కొలువు గత వారంరోజుల్లో విశేషాలు
ఇతర రాష్ట్రాలు, ప్రపంచ దేశాల ముఖ్యమైన పరిణామాలు
సామాజిక, ఆర్థిక, రాజకీయ పుస్తక సమీక్షలు
ప్రతి ఆదివారం 'వార్త' మెయిన్‌లో ఒక పూర్తి పేజీ

తెలుగు జాతీయ దినపత్రిక
వార్త
epaper.vaartha.com WWW.VAARTHA.COM
శ్రీకాకుళం
: fb.com/vaartha Digital
Published from Srikakulam, Visakhapatnam, Vijayawada, Hyderabad, Rajahmundry, Guntur, Ongole, Nizamabad, Warangal, Tirupathi, Kadapa, Kurnool, Anantapur, Karimnagar, Mahabubnagar, Khammam, Nellore, Nalgonda, Tadepalligudem
5-8-2026 బుధవారం సంపుటి: 32 సంచిక: 186 పేజీలు: 16 వెల: 6.50

డిసెంబరులో క్వాంటం వ్యాలీ: సిఎం చంద్రబాబు 2లో

ఉదయనిధి స్టాలిన్ అరెస్టు, విడుదల 5లో

వడివడిగా 'జల్‌జీవన్'

- తీరప్రాంత గ్రామాల మంచినీటి సమస్యకు శాశ్వత పరిష్కారం
- రెండు ప్రాజెక్టులకు రూ. 270 కోట్ల వ్యయం
- 400 కి.మీ. పైగా పైప్‌లైన్ నిర్మాణం
- ప్రాజెక్టుల పురోగతిపై సమీక్షించిన డి.సిఎం పవన్

విజయవాడ.ఆగస్టు 4,ప్రభాతవార్తప్రతినిధి: ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పరిధిలో జల్ జీవన్ మిషన్ కింద అమరజీవి జలధార ప్రాజెక్టు ద్వారా ఆయా జిల్లాల పరిధిలోని తీర ప్రాంత గ్రామాల మంచినీటి కష్టాలకు శాశ్వత పరిష్కారం లభించనుందని పంచాయతీరాజ్ గ్రామీణాభివృద్ధి, గ్రామీణ తాగునీటి సరఫరా శాఖలను నిర్వహిస్తున్న రాష్ట్ర ఉప ముఖ్యమంత్రి, పవన్ కల్యాణ్ స్పష్టం చేశారు. ఉమ్మడి తూర్పు, పశ్చిమ గోదావరి జిల్లాల పరిధిలో 33 లక్షల మందికి దాహార్తి తీర్చే బలమైన సంకల్పాన్ని ఈ ప్రాజెక్టుల ద్వారా ముందుకు తీసుకువెళ్తున్నామని తెలిపారు. నిర్ణీత గడువులోపు ముఖ్యమైన నిర్మాణాలు పూర్తిచేసి, ప్రజలకు అందుబాటులోకి తీసుకువచ్చే విధంగా ప్రణాళికలు రూపొందించుకోవాలని అధికారులను ఆదేశించారు. నీటి ఎద్దడి తీవ్రంగా ఉన్న ప్రాంతాలను గుర్తించి అక్కడ జల్ జీవన్ పనుల వేగం >>2

మళ్లీ వృద్ధిబాటలోకి రాష్ట్రం

- సంక్షేమం, అభివృద్ధిలో సమతౌల్యం పాటిస్తున్నాం
- పేదరికాన్ని నిర్మూలించే దిశలో అడుగులు
- 2019-24 మధ్య రాష్ట్రంలో అంతా విధ్వంసమే
- కేంద్రం అండతో కోలుకుంటున్నాం
- పిపిపిని వ్యతిరేకిస్తూ భోగాపురం క్రెడిట్ కావాలంటారు..
- రెండేళ్ల పాలనపై సిఎం చంద్రబాబు ప్రోగ్రెస్ రిపోర్ట్

విజయవాడ, ఆగస్టు 4 ప్రభాతవార్త ప్రతినిధి: విభజన నాటి కంటే 2019-24 మధ్యన జరిగిన విధ్వంసం వల్లే ఆంధ్రప్రదేశ్ ఎక్కువ నష్టపోయిందని, ఈ సమస్యను అధిగమిస్తూ అభివృద్ధి, సంక్షేమాన్ని బ్యాలెన్స్ చేసుకుంటూ పాలన సాగిస్తున్నామని ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు స్పష్టంచేశారు. తన జీవితంలో ఎన్నడూ పడనంత కష్టాన్ని గత రెండేళ్లల్లో పడ్డానని తెలిపారు. ఈ రెండేళ్ల కాలంలో రాష్ట్రాన్ని మొత్తంగా గాడిలో పెట్టేశామని చెప్పడంలేదన్న సిఎం, రాష్ట్రాన్ని అభివృద్ధిబాట పట్టించేలా పోయిన బ్రాండ్‌ను ఎస్టాబ్లిష్ చేశామన్నారు. ఆర్థిక వెసులుబాటు లేకున్నా ఇచ్చిన హామీలను నెరవేరుస్తూ సంక్షేమాన్ని అందిస్తున్నామని సిఎం తెలిపారు. రాష్ట్ర ఆర్థికపరిస్థితి, ఆదాయ వ్యయాలు.. ప్రభుత్వ భవిష్యత్ కార్యాచరణ వంటి అంశాలు ప్రజలకూ తెలియాల్సిన అవసరం ఉందని ముఖ్యమంత్రి అభిప్రాయపడ్డారు. మంగళవారం రాష్ట్ర సచివాలయంలో నిర్వహించిన మీడియా కాన్ఫరెన్స్‌లో రెండేళ్ల ఆర్థిక స్థితిగతులపై సిఎం చంద్రబాబు ప్రోగ్రెస్ రిపోర్ట్ ప్రజెంట్ చేశారు. 2019-24 మధ్య రాష్ట్రంలో వ్యవస్థలు నిర్వీర్యమయ్యాయని, ప్రజలు, అధికారులు, ఉద్యోగులు భయపడే పరిస్థితి ఏర్పడిందని పేర్కొన్నారు. ఆ పాలనపై

ప్రజల్లో వచ్చిన నిశ్శబ్ద విప్లవమే 2024 ఎ1న్నికల ఫలితాలని చెప్పారు. 2024 ఎన్నికల సమయంలో రాష్ట్రాన్ని పునర్నిర్మిస్తామని, బ్రాండ్ ఎపిని తిరిగి తీసుకొస్తామని ప్రజలకు హామీ ఇచ్చామని సిఎం గుర్తుచేశారు. అధికారంలోకి వచ్చిన తర్వాత ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తున్నామన్నారు. చెప్పిన విధంగా.. ఇచ్చిన తేదీల్లో సంక్షేమాన్ని అమలు చేస్తున్నామని స్పష్టం చేశారు. సంక్షేమంతో పాటు రాష్ట్రానికి ఆదాయం సమకూర్చే అభివృద్ధి కార్యక్రమాలకు సమాన ప్రాధాన్యం ఇస్తున్నామని చెప్పారు. రాష్ట్రానికి ఆదాయం పెరగాలంటే ముందుగా అభివృద్ధి జరగాలని చంద్రబాబు స్పష్టం చేశారు. అందుకే పెట్టుబడులు, పరిశ్రమలు, మౌలిక వసతులు, కొత్త రంగాల అభివృద్ధికి ప్రభుత్వం అత్యధిక ప్రాధాన్యం ఇస్తోందని, ఆ మేరకు కొత్తపాలసీలు తెస్తుందని సిఎం వివరించారు.

సమర్థవంతంగా పనిచేస్తే ప్రజలు సహకరిస్తారు: ప్రభుత్వం సమర్థంగా పనిచేస్తే ప్రజలు కూడా అభివృద్ధిలో ఏ స్థాయిలో భాగస్వాములు అవుతారో భోగాపురం అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభోత్సవం చాటిచెప్పిందని ముఖ్యమంత్రి అన్నారు. భోగాపురం ఎయిర్‌పోర్టు ప్రారంభంతో ఉత్తరాంధ్ర అభివృద్ధికి రెక్కలు వచ్చిన భావన ప్రజల్లో ఏర్పడిందన్నారు. ఉత్తరాంధ్రను అంతర్జాతీయ అవకాశాలకు గేట్‌వేగా తీర్చిదిద్దే దిశగా ప్రభుత్వం అడుగులు వేస్తోందని చెప్పారు. దీన్ని ప్రజలు గ్రహించారు కాబట్టే ఎయిర్ పోర్టు ప్రారంభోత్సవానికి ప్రజల నుంచి చక్కటి మద్దతు లభించిందని ముఖ్యమంత్రి అన్నారు. పిపిపిపద్ధతిలో ప్రాజెక్టులు చేపడుతుంటే వ్యతిరేకించిన వారు, అదే పిపిపి పద్ధతిలో చేపట్టిన భోగాపురం ఎయిర్ పోర్టు నిర్మాణ క్రెడిట్ మాత్రం తమదని చెప్పుకుంటున్నారని సిఎం విమర్శించారు. పెట్టుబడులు వస్తే పరిశ్రమలు >>2

నాన్ ఆక్వాజోన్‌కూ రాయితీ విద్యుత్

యూనిట్ రూ. 1.50 చొప్పున ఈ నెలనుంచే అమలు

ఆగస్టు 7 నుంచి రైతులకు అవగాహన కార్యక్రమాలు: సమీక్షలో సిఎం చంద్రబాబు

విజయవాడ, ఆగస్టు4,ప్రభాతవార్తప్రతినిధి: ఈ నెల నుంచే నాన్ ఆక్వా జోన్‌లో ఉన్న ఆక్వా రైతులకూ రాయితీపై విద్యుత్ అందించాలని రాష్ట్ర ప్రభుత్వం నిర్ణయించింది. ఈమేరకు ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు అధికారులకు ఆదేశాలు జారీ చేశారు. ఆక్వా జోన్ పరిధిలో ఇస్తున్నట్లే నాన్ ఆక్వా జోన్ లో ఉన్న రైతులకూ యూనిట్ విద్యుత్ ను రూ.1.5కే ఇవ్వాలని స్పష్టం చేశారు. ఈ నెల నుంచి దీనిని అమలు చేయాల్సిందిగా అధికారులకు దిశానిర్దేశం చేశారు. దీంతో ఇక జోన్లకు మాత్రమే పరిమితం కాకుండా ఆక్వా రైతులందరికీ రాయితీ విద్యుత్ అందుబాటులోకి రానుంది. ఈ నిర్ణయంతో 12,500 మంది ఆక్వా రైతులకు లబ్ధికలగనుంది. సచివాలయంలో మంగళవారం రాష్ట్రంలో ఎల్ నినో ప్రభావం, లోటు వర్షపాతం, పంటల సాగు, జల వనరులు తదితర అంశాలపై వ్యవసాయ శాఖతో సిఎం సమీక్ష నిర్వహించారు. ఎల్ నినో సంక్షోభ నివారణ ప్రణాళికతో రాష్ట్రంలోని ప్రతీ రైతు వద్దకు వెళ్లాలని ముఖ్యమంత్రి చంద్రబాబు అధికారులను, ప్రజాప్రతినిధులను ఆదేశించారు. దీనికి సంబంధించి ప్రభుత్వం తీసుకుంటున్న చర్యలు, రైతులు అనుసరించాల్సిన ప్రత్యామ్నాయ ప్రణాళికల్ని వారికి వివరించాలని సూచించారు. ఆగస్టు 7వ తేదీ నుంచి రైతులకు అవగాహనా కార్యక్రమాలు చేపట్టాలని అన్నారు. ఎల్ నినో కారణంగా రాష్ట్రవ్యాప్తంగా అన్ని ప్రాంతాల్లో అక్టోబర్ మాసం వరకూ లోటు వర్షపాతం నమోదయ్యే సూచనలున్న నేపథ్యంలో రైతులు ప్రత్యామ్నాయ ప్రణాళికలు అనుసరించేలా చర్యలు చేపట్టాలని సిఎం సూచించారు. ప్రత్యేకించి పీఎండీఎస్ విధానంలో సాగు చేసేందుకు ఉన్న అవకాశాలను రైతులకు వివరించేలా రైతుల వద్దకు వెళ్లాలని ముఖ్యమంత్రి నిర్దేశించారు. ఎల్ నినో లాంటి తీవ్ర వాతావరణ పరిస్థితుల నేపథ్యంలో స్పష్టమైన విధానాన్ని రైతులకు అందించాలని అన్నారు. రైతు యాప్ ద్వారా పూర్తి సమాచారాన్ని క్షేత్రస్థాయిలో రైతులకు వేగంగా అందించాలని స్పష్టం చేశారు. వర్షపాతం తగ్గి, సాగు విస్తీర్ణం పెరుగుతోందని క్షేత్రస్థాయిలో వస్తున్న ఈ మార్పులకు అనుగుణంగా కార్యాచరణ ఉండాలని ముఖ్యమంత్రి ఆదేశించారు. ఎల్ నినో ఎఫెక్ట్ మిటిగేషన్ యాక్షన్ ప్లాన్ పటిష్టంగా అమలు చేయాలని సూచించారు. పశువుల దాణా విషయంలోనూ వీబీ జీ రామ్ జీ అనుసంధానించాలన్నారు. ఆఫ్ స్టైల్ పొగాకుపై కిలోకు రూ.10 మద్దతు ధర ఇచ్చేలా కార్యాచరణ చేపట్టాలని ముఖ్యమంత్రి అధికారులను ఆదేశించారు. రేపటి నుంచే ఇది అమల్లోకి >>2

విజయవాడ నుంచి అమరావతి దేవస్థానం వరకు ఐకానిక్ రోప్‌వే
సిఎం అధ్యక్షతన సిఆర్‌డిఎ సమావేశంలో పలు నిర్ణయాలు 2లో

ఇథనాల్ పెట్రోల్‌పై ఆందోళన వద్దు

- పూర్తిస్థాయిలో తనిఖీలు
- 87 వేల బంకుల్లో రోజూ దాదాపు 12 సార్లు పరీక్షలు
- కేంద్రం వెల్లడి

న్యూఢిల్లీ, ఆగస్టు 4: ఇథనాల్ మిశ్రమ పెట్రోల్ నాణ్యత, కలుషితానికి సంబంధించిన ఆందోళనలపై కేంద్ర పెట్రోలియం, సహజ వాయు శాఖ సమగ్ర వివరణఇచ్చింది. దేశవ్యాప్తంగా ఇంధన సరఫరా వ్యవస్థలో అమలు చేస్తున్న కఠినమైన నాణ్యత నియంత్రణ చర్యలను మంగళవారం కేంద్రంవెల్లడించింది. వాహనయజమానులు ఆందోళనచెందాల్సిన అవసరంలేదని, ఇంధన నాణ్యతను ఆయిల్ మార్కెటింగ్ కంపెనీలు క్రమం తప్పకుండా పర్యవేక్షిస్తున్నాయని స్పష్టం చేసింది. ఇప్పటికే అమల్లోఉన్న పరీక్షా విధానాలతో పాటు.. ఇంధనంలో కల్తీ, కలుషితాన్ని అడ్డుకునేందుకు అదనపు తనిఖీలను కూడా చేపట్టి >>2

పోలీసు విచారణకు మాజీమంత్రి సీదిరి

పలాసలో రోజంతా ఉత్కంఠ

పలాస (శ్రీకాకుళం జిల్లా), ఆగస్టు 4 ప్రభాతవార్త : అసలు ఏమి జరిగింది... ఇప్పుడు ఏమి జరుగుతోంది.. పలాస కాశీబుగ్గ మున్సిపాలిటీ పరిధిలో ఇంగిలిగాం పారిశ్రామిక వాడ దగ్గర పాత హైవేలో గత నెల 10న జరిగిన ద్విచక్ర వాహన ప్రమాదానికి సంబంధించి వాస్తవాలు తారుమారు చేశారనే ఆరోపణపై అదే కేసులో ఎ3గా ఉన్న మాజీ మంత్రి డాక్టర్ సీదిరి అప్పలరాజును గత నెల 22న పోలీసులు అరెస్టు చేసి 23న అంపోలు జైలుకు రిమాండ్‌కు పంపించారు. ఆయన తరుపున న్యాయవాదులు కోర్టులో బెయిల్ పిటిషన్ వేసినప్పటికీ కోర్టులో తిరస్కరించారు. కాగా కాశీబుగ్గ పోలీసులు పలాస జూనియర్ సివిల్‌జడ్జి కోర్టులో డా. సీదిరికి పోలీసు విచారణకు అవకాశం కల్పించాలని పిటీషన్ దాఖలు చేసిన నేపద్యంలో ఈ కేసుకు సంబంధించి సోమవారం పలాస కోర్టులో వాదోపవాదనలు జరిగాయి. దీనిపై జడ్జ్ యు.మాధురి మాజీ మంత్రి డా. సీదిరి అప్పలరాజుకు కాశీబుగ్గ పోలీసులకు ఒక్క రోజుకు విచారణ జరిపేందుకు అనుమతించారు. దీంతో పోలీసులు మంగళవారం అప్పలరాజును కాశీబుగ్గ పోలీస్ స్టేషన్‌కు తీసుకువచ్చి కోర్టు ఇచ్చిన సమయం మేరకు విచారణ చేపట్టి తిరిగి డా. అప్పలరాజును జిల్లా జైలుకు తరలించారు. డా. అప్పలరాజును జూలై 23న 14 రోజులు కోర్టు రిమాండ్‌కు పంపించారు. రిమాండ్ ఈ నెల 5 నాటికి పూర్తి అయ్యి డా. సీదిరి ను కోర్టులో హాజరు పర్చాల్సి ఉంది. ఇప్పటికే డాక్టర్ అప్పలరాజుకు బెయిల్ మంజూరు చేయాలని సొంపేట కోర్టులో ఆయన తరుపు న్యాయవాది పిటిషన్ దాఖలు చేయగా ఈ సమయంలోనే కాశీబుగ్గ పోలీసులు కస్టడీకి కోరుతూ పలాస కోర్టులో పిటీషన్ దాఖలు చేయడంతో సొంపేట కోర్టు బెయిల్ ఫిటీషన్ కొట్టి వేశారు. ఇదే కేసులో ఎ1, ఎ2 గా ఉన్న డా. అప్పలరాజు కుమారుడు అరవ్ వర్మ మరియు సిద్ధార్థ త్యాడీలకు ఇటీవల బెయిల్ మంజూరు కావడంతో వారు జైలు నుంచి విడుదలఅయ్యారు. వీరు జైలులో ఉన్న సమయంలోనే వీరికి కస్టడీకి ఇవ్వాలని కాశీబుగ్గ పోలీసులు పిటీషన్ దాఖలు చేసినప్పటికీ పలాస కోర్టు న్యాయమూర్తి ఈఫిటీషన్ తిరస్కరిం >>2

పులి వేట కేసు: ఏడుగురి అరెస్టు

గిద్దలూరు, ఆగస్టు 4 ప్రభాతవార్త : గిద్దలూరు ప్రాజెక్ట్ టైగర్ డివిజన్ పరిధిలో సంచలనం సృష్టించిన పులి వేట కేసును అటవీ శాఖ కేవలం నాలుగు రోజుల్లోనే ఛేదించింది. రాచర్ల మండలం జెల్లివారి పుల్లలచెరు అటవీ ప్రాంతంలో నాటు తుపాకీతో పులిని కాల్చి చంపి, దాని కాళ్లు, పంజాలు నరికివేసి కళేబరాన్ని అడవిలో పడేసిన ఘటనలో ఏడుగురు నిందితులను అటవీ అధికారులు అరెస్టు చేశారు. వారి నుంచి పులికి చెందిన ఏడు పంజాలు, అవయవాల ఎముకలు, ఒక దేశీయ నాటుతుపాకీ, ఒకగొడ్డలిని స్వాధీనం చేసుకున్నారు. జూలై 31 తెల్లవారుజామున గుండ్లకమ్మ రేంజ్‌లోని రాచర్ల బీట్‌లో పులి కళేబరం లభ్యమవడంతో అటవీ శాఖ వెంటనే అప్రమత్తమైంది. ఎన్‌టిసిఎ మార్గదర్శకాల ప్రకారం సంఘటన స్థలాన్ని భద్రపరిచి, పులి కళేబరానికి పోస్టుమార్టం నిర్వహించారు. ఫోరెన్సిక్ పరీక్షల కోసం నమూనాలను సేకరించి పంపగా, అది పూర్తి ఎదిగిన మగ పులిగా అధికారులు నిర్ధారించారు. డి.సిఎం పవన్, రాష్ట్ర ప్రధాన అటవీ సంరక్షణాధికారి ఆదేశాల మేరకు, ఎన్ఎస్‌టిఆర్ ఫీల్డ్ డైరెక్టర్ పర్యవేక్షణలో గిద్దలూరు ప్రాజెక్ట్ టైగర్ డిప్యూటీ డైరెక్టర్ నేతృత్వంలో ప్రత్యేక దర్యాప్తు బృందాలు రంగంలోకిదిగాయి. గిద్దలూరు సబ్ డిఎఫ్‌ఓ, గుండ్లకమ్మ ఎఫ్ఆర్‌ఓ, ఏఆర్‌ఓ, పశువైద్య నిపుణులు, అటవీ సిబ్బంది సమన్వయంతో క్షేత్రస్థాయిలో విస్తృత దర్యాప్తు చేపట్టారు. డాగ్‌స్క్వాడ్‌సహాయం, సాంకేతిక ఆధారాలు, స్థానిక సమాచారాన్ని సమన్వయం చేస్తూ నిందితుల జాడను గుర్తించారు. విచారణలో నిందితులు నాటు తుపాకీతో పులిని వేటాడి, దాని పంజాలు, గోళ్లను నరికివేసి, కళేబరాన్ని అడవిలోనే వదిలేసినట్లు వెల్లడైంది.

వాము, జీలకర్ర, లవంగాలు అన్నీ కల్తీ!

హైదరాబాద్‌లో భారీగా పట్టుబడిన మసాలా పదార్థాలు, ముగ్గురు అరెస్టు

హైదరాబాద్, ఆగస్టు 4, ప్రభాతవార్త: హైదరాబాద్‌లో మరోసారి భారీగా మసాల దినుసులు, ఆహార వస్తువులు పట్టుబడ్డాయి. ఈ సందర్భం గా వీటిని తయారు చేస్తున్న ముగ్గురు వ్యాపారులను పోలీసులు అరెస్టు చేశారు. హైదరాబాద్ ఫుడ్ అడల్ట్రేషన్ సర్వైలెన్స్ టీం (హెచ్..ఫాస్ట్), బల్దియా అధికారులు సంయుక్తంగా దాడులు చేసి ఈ గోల్‌మాల్‌ను రట్టు చేశారు. దీనికి సంబంధించిన వివరాలను హైదరాబాద్ పోలీసు కమిషనర్ వి.సి సజ్జన్నర్ మంగళవారం మీడియాకు వెల్లడించారు. జంట నగరాలలో కల్తీ ఆహార వస్తువుల తయారీ, విక్రయాలపై హెచ్..ఫాస్ట్, బల్దియా సంయుక్తంగా నిఘా వుంచి, వరుసగా దాడులు చేస్తుండడం తెలిసిందే. ఈ క్రమంలో కాటేదాన్, బాలాపూర్ పరిధుల్లో మూడు ప్రాంతాలలో కల్తీ మసలా దినుసులు, ఇతర ఆహార వస్తువులు, ఇంకొన్ని ఉత్పత్తులు తయారవుతున్నట్లు సమాచారం అందింది. ఈ సమాచారం మేరకు సోమవారం రాత్రి హెచ్..ఫాస్ట్, బల్దియా సిబ్బంది సంయుక్తంగా దాడి చేశారు. దాడుల సందర్భంగా 7920 కిలోల కల్తీ వాము, 6700 కిలోల జీలకర్ర, 550 కిలోల లవాంగాలు, 2280 కిలోల సాజీర, 540 కిలోల సోంపు, 4960 కిలోల ఆవాలు, 65 వేల కిలోల జీలకర్ర పొడి, 13,460 కిలోల మెంతులు, పది వేల కిలోల తెల్లనువ్వులు, 90 కిలోల >>2

మంగళవారం హైదరాబాద్‌లో పట్టుబడిన కల్తీ మసాలా దినుసులు

మద్యం కుంభకోణం కేసు: కిరణ్ కుమార్ రెడ్డికి రిమాండ్

కీలక అంశాలు వెల్లడించిన సిట్

విజయవాడ,ఆగస్టు 4,ప్రభాతవార్తప్రతినిధి: మద్యం కుంభకోణం కేసు నిందితుడు కిరణ్ కుమార్ రెడ్డికి విజయవాడ ఎసిబి కోర్టు మంగళవారం రెండు వారాలు పాటు రిమాండ్ విధించింది. రాష్ట్రంలో 2019 నుంచి 2024 మధ్య కాలంలో జరిగిన భారీ మద్యం కుంభకోణం కేసులో అజ్ఞాతంలో ఉన్న కీలక నిందితుడైన కిరణ్‌కుమార్‌రెడ్డి పాత్రతో సహా ప్రభుత్వ ఆదాయానికి రూ. వేల కోట్ల దోపిడి పాల్పడిన సిండికేట్ కుట్రను సిట్ అధికారులు బయటపెట్టారు. గత ప్రభుత్వ హయాంలో జరిగిన రూ.వేల కోట్ల మద్యం కుంభకోణం కేసులో ఈశ్వర్ కిరణ్ కుమార్ రెడ్డిని సిట్ అధికారులు నిన్న అర్ధరాత్రి సమయంలో హైదరాబాద్‌లోని శంషాబాద్ ఎయిర్ పోర్టులో అరెస్ట్ చేశారు. మంగళవారం విజయవాడలోని ఎసిబి కోర్టులో హాజరు పర్చారు. అతని రిమాండ్ రిపోర్టులో కీలక అంశాలు వెల్లడించింది. మద్యం కుంభకోణం కేసులో కీలక నిందితుడు, లంచాల సొమ్ము దారి మళ్లించేందుకు భారీగా డొల్ల కంపెనీలు ఏర్పాటు చేసాడు మద్యం నగదు రవాణాలో ఈశ్వర్ ప్రధాన పాత్ర పోషించాడని సిట్ తెలిపింది. ఈ కేసులో ఇప్పటికే పలువురు అరెస్ట్ కావటం, ఎక్కువ కాలం విదేశాల్లో ఉండటానికి, తప్పించుకునేందుకు అవకాశం లేకపోవటంతో కిరణ్ కుమార్‌రెడ్డి ఇటీవల సుప్రీం కోర్టులో ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. ముందస్తు బెయిల్ ఇవ్వటానికి సుప్రీం కోర్టు నిరాకరించింది. వెంటనే దర్యాప్తు అధికారి ఎదుట లొంగిపోవాలని ఆదేశించింది. గత్యంతరం లేని పరిస్థితుల్లో కిరణ్ దుబాయ్ నుంచి బయలుదేరి శ్రీలంక మీదుగా భారత్‌కు వస్తుండగా అతనిపై లుక్ అవుట్ సర్క్యులర్ ఉండటంతో శంషాబాద్ విమానాశ్రయంలో ఇమ్మిగ్రేషన్ అధికారుల పట్టుకు న్నారు. అనంతరం సిట్ అధికారు >>2

మంగళవారం విజయవాడలో స్వర్గీయ మండలి వెంకట కృష్ణారావు శత జయంతి వేడుకల్లో ప్రసంగిస్తున్న వెంకయ్యనాయుడు

తెలుగు భాషకు అంకితం 'మండలి'

విజయవాడ,ఆగస్టు4,ప్రభాతవార్తప్రతినిధి: ప్రజలు, ప్రభుత్వం, పత్రికలు కలిసి పనిచేస్తేనే తెలుగు భాషకు పూర్వవైభవం వస్తుందని మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ఉద్ఘాటించారు. రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి సమితి బాషా (సంస్కృతిక శాఖ) మండలి వెంకట కృష్ణారావు అధికార భాషా సంఘం, పొట్టి శ్రీరాములు తెలుగు విశ్వ విద్యాలయం సంయుక్త ఆధ్వర్యంలో మంగళవారం స్థానిక తుమ్మల పల్లి వారి క్షేత్రయ్య కళాక్షేత్రంలో స్వర్గీయ మండలి వెంకట కృష్ణారావు శత జయంతి వేడుకలను ఘనంగా నిర్వహించారు. ఈ కార్యక్రమానికి మాజీ ఉపరాష్ట్రపతి వెంకయ్య నాయుడు ముఖ్య అతిథిగా హాజరయ్యారు. ఈ సందర్భంగా మండలి వెంకట కృష్ణారావు కాంస్య విగ్రహాన్ని అసెంబ్లీ స్పీకర్ అయ్యన్నపాత్రుడుతో కలిసి ఆయన ఆవిష్కరించారు. అనంతరం మండలి వెంకట కృష్ణారావు స్మృతికి ఘననివాళులు అర్పించారు. ఈ సందర్భంగా వెంకయ్య నాయుడు మాట్లాడుతూ.మండలి వెంకట కృష్ణారావు వంటి మహనీయుల సిద్ధాంతాలను ఆదర్శంగా తీసుకుని అమలు చేయాలన్నారు. దివిసీమ ఉప్పెన సమయంలో ఆయన చేసిన సేవలు అద్భుతమని కొనియాడారు. గాంధేయవాదిగా ఆయన పనితీరును చూసే అదృష్టం తనకు దక్కిందన్నారు. ఏ శాఖ మంత్రిగా ఉన్నా ప్రతి పనిలో తనదైన ముద్ర వేశారని చెప్పారు. తెలుగు భాష పరిరక్షణకు మండలి బుద్ధప్రసాద్ కృషి చేస్తూ తన తండ్రి అడుగుజాడల్లో నడుస్తున్నారని అన్నారు. మండలి వెంకట కృష్ణారావు శతజయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించడం అభినందనీయమని పేర్కొన్నారు.వెంకట కృష్ణారావు జీవిత విశేషాలతో రేగుళ్ళ మల్లిఖార్జునరావు రాసిన పుస్తకాన్ని ఆవిష్కరించామని వెంకయ్యనాయుడు చెప్పారు. మహనీయుల జీవితాల్లో జరిగిన ముఖ్య ఘట్టాలను ఇటువంటి పుస్తకాల ద్వారానే నేటి తరం తెలుసుకోవాలని అన్నారు. తెలుగు భాష పరిరక్షణ కోసం ఆయన ఎంతో పరితపిస్తూ కృషి చేసేవారని తెలిపారు. నేటి రోజుల్లో రాజకీయ నేతలకు తప్పనిసరిగా శిక్షణ ఇవ్వాల్సిన అవసరం ఉందన్నారు. ఈ >>2

మంగళవారం న్యూఢిల్లీలో ఉపరాష్ట్రపతికి 'అమరావతి విజన్' పుస్తకాన్ని అందజేస్తున్న టిడిపి ఎంపీలు

ఉపరాష్ట్రపతికి 'అమరావతి విజన్' పుస్తకాన్ని అందజేసిన టిడిపి ఎంపీలు

విజయవాడ,ఆగస్టు4,ప్రభాతవార్తప్రతినిధి: తెలుగుదేశం పార్టీ పార్లమెంట్ సభ్యుల బృందం నేడు న్యూఢిల్లీలోని భారత ఉపరాష్ట్రపతి సిపి రాధాకృష్ణన్‌ను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలి శారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి విజన్, పురోగతి, మరియు భవిష్యత్తు ప్రాధాన్య తలను వివరిస్తూ రూపొందించిన ప్రత్యేకపుస్తకాన్ని ఉపరాష్ట్రపతికి అందజేశారు. ఈ కార్యక్రమంలో లోక్‌సభ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు, రాజ్యసభ సభ్యులు సానాసతీష్, భాష్యం రామకృష్ణ, మరియు చింతకాయల విజయ్‌తో పాటు పలువురు ఇతర టిడిపి ఎంపీలు పాల్గొన్నారు. ఎంపీలతో ఎంతో ఆత్మీ యంగా ముచ్చటించిన ఉపరాష్ట్రపతి, అమరావతిపై వారుచేపట్టిన చొరవను ప్రత్యేకంగా అభినందించారు.

వాము, జీలకర్ర, లవంగాలు అన్నీ కల్తీ!

>> ఫైనింగ్ పౌడర్, 12 లీటర్ల రైస్ బ్రాన్ ఆయిల్, 1.5 కిలోల సింథటిక్, ఫ్యాబ్రిక్ డై, మూడు రోలింగ్ యంత్రాలు పట్టుబడ్డాయి. ఈ సందర్భంగా వీటిని తయారు చేస్తున్న కాటేదాన్‌కు చెందిన రాహుల్ బాటి, బేగంబజార్‌కు చెందిన విశాల్ పన్వార్, దులీచంద్ కచ్చావాలు పట్టుబడ్డారు. ఈ ఘటనపై సజ్జన్నర్ మాట్లాడుతూ ఆహార పదార్థాలలో పారిశ్రా మిక రంగులు, సింథటిక్ రంగులు, టాల్కం పౌడర్ వంటివి కలుపుతున్నారని, దీనివల్ల వీటిని వాడుతున్న వారు తీవ్రఅనారోగ్యం పాలవుతున్నారని తెలిపారు. కాలేయం, మూత్ర పిండాల సమస్యలు తలెత్తుతున్నాయని ఆయన తెలిపారు. ఆహార పదార్థాలలో రసాయనాలు కలపడం వల్ల క్యాన్సర్ సోకే ప్రమాదం ఎక్కువగా వుందని ఆయన వెల్లడించారు. కడుపునొప్పి, అలెర్జీ, జీర్ణకోశ, చర్మ వ్యాధులు, నరాలు దెబ్బతినే ప్రమాదం వుందని ఆయన అన్నారు. దీంతో పాటు శరీరం రోగ నిరోధక శక్తి కోల్పోతుందని సజ్జన్నర్ తెలిపారు.

నాన్ ఆక్వాజోన్‌కూ రాయితీ విద్యుత్

>> రావాలని సిఎం దిశానిర్దేశం చేశారు. 94 మిలియన్ కేజీల ఆఫ్ స్టైల్ పొగాకును కొనుగోలు చేసేలా చర్యలు చేపట్టాలని సూచించారు. దీని ద్వారా 44 వేల మంది రైతులకు ప్రయోజనం కలుగుతుందని స్పష్టం చేశారు. దీనిపై రాష్ట్ర ప్రభుత్వం, టొబాకో బోర్డు, రైతులు సహా 5గురు సభ్యుల కమిటీని ఏర్పాటు చేసి సమీక్షించాలని సీఎం నిర్దేశించారు. రైతులను ఆదుకునేలా బ్యారెల్ కు రూ.50 వేల రుణం ఇచ్చే కార్యక్ర మాన్ని ప్రారంభించాలని సీఎం ఆదేశించారు. ఫిష్ మీల్ ఎగుమతులను 50 శాతానికి తగ్గించేలా కేంద్రంతో సంప్ర దింపులు జరుపుతున్నామని సీఎం స్పష్టంచేశారు. కేంద్రం నిర్ణయం తీసుకునేంత వరకూ రొయ్యమేత ధరలు పెరగకుండా చర్యలు తీసుకోవాలన్నారు. రాయలసీమను ఉద్యాన హబ్ గా తీర్చిదిద్దే అంశంపై వేగంగా ప్రణాళికలు అమలు చేయాలని సీఎం సూచించారు. త్వరలోనే 201 ఉద్యాన క్లస్టర్లను ప్రారంభించ నున్నట్టు తెలిపారు. ఇక నుంచి ప్రతీ మంగళవారం వ్యవసాయం, అనుబంధ రంగాలపై, ఎల్ నినో ప్రభావం నియంత్రణా చర్యలపై సమీక్ష నిర్వహిస్తానని ముఖ్యమంత్రి స్పష్టంచేశారు. ఈ సమీక్షకు మంత్రి కె.అచ్చెన్నా యుడు, సీఎస్ సాయి ప్రసాద్, వ్యవసాయ, జల వనరులు, ఆర్థిక శాఖ ఉన్నతాధికారులు హాజరయ్యారు.

ఎన్‌ఎసి లేకున్నా గృహాలకు విద్యుత్ కనెక్షన్ల మంజూరు ఇవ్వాలి: హైకోర్టు

విజయవాడ,ఆగస్టు4,ప్రభాతవార్తప్రతినిధి: అనధికార లేఅవుట్లలో నిర్మించిన గృహాలకు విద్యుత్ కనెక్షన్ల మంజూరుపై ఆంధ్రప్రదేశ్ హైకోర్టు కీలక తీర్పు వెలువరించింది. గ్రామ పంచాయతీ నుంచి నిరభ్యంతర పత్రం (ఎన్ఒసి) లేదన్న ఏకైక కారణంతో విద్యుత్ కనెక్షన్‌ను నిరాకరించకూడదని విద్యుత్ పంపిణీ సంస్థ లను (డిస్కంలు) ఆదేశించింది. ఈ తీర్పుతో రాష్ట్రవ్యాప్తంగా ఇటువంటి సమస్యలను ఎదుర్కొంటున్న వేలాది మందికి భారీ ఊరట లభించింది.

ఎపికి ప్రత్యేక పెట్టుబడుల పథకం కింద రూ.19,619 కోట్ల సాయం

న్యూఢిల్లీ,అమరావతి, ఆగస్టు 4: ప్రత్యేక మూలధన పెట్టుబడుల కోసం రాష్ట్రాలకు కేంద్రం అందించే స్పెషల్ అసిస్టెన్స్ టు స్టేట్స్ ఫర్ క్యాపిటల్ ఇన్వెస్ట్‌మెంట్ (శీతిశీది) పథకం కింద గత రెండున్నరేళ్లలో ఆంధ్రప్రదేశ్‌కు రూ.19,619 కోట్లు విడుదలైనట్లు కేంద్ర ప్రభుత్వం లోక్‌సభలో వెల్లడించింది.ఈ మేరకు కేంద్ర ఆర్థిక మంత్రిత్వ శాఖ వైఎస్సార్‌సీపీ ఎంపీ పీవీ మిథున్ రెడ్డి అడిగిన ప్రశ్నకు లిఖితపూర్వక సమాధానం ఇచ్చింది. దీనిపై రాష్ట్రప్రభుత్వం ప్రత్యేక నివేదిక విడుదలచేసింది. 2020 నుంచి 2024 వరకు గత వైఎస్సార్‌సీపీ ప్రభుత్వానికి ఇదే పథకం కింద లభించిన రూ.11,386 కోట్లతో పోలిస్తే, ప్రస్తుత టీడీపీ నేతృత్వంలోని కూటమి ప్రభుత్వానికి రెండున్నరేళ్లలో లభించిన నిధులు 72 శాతం అధికం. రాష్ట్ర ప్రభుత్వం విడుదల చేసిన ప్రకటనలో, ఆర్థిక క్రమశిక్షణ, ప్రాజెక్టుల సకాలంలో రూపకల్పన, వేగవంతమైన అమలు వల్లే కేంద్రం నుంచి అధిక నిధులు పొందగలిగామని పేర్కొంది. అర్హత కలిగిన మూలధన పెట్టుబడి ప్రతిపాదనలను సమయానికి సమర్పించడం, వాటి అమలును వేగంగా పూర్తి చేయడం ద్వారా మౌలిక సదుపాయాల అభివృద్ధికి గణనీయమైన నిధులను రాష్ట్రం సమీకరించగలిగిందని తెలిపింది. కేంద్రం వెల్లడించిన వివరాల ప్రకారం, 202021 నుంచి ఇప్పటివరకు ఆంధ్రప్రదేశ్‌కు ఎస్ఏఎస్‌సీఐ పథకం కింద మొత్తం రూ.31,005.47 కోట్లు విడుదలయ్యాయి. ఇందులో ప్రస్తుత ప్రభుత్వం బాధ్యతలు చేపట్టిన తర్వాత విడుదలైన మొత్తం రూ.19,619 కోట్లు. వాటిలో:202425లో రూ.7,901.56 కోట్లు 2025 -26లో రూ.8,289.61 కోట్లు2026-27లో (ఆగస్టు 1 వరకు) రూ.3,428.14 కోట్లు విడుదలయ్యాయి.

డిసెంబరులో క్వాంటం వ్యాలీ

విజయవాడ,ఆగస్టు4,ప్రభాతవార్తప్రతినిధి: రాష్ట్ర పునర్నిర్మాణంలో కేంద్ర ప్రభుత్వ సహకారం ఎంతో కీలకంగా మారిందని సిఎం చంద్రబాబు అన్నారు.సచివాలయంలో మంగళవారం ఆయన మీడియా సమావేశంలో మాట్లాడుతూ గత ప్రభుత్వ విధానాలపై ధ్వజమెత్తారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత అమరావతి పనులను మళ్లీ గాడిలో పెట్టామని, నిర్మాణ పనులు వేగంగా చేపడుతున్నామని తెలిపారు. గతంలో మూడు రాజధానుల పేరుతో రాష్ట్రం నవ్వుల పాలైందని వ్యాఖ్యానించారు. ఇప్పుడు ప్రపంచంలో అమరావతికి గుర్తింపు తీసుకొచ్చే ప్రాజెక్టులకు శ్రీకారం చుడుతున్నామని చెప్పారు. డిసెంబరులో క్వాంటం వ్యాలీని ప్రారంభిస్తామని, 2028లో అమరావతి ఫేజ్1ను ప్రారంభించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యాల్లో ఒకటని సీఎం స్పష్టం చేశారు. పోలవరంతోనే ఆగకుండా రాష్ట్రంలోని కీలక సాగునీటి ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేసేలా ప్రణాళిక రూపొందించామని తెలిపారు. రూ.37,766 కోట్లతో 36 ఇరిగేషన్ ప్రాజెక్టు లను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వెల్లడించారు.

మళ్లీ వృద్ధిబాటలోకి రాష్ట్రం

>> వస్తాయని, పరిశ్రమలు వస్తే ఉద్యోగాలు, ఆదాయం పెరుగుతాయని, ఆదాయం పెరిగితే మరింత సంక్షేమం, అభివృద్ధి సాధ్యమవుతుందని పేర్కొన్నారు.

గుంతల రోడ్లు.. గుదిబండ అప్పులు:

2019-24 మధ్య రాష్ట్రాన్ని విషవలయంలోకి నెట్టారని, రోడ్లన్నీ గుంతలమయమయ్యాయని ముఖ్యమంత్రి చంద్రబాబు విమర్శించారు. గత ఐదేళ్లలో రాష్ట్ర ఆర్థిక వ్యవస్థను దెబ్బతీయడంతోపాటు అభివృద్ధి వేగాన్ని నిలిపివేశారని అన్నారు. ఆదాయాలు తగ్గి, ఖర్చులు పెరిగిన పరిస్థితుల్లో అప్పులు పెంచుకుంటూ వెళ్లారని, చివరకు రాష్ట్రం దివాళా తీసే పరిస్థితి ఏర్పడిందని వివరించారు. 2019లో పరిపాలన ప్రారంభించిన తీరు ప్రజా వేదిక కూల్చివేతతోనే స్పష్టమైందని పేర్కొన్నారు. కలెక్టర్ కాన్ఫరెన్స్ పెట్టి మరీ ప్రజా వేదికను కూల్చారు. దీన్ని గర్వం అనాలా? మదం అనాలా? దీనికి పేరే లేదేమో? అని సిఎం ఘాటుగా వ్యాఖ్యానించారు. ప్రభుత్వ పాలనలో విధానపరమైన నిర్ణయాల కంటే విధ్వంసకర చర్యలకే గత ప్రభుత్వంలో ప్రాధాన్యం ఇచ్చిందని విమర్శించారు. 2019-24 మధ్య రాష్ట్రాన్ని అన్ని విధాలుగా వెనక్కి నెట్టారని సిఎం అన్నారు. మౌలిక వసతుల ప్రాజెక్టుల్లో పురోగతి ఆగిపోయిందని, రోడ్ల నిర్వహణ సరిగాలేక గుంతలమయంగా మారాయని తెలిపారు. శాంతిభద్రతల పరిస్థితి దెబ్బతినడంతో పెట్టుబడిదారుల్లో నమ్మకం తగ్గిందన్నారు. పరిశ్రమలు రావాల్సిన చోట ఉన్నవి కూడా వెళ్లిపోయే పరిస్థితి ఏర్పడిందని, కొత్త పెట్టుబడులు లేకుండా పోయాయని పేర్కొన్నారు. రాష్ట్ర ఆర్థిక పరిస్థితిని గత ప్రభుత్వం తీవ్రంగా దిగజార్చిందని చంద్రబాబు విమర్శించారు. నాటి ప్రభుత్వ నిర్వాకం వల్ల అప్పులు రూ.9.74 లక్షల కోట్లకు చేరాయని, అప్పులు తీర్చే సామర్థ్యం లేని రాష్ట్రంగా నీతి ఆయోగ్ పేర్కొనే పరిస్థితి ఏర్పడిందన్నారు. ఆదాయాలు తగ్గుతున్నా ఖర్చులు మాత్రం పెరిగాయని, ప్రభుత్వ ఆస్తులు, భూములను తాకట్టు పెట్టి మరీ అప్పులు తెచ్చారని ఆరోపించారు. రాష్ట్రం దివాళా తీసే స్థాయికి చేరడంతో అధిక వడ్డీలకు అప్పులు తెచ్చుకోవాల్సిన పరిస్థితి ఏర్పడిందని అన్నారు.

కేంద్ర నిధులూ దారి మళ్లించారు:

కేంద్ర ప్రభుత్వం రాష్ట్రానికి ఇచ్చిన పథకాల నిధులను కూడా గత ప్రభుత్వం దారి మళ్లించిందని సిఎం ఆరోపించారు. కేంద్ర నిధుల వినియోగంలో గత ప్రభుత్వం అనుసరించిన విధానం కారణంగా కేంద్రం ప్రత్యేకంగా చట్టం చేయాల్సిన పరిస్థితి వచ్చిందని చెప్పారు. కేంద్రం ఇచ్చే నిధులను నిర్దేశిత ప్రయోజనాలకే వినియోగించేలా వ్యవస్థను కట్టుదిట్టం చేయాల్సిన అవసరం ఏర్పడిందన్నారు. మద్య నిషేధం చేస్తామని హామీ ఇచ్చి అధికారంలోకి వచ్చిన నాటి ప్రభుత్వం, చివరకు మద్యం ఆదాయాన్ని ముందుగానే తాకట్టు పెట్టి రూ.25 వేల కోట్లు అప్పులు తెచ్చిందని చంద్రబాబు విమర్శించారు.

గత ప్రభుత్వ హయాంలో అమరావతి నగర నిర్మాణాన్ని నిలిపివేశారని అన్నారు. తాము అధికారంలోకి వచ్చిన తర్వాత అమరావతి పనులను మళ్లీ గాడిలో పెట్టామని, నిర్మాణ పనులు వేగంగా చేపడుతున్నామని తెలిపారు. గతంలో మూడు రాజధానుల పేరుతో రాష్ట్రం నవ్వుల పాలైందని వ్యాఖ్యానించారు. ఇప్పుడు ప్రపంచంలో అమరావతికి గుర్తింపు తీసుకొచ్చే ప్రాజెక్టులకు శ్రీకారం చుడుతున్నామని చెప్పారు. డిసెంబరులో క్వాంటం వ్యాలీని ప్రారంభిస్తామని, 2028లో అమరావతి ఫేజ్1ను ప్రారంభించేలా ప్రణాళికలు సిద్ధం చేస్తున్నామని వెల్లడించారు. పోలవరం ప్రాజెక్టును పూర్తి చేయడం ప్రభుత్వ ప్రధాన లక్ష్యాల్లో ఒకటని సిఎం స్పష్టం చేశారు. పోలవరంతోనే ఆగకుండా రాష్ట్రంలోని కీలక సాగునీటి ప్రాజెక్టులన్నింటినీ పూర్తి చేసేలా ప్రణాళిక రూపొందించామని తెలిపారు. రూ.37,766 కోట్లతో 36 ఇరిగేషన్ ప్రాజెక్టులను పూర్తి చేయాలని లక్ష్యంగా పెట్టుకున్నామని వెల్లడించారు. ఎపిలో డబుల్ ఇంజిన్ ప్రభుత్వం ఉందని, ట్రిపుల్ రీజియన్ ప్రణాళికతో అభివృద్ధి చేస్తున్నామని చెప్పారు. అమరావతి, తిరుపతి, విశాఖ కేంద్రంగా ఎకనమిక్ రీజియన్ల వారీగా అభివృద్ధి చేపడుతున్నామని తెలిపారు.

టెక్నాలజీని అడ్డుకోవద్దు

గతంలో ఇండియన్ స్కూల్ ఆఫ్ బిజినెస్ (ఐఎస్‌బి)ను రాష్ట్రానికి తీసుకొచ్చామని, ఇప్పుడు ఇండియన్ స్కూల్ ఆఫ్ అగ్రికల్చర్ (ఐఎస్ఎ)ను ఏర్పాటు చేస్తున్నామని సిఎం తెలిపారు. ఐఎస్ఎ ఏర్పాటుకు రిలయన్స్ ముందుకొచ్చిందని వెల్లడించారు. డేటా సెంటర్లు వస్తుంటే ప్రజలను తప్పుదోవ పట్టించే ప్రయత్నాలు జరుగుతున్నాయని విమర్శించారు. మాకెందుకు స్టీల్ ప్లాంట్? మాకెందుకు ఎఐ? మాకెందుకు డేటా సెంటర్లు అంటూ పేదరికంలోనే బాధపడాలా? అని ముఖ్యమంత్రి ప్రశ్నించారు. యువతకు ఉద్యోగాలు, ప్రజలకు ఆదాయం, రాష్ట్రానికి సంపద తీసుకొచ్చే పరిశ్రమలు, సాంకేతిక రంగాలను ప్రోత్సహించాల్సిన అవసరం ఉందన్నారు. ప్రజల జీవితాలను మార్చేలా పబ్లిక్ పాలసీలు ఉండాలని ముఖ్యమంత్రి అన్నారు. సంక్షేమం ఎంత ముఖ్యమో, అభివృద్ధి కూడా అంతే ముఖ్యమని స్పష్టం చేశారు. మంచి రోడ్లు వేయాలన్నా.. మౌలిక వసతులు కల్పించాలన్నా.. సంపద సృష్టించాల్సిందేనని తెలిపారు. సంపద సృష్టికి కొత్త మార్గాలను అన్వేషించడంతోపాటు.. పెట్టుబడులను ఆకర్షించే విధానాలను రూపొందించాల్సిన అవసరం ఉందన్నారు. ఈ అంశాలపై ప్రజల్లో విస్తృత చర్చ జరగాలని ఆకాంక్షి ంచారు. పరిశ్రమలు వస్తే ప్రజల జీవితాల్లో ఎలాంటి మార్పు వస్తుందో కియా కార్ల పరిశ్రమను ఉదాహరణగా సిఎం ప్రస్తావించారు.

మాజీమంత్రి సీదిరి

>> చడంతో వారికి బెయిల్ మంజూరు అయ్యింది. అయితే ఎ3 నిందితుడుగా ఉన్న అప్పలరాజుకు కస్టడీకి ఇవ్వాలని మరో మారు కాశీబుగ్గ పోలీసులు ఫిటీషన్ దాఖలు చేయడం వెనుక డా. అప్పలరాజుకు బెయిల్ మంజూరు జరగకూడదనే ఫిటీషన్ దాఖలు చేసినట్లు పలువురు అనుమానం వ్యక్తం చేస్తున్నారు. ఎ1, ఎ2,ల కస్టడీ ఫిటీషన్ కొట్టి వేసిన పలాస కోర్టు ఎ3గా ఉన్న డా. అప్పల రాజుకు ఒక్క రోజు కస్టడీకి అనుమతించారు. పలాస కోర్టులో డా. అప్పలరాజు కస్టడీ ఫిటీషన్ తిరస్కరించినట్లయితే సోంపేట కోర్టులో కొత్తగా ఆయన తరుపున న్యాయవాదులు బెయిల్ ఫిటీషన్ దాఖలు చేసినట్టయితే సోంపేట కోర్టు అప్పలరాజుకు తప్పని సరిగా బెయిల్ మంజూరు చేసే అవకాశాలు ఉన్నాయని ఆయన తరుపున న్యాయ వాదులుతెలిపారు. కానీ కాశీబుగ్గ పోలీసులు అత్యు త్సాహంతో డా. అప్పలరాజును ఎక్కవ రోజులు జైలులో ఉంచేందుకు బెయిల్ రాకుండా చేసేందుకు కస్టడీ ఫిటీషన్ వేశారని ఆరోపణలు వినిపిస్తున్నాయి. అయితే అప్పలరాజును ఒక్క రోజు విచారణ చేపట్టి నప్పటికీ ఎలాంటి కొత్త విషయాలు సీదిరి నుండి రాబట్టారో తెలియాల్సి ఉంది. ఏదిఏమైనా డా. అప్పల రాజు బెయిల్‌పై బయటకు రాకూడదనే దురుద్దేశ్యం పోలీసులలో కనిపిస్తున్నట్లు స్పష్టంగా తెలుసుందని వైకాపా నాయకులు ఆరోపిస్తున్నారు.

రిమాండ్

>> లకు అప్పగిం చారు. వాస్తవానికి కూటమి ప్రభుత్వం వచ్చిన తర్వాత 2024 నవంబరులో ఇతడు దుబాయ్‌కి పారిపోయాడు. అనంతరం అతనిపై లుక్ అవుట్ సర్కులర్ జారీ అయింది. అప్పటి నుంచి అతను విదేశాల్లోనే దాక్కున్నాడు. మిగతా నిందితులకూ దుబాయ్‌లో ఆశ్రయమి చ్చాడు. కేసులో ఏ9గా ఉన్న ఈశ్వర్‌కిరణ్ కుమార్ రెడ్డి మద్యం రవాణా దోపిడీ, ఈడీ కేసుల్లోనూ కీలక పాత్రధారి. రాజ్ కెసిరెడ్డితో కలసి 'టెక్కర్' అనే డొల్ల కంపెనీని ఏర్పాటు చేశాడు. దీని ద్వారా కొల్లగొట్టిన ముడుపుల సొమ్మును దారి మళ్లిం చాడు. ఇతడిని విచారిస్తే మరిన్ని వివరాలు బయ టకు వచ్చే అవకాశం ఉంది. తిరుపతికి చెందిన ఈశ్వర్ కిరణ్‌కుమార్ కానిస్టేబుల్ కుమారుడు. రాజ్ కెసిరెడ్డిద్వారా ఈ కుంభకోణంలో కీలక పాత్రధా రిగా మారాడు. మరో నిందితుడు సైఫ్ అహ్మద్‌కూడా భారత్‌కు వస్తు న్నట్లు సమాచారం. అతను ఇప్పటికే విజయవాడ ఎసిబి కోర్టులో లొంగుబాటు పిటిషన్ దాఖలు చేశాడు. ఈ పిటి షన్‌పై కోర్టు ఇంకా ఉత్తర్వులు ఇవ్వలేదు. అయినా భారత్‌కు తిరిగి వస్తున్నట్లు తెలిసింది.

వారం - వర్జ్యం

05-08-2026, బుధవారం
శ్రీ పరాభవ నామ సంవత్సరం,
ఆషాఢ మాసం, దక్షిణాయణం,
గ్రీష్మ ఋతువు, కృష్ణపక్షం, ఆశ్లేష కార్తె,
తి.సప్తమి రా.8.38 న.అశ్వని రా.9.14
వ.సా.5.20-సా.6.54
దు.ఉ.11.47-మ.12.38
రాహు. మ.12.00-మ.1.30
శుభ ఉ.6.00-ఉ.7.00

వార్తాఫలం

మేషం : దూరప్రాంతాల నుండి ఆహ్వానాలు అందుకుంటారు. పోటీ పరీక్షలలో విజయం సాధిస్తారు. వస్తులాభం. సోదరుల కలయిక.

వృషభం : ఎంతోకాలంగా ఎదురు చూస్తున్న అవకాశాలు లభిస్తాయి. శత్రువులుసైతం మిత్రులుగా మారతారు. సభలలో పాల్గొంటారు.

మిథునం : మాటల చాతుర్యంతో ఎదుటి వారిని ఆకట్టుకొనే పనులు పూర్తి చేస్తారు. వస్త్రాలు కొనుగోలు.

కర్కాటకం : సంతాన విషయమై ప్రత్యేక శ్రద్ధను కనబరుస్తారు. క్రమశిక్షణ పాటించడం వలన లాభ పడతారు.

సింహం : మీలోని ప్రతిభా పాటవాలు వెలుగు చూసే దిశగా ప్రయాణం సాగిస్తారు. సంఘ సేవా కార్యక్రమాలలో పాల్గొంటారు.

కన్య : ఒకానొక రహస్య సమాచారం తెలుసు కుంటారు. జీవిత భాగస్వామితో చర్చలు జరిపి కొన్ని ముఖ్య నిర్ణయాలు చేస్తారు.

తుల : విధుల నిర్వహణలో, వ్యాపార రంగా లలో అభివృద్ధిని సాధిస్తారు. ఆరాధనలు, యాత్రలు సంభవము.

వృశ్చికం : దూర ప్రయాణాలలో నూతన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి. దీర్ఘ కాలిక సమస్యలు తీరుతాయి.

ధనుస్సు : మాట పట్టింపులతో ఎంతో కాలంగా దూరమైన సన్నిహితులను కలుసు కుంటారు. ఆరోగ్యం పట్ల జాగ్రత్త అవసరం.

మకరం : ముఖ్య కార్యక్రమాలు సకాలంలో పూర్తి చేస్తారు. కుటుంబంలో శుభకార్యాల ప్రస్తావన ఉంటుంది. వస్త్రాలాభం.

కుంభం : సంఘంలోని పలుకుబడి కలిగిన వ్యక్తులతో పరిచయాలు ఏర్పడతాయి. స్వల్ప ధన లాభం. వాహన సౌలభ్యం.

మీనం : చిన్ననాటి మిత్రుల నుండి కీలక సమాచారం తెలుసుకుంటారు. రాజకీయ పరపతి పెరుగుతుంది. ఆరోగ్యం పట్ల మెలుకువ అవసరం.

-శ్రీమతి ములుగు శివజ్యోతి, కోఠి, హైదరాబాద్

విజయవాడ నుంచి అమరావతి దేవస్థానం వరకు ఐకానిక్ రోప్‌వే

విజయవాడ,ఆగస్టు4,ప్రభాతవార్తప్రతినిధి: రాజధాని అమరావతి ప్రాంతంలో కీలకమైన పలు అభివృద్ధి పనులకు సిఆర్‌డిఎ అథారిటీ అనుమతులు మంజూరు చేయడం జరిగిందని రాష్ట్ర మున్సిపల్ పరిపాలన మరియు పట్టణాభివృద్ధి శాఖా మంత్రి పి.నారాయణ తెలిపారు. మంగళవారం సచివాలయంలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు అధ్యక్షతన జరిగిన 64వ సిఆర్‌డిఎ అథారిటీ సమావేశంలో ఆమోదించిన నిర్ణయాలను సచివాలయంలో నాల్గవ భవనంలో నిర్వహించిన మీడియా సమావేశంలో ఆయన వెల్లడించారు.ఈ సందర్భంగా మంత్రి నారాయణ మాట్లాడుతూ రాష్ట్ర 64వ రాజధాని ప్రాంత అభివృద్ధి ప్రాధికార సంస్థ అథారిటీ సమావేశంలో అమరావతి రాజధాని పునర్నిర్మాణం, మౌలిక వసతులు,సాంకేతిక అభివృద్ధి,పర్యాటక రంగానికి సంబంధించి అనేక కీలక నిర్ణయాలు తీసుకోవడం జరిగిందన్నారు.అమరావతిని గ్లోబల్ టెక్నాలజీ హబ్‌గా తీర్చిదిద్దే దిశగా రూ.1,280 కోట్ల భారీ అంచనా వ్యయంతో నిర్మించనున్న క్వాంటం ఫెసిలిటీ ప్రాజెక్టు టెండర్‌ను ప్రముఖ నిర్మాణ సంస్థ ఎల్ అండ్ టి (లార్సన్ అండ్ టూబ్రో) దక్కించుకోగా, ఈ ప్రతిపాదనకు అథారిటీ అధికారిక ఆమోదం తెలిపిందని వివరించారు.రాజధాని అనుసంధానానికి అత్యంత కీలకమైన ఇన్నర్ రింగ్ రోడ్డు మరియు నూతన రైల్వే లైన్ నిర్మాణానికి భూమి సేకరించాల్సిరాగా, గుంటూరు జిల్లా మోతడక గ్రామస్థులు ముందుకు వచ్చి తమ గ్రామంలోని 2,344 ఎకరాల భూమిని ల్యాండ్ పూలింగ్ కింద ఇచ్చేందుకు ఏకగ్రీవ తీర్మానం చేయడంపట్ల అథారిటీ హర్షం వ్యక్తం చేసి ఆమోదముద్ర వేసిందన్నారు. విజయవాడ నగరంలో ట్రాఫిక్ రహిత రవాణాతో పాటు పర్యాటకాన్ని ప్రోత్సహించేలా పబ్లిక్‌ప్రైవేట్ పార్టనర్ షిప్ మోడల్‌లో విజయవాడ రైల్వే స్టేషన్ నుండి పండిట్ నెహ్రూ బస్ స్టాండ్ వరకు, బస్టాండ్ నుండి ఇంద్రకీలాద్రి కనకదుర్గమ్మ ఆలయం వరకు, దుర్గమ్మ గుడి వద్ద నుండి కృష్ణా నది ఒడ్డున ఉన్న పున్నమి ఘాట్ వరకు అక్కడి నుండి భవాని ఐలాండ్ వరకు అక్కడి నుండి అమరావతిలోని శ్రీ వేంకటేశ్వర స్వామి దేవాయం వరకు ఐకానిక్ రోప్‌వే ప్రాజెక్ట్‌ను చేపట్టనున్నామన్నారు.

మంగళవారం న్యూఢిల్లీలో కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్‌తో భేటీ అయిన టిడిపి ఎంపీలు

కేంద్రమంత్రి అశ్విని వైష్ణవ్‌తో టిడిపి ఎంపీలు భేటీ

విజయవాడ..,ఆగస్టు4,ప్రభాతవార్తప్రతినిధి: తెలుగుదేశం పార్టీ పార్లమెంటు సభ్యుల బృందం మంగళవారం కేంద్ర రైల్వే, ఎలక్ట్రానిక్స్, ఐటీ,కమ్యూనికేషన్ల శాఖ మంత్రి అశ్విని వైష్ణవ్‌ను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిసారు. ఈ బృందంలో లోక్‌సభ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు, రాజ్యసభ సభ్యులు సానా సతీష్, భాష్యం రామకృష్ణ, మరియు చింతకాయల విజయ్‌లతో పాటు మరికొందరు టిడిపి ఎంపీలు ఉన్నారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి విజన్, అభివృద్ధి పురోగతి, అలాగే భవిష్యత్తులో దాని ప్రాధాన్యతను ప్రతిబింబించే ఒక ప్రత్యేక పుస్తకాన్ని ఎంపీల బృందం కేంద్ర మంత్రికి అందజేశారు. ఎంపీల బృందంతో ఎంతో సుహృద్భావ వాతావరణంలో ముచ్చటించిన కేంద్ర మంత్రి అశ్విని వైష్ణవ్.. అమరావతి ప్రాముఖ్యతను నలుదిశలా తెలియజేసేలా రూపొందించిన ఈ ప్రత్యేక పుస్తకాన్ని, అలాగే ఎంపీల చొరవను ప్రత్యేకంగా కొనియాడారు.

వడివడిగా 'జల్‌జీవన్'

>> మరింత పెంచాలని స్పష్టం చేశారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల పరిధిలో చేపట్టిన జల్ జీవన్ మిషన్ ప్రాజెక్టుల పురోగతిపై పవన్ కల్యాణ్ సమీక్షించారు. ఇన్ టేక్ వెల్స్, వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు, రిజర్వాయర్లతోపాటు పైప్‌లైన్ల నిర్మాణంవంటి కీలకపనులపురోగతికి సంబంధించిన వివరాలపై ఆర్.డబ్ల్యూ. ఎస్. అధికారులతో చర్చించారు. ఉమ్మడి ఉభయ గోదావరి జిల్లాల్లో రూ.3,050 కోట్లతో చేపట్టిన పనులు నిర్దేశిత లక్ష్యాలకు అనుగుణంగా సాగుతుండడంపట్ల సంతృప్తి వ్యక్తం చేశారు. ఉమ్మడి తూర్పు గోదావరి జిల్లా పరిధిలో రూ.1,650కోట్ల అంచనా వ్యయంతో చేపట్టిన మెగావాటర్‌గ్రిడ్ పథకాన్ని 10 నియోజక వర్గాల పరిధిలో సుమారు 20 లక్షల మందికి మంచినీరు అందించే లక్ష్యంతో ప్రారంభించారు. ఈ ప్రాజెక్టుకు సంబంధించి రెండు ఇంటేక్ వెల్స్, యాక్సెస్ బ్రిడ్జిల నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నట్టు అధికారులు తెలిపారు. 111 ఎంఎల్‌డి, 75 ఎంఎల్‌డి సామర్థ్యాలతో ఏర్పాటు చేస్తున్న నీటి శుద్ధి కేంద్రాల్లో ఒకటి నిర్మాణ దశలో ఉన్నట్టు వివరించారు. ఇప్పటి వరకు ఈ ప్రాజెక్టు కోసం రూ.151 కోట్లకు పైగా ప్రభుత్వం వెచ్చించగా, 182 కిలోమీటర్ల మేర పైప్‌లైన్ నిర్మాణం పూర్తయింది. ఉమ్మడి పశ్చిమ గోదావరి జిల్లా పరిధిలో రూ.1,400 కోట్లతో చేపట్టిన ప్రాజెక్టు ద్వారా సుమారు 13.50 లక్షల మందికి తాగునీటి కష్టాలు తీరనున్నాయి. దీనికి సంబంధించి ఇంటేక్ వెల్, యాక్సెస్ బ్రిడ్జి, 155 మిలియన్ లీటర్ల సామర్థం కలిగిన నీటి శుద్ధి ప్రాజెక్టులు పురోగతిలో ఉన్నాయి. రెండు పథకాల కింద సుమారు 400 కిలోమీటర్ల పైప్‌లైన్ నిర్మాణం పూర్తయినట్టు అధికారులు తెలిపారు. ఇందుకు స్పందిస్తూ పవన్ కల్యాణ్ మాట్లాడుతూ 'ఉభయ గోదావరి జిల్లాల పరిధిలోని గ్రామీణ ప్రజలకు స్వచ్ఛమైన తాగునీరు అందించే లక్ష్యంతో గత యేడాది డిసెంబర్‌లో పశ్చిమ గోదావరి జిల్లా పెరవలిలో రూ.3,050 కోట్ల అంచనా వ్యయంతో అమరజీవి జలధారకు శ్రీకారం చుట్టాం. రెండు మెగా వాటర్ గ్రిడ్ పథకాల నిర్మాణంలో కీలకమైన ఇంటేక్ వెల్స్, వాటర్ ట్రీట్‌మెంట్ ప్లాంట్లు, రిజర్వాయర్లు, పైప్‌లైన్ నిర్మాణ పనులు పురోగతిలో ఉన్నాయి. పనులన్నీ నిర్ణీత గడువులోపు పూర్తి చేసేలా సంబంధిత శాఖలతో సమన్వయంతో పని చేయాలి' అన్నారు.

ప్రాజెక్ట్ మానిటరింగ్ యూనిట్లతో నిరంతర పర్యవేక్షణ.

కేటాయింపుల ప్రక్రియ పూర్తయి నత్తనడకన నడుస్తున్న పనులపై దృష్టి సారించాలి. ముఖ్యంగా పైపు లైన్ల నిర్మాణానికి సంబంధించి ఇతర శాఖల అనుమతులు పెండింగ్‌లో ఉంటే ఆ ప్రక్రియ త్వరితగతిన పూర్తి చేయాలి. ఆర్ అండ్ బి, జాతీయ రహదారి అథారిటీ, పంచాయతీరాజ్ శాఖలు, అవసరం ఉన్న చోట అటవీశాఖలతో సమన్వయం చేసుకుంటూ, పనులు సకాలంలో పూర్తి చేసే విధంగా చర్యలు తీసుకోవాలి. జిల్లా కేంద్రాల్లో ఏర్పాటు చేసిన ప్రాజెక్టు మానిటరింగ్ యూనిట్ల ద్వారా పనుల పురోగతిని ఎప్పటికప్పుడు పర్యవేక్షిస్తూ, రాష్ట్ర కార్యాలయానికి సమాచారం ఇవ్వాలి. ముఖ్యంగా నీటి ఎద్దడి తీవ్రంగా ఉన్న తీర ప్రాంత గ్రామాల్లో పనుల వేగం పెంచాలి. అదే సమయంలో నిర్మాణ పనుల నాణ్యతలో రాజీ పడవద్దని, త్వరలో రాష్ట్రవ్యాప్తంగా చేపట్టిన జల్ జీవన్ మిషన్ పనులను క్షేత్రస్థాయిలో పరిశీలన చేపడతా. నిర్మాణ పనులకు సంబంధించి నాణ్యతాపరమైన తనిఖీలు స్వయంగా నిర్వహిస్తాం. ప్రధాని నరేంద్రమోడీ లక్ష్యాలకు అనుగు ణంగా ప్రతి ఇంటికీ స్వచ్ఛమైన తాగునీరు అందించే విధంగా చర్యలు చేపడతామన్నారు. ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ చొరవతో ఏలూరు డిగ్రీ కళాశాలకు శాశ్వత భవనాలు కోసం రూ.12.60 కోట్ల నిధులు మంజూరు అయ్యాయి. జనవాణి, వారాహి యాత్రల్లో పవన్ దృష్టికి డిగ్రీ కళాశాల సమస్యలు. చెట్ల కింద పాఠాలు చెబుతున్న దుస్థితిపై స్పందించిన పవన్ నిర్దిష్టమైన హామీనిచ్చారు.

ఇథనాల్ పెట్రోల్‌పై ఆందోళన వద్దు

>> నట్లు పెట్రోలియం శాఖ తెలిపింది. దేశవ్యాప్తంగా ఉన్న 87 వేలకుపైగా పెట్రోల్ బంకుల్లో రోజుకు 8 నుంచి 12 సార్లు ఇంధనంలోకి నీరు చేరిందా లేదా అనే పరీక్షలు నిర్వహిస్తున్నట్లు వెల్లడించింది. క్లోరైడ్, సల్ఫైడ్ కలుషితాన్ని గుర్తించేందుకు ఇప్పటివరకు 2 వేలకుపైగా ఇంధన నమూనాలను ప్రత్యేకంగా పరీక్షించినట్లు పేర్కొంది. దేశవ్యాప్తంగా ఇప్పటివరకు కేవలం రెండు ప్రాంతాల్లో మాత్రమే క్లోరైడ్ కలుషితానికి సంబంధించిన వేర్వేరు ఘటనలు గుర్తించినట్లు తెలిపింది. ఆ రెండు పెట్రోల్ బంకుల్లో ఇంధన విక్రయాలను వెంటనే నిలిపివేసినట్లు వెల్లడించింది. ఇంధనంలో కలుషితం లేదా కల్తీకి పాల్పడినట్లు తేలిన ఏ రిటైల్ అవుట్‌లెట్‌పైనా కఠిన చర్యలు తీసుకుంటామని పెట్రోలియం శాఖ హెచ్చరించింది. ఇంధన నాణ్యత విషయంలో ఎలాంటి రాజీ ఉండదని స్పష్టం చేసింది. వాహనాల ట్యాంకుల్లోకి ఇంధనం చేరడానికి చాలా ముందే నాణ్యత పరీక్షలు ప్రారంభమవుతాయని తెలిపింది.

అసోంలో సిఆర్‌పిఎఫ్ క్యాంప్ వద్ద దారుణం

తోటి జవాన్లపై కాల్పులు జరిపి ఆత్మహత్య చేసుకున్న ఎపి అధికారి

హైదరాబాద్, ఆగస్టు 4, ప్రభాతవార్త: అస్సాం రాష్ట్రంలో సిఆర్‌పిఎఫ్ క్యాంప్ వద్ద మంగళవారం ఉదయం ఎపికి చెందిన ఓ ఏఎస్ఐ తోటి జవాన్లపై ఇన్సాస్ తుపాకితో కాల్పులు జరపడంతో ఇద్దరు చనిపోగా మరొకరు గాయపడ్డారు. ఈ ఘాతుకం తరువాత సదరు ఏఎస్ఐ తనను తాను కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. అస్సాంలోని నాగావ్ జిల్లా కతిమెరి వద్ద గల సిఆర్‌పిఎఫ్ 34వ బెటాలియన్ ప్రధాన గేట్ డ్యూ టీలో వున్న ఎపికి చెందిన ఏఎస్ఐ బల్లాని ప్రేమాంబరం ఉదయం ఏడు గంటల సమయంలో వున్నట్లుండి తన చేతిలో వున్న ఇన్సాస్ తుపా కితో విచక్షణారహితంగా కాల్పులు జరిపాడు. ఈ ఘటనలో ఎస్ఐ రాంనవాల్ సింగ్, హెడ్ కానిస్టేబుల్ విష్ణుప్రసాద్ బహేల్‌లు ఘటనా స్థలం లోనే మరణించగా ఏఎస్ఐ గోవింద్ శ్రీపుల్ తీవ్రంగా గాయపడ్డాడు. కాల్పుల ఘటన తరువాత ఏఎస్ఐ ప్రేమాంబరం తన వద్ద వున్న ఇన్సాస్ తుపాకితో కాల్చుకుని ఆత్మహత్యకు పాల్పడ్డాడు. ఈ ఘటన సిఆర్‌పిఎఫ్ క్యాంప్ కార్యాలయం వద్ద సంచలనం రేపింది.

తెలుగు భాషకు అంకితం 'మండలి'

>> కార్యక్రమంలో శాసనసభాపతి గౌరవ చింతకాయల అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ.. మండలి వెంకటకృష్ణారావు శతజయంతి సందర్భంగా ఆయన చేసిన సేవా కార్యక్రమాలను స్మరించుకున్నారు. తెలుగు భాషను కాపాడుకోవడం మన బాధ్యత అని శాసనసభలో ప్రతి ఎమ్మెల్యే కూడా తెలుగులోనే మాట్లాడాలని, తెలుగులో మాట్లాడితేనే మైక్ ఆన్ చేస్తానని సభాపతిగా నిబంధన విధించినట్లు తెలిపారు. అలాగే అసెంబ్లీకి రాకుండా ఉండే సభ్యులపై కూడా తగిన చర్యలు ఉండాలని శాసనసభాపతి అయ్యన్నపాత్రుడు అభిప్రాయ పడ్డారు. రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ... జీవితాంతం తెలుగు భాషా వికాసానికి అంకితమైన మాజీ ఉపరాష్ట్రపతి ముప్పవరపు వెంకయ్య నాయుడు ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా హాజరవ్వడం ఎంతో సముచితమని, ఈ సభకు వన్నె తెచ్చిందని తెలిపారు. తెలుగు భాషను జాతీయ, అంతర్జాతీయస్థాయిలో విశ్వవ్యాప్తం చేయడానికి మొట్టమొదటి తెలుగు మహాసభలను నిర్వహిం చిన మహానుభావుడు మండలి వెంకటకృష్ణారావు అని మంత్రి కొనియాడారు. ఆయన సేవలకు గుర్తుగా రాష్ట్ర ప్రభుత్వం అధికారభాషా సంఘానికి ఆయన పేరు పెట్టడం ఎంతో గౌరవప్రదమైన విషయమన్నారు. అలాగే తండ్రి అడుగుజాడల్లో నడుస్తూ మండలి బుద్ధప్రసాద్ కూడా తెలుగు భాషాభివృద్ధికి విశేష కృషి చేస్తున్నారని శ్లాఘించారు. వైద్య ఆరోగ్య కుటుంబ సంక్షేమ, వైద్య విద్య శాఖామంత్రి సత్య కుమార్ యాదవ్ మాట్లా డుతూ... మండలి వెంకటకృష్ణారావు బహుముఖ ప్రజ్ఞాపాటవాలు, వారి సుదీర్ఘ ప్రజాసేవ నేటి తరం రాజకీయ నాయకులకు ఆదర్శనీయమని కొనియాడారు. ఎమ్మెల్యేగా, ఎంపీగా, జెడ్పీ ఛైర్మన్‌గా, వివిధ శాఖల మంత్రిగా ఏ బాధ్యత నిర్వహించినా దానికి పరిపూర్ణ న్యాయం చేశారని కొనియాడారు.

అంతేకాకుండా తెలుగు భాషా పరిరక్షణకు, సాంస్కృతిక వికాసానికి ఆయన చేసిన కృషి అమూల్య మైనదని... హైదరాబాద్ మరియు మలేషియాలో ప్రపంచ తెలుగు మహాసభలను నిర్వహించి ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగువారిని ఒకే తాటిపైకి తెచ్చారని మంత్రి గుర్తుచేశారు.ఇటువంటి మహోన్నత నాయకుడి శత జయంతి ఉత్సవాలను అధికారికంగా నిర్వహించాలని నిర్ణయించిన ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, పర్యాటక సాంస్కృతిక శాఖ మంత్రి కందుల దుర్గేష్ కి, ఈ కార్యక్రమాన్ని సమర్థవంతంగా రూపుదిద్దిన మండలి బుద్ధప్రసాద్ కి మంత్రి ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు.

5-8Pg3exHMNWJQE.qxd:5-8Pg3exHMNWJQE.qxd 1/1/02 6:40 AM Page 1

డి.సిఎం పవన్‌తో బిజెపి నేత శివ్‌ప్రకాష్ భేటీ

విజయవాడ, ఆగస్టు 4 ప్రభాతవార్త ప్రతినిధి: ఉప ముఖ్యమంత్రి పవన్ కల్యాణ్‌ను భారతీయ జనతా పార్టీ జాతీయ సంయుక్త ప్రధాన కార్యదర్శి శివ్‌ప్రకాష్ మర్యాదపూర్వకంగా కలిశారు. మంగళవారం క్యాంపు కార్యాలయంలో జరిగిన ఈ భేటీలో ఇటీవల భుజానికి శస్త్రచికిత్స చేయించుకుని విశ్రాంతి తీసుకుంటున్న పవన్ కల్యాణ్ ఆరోగ్య పరిస్థితిని అడిగి తెలుసుకున్నారు. పవన్ కల్యాణ్ త్వరగా సంపూర్ణ ఆరోగ్యంతో ప్రజాసేవలో మరింత చురుకుగా పాల్గొనాలని ఆకాంక్షించారు. ఈ భేటీలో బిజెపి రాష్ట్ర అధ్యక్షుడు పివిఎన్ మాధవ్, రాష్ట్ర ఆర్గనైజింగ్ జనరల్ సెక్రటరీ మధుకర్ పాల్గొన్నారు.

మెగా డిఎస్సీపై పిల్... జోక్యానికి హైకోర్టు నిరాకరణ

విజయవాడ, ఆగస్టు 4 ప్రభాతవార్త ప్రతినిధి: మెగా డిఎస్సీ 2025పై సిబిఐ విచారణకు ఆదేశించాలంటూ వైసిపి ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి వేసిన పిల్‌పై జోక్యానికి ఆంధ్రప్రదేశ్ హైకోర్టు నిరాకరించింది. స్పోర్ట్స్ కోటా వల్ల నష్టపోయిన అభ్యర్థులు నేరుగా కోర్టుకు ఎందుకు హాజరు కావడం లేదని ప్రశ్నించింది. బాధిత అభ్యర్థులు నేరుగా న్యాయస్థానాన్ని ఆశ్రయించేందుకు భయపడుతున్నారనే వాదనతో ఏకీభవించలేమని తెలిపింది. మెగా డిఎస్సీ నోటిఫికేషన్, నియామకాలను సవాల్ చేస్తూ ఇప్పటివరకు 335 పిటిషన్లు దాఖలయ్యాయని హైకోర్టు పేర్కొంది. ప్రజా ప్రయోజన వ్యాజ్యమనేది చాలా విలువైన సాధనమని హైకోర్టు అభిప్రాయ పడింది. రాజకీయ ప్రయోజనాల కోసం దానిని వినియోగించడానికి అనుమతిస్తే పిల్ ఉద్దేశం దెబ్బతింటుందని హెచ్చరించింది. ఈ పిల్‌పై వాదనలు కొనసాగిస్తారా?, ఉపసంహరించుకుంటారా? పిటిషనర్ నుంచి ఇన్‌స్ట్రక్షన్స్ తీసుకొని తమ ముందుకు రావాలని న్యాయస్థానం సూచించింది. ఈ మేరకు వైసిపి ఎమ్మెల్సీ పర్వతరెడ్డి చంద్రశేఖర్‌రెడ్డి తరఫు సీనియర్ న్యాయవాదికి న్యాయస్థానం వెల్లడించింది. మెగా డిఎస్సీ 2025పై సిబిఐ విచారణకు ఆదేశించాలంటూ హైకోర్టులో చంద్రశేఖర్‌రెడ్డి హైకోర్టులో ఇటీవల పిల్ దాఖలు చేసిన విషయం తెలిసిందే.

కడప జిల్లాలో జంట హత్యలు

- కుమార్తెను, కన్నతల్లిని కడతేర్చిన వైనం
- సిసి కెమెరాలు తనిఖీ చేసిన పోలీసులు
- నిందితుడి కోసం ముమ్మర గాలింపు

సిద్ధవటం, ఆగస్టు 4 ప్రభాతవార్త: కడప జిల్లాలో పరువు హత్యలు కలకలం రేపాయి. అనుమానంతో కుమార్తెను కడతేర్చి నవ మోసాలు మోసి, పెంచి పెద్ద చేసిన తన కన్నతల్లినే అతి కిరాతకంగా హత్య చేసిన సంఘటన మంగళవారం మాచుపల్లి పొలాల్లో వెలుగు చూసింది. సిద్ధవటం మండలంలోని మాచుపల్లి సమీపంలోని వరి పంట పొలంలో ఓబుళమ్మ(50) అనే మహిళ మృతి చెందినట్లు స్థానికులు పోలీసులకు సమాచారం అందజేశారు. ఈ మేరకు పోలీసులు ఘటనాస్థలికి చేరుకుని మహిళ మృతదేహం వద్ద ఉన్న పర్సులో మైదుకూరు గ్రామంలోని, బంగారం దుకాణం అడ్రస్‌తో కూడిన సమాచారం లభ్యం కావడంతో మృతురాలు వనిపెంట ఎస్సీ కాలనీకి చెందిన ఓబుళమ్మగా గుర్తించారు. ఓబులమ్మకు వెంకటరమణ, బాబు, రఘునాథ్ ముగ్గురు కొడుకులు. బాబు కడప నగరంలో పెయింటింగ్ పనులు చేస్తూ జీవనం కొనసాగిస్తున్నాడు. ఓబుళమ్మ కుమారుడు రఘునాథ్ కథనం మేరకు, సోమవారం రాత్రి 7 గంటలకు తన అన్న బాబు ద్విచక్ర వాహనంలో వనిపెంట నుండి తల్లి ఓబులమ్మను తీసుకొని వచ్చాడు. కూతురు హారిక(21)పై అనుమానం పడేవారు. తల్లి ఓబులమ్మను తన కూతురు వద్దే ఉండమని చెప్పేవాడని, అయితే వృద్ధాప్య పెన్షన్ కోసం తల్లి ఓబుళమ్మ వనిపెంటకు వచ్చిందన్నారు. కూతురిపై అనుమానంతో హతమార్చాడని రఘునాథ్ పేర్కొన్నారు. అదే కోపంతో తల్లిని ద్విచక్ర వాహనంలో తీసుకు వచ్చి హత్య చేసినట్లు అనుమానం కలిగిస్తుందన్నారు. భార్య అయ్యవారమ్మను కూడా హత్య చేయాలని చూశాడన్నారు. మృతుల కుటుంబీకులు ఇచ్చిన ఫిర్యాదు మేరకు పోలీసులు కేసు నమోదు చేసి, దర్యాప్తు చేపట్టారు. నిందితుడి ఆచూకీ కోసం గాలిస్తున్నారు. సిసి కెమెరాలు పరిశీలిస్తున్నారు. జంట హత్యలపై డిఎస్పి బాలస్వామి రెడ్డి నేతృత్వంలో సర్కిల్ ఇన్‌స్పెక్టర్ వెంకటేశ్వర్లు, ఎస్ఐలు హారిక, శ్రీనివాసులు విచారణ చేపట్టారు.

మండలి వెంకటకృష్ణారావుకు అయ్యన్న నివాళి

విజయవాడ, ఆగస్టు 4 ప్రభాతవార్త ప్రతినిధి: మాజీ మంత్రి, ప్రముఖ స్వాతంత్ర్య సమరయోధుడు మండలి వెంకట కృష్ణారావు శత జయంతిని పురస్కరించుకుని రాష్ట్ర శాసనసభలో ఆయనకు నివాళి అర్పించారు. అసెంబ్లీ సమావేశ మందిరంలో జరిగిన ఈ కార్యక్రమంలో శాసనసభ సభాపతి చింతకాయల అయ్యన్నపాత్రుడు పాల్గొని కృష్ణారావు చిత్రపటానికి నివాళి అర్పించారు. ఈ సందర్భంగా స్పీకర్ అయ్యన్నపాత్రుడు మాట్లాడుతూ, ఇది కేవలం ఒక వ్యక్తిని స్మరించుకునే కార్యక్రమం మాత్రమే కాదని, ఒక గొప్ప ఆదర్శాన్ని గుర్తుచేసుకునే అరుదైన సందర్భమని కొనియాడారు. మండలి వెంకట కృష్ణారావు కేవలం రాజకీయ నాయకుడు మాత్రమే కాదని, నిజమైన ప్రజల మనిషి అని అన్నారు. నిస్వార్థ ప్రజా సేవకు అంకితమైన ఆయనను ప్రజలందరూ ఎంతో ప్రేమగా "దివిసీమ గాంధీ" అని పిలుచుకునేవారని ఆయన ఈ సందర్భంగా గుర్తుచేశారు. ఈ కార్యక్రమంలో శాసనసభ్యులు వేగుళ్ళ జోగేశ్వరరావు, విష్ణుకుమార్ రాజు, అసెంబ్లీ సెక్రటరీ జనరల్ ప్రసన్నకుమార్ సూర్యదేవర పాల్గొన్నారు.

నెల్లూరులో యువతి దారుణ హత్య

నెల్లూరు(క్రైమ్), ఆగస్టు 4 ప్రభాతవార్త: నెల్లూరు రూరల్ మండలంలో వివాహేతర సంబంధాన్ని కొనసాగించేందుకు నిరాకరించిన ఓ వివాహితను దారుణంగా హత్య చేసిన ఘటన కలకలం రేపింది. పోలీసుల కథనం మేరకు, మనుబోలు మండలం బిరుదవోలు గ్రామానికి చెందిన మద్దూరు వెన్నెల (25)కు మట్టెంపాడు గ్రామానికి చెందిన కాకుమూరు శ్రీహరితో గతంలో వివాహేతర సంబంధం ఉండేది. ఈ విషయం తెలుసుకున్న కుటుంబ సభ్యులు వెన్నెలను మందలించడంతో ఆమె ఆ సంబంధాన్ని పూర్తిగా విరమించుకుంది. అప్పటి నుంచి శ్రీహరి తిరిగి తనతో సంబంధాన్ని కొనసాగించాలని ఆమెపై ఒత్తిడి చేస్తూ వేధింపులకు పాల్పడుతున్నాడు. ఈ క్రమంలో ఆగస్టు 3వ తేదీ రాత్రి వెన్నెల మట్టెంపాడు గ్రామానికి వెళ్లిన అనంతరం తిరిగి ఇంటికి చేరుకోకపోవడంతో కుటుంబ సభ్యులు గాలింపు చేపట్టారు. తెల్లవారుజామున నెల్లూరు-పొదలకూరు రహదారిలోని ఎంఎస్ఎంఈ పార్క్ సమీపంలో వెతుకుతుండగా ఓ మహిళ కేకలు వినిపించడంతో అక్కడికి వెళ్లి చూడగా, కాకుమూరు శ్రీహరి చెక్క కర్రతో వెన్నెల తలపై దాడి చేస్తున్నట్లు మృతురాలి బంధువులు చల్లా తేజా, గుంజి వెంకట కృష్ణ గుర్తించారు. గమనించిన నిందితుడు తన మోటార్‌సైకిల్‌పై అక్కడి నుంచి పరారయ్యాడు. వెన్నెల తీవ్ర రక్తస్రావ గాయాలతో అపస్మారక స్థితిలో పడి ఉండటాన్ని గమనించగా, అప్పటికే ఆమె మృతి చెందినట్లు నిర్ధారించారు. ఈ ఘటనపై మృతురాలి తల్లి చల్లా మంగమ్మ ఫిర్యాదు మేరకు నెల్లూరు రూరల్ పోలీసులు బీఎన్ఎస్ సెక్షన్ 103(2) కింద కేసు నమోదు చేసి దర్యాప్తు చేపట్టారు. ఘటనా స్థలానికి నెల్లూరు రూరల్ డిఎస్పి ఘట్టమనేని శ్రీనివాసరావు, సిఐ గుంజి వేణు చేరుకుని పరిశీలించారు.

నైతిక విలువలతోనే విద్యా వికాసం

- విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌తో మర్యాదపూర్వక భేటీలో ప్రవచనకర్త చాగంటి కోటేశ్వరరావు

విజయవాడ, ఆగస్టు 4 ప్రభాతవార్త ప్రతినిధి: ప్రవచన చక్రవర్తి, నైతిక విలువల సలహాదారులు చాగంటి కోటేశ్వరరావు మంగళవారం ఉండవల్లిలోని నివాసంలో రాష్ట్ర విద్యా, ఐటీ శాఖల మంత్రి నారా లోకేష్‌ను మర్యాద పూర్వకంగా కలిశారు. ఈ భేటీ సందర్భంగా సమాజంలో బాధ్యతాయుత పౌరులుగా విద్యార్థులను తీర్చిదిద్దడానికి నైతిక విలువలతో కూడిన విద్య ఎంతటి కీలకమైనదో చాగంటి కోటేశ్వరరావు మంత్రికి వివరించారు. చిన్ననాటి నుంచే పిల్లలలో మానవీయ విలువలు, క్రమశిక్షణ, నైతికతను పెంపొందించాల్సిన అవసరం ఉందని ఆయన పేర్కొన్నారు. ప్రస్తుతం ఆంధ్రప్రదేశ్ ప్రభుత్వ పాఠశాలల్లోని విద్యార్థులకు చాగంటి కోటేశ్వరరావు దిశా నిర్దేశంలో రూపకల్పన చేసిన నైతిక విలువల పాఠ్యాంశాలను 'నో బ్యాగ్ డే' రోజు బోధిస్తున్నారు. నైతిక విలువల విద్యతోనే సమగ్ర విద్యా వికాసం సాధ్యమని నమ్మిన ఎపి ప్రభుత్వం చేస్తున్న కృషిలో భాగం కావడం పట్ల చాగంటి కోటేశ్వరావు సంతోషం వ్యక్తం చేశారు. భేటీ అనంతరం ఇంటి నుంచి కారు వద్దకు వచ్చి చాగంటి కోటేశ్వరావుని మంత్రి నారా లోకేష్ వినయపూర్వకంగా సాగనంపారు.

మంత్రి నారా లోకేష్‌ను మర్యాదపూర్వకంగా కలిసిన ప్రముఖ గాయని శోభారాజు

విజయవాడ, ఆగస్టు 4 ప్రభాతవార్త ప్రతినిధి: ప్రఖ్యాత శాస్త్రీయ సంగీత కళాకారిణి, పదకవితా పితామహుడు తాళ్లపాక అన్నమాచార్యుల సంకీర్తనల ఆలాపన, ప్రచారంలో విశేష ప్రావీణ్యం సంపాదించిన పద్మశ్రీ శోభారాజు మంగళవారం ఉండవల్లిలోని నివాసంలో విద్య, ఐటీ శాఖల మంత్రి లోకేష్‌ని మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా మంత్రి లోకేష్‌కి శోభారాజు అన్నమాచార్యులు చిత్రపటాన్ని బహుకరించారు. శ్రీవారి ప్రతిమను అందజేసి శోభారాజుని గౌరవించారు. తెలుగు సంస్కృతి, సనాతన ధర్మం, ఆధ్యాత్మిక ప్రచారం, అన్నమయ్య సంకీర్తనా వైభవాన్ని భావితరాలకు అందించడంలో శోభారాజు చేస్తున్న సేవలను ఈ సందర్భంగా మంత్రి లోకేష్ అభినందించారు.

తెలుగుజాతి గర్వించేలా అమరావతి

- 2028 నాటికి నిర్మాణాలు పూర్తి
- అద్భుతంగా మంత్రులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల నివాసాలు
- జోరుగా రాజధాని రహదారుల నిర్మాణాలు
- మంత్రులు అనగాని సత్యప్రసాద్, సవిత

విజయవాడ, ఆగస్టు 4 ప్రభాతవార్త ప్రతినిధి: తెలుగు జాతి గర్వించేలా రాజధాని అమరావతిని సీఎం చంద్రబాబు నిర్మిస్తున్నారని, 2028 ఆగస్టు నాటికి మొదటి విడత నిర్మాణాలు పూర్తి చేస్తామని రాష్ట్ర మంత్రులు అనగాని సత్యప్రసాద్, ఎస్.సవిత తెలిపారు. అబద్ధపు పునాదులపై ఏర్పడిన వైసీపీ ఆనాడు అమరావతి గ్రాఫిక్స్ అని తప్పుడు ఆరోపణలు చేసి పబ్బం గడుపుకుందన్నారు. గ్రాఫిక్స్‌కు, వాస్తవాలకు జగన్‌కు తేడా తెలియదా..? అని ప్రశ్నించారు. జగన్ విధ్వంసపు క్రెడిట్ ఎవ్వరికీ అక్కర్లేదని, తమ ప్రభుత్వానికి అభివృద్ధి అని స్పష్టం చేశారు. చదువు గురించి జగన్ ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిదని, స్టాన్ ఫోర్డ్ యూనివర్శిటీలో చదువుకున్న మంత్రి నారా లోకేష్ తో ఆయనకేంటి పోలికని ఎద్దేవా చేశారు. రాజధాని అమరావతి పనులను మంత్రులు అనగాని సత్యప్రసాద్, నారాయణ, ఎస్.సవిత మంగళవారం పరిశీలించారు. తొలుత మంత్రుల నివాసాలను తరవాత సచివాలయం, హెచ్ ఓడీ ఐకానిక్ టవర్లను, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల టవర్లను పరిశీలించారు. ఇప్పటికే పూర్తయిన మంత్రులు, ఎమ్మెల్యే, ఎమ్మెల్సీల నివాసాల్లో ఏర్పాటు చేసిన సౌకర్యాలపై మంత్రులు ఆనందం వ్యక్తంచేశారు. ఈ సందర్భంగా తమను కలిసిన విలేకరులతో మాట్లాడారు.

ముందుగా మంత్రి అనగాని సత్యప్రసాద్ మాట్లాడుతూ, అబద్ధపు పునాదులపై ఏర్పడిన వైసీపీ అమరావతిలో గ్రాఫిక్స్ నిర్మాణాలంటూ తప్పుడు ప్రచారాలు చేసిందన్నారు. గ్రాఫిక్స్ కు, వాస్తవాలకు జగన్ కు తేడా తెలియదా..? అని ప్రశ్నించారు. చదువు గురించి జగన్ ఎంత తక్కువ మాట్లాడితే అంత మంచిదన్నారు. స్టాన్ ఫోర్డ్ యూనివర్శిటీలో చదువుకున్న ఉన్నత విద్యా వంతుడితో మంత్రి నారా లోకేశ్ తో ఆయనకు పోలికే లేదన్నారు. మంత్రి నారా లోకేశ్ ఎందుకు రాజీనామా చేయాలని వైసీపీనుద్దేశించి మంత్రి అనగాని ప్రశ్నించారు. విద్యా రంగంలో విప్లవాత్మకమైన మార్పులు తీసుకొచ్చినందుకా... రాష్ట్రానికి భారీ ఎత్తున పెట్టుబడులు తీసుకొస్తున్నందుకా? అని నిలదీశారు. మెగా డీఎస్సీపై తప్పుడు ఆరోపణలు చేయడం మానుకోవాలని మంత్రి అనగాని సత్యప్రసాద్ హితవు పలికారు. తెలుగుజాతి గర్వించేలా అమరావతి నిర్మాణాన్ని సీఎం చంద్రబాబు చేపట్టారని మంత్రి సవిత తెలిపారు. సచివాలయం, హెచ్ ఓడీ టవర్లతో పాటు మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల నివాసాలు అద్భుతం నిర్మిస్తున్నారన్నారు. ఇప్పటికే మంత్రులు, ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీల నివాసాలు పూర్తయ్యాయని, ఈ నెల 15 తేదీన జీఏడీకి అప్పగించనున్నారని తెలిపారు. 2028 నాటికి సచివాలయం, హైకోర్టు, అసెంబ్లీ తదితర ఐకానిక్ భవనాల నిర్మాణాలను పూర్తి చేయబోతున్నామన్నారు. రాజధాని పనుల్లో ముఖ్యమైన రోడ్ల నిర్మాణ పనులు చురుగ్గా సాగుతున్నాయన్నారు. ప్రజలకు అన్ని సేవలు ఒకేచోట లభించేలా సచివాలయం, హెచ్ ఓడీ కార్యాలయాలను నిర్మిస్తున్నామన్నారు. గతంలో హైటెక్ సిటీ సైబరాబాద్ ను నిర్మించిన సీఎం చంద్రబాబు నాయుడు అమరావతిని కూడా పూర్తి చేసి ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోతారని మంత్రి సవిత కొనియాడారు. ప్రపంచం మెచ్చేలా గ్రీన్ ఫీల్డ్ రాజధానిని సీఎం చంద్రబాబు నిర్మిస్తుండడం చూసి జగన్ ఓర్వలేకపోతున్నారని మంత్రి సవిత మండిపడ్డారు. జగన్ ది విధ్వంసం క్రెడిట్ అని, తమ ప్రభుత్వానికి అభివృద్ధి క్రెడిట్ అని అన్నారు. రప్పా రప్పా నరకడం, విధ్వంసం, దోపిడీ, అరాచకం ఇవి జగన్ క్రెడిట్ అని అన్నారు. ఆ క్రెడిట్ ను ఎవ్వరూ ఆశించరన్నారు. ప్రజలు ఛీ కొట్టడంతో ఇప్పుడు మావిగన్ అంటూ మరో డ్రామా ఆడుతున్నారన్నారు. మావిగన్ ఎక్కడుందో కూడా తెలియని అజ్ఞాని జగన్ అని విమర్శించారు.

నిరసనల పేరుతో రాష్ట్రంలో జగన్, వైసీపీ నాయకులు విధ్వంసం సృష్టిస్తున్నారని మంత్రి సవిత మండి పడ్డారు. ఈ కార్యక్రమంలో రాష్ట్ర మున్సిపల్ శాఖ మంత్రి నారాయణ, ఇతర అధికారులు పాల్గొన్నారు.

మనమిత్ర ద్వారా సదరం స్లాట్ బుకింగ్ ఇక సరళతరం

విజయవాడ, ఆగస్టు 4 ప్రభాతవార్త ప్రతినిధి: రాష్ట్రంలోని దివ్యాంగులు సదరం సర్టిఫికెట్లు మరింత సులభంగా పొందడానికి వీలుగా ఆన్‌లైన్ స్లాట్ బుకింగ్ విధానాన్ని ప్రభుత్వం మరింత సరళతరం చేసింది. దివ్యాంగులు ఇకపై సదరం స్లాట్ బుకింగ్ కోసం మీ సేవా కేంద్రాలు, స్వర్ణ గ్రామ, స్వర్ణ వార్డు కార్యాలయాల చుట్టూ తిరగాల్సిన పనిలేదు. మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా వారు తామున్న చోటు నుంచి కేవలం తమ మొబైల్ ఫోను ద్వారా ఇకపై ఈ పనులు నిర్వహించుకోవచ్చు. ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు సూచనల ప్రకారం దివ్యాంగుల కొరకు సదరం సేవలను మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా పొందే వీలు కల్పించినట్లు రియల్ టైమ్ గవర్నెన్స్ సొసైటీ (ఆర్టీజీఎస్) ఒక ప్రకటనలో తెలిపింది. దీనివల్ల దివ్యాంగులు ఇకపై సదరం స్లాట్ బుకింగ్, స్లాట్ లభ్యత సమయం, సర్టిఫికెట్ డౌనులోడు సేవల కోసం వారు ఏ కార్యాలయానికి వెళ్లనవసరం ఉండదు. వారున్న చోటు నుంచే తమ మొబైల్ ఫోనులోని మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ద్వారా క్షణాల్లో ఈ పనులు చక్కబెట్టుకోవచ్చని ఆర్టీజీఎస్ అధికారులు తెలిపారు. ఎలా తెలుసుకోవచ్చు అంటే ముందుగా మీ మొబైల్ నంబరులోని వాట్సాప్ ఓపెన్ చేయాలిఅందులో మనమిత్ర వాట్సాప్ గవర్నెన్స్ ..9552300009కు హాయ్ అని మెసేజ్ పంపాలి. తర్వాత మీకు మొబైల్ ఫోనులో కనిపించే సిటిజన్ సర్వీసుల్లో సదరం సర్వీసులను ఎంపిక చేసుకోవాలి. అందులో మీకు సదరం స్లాట్ అవైలబిలిటీ, సదరం స్లాట్ బుకింగ్, సదరం సర్టిఫికెట్ డౌన్ లోడు అనే మూడు ఆప్షన్లు కనిపిస్తాయి. అందులో మీకు ఏది అవసరమైతే దాన్ని ఎంపిక చేసుకోవాలి.అందులో మీరు స్లాట్ బుకింగ్ చేసుకోవాలనుకుంటే స్లాట్ బుక్ చేసుకోవచ్చు సదరం సర్టిఫికెట్ కావాలంటే మీరున్న చోటునుంచే సర్టిఫికెట్ డౌన్‌లోడు చేసుకోవచ్చు. దివ్యాంగులందరూ ఈ అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలని అధికారులు కోరారు.

మహిళలపై వేధింపులు తీవ్రమైన నేరం

- ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్ పర్సన్ డా.రాయపాటి శైలజ

అనంతపురం, ఆగస్టు 4 ప్రభాతవార్త బ్యూరో: నేటి సమాజంలో స్టాకింగ్ (మహిళలపై వేధింపులు) నివారణ సామాజిక బాధ్యతగా ప్రతి ఒక్కరు గుర్తించాలని రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ డా.శైలజ తెలిపారు. మంగళవారం ఎస్.కె.యులోని ఇంజనీరింగ్ విభాగ సమావేశ మందిరంలో జాతీయ మహిళా కమిషన్ సహకారంతో ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర మహిళా కమిషన్ ఆధ్వర్యంలో మహిళల వేధింపుపై వేధింపులు, స్టాకింగ్ (మహిళల వేధింపు) సైబర్ స్టాకింగ్ నివారణ అంశాలపై విద్యార్థినీలకు అవగాహన కార్యక్రమం నిర్వహించారు. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా రాష్ట్ర మహిళా కమిషన్ చైర్మన్ శైలజ పాల్గొన్నారు. ప్రత్యేక ఆహ్వానితులుగా అనంతపురం పిటిసి ప్రిన్సిపాల్ సుప్రజ, సీనియర్ ఏపీపీ ఎన్.సి.సంగీత, మానసిక నిపుణులు డా.సురేఖ, ఉమెన్ కమిషన్ సలహాదారులు సూయాజ్, ఐసిడిఎస్ పిడి సాజిదా బేగం, ఎస్కేయు కళాశాల ప్రిన్సిపాల్ రామచంద్ర తదితరులు అలాగే పలువురు అధ్యాపకులు, ఉద్యోగులు, స్వయం సహాయక సంఘాల సభ్యులు, మహిళా పలువురు పారిశ్రామి కవేత్తలు మహిళలు, స్వచ్ఛంద సేవా సంస్థల ప్రతినిధులు, ఐసిడిఎస్ సిడిపిఓలు, సూపర్వైజర్లు, అంగన్వాడి కార్యకర్తలు తదితరులు పాల్గొన్నారు. ఈ సందర్భంగా ముఖ్య అతిథి రాష్ట్ర మహిళా కమిషన్ చైర్ పర్సన్ కార్యక్రమాన్ని ఉద్దేశించి మాట్లాడుతూ ప్రస్తుత సమాజంలో ప్రతి ఒక్కరూ స్టాకింగ్ గురించి తెలుసుకోవాల్సిన ఆవశ్యకత ఎంతైనా ఉందన్నారు. ముఖ్యంగా స్టాకింగ్ అంటే ఎవరి ఇష్టానికి వ్యతిరేకంగా అయినా, వారిని నిరంతరం వెంబడించడం, గమనించడం, లేదా వారి ప్రమేయం లేకుండా వారి వ్యక్తిగత జీవితంలోకి చొరబడడానికి ప్రయత్నిం చడాన్ని స్టాకింగ్ అంటారని ఇది చట్టరీత్యా ఒక తీవ్రమైన నేరం అని పేర్కొన్నారు.

సమాజంలో చాలా మంది యువతులు మహిళలకు స్టాకింగ్ అంటే ఏమిటి అది ఏ ఏ రూపాల్లో జరుగుతుందో తెలియక వేధింపుల ను భరిస్తున్నారని ఆమె ఆవేదన వ్యక్తం చేశారు. ఒక వ్యక్తి పదే పదే వెంబడించడం, వద్దని చెప్పిన ఆగకుండా మెసేజ్‌లు, ఫోన్ కాల్స్, గిఫ్టులు, లేఖలు పంపడం, సోషల్ మీడియా ద్వారా ఇబ్బంది పెట్టడం, ఫోన్ లేదా అకౌంట్లను హ్యాక్ చేయడం నకిలీ అకౌంట్లు సృష్టించి వేధించడం వంటి చర్యలన్నీ స్టాకింగ్ కిందకే వస్తాయని వివరించారు. గతంలో ఎక్కువగా ఫిజికల్ స్టాకింగ్ ఉండేదని, ప్రస్తుతం సైబర్ స్టాకింగ్ కేసులు వేగంగా జరుగుతున్నాయని ఆమె ఆందోళన వ్యక్తం చేశారు. బాధితులు మొదట స్టాకింగ్‌ను గుర్తించడం, ఆధారాలను భద్రపరచడం, వెంటనే పోలీసులకు లేదా సంబంధిత అధికారులకు ఫిర్యాదు చేయడం ఎంతో ముఖ్యమని సూచించారు. కార్యక్రమంలో పాల్గొన్న పిటిసి ప్రిన్సిపల్ సుప్రజ ఐపిఎస్ వివిధ కేస్ స్టడీలను వివరించారు. వివాహిత మహిళలు కూడా స్టాకింగ్ గురవుతున్నారని పేర్కొన్నారు. కొన్నిసార్లు ఈ వేధింపుల కారణంగా కుటుంబాలు విచ్ఛిన్నమవడం తీవ్ర మానసిక ఒత్తిడికి గురి కావడం ఆత్మహత్యలకు కూడా దారి తీసిన సంఘటనలు ఉన్నాయని తెలిపారు. అలాగే న్యాయవాదులు టాకింగ్ సంబంధించిన చట్టాలు ఫిర్యాదు చేస్తే అమలయ్య విధానాన్ని సీనియర్ ఏపీపీ విద్యార్థులకు అవగాహన కల్పించారు. అలాగే డా.సురేఖ సైకియాట్రిస్ట్ మాట్లాడుతూ.. బాధితుల్లో ఏర్పడే మానసిక ప్రభావాలపై విద్యార్థినీలకు అవగాహన కల్పించారు.

డిగ్రీ అడ్మిషన్లకు గ్రీన్ సిగ్నల్

- నాలుగు నెలల ఆలస్యానికి తెర
- నేటి నుంచి దరఖాస్తుల స్వీకరణ
- 126 కళాశాలల్లో 26,755 సీట్లు అందుబాటులో

తిరుపతి(విద్య), ఆగస్టు 4 ప్రభాతవార్త: ఇంటర్మీడియట్ ఫలితాలు విడుదలై నాలుగు నెలలు గడిచినా డిగ్రీ ప్రవేశాల నోటిఫికేషన్ జారీ కాకపోవడంతో వేలాది మంది విద్యార్థులు, తల్లిదండ్రులు తీవ్ర అనిశ్చితిలో చిక్కుకున్నారు. ఎట్టకేలకు రాష్ట్ర ఉన్నత విద్యామండలి డిగ్రీ ప్రవేశాల నోటిఫికేషన్ విడుదల చేయడంతో తిరుపతి జిల్లాలో సుమారు 30 వేల మంది విద్యార్థుల నిరీక్షణకు తెరపడింది. బుధవారం నుంచి ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ ప్రారంభం కానుండగా, అడ్మిషన్ల ప్రక్రియకు మార్గం సుగమమైంది.

ప్రవేశాల షెడ్యూల్ ప్రకారం విద్యార్థులు ఈ నెల 11వ తేదీ వరకు ఓఎండీసీ (ఆన్‌లైన్ అడ్మిషన్స్ మాడ్యూల్ ఫర్ డిగ్రీ కాలేజెస్) ద్వారా దరఖాస్తు చేసుకోవాలి. 15 నుంచి 19వ తేదీ వరకు వెబ్ ఆప్షన్లు నమోదు చేసుకునే అవకాశం ఉండగా, 20న వెబ్ ఆప్షన్లలో మార్పులు చేసుకునే వెసులుబాటు కల్పించారు. 26న మెరిట్, రిజర్వేషన్ల ప్రాతిపదికన సీట్ల కేటాయింపు చేపట్టనుండగా, 27 నుంచి 29వ తేదీ వరకు విద్యార్థులు కేటాయించిన కళాశాలల్లో రిపోర్ట్ చేసి అదే రోజు నుంచి తరగతులకు హాజరు కావాల్సి ఉంటుంది. ఈ ఏడాది కూడా గతంలో అమల్లోకి తీసుకొచ్చిన సింగిల్ మేజర్ విధానాన్నే కొనసాగిస్తూ ప్రవేశాలు చేపట్టనున్నట్లు నోటిఫికేషన్‌లో పేర్కొన్నారు. అయితే డిగ్రీ ప్రవేశాల నోటిఫికేషన్ విడుదలైనప్పటికీ పీజీసెట్, లాసెట్, ఐసెట్ కౌన్సెలింగ్ షెడ్యూల్‌పై ఇప్పటికీ స్పష్టత లేకపోవడంతో ఉన్నత విద్యలో చేరాలనుకునే విద్యార్థులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు.విద్యార్థులకు ఇబ్బందులు తలెత్తకుండా జిల్లాలోని అన్ని ప్రభుత్వ, ప్రైవేటు, టీటీడీ డిగ్రీ కళాశాలల్లో ప్రత్యేక హెల్ప్‌డెస్క్‌లు ఏర్పాటు చేశారు. ఇప్పటికే ఆఫ్‌లైన్‌లో దరఖాస్తు చేసుకున్న వారి వివరాలను ఆయా కళాశాలల అధ్యాపకులు ఆన్‌లైన్‌లో నమోదు చేయనుండగా, ఇంకా దరఖాస్తు చేయని విద్యార్థులు నేరుగా ఆన్‌లైన్‌లో నమోదు చేసుకోవచ్చని అధికారులు తెలిపారు. సందేహాలు ఎదురైతే సమీప ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో ఏర్పాటు చేసిన హెల్ప్‌డెస్క్‌ను సంప్రదించాలని సూచించారు.జిల్లాలో డిగ్రీ విద్యకు విస్తృత అవకాశాలు అందుబాటులో ఉన్నాయి. ఉమ్మడి జిల్లాలో 17 ప్రభుత్వ డిగ్రీ కళాశాలలు, 104 ప్రైవేటు డిగ్రీ కళాశాలలు, 5 టీటీడీ డిగ్రీ కళాశాలలు కలిపి మొత్తం 126 కళాశాలలు ఉన్నాయి. వీటిలో 21 విభాగాల్లో మొత్తం 26,755 సీట్లు అందుబాటులో ఉండగా, ఈ విద్యాసంవత్సరానికి ఆ సీట్ల భర్తీ ప్రక్రియ ఇప్పుడు ప్రారంభమైంది. దీంతో వేలాది మంది విద్యార్థులు తమ అభిరుచికి అనుగుణంగా కళాశాలలు, కోర్సులను ఎంపిక చేసుకునే అవకాశం లభించనుంది.

ఘనంగా శ్రీచైతన్య కావూరి హిల్స్ జోన్ రోర్ వేడుకలు

హైదరాబాద్, ఆగస్టు 4 ప్రభాతవార్త: విద్యా రంగంలో నాలుగు దశాబ్దాల సుదీర్ఘ అనుభవంతో ఘనమైన వారసత్వాన్ని కలిగిన శ్రీచైతన్య విద్యా సంస్థలు తమ కావూరి హిల్స్ జోన్ ఆధ్వర్యంలో రైజ్ ఆఫ్ అచీవర్స్ అండ్ రాక్ స్టార్స్ 2026 ఫ్రెషర్స్ డే వేడుకలు, ఇంటర్ కాలేజ్ స్పోర్ట్స్ కాంపిటీషన్స్ మంగళవారం హైదరాబాద్‌లోని గచ్చిబౌలి ఇండోర్ స్టేడియంలో అత్యంత వైభవంగా జరిగాయి. ఉదయం 11 గంటల నుండి మధ్యాహ్నం 3 గంటల వరకు సాగిన ఈ వేడుక విద్యార్థులలో నూతన ఉత్సాహాన్ని, ఉన్నత లక్ష్యాల పట్ల కొత్త ఆకాంక్షలను రగిలించింది. ఈ కార్యక్రమంలో ముఖ్య అతిథులుగా సైబరాబాద్ పోలీస్ కమిషనర్ డాక్టర్ ఎం. రమేష్, సైబరాబాద్ మునిసిపల్ కార్పొరేషన్ కమిషనర్ జి. సృజన, సైబరాబాద్ డెప్యూటీ పోలీస్ కమిషనర్ రీతిరాజ్ హాజరయ్యారు. అతిథులు తమ ప్రసంగంలో... భవిష్యత్ విజేతలను తీర్చిదిద్దడంలో శ్రీచైతన్య విద్యాసంస్థలు పడుతున్న నిరంతర శ్రమను కొనియాడారు. శ్రీచైతన్య అందిస్తున్న ప్రపంచ స్థాయి విద్యా వ్యవస్థను విద్యార్థులు సరైన రీతిలో ఉపయోగించుకుని అత్యుత్తమ ఫలితాలు సాధించాలని పిలుపునిచ్చారు. ఐఐటీ, జేఈఈ, నీట్ వంటి ప్రతిష్టాత్మక జాతీయ స్థాయి పరీక్షలలో శ్రీచైతన్య విద్యార్థులు ప్రతి ఏటా సాధిస్తున్న అద్భుతమైన విజయాలను ఈ సందర్భంగా వారు కొనియాడారు. ఇటువంటి వేడుకలు కేవలం విద్యా ప్రయాణానికి ఆరంభంగా నిలవడమే కాకుండా, విద్యార్థులలో ఆత్మవిశ్వాసాన్ని నింపి ఉన్నత శిఖరాలను చేరుకోవడానికి ప్రేరణనిస్తాయని పేర్కొన్నారు.ప్రత్యేక అతిథిగా హాజరైన ప్రముఖ సినీ నటుడు నిఖిల్ సిద్ధార్థ తన ఉత్తేజపూరితమైన ప్రసంగంతో విద్యార్థులలో సరికొత్త ఉత్సాహాన్ని నింపారు. ఓటమికి భయపడకుండా అనుకున్న లక్ష్యం దిశగా అడుగులు వేయాలని, యువత తమ కలలను నిజం చేసుకునే వరకు విశ్రమించకూడదని పిలుపునిచ్చారు. ఈ వేడుకలో శ్రీచైతన్య విద్యా సంస్థల డైరెక్టర్లు ముఖ్య భూమిక పోషించి, విద్యార్థులకు మార్గదర్శనం చేశారు. సుష్మా బొప్పన, అకాడమిక్ డైరెక్టర్, శ్రీచైతన్య విద్యా సంస్థలు మాట్లాడుతూ.. "జాతీయ స్థాయి ర్యాంక్‌లలోనూ, అగ్రశ్రేణి ఫలితాల్లోనూ కావూరి హిల్స్ జోన్ ఒక చిరునామాగా (హబ్) మారిందంటే, అది ఇక్కడి విద్యార్థుల శ్రమ, ఉపాధ్యాయుల నిరంతర తోడ్పాటు, టాప్ ర్యాంకులే లక్ష్యంగా రూపొందించిన ప్రోగ్రాముల ఫలితమేనని పేర్కొన్నారు. ప్రతి సంవత్సరం ఐఐటీ, జేఈఈ, నీట్ వంటి జాతీయ స్థాయి పోటీ పరీక్షలలో శ్రీచైతన్య విద్యార్థులు తమ గెలుపు జెండాను ఎగురవేస్తున్న తీరును గుర్తుచేశారు. విద్యార్థులంతా పక్కా ప్రణాళిక, ఆత్మవిశ్వాసంతో తమ గమ్యాల వైపు అడుగులు వేయాలని శ్రీచైతన్య కల్పిస్తున్న అంతర్జాతీయ ప్రమాణాలతో కూడిన విద్యను సంపూర్ణంగా వినియోగించుకుని విజేతలుగా నిలవాలని ఆకాంక్షించారు.

వార్త

తక్కువ పదాలతో ఎక్కువ విషయాలు చెప్పడం మేధావుల లక్షణమైతే.. చెప్పేదేమీ లేకపోయినా ఎక్కువ పదాలు వినియోగించడం మూర్ఖుల లక్షణం.

- కాల్టన్

జాప్యం వలయంలో 'న్యాయం'!

భారత న్యాయవ్యవస్థ ముందు పెండింగ్ కేసుల సమస్య అతిపెద్ద సవాలుగా మారింది. న్యాయం వేగంగా అందినప్పుడే ప్రజాస్వామ్యం మరింత బలపడుతుంది. న్యాయ వ్యవస్థపై రోజురోజుకూ పెరుగుతున్న భారంతో కేసుల పెండింగ్ ఆందోళనకర స్థాయికి చేరుకుంది. జాతీయ న్యాయ డేటా గ్రిడ్ ప్రకారం దేశవ్యాప్తంగా సుప్రీంకోర్టు, దేశంలోని 25 హైకోర్టులు, జిల్లా/ అనుబంధ కోర్టులలో కలిపి జిల్లా, అనుబంధ కోర్టుల్లోనే దాదాపు 5.64 కోట్ల పెండింగ్ కేసులు పెండింగ్లో ఉన్నాయి. సుప్రీంకోర్టు, హైకోర్టుల్లో కూడా లక్షల సంఖ్యలో కేసులు విచారణ కోసం ఎదురుచూస్తున్నాయని నేషనల్ జ్యుడీషియల్ డేటా గ్రిడ్ పేర్కొంది. కేంద్రప్రభుత్వం పార్లమెంట్‌కు ఇచ్చిన తాజా సమాచారం ప్రకారం ప్రస్తుతం సుప్రీంకోర్టులో దశాబ్ద కాలం నాటి 10 వేలకుపైగా కేసులు, మూడు దశాబ్దాలకు చెందిన 80,660 కేసులు హైకోర్టులలో పరిష్కారం కోసం ఎదురు చూస్తున్నాయి. సుప్రీం కోర్టులో 96వేలకు పైగా కేసులు పెండింగ్లో ఉన్నాయని రాజ్యసభలో కేంద్ర న్యాయ శాఖ మంత్రి అర్జున్ రామ్ మేఘ్వాల్ లిఖితపూర్వక సమాధానంలో వెల్లడించారు. అలాగే, 558 కేసులు 20యేళ్లకు పైగా పెండింగ్లో ఉండగా, అత్యున్నత న్యాయస్థానంలో 26 కేసులు 30 యేళ్లకు పైగా పరిష్కారం కాలేదని ఆయన వివరించారు. ఇది న్యాయవ్యవస్థలో పెండింగ్లో ఉన్న కేసుల తీవ్రతను తెలియజేస్తోంది. అన్ని రంగాల్లోనూ సంస్కరణలు జరుగుతున్నట్లు ప్రజాస్వామ్యంలో అతి ప్రధానమైన న్యాయ రంగాల్లోనూ సంస్కరణలు జరుగుతున్నా అవి ప్రజలకు చేరడంలోనూ ఎంతో జాప్యం అవుతోంది. జాప్యానికి కారణాలేమిటంటే కేసుల సంక్లిష్టత,సమర్థ పరిష్కారం ఆధారపడి ఉంటుందనిమేఘ్వాల్ అన్నారు. హైకోర్టులు, దిగువ న్యాయవ్యవస్థలో ఖాళీలు కొనసాగుతున్నాయి. న్యాయమూర్తులు, న్యాయాధికారులు, సహాయక సిబ్బంది లభ్యతతో సహా, తగినంత న్యాయ సిబ్బంది, మౌలిక సదుపాయాలపై కూడా కేసుల కాల పరిష్కారం ఆధారపడి ఉంటుందని కేంద్రం పేర్కొంది. భారతీయ కోర్టులలో పెరుగుతున్న ఖాళీల కారణంగానే పెద్ద సంఖ్యలో కేసులు పెండింగ్లో ఉన్నాయని తెలుస్తోంది. సుప్రీంకోర్టులో న్యాయమూర్తుల సంఖ్యను పెంచే సవరణ బిల్లు 2026కు లోక్‌సభ ఆమోదం తెలిపింది. సీజేఐ సహా జడ్జీల సంఖ్యను 34 నుంచి 38కి పెంచేందుకు ఈ బిల్లును రూపొందించి తగినంత మంది కోర్టు సిబ్బంది, మౌలిక సదుపాయాల లభ్యతపై కూడా కేసుల సకాల పరిష్కారం ఆధారపడి ఉంటుందని పేర్కొంది. ప్రస్తుతం 25 హైకోర్టులలో మంజూరైన 1,122 మంది న్యాయమూర్తులకు గాను 341 న్యాయమూర్తుల ఖాళీలు ఉండగా, దిగువ న్యాయమూర్తులకు 7,311 ఖాళీలు కోర్టులలో మంజూరైన 30,868 మంది ఉన్నాయి. కేసుల పరిష్కార, వేగం ఖాళీలు కార్యాచరణ, విధానపరమైన అంశాలచే ప్రభావితమవుతుందని, కేంద్ర న్యాయశాఖ మంత్రి చెప్పారు. భారత రాజ్యాంగం ప్రతిపౌరుడికి హామీ ఇచ్చిన 'సకాలంలో న్యాయం' అనే ప్రాథమిక విలువను సాకారం చేయాల్సిన జాతీయ కర్తవ్యం. పెండింగ్ కేసులకు అనేక కారణాలున్నాయి. న్యాయమూర్తుల ఖాళీలు, కొత్త కోర్టుల కొరత, విచారణల్లో తరచూ వాయిదాలు, ప్రభుత్వశాఖలే అత్యధికంగా దావాలు వేయడం, దర్యాప్తు సంస్థల ఆలస్యం, సాక్షులు హాజరు కాకపోవడం, సాంకేతిక సిబ్బంది కొరత వంటి అంశాలు సమస్యను మరింత క్లిష్టం చేస్తున్నాయి. ప్రతి కేసు వెనుక ఒక కుటుంబం, ఒక బాధితుడు, ఒక వ్యాపారం లేదా ఒక పౌరుని హక్కు దాగి ఉంటుంది. న్యాయం కోసం సంవత్సరాల తరబడి వేచి చూడాల్సిన పరిస్థితి ప్రజల విశ్వాసాన్ని దెబ్బతీస్తోంది. ప్రభుత్వం కూడా పార్లమెంట్లో ఇదే కారణాలను ప్రస్తావించింది. దేశంలో అత్యధిక జనాభా ఉన్న రాష్ట్రాల్లో కేసుల పెండింగ్ మరింత తీవ్రంగా ఉంది. ఉత్తరప్రదేశ్, మహారాష్ట్ర, పశ్చిమ బెంగాల్, బీహార్,కర్ణాటక,గుజరాత్, తమిళనాడు వంటి రాష్ట్రాల్లో లక్షల నుంచి కోట్ల వరకు కేసులు పెండింగ్లో ఉన్నాయి. కొన్ని రాష్ట్రాల్లో ఐదేళ్లకు పైగా పెండింగ్లో ఉన్న కేసుల సంఖ్య కూడా గణనీయంగా ఉంది. అత్యంత ఆందోళనకర అంశం ఏమిటంటే, కొన్నికేసులు 20నుంచి30 సంవత్సరాలుగా కూడా తుది తీర్పు కోసం ఎదురుచూస్తున్నాయి. ఇటీవల వెల్లడైన వివరాల ప్రకారం దేశవ్యాప్తంగా 20సంవత్సరాలకు పైగా పెండింగ్లో ఉన్న కేసుల సంఖ్య 11లక్షలకు మించిపోయింది. ఇది న్యాయవ్యవస్థ వేగంపై తీవ్రమైన ప్రశ్నలు లేవనెత్తుతోంది. అయితే ఆశాజనక పరిణామాలు కూడా ఉన్నాయి. న్యాయమూర్తుల నియామకాలను వేగవంతం చేయడం, ఖాళీలను భర్తీచేయడం, ప్రత్యామ్నాయవివాద పరిష్కార వ్యవస్థలు లోక్అదాలత్‌లను మరింత బలోపేతం చేయడం, ప్రభుత్వ వ్యాజ్యాలను తగ్గించడం,కేసుల నిర్వహణలో సమర్థత పెంచడం వంటి నిర్మాణాత్మక సంస్కరణలు అత్యవసరం.దర్యాప్తు సంస్థల ఆలస్యం, సాక్షులు హాజరు కాకపోవడం, ఫోరెన్సిక్ నివేదికలు ఆలస్యంగా రావడం, మౌలిక వసతుల కొరత వంటి అంశాలు కూడా విచారణను నెమ్మదింపజేస్తున్నాయి.భూవివాదాలు పరిష్కారం కాక రైతులు,పెట్టుబడిదారులు నష్టపోతారు. వాణిజ్య కేసులు ఆలస్యమైతే పరిశ్రమలు పెట్టుబడులు పెట్టడానికి వెనుకంజ వేస్తాయి. క్రిమినల్ కేసుల్లో ఆలస్యం వల్ల బాధితులకు న్యాయం దూరమవుతుండగా, నిర్దోషులు కూడా సంవత్సరాల తరబడి విచారణను ఎదుర్కోవాల్సి వస్తుంది.జైళ్లలో విచారణ పూర్తికాకుండానే వేలాది మంది ఖైదీలు ఉండటం మరో పెద్ద సమస్య. ఇది మానవహక్కుల కోణంలో కూడా ఆందోళన కలిగించే అంశం. పెండింగ్ సమస్యను పరిష్కరించాలంటే తాత్కాలిక చర్యలు సరిపోవు. సమగ్ర సంస్కరణలు అవసరం.

ఎన్నో కష్టనష్టాలు అనుభవించిన తరువాత కానీ, మనిషికి వినయం, వివేకం రాదు.

ఫ్రాంక్లిన్

సమర్థులైనవారే ఎప్పుడూ నాయకత్వం వహిస్తారు. అందరికీ మార్గదర్శకులవుతారు.

రాధాకృష్ణన్

ప్రజావాక్కు



మారుతున్న జీవనశైలి

భారతీయుల్లో అధిక శాతం మంది రక్తంలోని కొవ్వు సంబంధిత సమస్యలతో బాధపడుతున్నారనివెల్లడించిన ఐసీఎంఆర్ నివేదిక ప్రతి ఒక్కరికీ ఒకహెచ్చరికగా భావించాలి. మారుతున్న జీవనశైలి, శారీరక శ్రమ తగ్గడం, అనారోగ్యకరమైన ఆహారపు అలవాట్లు, పెరుగుతున్న ఒత్తిడి, క్రమం తప్పకుండా ఆరోగ్యపరీక్షలు చేయించుకోకపోవడం వల్ల గుండె జబ్బులు, పక్షవాతం వంటి సమస్యల ప్రమాదం పెరుగుతోంది. ముఖ్యంగా యువతలో కూడా ఈ సమస్యలు కనిపించడం ఆందోళన కలిగించే విషయం. వ్యాధులు వచ్చిన తర్వాత చికిత్స చేయడం ఎంత ముఖ్యమో, వాటిని ముందుగానే నివారించడం కూడా అంతే అవసరం. ప్రజల్లో ఆరోగ్యంపై అవగాహన పెంచేందుకు విస్తృత ప్రచారకార్యక్రమాలునిర్వహించాలి. పాఠశాలలు, కార్యాలయాల్లో ఆరోగ్యకరమైన ఆహారపు అలవాట్లను ప్రోత్సహించాలి.క్రమంతప్పకుండా లిపిడ్‌పరీక్షలు చేయించుకోవడం,ప్రతిరోజూ వ్యాయామం చేయడం వంటి అలవాట్లు ఆరోగ్య పరిరక్షణకు దోహదపడతాయి.

- సి.హెచ్. ప్రతాప్, శ్రీకాకుళం

విలువల పతనం

ఎన్నికల్లో ఓడిపోయినపార్టీకి చెందిన ఎమ్మెల్యే, ఎమ్.పి, మంత్రులు కిందిస్థాయి నాయకులు అధికారంలోకి వచ్చిన పార్టీలోకి క్యూ కడుతున్నారు. తమకు అవకాశం ఇచ్చి ప్రోత్సహించిన వారి పట్ల తమ రాజకీయ ఎదుగుదలకు కారణమైన వారిపట్ల ఏమాత్రం కృతజ్ఞత చూపకుండా వెన్నుపోటుపొడుస్తున్నారు. అన్నిరాష్ట్రాల్లో ఇలా జరగటం సర్వసాధారణమైపోయింది. వీరు క్షమార్హులు కాదు.

- మిథునం, హైదరాబాద్

మన భాషను మనమే అభివృద్ధి చేయాలి

మన మాతృభాష తెలుగు ప్రాముఖ్యాన్ని పెంచే పుస్తక మహోత్సవాలు,భాషాభివృద్ధి సభలు జరుగుతున్న సందర్భాల్లో మనంహాజరుకాకపోవడం కన్నా దాన్ని మనం, మనపిల్లలు ఆంగ్లంతో పాటు మాతృభాష మరింత పట్టు వచ్చేట్లు ఇంటివద్ద నేర్పించాలి. ఉపాధి దృష్టిలో పరీక్షల కోసం ఆంగ్లం అవసరమైన ,తెలుగులో కూడా పరిజ్ఞానం విషయాలను మనస్సులో అర్థంచేసుకునేందుకు సులువుగా ఉంటుంది. దీనివల్ల అనువాద ప్రక్రియ సులువుగా ఉంటుంది. మన భాషను మనమే అభివృద్ధి చేయడం విద్యావంతులు, తల్లి తండ్రులు బాధ్యత వహించాలి.

- బొల్లోజు మేఘనాదం, విశాఖపట్నం

'సర్'పై దుష్ప్రచారం

మహాభారతంలో శకుని మాయపాచికలతో పాండవులను మోసం చేసి వారి రాజ్యాన్ని కాజేసినట్టు ఎన్నికలు వచ్చినప్పుడల్లా బిజెపి వాల్లు తమ అధికార బలాన్ని ఉపయోగించి తిమ్మిని బమ్మిని, బమ్మిని తిమ్మిని చేస్తూ ఓట్లను అటుఇటు చేస్తూ మొత్తానికి ఎలాగోలా తాము అనుకున్నది సాధిస్తున్నారు. తమ ప్రత్యర్థులను గెలవకుండా చేస్తున్నారు. వారిని శాశ్వత అజ్ఞాన వాసులుగా మారుస్తున్నారు. ఒక వంక నీతి న్యాయం, సనాతనధర్మం రాముడుదేవుడు అనే కబుర్లు చెబుతూ మరోవంక అధికారంకోసం అడ్డదారులు తొక్కుతున్నారు.

- శాస్త్రి, హైదరాబాద్

పెరుగుతున్న వలసలు

మోరాకో నుండి స్పెయిన్ దేశానికి వలసలు వెల్లువలా కొనసాగుతున్నాయి. ఉపాధి లేక వాళ్ళుసముద్రాల ద్వారా స్పెయిన్ దేశానికి చేరుకుంటున్నారు. ఈ ఇదులాటలో 20 మంది వరకు ప్రాణాలు కోల్పోయారు. ఒక వైపు సంపన్న దేశాలు తమ ఉనికిని కాపాడుకోవడం కోసం చేసే ప్రయత్నం ఒకవైపు కొన్ని దేశాలు సంపన్న దేశాలుగా ఉండి తన స్థిరత్వం కోసం పోరాడుతున్నాయి. దేశాలు ఉపాధి కల్పించడం లో విఫలం అయినందువల్లే ఈవలసలు కొనసాగుతున్నాయి. ఎందుకంటే ఉపాధి అనేది మౌలిక సమస్య అది గుర్తించి తగు విధంగా చర్యలు తీసుకోవాలి. దేశవ్యాప్తంగా కొనసాగుతున్న ఉద్యమానికి చలించని ప్రభుత్వం ఇప్పుడెందుకు చలించింది.ఈ ఉద్యమంలో మధ్యతరగతి వర్గం పిల్లలు మాత్రమేకాదు వారి తల్లిదండ్రులు కూడాపాల్గొన్నారు.అదేవారికి కనువిప్పు అయింది.

- భారత అవినాష్, జనగామ

ఉద్యమకారులకు ప్రభుత్వ గుర్తింపు ఇవ్వాలి

తెలంగాణ ఉద్యమంలో కీలకపాత్ర పోషించిన ప్రజల్లో నుండి పౌరులను, ఉద్యమకారులుగా గుర్తించాలి. తెలంగాణ రాష్ట్ర సాధనఉద్యమంలో పౌరులు,మీడియా,రచనపరు, జర్నలిస్టులు, రిపోర్టర్లు, ఫోటోజర్నలిస్టులు, కెమెరామెన్‌లు, మీడియా యాజమాన్యాలు ఎన్నో కష్టనష్టాలను భరిస్తూ ఉద్యమాన్ని ప్రజల్లోకి తీసుకెళ్లడంలో, ఉద్యమ స్ఫూర్తిని ప్రతి గ్రామానికి చేర్చడంలో, తెలంగాణఆకాంక్షను దేశవ్యాప్తంగా వినిపించడంలో అత్యంత కీలకమైన పాత్ర పోషించారు.తెలంగాణ రాష్ట్రం ఏర్పడటానికి ఉద్యమకారు పౌరులతోపాటు రచయితలు మీడియా కూడా ఒక ఉద్యమ శక్తిగా పనిచేశారు. ఆర్థిక ఇబ్బందులు, ఉద్యోగ భద్రత లేని పరిస్థితులను ఎదుర్కొంటూ ప్రజల ఆకాంక్షలను ప్రపంచానికి చాటిచెప్పారు.

-సింగు. లక్ష్మీనారాయణ, కరీంనగర్

గమనిక: ఎడిటోరియల్ పేజీలో ప్రచురితమయ్యే వ్యాసాలలోని అంశాలు, విశ్లేషణలు వ్యాసకర్త సొంత అభిప్రాయాలు. వాటితో పత్రికకు ఎలాంటి సంబంధం లేదు. -ఎడిటర్

మనవి ఎడిట్ పేజీకి..
ఆర్థిక, సామాజిక, రాజకీయ విశ్లేషణాత్మక రచనలు పంపగోరు రచయితలు
మాకు పంపే వ్యాసాలు ఇతర పత్రికలకు కూడా పంపడం సరైన విధానం కాదు. సహకరిస్తారని ఆశిస్తాం. -ఎడిటర్
(e-mail: editpage@vaartha.com)

రిజర్వేషన్లకు ప్రత్యామ్నాయం ఏమిటి?

అందరికీ సమాన నాణ్యతతో కూడిన విద్య, భూమి వంటి ఉత్పాదక వనరులపై న్యాయమైన ప్రాప్యత, వివక్ష లేని ఉపాధి, సంపదలో తీవ్రమైన అసమానతలు తగ్గిన ఆర్థిక వ్యవస్థ, అన్ని వర్గాలకు సహజమైన ప్రాతినిధ్యం, ఇలాంటి పరిస్థితులు ఏర్పడితే రిజర్వేషన్ల అవసరం సహజంగానే తగ్గుతుంది. కానీ ఈ పరిస్థితులను సృష్టించకుండా రిజర్వేషన్లను మాత్రమే తొలగించడం అంటే వ్యాధిని అలాగే ఉంచి మందులు తీసేయడమే. అందుకే భారత ప్రజాస్వామ్యం ముందున్న అసలు సవాలు రిజర్వేషన్లను సమర్థించాలా వ్యతిరేకించాలా అనేది కాదు. సమానత్వాన్ని నిరంతరం వాయిదా వేస్తున్న సామాజిక నిర్మాణాన్ని మార్చగలదా లేదా అనేదే. రిజర్వేషన్లకు ప్రత్యామ్నాయం రిజర్వేషన్లను రద్దు చేయడం కాదు. వాటి అవసరాన్ని అనవసరం చేసే వ్యవస్థను నిర్మించడం.

ఆయిరబోయిన బిక్షపతి

కొన్ని ప్రశ్నలకు సమాధానం చెప్పేముందు ఆ ప్రశ్న సరైనదేనా అని అడగాలి ఎందుకంటే ప్రజాస్వామ్యంలో ప్రతి చర్చ ఒకే విధంగా పుట్టదు. కొన్ని చర్చలు సమాజం అవసరం వల్ల వస్తాయి. మరికొన్ని రాజకీయాల అవసరం వల్ల వస్తాయి. ఈ రెండింటి మధ్య తేడా గుర్తించకపోతే సమాధానం ఎంత సరైనదైనా అది అసలు ప్రశ్న నుంచి తప్పించుకోవచ్చు. నేడు రిజర్వేషన్లపై జరుగుతున్న చర్చ కూడా అలాంటిదే. పైకిచూస్తే అది ఒక విధానం గురించి చర్చలా కనిపిస్తుంది. కానీ కొంచెం లోతుగా చూస్తే అది భారత ప్రజాస్వామ్యం తన గురించి తాను వేసుకోవాల్సిన ఒక పెద్ద ప్రశ్నను తాకుతుంది. అదే 'సామాజిక న్యాయం పూర్తయిందా'? ఈ ప్రశ్నకు సమాధానం తెలియకుండా దాన్ని సాధించే విధానాలపై తీర్పు చెప్పడం అంటే గమ్యానికి చేరామో లేదో చూడకుండానే ప్రయాణాన్ని ఆపేయాలని నిర్ణయించడం లాంటిది. జర్మన్ తత్వవేత్త యుర్గన్ హెబెర్మాస్ ఆధునికతను ఒక అసంపూర్ణ ప్రాజెక్టుగా అభివర్ణించాడు. ఈ భావనలోని అసలు బలం ఒకే మాటలో ఉంది. అసంపూర్ణమంటే విఫలం అని కాదు. ఇంకా పూర్తి చేయాల్సిన బాధ్యత మిగిలి ఉందని అర్థం. ప్రతిఅసంపూర్ణ ప్రాజెక్టుకు ముందు రెండు మార్గాలు ఉంటాయి. ఒకటి అది పూర్తి కాలేదు అని చెప్పి విఫలమైందని ప్రకటించడం. రెండోది ఎందుకు పూర్తికాలేదో అర్థం చేసుకొని దాన్ని పూర్తి చేసే బాధ్యతను స్వీకరించడం. భారత ప్రజాస్వామ్యం ముందు కూడా నేడు అదే ఎంపిక ఉంది. రిజర్వేషన్లపై చర్చ చివరికి ఆ ఎంపిక గురించే. రాజ్యాంగ నిర్మాతలు ఒక గొప్ప నైతిక సత్యాన్ని గుర్తించారు. చట్టం సమానత్వాన్ని ప్రకటించగలదు. కానీ చరిత్రను రద్దు చేయలేదు.ఎందుకంటే అసమానత అనేది కేవలం వర్తమాన సమస్య కాదు, వర్తమానంపై గతం చూపే ప్రభావం. అందుకే శతాబ్దాలుగా అవకాశాలకు దూరమైన వర్గాలకు ఇప్పటినుంచి అందరూ సమానం అని చెప్పడం న్యాయం కాదని వారు అర్థం చేసుకున్నారు. అందుకే సమానత్వాన్నీ కేవలం హక్కుల భాషలోనే కాదు అవకాశాల భాషలో కూడా నిర్వచించారు. రిజర్వేషన్లు ఆ తర్కం నుంచే పుట్టాయి. అవి ప్రత్యేక హక్కులు కాదు. చరిత్ర మూసివేసిన తలుపులను ప్రజాస్వామ్యం మళ్లీ తిరిగి రాయడానికి నిర్మించిన రాజ్యాంగబద్ధ వంతెన. ప్రపంచ ప్రజాస్వామ్యాల అనుభవం కూడా ఇదే చెబుతుంది. అమెరికా బానిసత్వం తర్వాత, దక్షిణాఫ్రికా అపార్థెయిడ్ తర్వాత, బ్రెజిల్ వర్ణ అసమానతల నేపథ్యంలో, కెనడా స్థానిక ప్రజల హక్కుల విషయంలో, న్యూజిలాండ్ మావోరీ ప్రజల రాజకీయ ప్రాతినిధ్యంలో. రూపాలు,పేర్లు వేరు కావచ్చు. కానీ ప్రతి సమాజం ఒకే సత్యాన్ని ఎదుర్కొంది. చరిత్ర సృష్టించిన అసమానతలను మార్కెట్ స్వయంగా సరిచేయదు. పోటీ కూడా సరి చేయదు. అందరికీ సమాన అవకాశం అనే నినాదం ఒకటే వాటిని తొలగించదు. ప్రజాస్వామ్యం కొన్నిసార్లు చరిత్రతో వాదించాల్సి వస్తుంది. ప్రత్యేక అవకాశాల విధానాలు ఆ వాదనలో భాగం. అవి సమానత్వానికి మినహాయింపులు కాదు. సమానత్వాన్ని వాస్తవం చేయటానికి ఉపయోగపడే మార్గాలు. రిజర్వేషన్లపై ప్రతి చర్చలో 'మెరిట్' అనే పదం తప్పనిసరిగా వినిపిస్తుంది. కానీ మెరిట్ అనేది అవకాశాల నుంచి వేరు చేసుకోగలిగే గుణం అయితే సమాజం ఎప్పుడో న్యాయబద్ధమై ఉండేది. నిజానికి మెరిట్ కూడా ఒక సామా

జిక నిర్మాణమే. ఒక పిల్లవాడు ఏ పాఠశాలలో చదివాడు, ఇంట్లో చదివే గదిఉందా, తల్లిదండ్రుల విద్యాస్థాయి ఏంటి, అతను ఆకలితో పాఠశాలకు వెళ్లాడా లేక ఆత్మవిశ్వాసంతో వెళ్ళాడా, కులం కారణంగా అవమానాన్ని ఎదుర్కొన్నాడా లేదా ఇవన్నీ అతని సామర్థ్యాన్ని ప్రభావితం చేస్తాయి. అందువల్ల ప్రతిభను మాత్రమే చూసి మెరిట్‌ను కొలవడం అంటే అవకాశాలను కల్పించినట్లు నటించడం. అసమాన ప్రారంభ రేఖలతో పందెం పెట్టి గెలిచిన వారిని ప్రతిభావంతులని ప్రకటించినట్టే. ప్రపంచానికి మరో నైతిక కొలమానం ప్రాతినిధ్యం. ప్రాతినిధ్యం రాజకీయ నినాదం కాదు. ప్రజాస్వామ్య నైతికత. న్యాయస్థానాల్లో, విశ్వవిద్యాలయాల్లో, శాసనసభల్లో, పరిపాలన వ్యవస్థలో,సమాజంలోని అన్ని వర్గాలు కనిపించాలి. ఎందుకంటే రాష్ట్రం కేవలం అధికారం నిర్మాణం కాదు. సమాజం తనను తాను చూసుకునేఅద్దం. ఆ అద్దంలో కొన్ని వర్గాలు మాత్రమే కనిపిస్తే మిగిలినవారికి ప్రజాస్వామ్యం ఒక వాగ్దానంగా మిగులుతుంది.అనుభవంగా మారదు. అందుకే ప్రాతినిధ్యం అనేది రాజకీయ రాయితీ కాదు. ప్రజాస్వామ్య నాణ్యతకు అవసరమైన షరతు.అయితే రిజర్వేషన్ల గురించి ఏ నిర్ణయానికైనా రాకముందు ఆషరతు నిజంగా నెరవేరిందా అనే కనీస ప్రాథమిక ప్రశ్నలనైనా మనకు మనమే వేసుకోవాలి. అది కులం మనిషి అవకాశాలను, ఆత్మ గౌరవాన్ని, జీవిత గమనాన్ని, ఏమాత్రం ప్రభావితం చేయడం లేదని ధైర్యంగా ప్రకటించగలమా? పుట్టుక కాదు ప్రతిభ మాత్రమే ప్రతి వ్యక్తి భవిష్యత్తును నిర్ణయిస్తుందని నిస్సందేహంగా చెప్పగలమా? మొత్తానికి సామాజిక న్యాయం పూర్తయిందని నిజంగా చెప్పగలమా? ఈ ప్రశ్నలు దీనికైనా నిజాయితీగా 'అవును' అని చెప్పగలిగితేనే రిజర్వేషన్ల అవసరం ముగిసింది అని చెప్పవచ్చు. లేకపోతేసమస్య ఇంకా కొనసాగుతుండగానే పరిష్కారం పూర్తయిందని ప్రకటించినట్లు అవుతుంది. ఇలాంటి సమయంలోనే రిజర్వేషన్లపై చర్చ మళ్ళీ రాజకీయ కేంద్రంగా మారడం గమనించదగిన విషయం. రాజకీయాలు ఎప్పుడు సమస్యలు మాత్రమే పరిష్కరించవు. ప్రజలు ఏ సమస్య గురించి మాట్లాడాలో కూడా నిర్ణయిస్తాయి. నిరుద్యోగం, పరీక్షల నిర్వహణ, విద్యాసంక్షోభం, పెరుగుతున్న అసమానతలు చర్చలో ఉన్న ఈ సమయంలో రిజర్వేషన్లను కేంద్ర అంశాలుగా నిలబెట్టడం వెనుక రాజకీయ సందర్భాన్ని విస్మరించడం కష్టం. రిజర్వేషన్ల పట్ల విముఖతను వ్యక్తం చేస్తూ వచ్చిన రాజకీయ సైద్ధాంతిక వైఖరి నేపథ్యంలో ఈ చర్చను విశ్లేషించడం సహజమే. అయితే రాజకీయ ఉద్దేశం ఏదైనా కావచ్చు. కానీ సమాజం అడగాల్సిన ప్రశ్న మాత్రం వేరే. 'రిజర్వేషన్ల స్థానంలో సామాజిక న్యాయాన్ని మరింత సమర్థంగా సాధించే వ్యవస్థ ఏమిటి'? ఈ ప్రశ్నకు సమాధానం ఇప్పటివరకు స్పష్టంగా వినిపించలేదు. ఎందుకంటే ప్రత్యామ్నాయం అనేది ఒక నినాదం కాదు. ఒక సామాజిక నిర్మాణం. కులం అవకాశాలను నిర్ణయించనీ సమాజం. అందరికీ సమాన నాణ్యతతో కూడిన విద్య. భూమి వంటి ఉత్పాదక వనరులపై న్యాయమైన ప్రాప్యత. వివక్ష లేని ఉపాధి. సంపదలో తీవ్రమైన అసమానతలు తగ్గిన ఆర్థిక వ్యవస్థ, అన్ని వర్గాలకు సహజమైన ప్రాతినిధ్యం, ఇలాంటి పరిస్థితులు ఏర్పడితే రిజర్వేషన్ల అవసరం సహజంగానే తగ్గుతుంది. కానీ ఈ పరిస్థితులను సృష్టించకుండా రిజర్వేషన్లను మాత్రమే తొలగించడం అంటే వ్యాధిని అలాగే ఉంచి మందులు తీసేయడమే. అందుకే భారత ప్రజాస్వామ్యం ముందున్న అసలు సవాలు రిజర్వేషన్లను సమర్థించాలా వ్యతిరేకించాలా అనేది కాదు. సమానత్వాన్ని నిరంతరం వాయిదా వేస్తున్న సామా జిక నిర్మాణాన్ని మార్చగలదా లేదా అనేదే. రిజర్వేషన్లకు ప్రత్యామ్నాయం రిజర్వేషన్లను రద్దు చేయడం కాదు. వాటి అవసరాన్ని అనవసరం చేసే వ్యవస్థను నిర్మించడం. కానీ ఆ సమాజాన్ని నిర్మించే దిశగా మనం నిజంగా ప్రయాణిస్తున్నామా? లేక రిజర్వేషన్లనే ప్రశ్నిస్తూ వాటిని అనివార్యం చేసిన సామాజిక నిర్మాణాన్ని యథాతథంగా కొనసాగిస్తున్నామా? భారత ప్రజాస్వామ్యం చివరికి సమాధానం చెప్పాల్సింది ఈ ప్రశ్నకే. •

ప్రభుత్వ పాఠశాలలకు మహర్దశ రానున్నదా?

దాడిశెట్టి శ్యామ్ కుమార్

విద్యా వ్యవస్థలో ఆధునిక పోకడలకు అనుగుణంగా ప్రభుత్వాలు విద్యపై ప్రత్యేక దృష్టి సారించడం తద్వారా ప్రభుత్వ పాఠశాలను బలోపేతం చేసే రీతిలో రాష్ట్రాల్లో అమలవుతున్న విద్యావిధానం ప్రత్యేక ఆకర్షణగా నిలుస్తుందనే భిన్నాభిప్రాయాలు లేకపోలేదు. ప్రభుత్వ పాఠశాలల మౌలిక సదుపాయాలు మెరుగుపరచడంతో పాటు విద్యావిధానంలో బోధనా అభ్యసనంలో విద్యార్థుల ప్రగతికి తోడ్పడే విధంగా తెలుగు,ఇంగ్లీష్ మాధ్యమాల్లో ప్రైవేట్ పాఠశాలలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే దిశలో ప్రభుత్వాలు ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటూ ఉండడం గమనార్హం. విద్యలో డిజిటల్ విద్యా విధానం ఆర్టిఫీషియల్ ఇంటెలిజెన్స్ ద్వారా విద్యార్థులకు అవగాహన కల్పించడం ప్రభుత్వ పాఠశాలలో విద్యార్థులను ఆకర్షించే రీతిలో ఉంటున్నాయని అనిపిస్తుంది. విద్యార్థులకు విశాలమైన ఆట స్థలాలు మౌలిక సదుపాయాలు మెరుగైన శానిటేషన్ వ్యవస్థ, త్రాగునీరు, మధ్యాహ్న భోజనంతోపాటు కొన్ని రాష్ట్రాలు పైలెట్ ప్రాజెక్టుగాఅల్పాహారం అందిస్తున్న క్రమంలో ఉపాధ్యాయులను కూడా ఇందులో భాగస్వామ్యం చేయడం విద్యార్థులు తల్లిదండ్రులకు ప్రభుత్వ పాఠశాలపై తమ పిల్లలపై శ్రద్ధ వహించే రీతిలో ప్రభుత్వ పాఠశాలలు ఉంటున్నాయనే భావన కల్పించే రీతిలో ప్రధానంగా విద్యాశాఖను నిర్వహిస్తున్నటువంటి మంత్రులు ప్రభుత్వ పాఠశాలల ఆవశ్యకతను సమాజం గుర్తించే విధంగా రాజకీయాలకతీతంగా తోడ్పాటు అందిస్తుండడంతో అన్నివర్గాల ప్రజలు ప్రభుత్వ పాఠశాలల్లో తమ పిల్లలను చదివించడానికి ఆసక్తిని కనబరుస్తున్నారు అనే వాదనలు వినిపిస్తున్నాయి. ప్రభుత్వ పాఠశాల అభ్యున్నతికి విద్యా కమిటీలు గ్రామయువజన సంఘాలు స్థానికంగా ఉన్నటువంటి విద్యార్థులతల్లిదండ్రులు ప్రభుత్వపాఠశాలల్లో విద్యార్థుల సమోదుఉంటేనే భవిష్యత్తులో ప్రభుత్వ పాఠశాల మనుగడకు అవకాశం ఉంటుందనే విషయ అవగాహన చేసుకోవాలి. స్థానికంగాఉండే ప్రభుత్వ పాఠశాలను మెరుగుపరుచుకునే రీతిలో ప్రభుత్వ పథకాలను సాధ్యమైనంతగా వినియోగించుకుంటూ బడి ఈడు పిల్లలందరినీ ప్రభుత్వ పాఠశాలవైపు మొగ్గుచూపే విధంగా ఉపాధ్యాయులు, విద్యా కమిటీలు సంయుక్త సహకారంతో బడిబాట లాంటి కార్యక్రమాన్ని నిర్వహించడంతో పాటు విద్యార్థులను అధిక సంఖ్యలో ప్రభుత్వ పాఠశాలలు చేర్పించి నాణ్యమైన విద్యను అందించే విధానంలో బాధ్యతాయుతమైన పాత్రను మరింత పోషించాల్సి ఉంది. ఈ క్రమంలో సమాజంలోని వారందరూ ఆర్థికస్తోమతతో నిమిత్తం లేకుండా తమ పిల్లల్ని ప్రభుత్వ పాఠశాలల్లో చదివిస్తే రాబోవు కాలంలో ప్రవేట్ పాఠశాలకు దీటుగా ప్రభుత్వ పాఠశాలల్లో మౌలిక వసతులతో పాటు ఉచితమైన నాణ్యమైన విద్యా విధానం ప్రతి ఒక్కరికి పూర్తిస్థాయిలో అందుతుందని అనుకునేవారు లేకపోలేదు. విద్యావ్యవస్థలో వస్తున్న మార్పుల గురించి అవగాహనతో ఉన్న సంబంధిత శాఖఅధికారులు, మంత్రులు ప్రభుత్వ పాఠశాలల్లో అత్యున్నతమైన విద్యా బోధనను విద్యార్థులకు అందించే రీతిలో ఏర్పాటైన విద్యా కమిటీలు కూడా ప్రభుత్వంతో సమన్వయంగా ఉంటూ ఆశించిన స్థాయిలో విద్యా సంస్కరణల అమలు విధానాలపైన ఎప్పటికప్పుడు స్పందిస్తూ విద్యావిధానంలో ఎదురయ్యే సమస్యలపై విభిన్న కోణాల్లో ఆలోచిస్తూ ప్రాథమిక స్థాయి నుండి విద్యార్థులకు ఆధునిక బోధనా విధానాలను అమలుపరచడంలో సఫలీకృతం కావడానికి మరింత ప్రయత్నించాలి అని కోరుకునే వారు లేకపోలేదు. అంతేకాకుండా సంబంధిత ప్రభుత్వ పాఠశాలల విద్యార్థులలో ఆధునిక నూతన భావనలను కలిగించడానికి శాస్త్రసాంకేతిక విద్యపై విద్యార్థులు ఆసక్తి పెంచుకోవడానికి ప్రభుత్వ విద్యారంగంలో అన్నిపాఠశాలలో క్రమక్రమంగా సాంకేతిక ఉపకరణాలు వినియోగించుకునే అవకాశంఉండడంతో సంబంధిత ప్రభుత్వ పాఠశాలల్లో పనిచేస్తున్న ఉపాధ్యాయులకు శిక్షణఇస్తుండటంతో రాబోవు కాలంలో ప్రభుత్వ పాఠశాలలు మరింత ఆధునికతను సంతరించుకుంటాయి అనిఅనిపిస్తుంది.విద్యారంగ అభివృద్ధికి ఎమ్మెల్సీల పాత్రకూడా చాలా ముఖ్యమైనది. రాజకీయాలకతీతంగా రాష్ట్రాల్లో విద్యను ప్రభుత్వ పాఠశాలలను బలోపేతం చేసే విధానంలో విద్యా శాఖకు సంబంధించి శాసనమండలి సభ్యులు కూడా చాలా వరకు ప్రభుత్వ పాఠశాలలో నూతన సంస్కరణల విషయంలో ప్రభుత్వానికి సలహాలుసూచనలు ఇస్తూనే ఎదురవుతున్న సమస్యలపై మరింత ప్రత్యేక దృష్టి సారించాల్సిన అవసరం ఉంది. ఈక్రమంలో తరచూ ఉపాధ్యాయ సంఘాలు ఎమ్మెల్సీలు ప్రభుత్వపాఠశాల బలోపేతానికి కావలసినఅంశాలపై వీలైనప్పుడల్లా సంబంధిత విద్యాశాఖతో చర్చ జరుపుతూ ఉండడం రాబోకాలంలో ప్రభుత్వ పాఠశాల విద్య మరింత బలోపేతం కావడానికి అవకాశం ఉంటుంది. •

ఇథనాల్ మిశ్రమ పెట్రోలు ఎంతవరకు మేలు?

తిప్పర్తి శ్రీనివాస్

దేశ అభివృద్ధికి ఇంధనం ఎంత ముఖ్యమో, ఇంధన భద్రత అంతకంటే ముఖ్యమైనది. ప్రపంచవ్యాప్తంగా ముడి చమురు ధరలు రాజకీయ, ఆర్థిక పరిణామాలకు అనుగుణంగా తరచూ మారుతూ ఉంటాయి. చమురు దిగుమతులపై అధికంగా ఆధారపడే భారతదేశం వంటి దేశానికి ఈ పరిస్థితి తీవ్రమైన సవాలుగా మారుతోంది. ఇలాంటి సమయంలో ప్రత్యామ్నాయ ఇంధనాల వినియోగాన్నిప్రోత్సహించడం కేంద్ర ప్రభుత్వానికి ఒక వ్యూహాత్మక అవసరంగా మారింది. ఈ క్రమంలోనే పెట్రోల్‌లో ఇథనాల్‌ను కలిపివినియోగించే విధానాన్ని ప్రభుత్వం దశలవారీగా అమలు చేస్తోంది. అయితే ఈ నిర్ణయం దేశ ప్రయోజనాలకు ఎంత వరకు ఉపయోగపడుతుంది? వినియోగదారులపై దీని ప్రభావం ఏమిటి? అనే అంశాలపై సమగ్ర చర్చ అవసరం. ఇథనాల్ అనేది చెరకు, మొక్కజొన్న, విరిగిన బియ్యం, ఇతర ధాన్యాలు, అలాగే వ్యవసాయ అవశేషాల నుంచి తయారయ్యే జీవ ఇంధనం. పెట్రోల్‌లో దీనిని నిర్దిష్ట శాతంలో కలిపి వినియోగిస్తారు. ప్రస్తుతం ఇ10, ఇ20 వంటి మిశ్రమ ఇంధనాలు ప్రాచుర్యంలో ఉన్నాయి. అంటే వరుసగా 10 శాతం, 20 శాతం ఇథనాల్ కలిగిన పెట్రోల్ అన్నమాట. ప్రపంచంలోని అనేక దేశాలు ఇప్పటికే ఈ విధానాన్ని విజయవంతంగా అమలు చేస్తున్నాయి. భారత్ కూడా ఇంధన దిగుమతుల వ్యయాన్ని తగ్గించడం, కార్బన్ ఉద్గారాలను నియంత్రించడం, రైతులకు అదనపు ఆదాయం కల్పించడం వంటి లక్ష్యాలతో ఈ కార్యక్రమాన్ని ముందుకు తీసుకెళ్తోంది. ఇథనాల్ మిశ్రమ పెట్రోల్‌కు ఉన్న ప్రధాన ప్రయోజనం విదేశీ చమురుపై ఆధారపడటాన్నితగ్గించడమే. ప్రతి సంవత్సరం ముడి చమురు దిగుమతుల కోసం దేశం లక్షల కోట్ల రూపాయల విదేశీ మారకద్రవ్యాన్ని వెచ్చిస్తోంది. పెట్రోల్‌లో కొంత భాగాన్ని దేశీయంగా ఉత్పత్తి చేసిన ఇథనాల్‌తో భర్తీచేయడం ద్వారా ఆ వ్యయాన్ని తగ్గించే అవకాశం ఉంటుంది. ఇది కేవలం ఆర్థిక ప్రయోజనం మాత్రమే కాదు,ఇంధన భద్రతను బలోపేతం చేసే చర్య కూడా.అంతర్జాతీయ మార్కెట్‌లో చమురు ధరలు పెరిగినా, దేశీయ ఇంధన సరఫరాపై కొంత మేర ప్రభావం తగ్గుతుంది. వ్యవసాయ రంగానికి కూడా ఈ విధానం కొత్త అవకాశాలను తెరుస్తోంది. చెరకు, మొక్కజొన్న వంటి పంటలకు అదనపు డిమాండ్ ఏర్పడటం వల్ల రైతులకు మార్కెట్ విస్తరిస్తుంది. గ్రామీణ ప్రాంతాల్లో ఇథనాల్ ఉత్పత్తి పరిశ్రమలు ఏర్పడితే ఉపాధి అవకాశాలు కూడా పెరుగుతాయి. రైతుల ఆదాయా న్ని పెంచేందుకు ప్రభుత్వం చేపడుతున్న చర్యల్లో ఇది ఒక ముఖ్యమైన అడుగుగా చెప్పవచ్చు. పర్యావరణ పరిరక్షణ కోణంలో చూస్తే కూడా ఇథనాల్ మిశ్రమ ఇంధనం కొంత మేర ప్రయోజనకరమే. పెట్రోల్‌తో పోలిస్తే ఇథనాల్ దహ నం సమయంలో కొన్ని హానికర ఉద్గారాలు

తగ్గుతాయి. వాతా వరణ మార్పులను నియంత్రించేందుకు ప్రపంచ దేశాలు చేస్తున్న ప్రయత్నాల్లో ప్రత్యామ్నాయ ఇంధనాల వినియోగం కీలకంగా మారింది. ఆ దిశగా భారతదేశం తీసుకుంటున్న ఈ చర్యను సానుకూలంగానే చూడాలి. అయితే ఈ విధానానికి విమర్శలు కూడా లేకపోలేదు. ఇథనాల్‌లో శక్తిసాంద్రత పెట్రోల్ కంటే తక్కువగా ఉం టుంది. అందువల్ల కొన్ని వాహ నాల్లో మైలేజ్ స్వల్పంగా తగ్గే అవకాశం ఉంది. సాధారణ వినియోగదారుడు ముందుగా గమనించే అంశం ఇదే. ఇంధనం ఆదా అవుతుందని భావించిన చోట, ఎక్కువ ఇంధనం వినియోగించాల్సి వస్తే అసంతృప్తి సహజం. కాబట్టి ఈ విషయంపై ప్రభుత్వం, ఆయిల్ కంపెనీలు పారదర్శకంగా సమాచారం అందించాల్సిన బాధ్యత ఉంది. ప్రస్తుతం తయారవుతున్న అనేక కార్లు, ద్విచక్ర వాహనాలు ఇ20 ఇంధనానికి అనుగుణంగా రూపొందించ బడుతున్నాయి. కానీ పది లేదా పదిహేనేళ్ల క్రితం తయారైన వాహనాల్లోని కొన్ని రబ్బరు భాగాలు, సీల్స్, ఫ్యూయల్ పంపులు అధిక ఇథనాల్ మిశ్రమాన్ని తట్టుకునేలా ఉండకపోవచ్చు. ఇలాంటి వాహనాల్లో దీర్ఘకాలం అధిక ఇథనాల్ కలిగిన పెట్రోల్ ఉపయోగిస్తే నిర్వహణ వ్యయం పెరిగే అవకాశాన్ని పూర్తిగా తోసిపుచ్చలేం. అందువల్ల తయారీ సంస్థ సూచనలను పాటించడం అత్యంత అవసరం. ప్రభుత్వం కూడా ఈ మార్పును ప్రజలపై బలవంతంగా మోపకుండా, అవగాహనతో అమలు చేయాలి. ఏ వాహనాలు ఇ-20కు అనుకూలం? పాత వాహనాల యజమానులు ఏ జాగ్రత్తలు తీసుకోవాలి? మైలేజ్‌లో ఎంత మార్పు రావచ్చు? వంటి ప్రశ్నలకు స్పష్టమైన సమాధానా లు ఇవ్వాలి. ప్రజల్లో అవగాహన పెరిగితే అపోహలు తగ్గుతాయి. లేకపోతే సాంకేతిక కారణాల కంటే పుకార్లే ఎక్కువ ప్రభావం చూపే ప్రమాదం ఉంది. ఇథనాల్ ఉత్పత్తి విష యంలో కూడా సమతుల్య దృష్టి అవసరం. ఆహార పంటలను అధికంగా ఇంధన ఉత్పత్తికి మళ్లిస్తే భవిష్యత్తులో ఆహార భద్రతపై ప్రభావం పడే అవకాశం ఉంది. కాబట్టి వ్యవసాయ వ్యర్థాలు, బయోమాస్, ఇతర రెండో తరం ముడిపదార్థాల నుంచి ఇథనాల్ ఉత్పత్తిని ప్రోత్సహించడం మరింత స్థిరమైన పరిష్కారం అవుతుంది. ఇది రైతులకు, పర్యావరణానికి, దేశ ఆర్థికవ్యవస్థకు దీర్ఘకాలంలో మరింత మేలు చేస్తుంది. మొత్తంగా చూస్తే, ఇథనాల్ మిశ్రమ పెట్రోల్ అనేది దేశఇంధన విధానంలో ఒక ముఖ్యమైన సంస్కరణ. దీనిని కేవలం మైలేజ్ కోణంలో మాత్రమే అంచనా వేయడం సరైందికాదు. అలాగే జాతీయ ప్రయోజనాల పేరుతో వినియోగదారుల ఆందోళనలను విస్మరించడం కూడా సమంజసం కాదు. దేశ ప్రయోజనాలు, పర్యావరణ పరిరక్షణ, రైతుల సంక్షేమం, వాహనదారుల విశ్వాసం ఈ నాలుగు అంశాల మధ్య సమతుల్యత సాధించినప్పుడే ఈ విధానం ఆశించిన ఫలితాలను ఇస్తుంది. ఇంధన స్వావలంబన ఒక్కరోజులో సాధ్యమయ్యే లక్ష్యం కాదు. అది సాంకేతికత, శాస్త్రీయ ప్రణాళిక, ప్రజల సహకారం, పారదర్శక పాలన అనే నాలుగు స్తంభాలపై నిలబడాలి. ఇథనాల్ మిశ్రమ పెట్రోల్ ఆ ప్రయాణంలో ఒక కీలక అడుగు. ఆ అడుగు ప్రజల విశ్వాసాన్ని గెలుచుకుంటూ ముందుకు సాగితేనే అది నిజమైన విజయంగా నిలుస్తుంది. •

రోజూ రగడ.. సాగని పార్లమెంటు

'జీరో అవర్'ను మింగేస్తున్న ప్రతిపక్షం

వరుస వాయిదాలతో స్తంభిస్తున్న ఉభయ సభలు

అత్యవసర బిల్లులకే ఆమోదముద్ర

న్యూఢిల్లీ, ఆగస్టు 4: పార్లమెంట్‌లో ప్రశ్నోత్తరాల సమయం, జీరో అవర్‌ను ప్రతిపక్ష సభ్యులు పదేపదే అడ్డుకుంటున్నారని, దీంతో ప్రజలకు సంబంధించిన కీలక అంశాలను సభ దృష్టికి తీసుకురావడానికి ఎంపీలకు అవకాశం లేకుండా పోతోందని బిజెపి ఎంపీ సంబిత్ పాత్ర ఆరోపించారు. పార్లమెంట్ సమావేశాల సందర్భంగా నినాదాలు, ఆందోళనలు, గందరగోళం కారణంగా సభలు వాయిదా పడటం సాధారణమే అయినప్పటికీ, ఈ యేడాది వర్షాకాల సమావేశాలు అత్యంత నిరుత్సాహకరంగా సాగుతున్నాయని ఆయన పేర్కొన్నారు. ఈ యేడాది మాన్సూన్ సమావేశాలు గతనెల 20న ప్రారంభమై ఆగస్టు 13 వరకు కొనసాగనున్నాయి. ఆగస్టు 4 నాటికి మొత్తం 12 సమావేశ దినాలు పూర్తయ్యాయి. అయితే నీట్ ప్రశ్నాపత్రం లీక్ అంశం, రామ మందిర విరాళాల దొంగతనం వ్యవహారాలపై ప్రతిపక్ష నిరసనల కారణంగా సభా కార్యక్రమాలు పలుమార్లు అంతరాయం ఎదుర్కొన్నాయి. మొదటి వారంలోనే లోక్‌సభ, రాజ్యసభలు వరుస వాయిదాలతో దాదాపు స్తంభించిపోయాయి. లోక్‌సభ మొత్తం నిర్ణయించిన సమయంతో పోలిస్తే కేవలం 1.6 గంటలు మాత్రమేపనిచేయగా, ఇది కేటాయించిన సమయంలో కేవలం 5 శాతం మాత్రమే. రాజ్యసభ కూడా కేవలం 1.7 గంటలు మాత్రమే సమావేశమై, మొత్తం సమయంతో పోలిస్తే 6 శాతం మాత్రమే పనిచేసినట్లు సమాచారం. గతనెల 27న ఉభయ సభలు రోజంతా వాయిదా పడ్డాయి. జూలై 31న జనన-మరణాల నమోదు (సవరణ) బిల్లును చర్చ లేకుండానే లోక్‌సభ ఆమోదించినప్పటికీ, అనంతరం రెండు సభలు ముందుగానే వాయిదా పడ్డాయి. ఈ సమావేశాల్లో ఇప్పటివరకు ప్రశ్నోత్తరాల సమయం, జీరో అవర్ ఒక్కసారి కూడా పూర్తిస్థాయిలో నిర్వహించలేకపోయాయి. తొలుత నీట్ పేపర్ లీక్ అంశం, అనంతరం రామమందిర దొంగతనం వివాదంపై ప్రతిపక్ష ఆందోళనల కారణంగా సభా కార్యకలాపాలు నిలిచిపోయాయి.

రూ.190 కోట్ల ప్రజాధన వృథా

అధికారుల అంచనాల ప్రకారం పార్లమెంట్ నిర్వహణకు ప్రతి నిమిషానికి సుమారు రూ.2.5 లక్షల వ్యయం అవుతుంది. అంటే ఒక్క సమావేశ దినానికి దాదాపు రూ.9 కోట్ల వరకు ఖర్చు అవుతోంది. ఇందులో మౌలిక సదుపాయాలు, సిబ్బంది, భద్రత, లాజిస్టిక్స్, ఎంపీల భత్యాలు వంటి వ్యయాలు ఉంటాయి. 12 సమావేశ దినాలకు కేటాయించిన మొత్తం 144 గంటల్లో సుమారు 95 శాతం సమయం వాయిదాలకే పరిమితమైనట్లు అంచనా.

దీంతో ఈ సమావేశాల కాలంలోనే రూ.150 కోట్ల నుంచి రూ.190 కోట్ల వరకు ప్రజాధనం వృథా అయి ఉండొచ్చని అంచనాలు సూచిస్తున్నాయి. గత సమావేశాల గణాంకాలను పరిశీలిస్తే, ఈ మాన్సూన్‌సమావేశాలు ఇటీవలి కాలంలో అత్యంత తక్కువ పనితీరు కనబరిచిన సమావేశాల్లో ఒకటిగా నిలిచే అవకాశముంది. 2025 మాన్సూన్ సమావేశాల కంటే కూడా అధ్వాన్నంగా ఉన్నాయని విశ్లేషణలు పేర్కొంటున్నాయి.

కీలక బిల్లులకు ఆమోదం

సభలో అంతరాయాలు కొనసాగుతున్నప్పటికీ, రెండు కీలక బిల్లులు మాత్రం పార్లమెంట్ ఆమోదం పొందాయి. వాటిలో జాతీయ గౌరవానికి అవమానాల నిరోధక బిల్లు మరియు ప్రజా పరీక్షల్లో అక్రమాలకు నిరోధక (యాంటీ పేపర్ లీక్) సవరణ బిల్లు ఉన్నాయి. వందే మాతరం బిల్లు ప్రకారం జాతీయ పతాకం, రాజ్యాంగం, జాతీయ గీతంతో పాటు జాతీయ గానం వందేమాతరంను అవమానించడం కూడా శిక్షార్హ నేరంగా పరిగణించబడుతుంది.

ఉద్దేశపూర్వకంగా వందే మాతరం ఆలాపనను అడ్డుకోవడం లేదా సభల్లో అంతరాయం కల్పించడం వంటి చర్యలకు గరిష్ఠంగా మూడు సంవత్సరాల జైలు శిక్ష, జరిమానా లేదా రెండూ విధించే అవకాశం ఉంటుంది. ఈ బిల్లుకు జూలై 29న రాజ్యసభ, జూలై 30న లోక్‌సభ ఆమోదం తెలిపాయి. అదేవిధంగా, పరీక్షల్లో మోసాలు, ప్రశ్నాపత్రాల లీకులు, సాంకేతిక పరిజ్ఞానం ద్వారా జరిగే అక్రమాలను మరింత కఠినంగా అరికట్టేందుకు 2024 చట్టానికి సవరణగా యాంటీ పేపర్ లీక్ బిల్లును తీసుకొచ్చారు.

సవరణల ప్రకారం నిందితులకు 5 నుంచి 10 సంవత్సరాల వరకు జైలు శిక్షతో పాటు గరిష్ఠంగా రూ.50 లక్షల వరకు జరిమానా విధించే నిబంధనలు ప్రతిపాదించారు.

ట్రంప్ కొత్త సుంకాలపై

కోర్టుకెక్కిన 25 రాష్ట్రాలు

వాషింగ్టన్, ఆగస్టు 4: సుంకాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్ ఇటీవల తీసుకున్న నిర్ణయం ఇప్పుడు న్యాయపరమైన చిక్కుల్లో పడింది. భారత్‌తో సహా 60 భాగస్వామ్య దేశాలపై ట్రంప్ విధించిన కొత్త పన్నులను సవాలు చేస్తూ.. అమెరికాలోని 25 డెమొక్రటిక్ పార్టీ నేతృత్వంలోని రాష్ట్రాలు కోర్టును ఆశ్రయించాయి. ట్రంప్ ప్రభుత్వం తమ చట్టబద్ధమైన పరిమితులను దాటి వ్యవహరిస్తోందని ఆరోపిస్తూ దావా వేశాయి. న్యూయార్క్‌లోని 'యుఎస్ కోర్ట్ ఆఫ్ ఇంటర్నేషనల్ ట్రేడ్'లో 25 రాష్ట్రాల కూటమి ఈ పిటిషన్‌ను దాఖలు చేసింది. వెట్టి చాకిరీ ద్వారా తయారు చేసిన వస్తువుల దిగుమతులపై సరైన నిషేధం అములు చేయడం లేదనే ఆరోపణలతో గత నెలలో ట్రంప్ ప్రభుత్వం సుంకాలను విధించింది. భారత్ సహా దాదాపు 60 భాగస్వామ్య దేశాల నుంచి వచ్చే దిగుమతులపై 10 శాతం నుంచి 12.5 శాతం వరకు కొత్త సుంకాలను విధిస్తున్నట్లు ప్రకటించింది. ఈ సుంకాల వల్ల వినియోగదారులు, వ్యాపారాలపై భారం పడుతుందన్న 25 రాష్ట్రాలు ఇప్పుడు కోర్టును ఆశ్రయించాయి. ఇంతకుముందు కూడా ట్రంప్ విధించిన అనేక సుంకాల నిర్ణయాలు అమెరికా కోర్టులలో చట్టపరమైన చిక్కులను ఎదుర్కొన్న సంగతి తెలిసిందే. ఇప్పుడు ఈ కొత్త టారిఫ్‌లపై నమోదైన కేసు ట్రంప్ వాణిజ్య విధానాలకు మరో పెద్ద పరీక్షగా మారనుంది.

ప్రారంభంలో భారత్‌పై 12.5 శాతం టారిఫ్ విధించాలని ప్రతిపాదించినప్పటికీ.. వెట్టి చాకిరీ నిరోధక చట్టాల అమలును భారత్ వేగవంతం చేయడంతో పన్నును 10 శాతానికి తగ్గించారు. చమురు, సహజవాయువు, ఎరువుల దిగుమతులకు, అలాగే యుఎస్-మెక్సికో-కెనడా వాణిజ్య ఒప్పందం పరిధిలోకి వచ్చే వస్తువులకు ఈ పన్నుల నుంచి మినహాయింపు ఇచ్చారు.

18 యేళ్లకే ప్రొఫెసర్

306 యేళ్ల రికార్డు బద్దలు

వాషింగ్టన్, ఆగస్టు 4: పట్టుదల ఉండాలే గానీ.. అసాధ్యాన్ని కూడా సుసాధ్యం చేయవచ్చని నిరూపించాడు అమెరికాకు చెందిన నాథన్ థామస్. చాలామంది 18 యేళ్ల వయసులో ఉన్నత విద్యలోకి అడుగు పెడుతుంటే.. అతడు మాత్రం తరగతి గదిలో పాఠాలు చెబుతున్నాడు. పదేళ్ల వయసులోనే కళాశాల చదువు ప్రారంభించిన థామస్.. 18 యేళ్లకే ప్రొఫెసర్‌గా అరుదైన ఘనత సాధించాడు. ప్రపంచంలోనే అతి పిన్న వయస్కుడైన పురుష ప్రొఫెసర్‌గా గిన్నిస్ వరల్డ్ రికార్డులో చోటు సంపాదించాడు. ఈ విషయంలో దాదాపు 300 యేళ్ల నాటి రికార్డును థామస్ బద్దలు కొట్టాడు. అంతకుముందు 1717లో స్కాట్లాండ్ గణిత శాస్త్రవేత్త కొలిన్ మెక్‌లారిన్ తన 19 యేళ్ల వయసులో ప్రొఫెసర్‌గా విధులు నిర్వర్తించారు. ఆయన రికార్డును తాజాగా థామస్ అధిగమించాడు.

అమెరికాలోని మియామీ కాలేజీలో ఇంజినీరింగ్ అధ్యాపకుడిగా బాధ్యతలు చేపట్టిన థామస్.. తనతో దాదాపు సమానమైన వయసున్న విద్యార్థులకు బోధించడం విశేషం. నాథన్ థామస్ పదేళ్ల వయసులోనే డ్యుయల్ ఎన్‌రోల్‌మెంట్ కార్యక్రమం కింద మియామీ కాలేజీలో చేరాడు. అనంతరం 14 యేళ్లకే ఫ్లోరిడా ఇంటర్నేషనల్ యూనివర్సిటీలో బ్యాచిలర్, మాస్టర్స్ డిగ్రీలు పూర్తి చేశాడు. ఇప్పుడు ప్రొఫెసర్‌గా ఇంజినీరింగ్ విద్యార్థులకు పాఠాలు చెబుతున్నాడు. ఇంజినీర్ల కుటుంబంలో పెరగడం, గణితంపై తల్లి ఆసక్తి పెంచడమే తన ఎదుగుదలకు బలమైన పునాది అని థామస్ అంటాడు. ప్రస్తుతం బోధనతోపాటు మియామీ యూనివర్సిటీ లా స్కూల్‌లో డిగ్రీ చదువుతున్న నాథన్.. న్యాయ నిపుణుడు కావాలని లక్ష్యంగా పెట్టుకున్నాడు.

రాష్ట్ర బార్ కౌన్సిళ్లు 'పురుషుల క్లబ్‌లు'గా మారాయి

సుప్రీంకోర్టు ఘాటు వ్యాఖ్యలు

బార్ కౌన్సిళ్లలో మహిళలను నామినేట్ చేయాలని హైకోర్టులకు ఆదేశం

న్యూఢిల్లీ, ఆగస్టు 4: భారతదేశ న్యాయ సంస్థలలో లింగ అసమానతపై సుప్రీంకోర్టు తీవ్ర వ్యాఖ్యలు చేసింది. రాష్ట్ర బార్ కౌన్సిళ్లు 'పురుషుల క్లబ్‌లు'గా మారాయని ప్రకటిస్తూ, వాటి పనితీరుపై ఉన్న గుత్తాధిపత్యాన్ని 'పూర్తిగా తొలగించాలి' అని హెచ్చరించింది. బార్ కౌన్సిల్ ఆఫ్ ఇండియా (బిసిఐ), రాష్ట్ర బార్ కౌన్సిళ్ల ఎన్నికలకు సంబంధించిన పలు పిటిషన్లపై మంగళవారం విచారణ జరిపిన భారత ప్రధాన న్యాయమూర్తి సూర్యకాంత్ నేతృత్వంలోని ధర్మాసనం, న్యాయమూర్తులు జయమాల్య బాగ్చి, వి. మోహనలతో కలిసి, ప్రతి రాష్ట్ర బార్ కౌన్సిల్‌కు ఇద్దరు కోఆప్టెడ్ మహిళా సభ్యులను నామినేట్ చేయాలని తమ పరిధిలోని హైకోర్టుల ప్రధాన న్యాయమూర్తులను ఆదేశించింది. కోఆప్ట్ సభ్యులలో ఒకరు మాజీ హైకోర్టు న్యాయమూర్తిగా, మరొకరు పేరున్న సీనియర్ మహిళా న్యాయవాదిగా ఉండాలని కోర్టుఆదేశించింది. కౌన్సిళ్ల పనితీరులో నిష్పక్షపాతాన్ని నిర్ధారించడానికి, వీరిద్దరూ ఎన్నికల ప్రక్రియకు అతీతంగా స్వతంత్రంగా ఉండాలి. రాష్ట్ర బార్ కౌన్సిల్ ఎన్నికలలో పోటీ చేసి ఓడిపోయిన మహిళలు కూడా కోఆప్షన్‌కు అర్హులుగా ఉంటారని ధర్మాసనం స్పష్టం చేసింది. మహిళా అభ్యర్థులకు బదిలీ చేయదగిన ఓట్లను లెక్కించే అంశాన్ని, సుప్రీంకోర్టు మాజీ న్యాయమూర్తి జస్టిస్ సుధాన్షు ధూలియా నేతృత్వంలోని ఉన్నత స్థాయి పర్యవేక్షక కమిటీకి నివేదించారు. బార్ సభ్యుల నుండి సూచనలు ఆహ్వానించి, మౌఖిక విచారణలు నిర్వహించిన తర్వాత ఈ పద్ధతిని పునఃపరిశీలించాలని కమిటీని కోరారు.

'ఆయన బతికే ఉన్నారు'

మర్చంట్ నేవీ కెప్టెన్ భార్య సుప్రీంకోర్టులో హెబియస్ కార్పస్ పిటిషన్ దాఖలు

న్యూఢిల్లీ, ఆగస్టు 4: ఒమన్ తీరంలో ఒక ఆయిల్ ట్యాంకర్‌పై జరిగిన క్షిపణి దాడిలో మర్చంట్ నేవీ కెప్టెన్ ఆశిష్ కుమార్ మరణించారని ప్రకటించిన కొన్ని నెలల తర్వాత, ఆయన భార్య సుప్రీంకోర్టులో హెబియస్‌కార్పస్ పిటిషన్ దాఖలు చేశారు. 'ఆయన బతికే ఉన్నారు, గుర్తుతెలియని విదేశీ శక్తుల చేతిలో బందీగా ఉన్నారు' అని ఆమె ఆరోపించారు. తన భర్తను గుర్తించి, ఆయన విడుదల కోసం రూ.20 లక్షలు డిమాండ్ చేస్తూ తనకు బెదిరింపు కాల్స్ వచ్చాయని ఆరోపిస్తూ, అన్షు కుమార్ ఒక హెబియస్ కార్పస్ పిటిషన్‌లో తన భర్తను గుర్తించి, విడిపించాలని అధికారులను ఆదేశించాలని సుప్రీంకోర్టును కోరారు.

ఇరాన్‌తో ఘర్షణల తొలిదశలో, మార్చి 1న ఒమన్‌లోని ఖసాబ్ పోర్టు సమీపంలో 'స్కై లైట్'అనే చమురు ట్యాంకర్‌పై క్షిపణి దాడి జరిగినప్పుడు, బీహార్‌లోని బెట్టియాకు చెందిన 37 ఏళ్ల కెప్టెన్ ఆశిష్ కుమార్ దానికి సారథ్యం వహిస్తున్నారు. నివేదికల ప్రకారం, ఆ దాడి అనంతరం నౌకకు నిప్పంటుకున్నప్పుడు అందులో పది మంది భారతీయ సిబ్బంది ఉన్నారని ఒమన్‌లోని భారత రాయబార కార్యాలయం ఆ సమయంలో పేర్కొంది. ఒమన్ అధికారులు ఎనిమిది మంది నావికులను రక్షించగా, ఇంజిన్ రూమ్‌లో పనిచేస్తున్న కెప్టెన్ కుమార్, మరో సిబ్బంది దలీప్ ఆచూకీ తెలియరాలేదని నివేదికలు చెబుతున్నాయి. మార్చి 4న, ఒమన్ కోస్ట్ గార్డ్ కెప్టెన్ క్యాబిన్ నుండి కాలిపోయిన అస్థిపంజర అవశేషాలను స్వాధీనం చేసుకుంది. దాడి తర్వాత క్యాబిన్‌లోకి మరెవరూ ప్రవేశించలేదని భావిస్తున్నందున, ఆ అవశేషాలు చాలా మటుకు కెప్టెన్ కుమార్‌కు చెందినవేనని భారత రాయబార కార్యాలయం ఆ పరిస్థితులను బట్టి చెప్పింది. అయితే, ఆ తర్వాత జరిగిన పరిణామాలు ఆ నిర్ధారణను ప్రాథమికంగా మార్చేశాయని అన్షు కుమార్ తన పిటిషన్‌లో పేర్కొన్నారు.

తమిళనాడుకు చేరిన కావేరి జలాలు

కోయంబత్తూరు, ఆగస్టు 4: కావేరి నదీ జలాలు మంగళవారం తమిళనాడు చేరుకున్నాయి. కర్నాటకలోని కాబిని డ్యామ్ నుంచి రిలీజ్ చేసిన నీరు తమిళనాడులోని ఎంట్రీపాయింట్ బిలిగుండ్లకు చేరుకున్నది. సోమవారం ఉదయం 500 క్యూసెక్కులుఉండగా, ఆగస్టు 4వ తేదీ మంగళవారం ఆ ప్రవాహం 1000 క్యూసెక్కులకు చేరుకున్నది. ఉదయం 7 గంటలకు 8వేల క్యూసెక్కులు కాగా, ఉదయం 10 గంటలకు 18వేల క్యూసెక్కులకు చేరుకున్నది. అయితే కర్నాటక నీరును విడుదల చేస్తున్న నేపథ్యంలో కావేరి నదిప్రవాహ ఉధృతి పెరిగే అవకాశాలు ఉన్నట్లు అధికారులు చెప్పారు. కావేరి పరివాహక ప్రాంతాల్లో భారీగా వర్షం కురవడం వల్ల నదిలోకి నీరు ఉధృతంగా ప్రవహిస్తోంది. తాజాగా వస్తున్న నీరు.. మంగళవారం రాత్రివరకు మెట్టూరు డ్యామ్‌కు చేరుకునే అవకాశాలు ఉన్నాయి. ప్రస్తుతం మెట్టూరు రిజర్వాయర్‌లో నీటి సామర్థం 73.18 ఫీట్ల వద్ద ఉన్నది. ఆ రిజర్వాయర్ పూర్తి సామర్థం 120 ఫీట్లుగా ఉంది. ఆ డ్యామ్‌కు 68 క్యూసెక్కుల ప్రవాహం వస్తుండగా, దాని నుంచి 1500 క్యూసెక్కుల నీటిని దిగువ ప్రాంతాలకు రిలీజ్ చేస్తున్నారు. మెట్టూరు డ్యామ్‌కు నీరు చేరితే అప్పుడు దిగువన ఉన్న డెల్టా ప్రాంత రైతులు సేద తీరే అవకాశాలు ఉన్నాయి.

ఉదయనిధి స్టాలిన్ అరెస్టు, విడుదల

నటి త్రిషపై వ్యాఖ్యల దుమారం

చెన్నై, ఆగస్టు 4: తమిళనాడు రాజకీయాలు ఒక్కసారిగా వేడెక్కాయి. ప్రతిపక్ష నేత ఉదయనిధి స్టాలిన్ ఓ కార్యక్రమంలో చేసిన వ్యాఖ్యలు తీవ్ర దుమారాన్ని సృష్టిస్తున్నాయి. ఈ విషయంలో పోలీసులు ఇప్పటికే ఆయన్ను అరెస్ట్ చేశారు. చెన్నైలో ఆయన నివాసానికి పెద్ద ఎత్తున చేరుకున్న డిఎంకే కార్యకర్తలు పోలీసు వాహనాన్ని అడ్డుకునే ప్రయత్నం చేశారు. తంజావూరు పోలీసులు ఈకేసునమోదుచేసారు. డిఎస్‌పి అలగేషన్ ఆధ్వర్యంలోని పోలీస్ బృందం, చెన్నై పోలీస్ కమిషనర్ ఎ అమల్‌రాజ్ ఉదయనిధి నివాసానికి చేరి కేసు వివరాలు తెలిపారు. మరోవైపు అరెస్టు నుంచి రక్షణ కోరుతూ మద్రాస్ హైకోర్టులో ఉదయనిధి ముందస్తు బెయిల్ పిటిషన్ దాఖలు చేశారు. అది విచారణకు వచ్చేలోపే ఆయన్ను అరెస్ట్ చేయడం గమనార్హం. కావేరి జలాల విషయంలో రాష్ట్ర ప్రభుత్వాన్ని విమర్శిస్తూ ఉదయనిధి ముందురోజు ప్రసంగించారు. ఆ సమయంలో సభలో ఉన్న ఓ వ్యక్తి నటి త్రిష పేరు ప్రస్తావించగా, దానికి ఉదయనిధి చేసిన వ్యాఖ్యలు ద్వంద్వార్థంతో ఉన్నాయని విమర్శలు వచ్చాయి. మహిళలను అవమానించేలా ఆ వ్యాఖ్యలు ఉన్నాయని ప్రత్యర్థి పార్టీలు ఆరోపించాయి. అధికార టీవీకే పార్టీ నేత ఆధవ్ అర్జున్ ఉదయనిధిపై తీవ్ర విమర్శలు చేశారు. మహిళల పట్ల అవమానకరంగా మాట్లాడారని ఆరోపించారు. టీవీకే అధికార ప్రతినిధి ఫెలిక్స్ జెరాల్డ్ కూడా స్పందించారు. అదే వ్యాఖ్యలను తన కుటుంబ సభ్యుల ముందు చెబుతారా అని ప్రశ్నించారు. బిజెపి కూడా ఈ వ్యాఖ్యలను ఖండించింది. ఉదయనిధిని వెంటనే అరెస్టు చేయాలని తమిళనాడు బిజెపి ప్రధాన అధికార ప్రతినిధి నారాయణన్ తిరుపతి డిమాండ్ చేశారు. నటి త్రిషకు బహిరంగ క్షమాపణ చెప్పాలని బిజెపి ఉపాధ్యక్షురాలు ఖుష్బూ సుందర్ డిమాండ్ చేశారు. అయితే ఈ వివాదాన్ని డిఎంకే కొట్టిపారేసింది. కావేరి జలాల సమస్య, డెల్టారైతుల ఇబ్బందుల నుంచి ప్రజల దృష్టి మళ్లించేందుకే ఈ అంశాన్ని పెద్దది చేస్తున్నారని మాజీ మంత్రి మనో తంగరాజ్ ఆరోపించారు. ప్రభుత్వ వైఫల్యాలపై ఉదయనిధి ప్రశ్నించకుండా అడ్డుకునేందుకే ఈ ప్రచారం జరుగుతోందని అన్నారు. అయితే పోలీసులు అరెస్టుచేయడంతో ఉదయనిధి హైకోర్టులో వేసిన పిటిషన్‌కు ఊరట లభించింది. ఆయనకు న్యాయస్థానం బెయిల్ మంజూరు చేసింది. వెంటనే విడుదల చేయాలని పోలీసులను ఆదేశించింది. అలాగే విచారణకు పూర్తిగా సహకరించాలని ఉదయనిధికి సూచించింది. సిఎం విజయ్, సినీ నటి త్రిషకు సంబంధించిన వ్యాఖ్యల ఆరోపణల కేసులో ఈరోజు పోలీసులు ఉదయనిధిని అరెస్ట్‌చేసిన విషయం తెలిసిందే. ఉదయనిధిని రిమాండ్‌కు పంపే ఆలోచన తమకు లేదని తమిళనాడు పోలీసులు స్పష్టం చేశారు. ఎఫ్ఐఆర్ నమోదైన నేపథ్యంలో మాత్రమే ఆయన్ను విచారిస్తున్నామని తెలిపారు.

మధ్య ఆసియాపై భారత్ దృష్టి

ఈ నెలాఖరులో కిర్గిజ్‌స్థాన్, ఉజ్బెకిస్థాన్‌లకు ప్రధాని మోడీ పర్యటన

న్యూఢిల్లీ,ఆగస్టు 4: ప్రధానమంత్రి నరేంద్ర మోడీ ఈ నెలాఖరులో కిర్గిజ్‌స్తాన్, ఉజ్బెకిస్థాన్ దేశాల్లో పర్యటించనున్నారు. చైనా తన బెల్ట్ అండ్ రోడ్ ఇనిషియేటివ్‌ద్వారా మధ్య ఆసియాలో ప్రభావాన్ని విస్తరిస్తుండగా, రష్యా ఈ ప్రాంతాన్ని తన సాంప్రదాయ ప్రభావ పరిధిగా భావిస్తోంది. ఇదే సమయంలో భారత్ కూడా మధ్య ఆసియాలో తన వ్యూహాత్మక, ఆర్థిక ప్రాధాన్యాన్ని పెంచుకునేందుకు ప్రయత్నాలు ముమ్మరం చేస్తోంది. ఈ నేప థ్యంలో ప్రధాని మోడీ పర్యటనకు విశేష ప్రాధాన్యం ఏర్పడింది. ఈ పర్యటన రెండు దశల్లో జరగనుంది. ముందుగా కిర్గిజ్‌స్తాన్‌లో జరిగే షాంఘై కోఆపరేషన్ ఆర్గనైజేషన్ (ఎస్‌సిఒ) శిఖరాగ్ర సమావేశంలో ప్రధాని మోడీ పాల్గొంటారు. సమావేశం సందర్భంగా పలువురు దేశాధినేతలతో ద్వైపాక్షిక భేటీలుకూడా నిర్వహిస్తారు. ఉజ్బెకిస్థాన్‌లో పూర్తి స్థాయి ద్వైపాక్షిక పర్యటనకొనసాగనుంది. ఇందులో వాణిజ్యం, రక్షణ సహకారం, పెట్టుబడులు, కనెక్టివిటీ తదితర అంశాలపై చర్చలు జరుగుతాయి. అఫ్గానిస్థాన్‌లో మారిన భద్రతా పరిస్థితులు, మధ్య ఆసియాలో చైనా పెరుగుతున్న ప్రభావం, భారత్ తన వ్యూహాత్మక, ఆర్థిక ప్రయోజనాలను విస్తరించే లక్ష్యం వంటి అంశాల నేపథ్యంలో ఈ ప్రాంతానికి భారత విదేశాంగ విధానంలో మరింత ప్రాధాన్యం పెరిగింది. ఉజ్బెకిస్థాన్ విదేశాంగ మంత్రి బఖ్తియోర్ సైదోవ్ ఇటీవల న్యూఢిల్లీలో విదేశాంగ మంత్రి ఎస్. జైశంకర్‌తో సమావేశ మయ్యారు. రాష్ట్రపతి ద్రౌపది ముర్మును కూడా మర్యాద పూర్వకంగా కలిశారు.

సిజెపి వ్యవస్థాపకుడు అభిజిత్ దీప్కేపై పోలీసులకు ఫిర్యాదు

ఔరంగాబాద్,ఆగస్టు 4: సిజెపి (కాక్రోచ్ జనతా పార్టీ) ఫౌండర్ అభిజీత్ దీప్కేపై ఒక సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్ ఢిల్లీ పోలీసులకు ఫిర్యాదు చేశాడు. అతడి అనుచరులు తనపై వరుసగా దాడికి పాల్పడ్డారని, దీనికి బాధ్యుడిగా అభిజీత్ దీప్కేను అరెస్టు చేయాలని కోరుతూ ఫిర్యాదు చేశాడు. ఫిర్యాదుకు సంబంధించిన వివరాలివి. ఫైజన్ అన్సారీ అనే అతడు సోషల్ మీడియా ఇన్‌ఫ్లుయెన్సర్‌గా గుర్తింపు తెచ్చుకున్నాడు. అతడిపై ఇటీవల పుణెలో, ఔరంగాబాద్‌లో దీప్కే అనుచరులు దాడి చేశారు. ఈ విషయాన్ని ఫైజన్ అన్సారీయే వెల్లడించాడు. ఇందుకు సంబంధించి తన వద్ద ఆధారాలున్నాయని, ఈ నేపథ్యంలో అభిజీత్ దీప్కేపై చర్యలు తీసుకోవాలని కోరుతూ ఢిల్లీ డిసిపికి ఫిర్యాదు చేసినట్లు ఫైజన్ పేర్కొన్నాడు. ఇప్పటికే ఇదే అంశంపై రెండు చోట్ల ఎఫ్ఐఆర్‌లు నమోదు చేశానన్నాడు. ఢిల్లీ పోలీసులు కూడా వెంటనే స్పందించి, దీప్కేను అరెస్టు చేయాలని అతడు కోరాడు. ఇదే సమయంలో ఢిల్లీ పోలీసులు, ప్రభుత్వంపై ఫైజన్ ప్రశంసలు కురిపించాడు. పోలీసులు సరైన సమయంలో స్పందించి, సోనమ్ వాంగ్‌చుక్‌ను అరెస్టు చేశారని చెప్పాడు. దీప్కేకు స్వప్రయోజనాలే ముఖ్యమని, ప్రతి అంశాన్ని తన ప్రయోజనం కోసమే వాడుకుంటాడని ఫైజన్ ఆరోపించాడు. అయితే, ఫైజన్ చేసిన ఆరోపణలపై దీప్కే కానీ, సిజెపి కానీ స్పందించలేదు.

వాషింగ్టన్‌లో విస్తరిస్తున్న కార్చిచ్చు

అత్యవసర పరిస్థితి విధింపు

వాషింగ్టన్, ఆగస్టు 4: అమెరికాలో అగ్నికీలలు విధ్వంసం సృష్టిస్తున్నాయి. వాషింగ్టన్ రాష్ట్ర పరిధిలోని అటవీ ప్రాంతాన్ని కార్చిచ్చు దహించివేస్తుండగా, సమీపంలోని వేల మంది ప్రజలను అధికారులు సురక్షిత ప్రాంతాలకు తరలించారు. తాజాగా మరో 60 వేల మందిని తాత్కాలిక శిబిరాలకు పంపారు. మంటలకు కారణమని భావిస్తున్న స్పోకేన్‌కు చెందిన వ్యక్తిని పోలీసులు అరెస్టు చేశారు. ప్రస్తుతం వాషింగ్టన్ వ్యాప్తంగా 16 ప్రదేశాల్లో కార్చిచ్చు విస్తరించింది. వందల భవనాలు అగ్నికి ఆహుతయ్యాయి. స్పోకేన్ ప్రాంతంలో మంటలు కొనసాగుతుండడంతో వాటిని అదుపు చేయడానికి అగ్నిమాపక సిబ్బంది తీవ్రంగా ప్రయత్నిస్తున్నారు. బలమైన గాలులు, పొడి వాతావరణం కారణంగా మంటలను నియంత్రించడం సవాలుగా మారింది. నష్టం తీవ్రతను అంచనా వేస్తున్నట్లు స్పోకేన్ మేయర్ లీసా బ్రౌన్ వెల్లడించారు.

వాషింగ్టన్‌లో అత్యవసర పరిస్తితి..

తాజా పరిణామాలపై అమెరికా అధ్యక్షుడు డొనాల్డ్ ట్రంప్‌తో మాట్లాడిన తర్వాత.. వాషింగ్టన్ రాష్ట్ర గవర్నర్ బాబ్ ఫెర్గూసన్ రాష్ట్రవ్యాప్తంగా అత్యవసర పరిస్థితిని ప్రకటించారు. కార్చిచ్చు వేగంగా వ్యాపిస్తుండడంతో ప్రభావిత ప్రాంతాల్లో ఇళ్లను ఖాళీ చేయిస్తున్నారు. ప్రజలందరూ అప్రమత్తంగా ఉండాలని హెచ్చరించారు. మరోవైపు ఈ వారం ఉష్ణోగ్రతలు మళ్లీ పెరిగే అవకాశం ఉందని వాతావరణ శాఖ హెచ్చరించింది.

సంక్షిప్త వార్తలు

పాక్ చరిత్రలోనే అతిపెద్ద భూకుంభకోణం

ఇస్లామాబాద్,ఆగస్టు 4: పాకిస్థాన్ రాజకీయాల్లో తీవ్ర ప్రకంపనలు రేగాయి. దేశ చరిత్రలోనే అతిపెద్ద కుంభకోణాన్ని తాను బయటపెట్టినట్లు అంతర్గత వ్యవహారాల శాఖ మంత్రి మొహ్సిన్ నఖ్వీ చేసిన వ్యాఖ్యలు అధికార వర్గాల్లోని విభేదాలను బట్టబయలు చేశాయి. న్యాయమూర్తులు, బ్యూరోక్రాట్లు, రాజకీయ నాయకులు, బ్యాంకర్లు ఈ స్కామ్‌లో భాగస్వాములుగా ఉన్నారని, గత 21 యేళ్లుగా లంచాలు చేతులు మారాయని ఆయన ఆరోపించారు. ఈ వ్యాఖ్యల వెనుక సైన్యం, పౌర ప్రభుత్వానికి మధ్య పెరుగుతున్న ఘర్షణ వాతావరణమే కారణమని విశ్లేషకులు భావిస్తున్నారు. ఈ కుంభకోణంలో బాధ్యులైన ప్రతి ఒక్కరిపై కఠిన చర్యలు తీసుకుంటామని నఖ్వీ హెచ్చరించారు.

పాక్‌లో 30 మందికిపైగా లష్కరే సభ్యుల హత్య

పెషావర్, ఆగస్టు 4: పాకిస్థాన్‌కు చెందిన నిషేధిత ఉగ్రవాద సంస్థ లష్కరే తోయిబాకు చెందిన 30 మందికిపైగా సభ్యులు గత 34 యేళ్లలో గుర్తు తెలియని వ్యక్తుల చేతుల్లో హత్యకు గురయ్యారని ఆ సంస్థ కీలక నేత రిజ్వాన్ హనీఫ్ వెల్లడించాడు. దీనికి సంబంధించిన వీడియో సామాజిక మాధ్యమాల్లో వైరల్‌గా మారింది. వీడియోలో కనిపిస్తున్న వ్యక్తి లష్కరే తోయిబాకు చెందిన సీనియర్ ఉగ్రవాదేనని భారత భద్రతా సంస్థలు ధ్రువీకరించాయి. పెషావర్, కరాచీ, రావల్పిండి, రావల్‌కోట్, ముజఫరాబాద్ ప్రాంతాల్లో 30 మందికిపైగా లష్కరే సభ్యులు హత్యకు గురయ్యారని హనీఫ్ వీడియోలో పేర్కొన్నాడు.

నేతాజీముని మనుమడు టిఎంసికి రాజీనామా

కోల్‌కత్తా, ఆగస్టు 4: నేతాజీ సుభాష్ చంద్రబోస్ మనవడు చంద్రకుమార్ బోస్ తృణమూల్ కాంగ్రెస్ (టిఎంసి) పార్టీకి రాజీనామా చేశారు. వ్యక్తిగత కారణాలతోనే తాను పార్టీ ప్రాథమిక సభ్యత్వానికి రాజీనామా చేస్తున్నట్లు ఆయన సోమవారం ప్రకటించారు. ఈ అనూహ్యపరిణామంపై టిఎంసి అధిష్ఠానం స్పందించాల్సి ఉంది. చంద్ర కుమార్ బోస్ రాజకీయ ప్రస్థానం గత కొంతకాలంగా చర్చనీయాంశంగా మారింది. 2016లో ఆయన బిజెపిలో చేరారు. ఆ పార్టీ తరఫున 2016 అసెంబ్లీ ఎన్నికల్లో, 2019 లోక్‌సభ ఎన్నికల్లో పోటీ చేసి పరాజయం పాలయ్యారు. పశ్చిమ బెంగాల్ బిజెపి ఉపాధ్యక్షుడిగా కూడా ఆయన బాధ్యతలు నిర్వహించారు.

భారత్‌లో 15 విదేశీ వర్సిటీల క్యాంపస్‌లు

న్యూఢిల్లీ, ఆగస్టు 4: భారత ఉన్నత విద్యా రంగంలో ఒక కీలక ముందడుగు పడింది. దేశంలో తమ ప్రాంగణాలను (క్యాంపస్‌లను) ఏర్పాటు చేసేందుకు 15 విదేశీ విద్యా సంస్థలకు కేంద్ర ప్రభుత్వం అనుమతినిచ్చింది. ఈ మేరకు కేంద్ర విద్యాశాఖ సహాయ మంత్రి సుకాంత మజుందార్ లోక్‌సభలో సభ్యులు అడిగిన ప్రశ్నకు లిఖిత పూర్వక సమాధానం ఇచ్చారు. ఆస్ట్రేలియా, ఇటలీ, అమెరికా, యూకే దేశాలకు చెందిన 15 విదేశీ విద్యా సంస్థలకు యూనివర్సిటీ గ్రాంట్స్ కమిషన్ (యూజీసీ) ఇప్పటివరకు 16 లెటర్స్ ఆఫ్ ఇంటెంట్ జారీ చేసింది.

పిఒకెలో మానవహక్కుల ఉల్లంఘన

ముజఫరాబాద్, ఆగస్టు 4: పాక్ ఆక్రమిత కశ్మీర్‌లో (పిఒకె) జరుగుతున్న అసెంబ్లీ ఎన్నికల నేపథ్యంలో అక్కడ తీవ్ర హింస, అశాంతి చోటుచేసుకుంటున్నాయి. నిరసనకారులపై పాక్ భద్రతాబలగాలు దాడులకు పాల్పడటం, మీడియాపై ఉక్కుపాదం మోపడం, ఇంటర్నెట్ సేవలను నిలిపివేయడంపై ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్, కమిటీ టు ప్రొటెక్ట్ జర్నలిస్ట్స్ వంటి అంతర్జాతీయ సంస్థలు తీవ్రఆందోళన వ్యక్తం చేశాయి. మానవ హక్కుల ఉల్లంఘనలపై వెంటనే దర్యాప్తుజరపాలని పాకిస్థాన్ ప్రభుత్వాన్ని డిమాండ్‌చేశాయి. రావల్‌కోట్‌లో నిరసనకారులపై భద్రతాబలగాలు విచక్షణారహితంగా వ్యవహరించాయని ఆమ్నెస్టీ ఇంటర్నేషనల్ ఆరోపించింది.

5-8Pg6exHMNWJQE.qxd:5-8Pg6exHMNWJQE.qxd 1/1/02 6:10 AM Page 1

మాజీ సిఎం వైఎస్ జగన్ ఇంటిముందు భార్యతో కలిసి బోరుగడ్డ అనిల్ నిరసన

విజయవాడ, ఆగస్టు 4 ప్రభాతవార్త ప్రతినిధి: వైసిపి అధినేత, మాజీ సిఎం వైఎస్ జగన్ తాడేపల్లిలోని నివాసం వద్ద బోరుగడ్డ అనిల్ కుమార్ తన భార్యతో కలిసి నిరసనకు దిగడం రాజకీయ వర్గాల్లో కలకలం రేపింది. గతంలో తనను వైసిపి నేతగా చెప్పుకున్న అనిల్‌తో పార్టీకి ఎలాంటి సంబంధం లేదని గతంలోనే ఆ పార్టీ స్పష్టత ఇచ్చింది. అయితే తాజాగా జగన్ నివాసానికి చేరుకున్న ఆయన, పార్టీ సీనియర్ నేత సజ్జల రామకృష్ణారెడ్డిపై సంచలన వ్యాఖ్యలు చేశారు. తనను జగన్ ఇంటికి వెళ్లకుండా సజ్జల తన అనుచరులతో కలిసి అడ్డుకుంటున్నారని, అంతేకాకుండా తనపై 'రౌడీషీటర్' అని తప్పుడు ప్రచారం చేయిస్తున్నారని బోరుగడ్డ అనిల్ మండిపడ్డారు. తనపై ఎలాంటి రౌడీషీట్ లేదని హైకోర్టు స్పష్టం చేసిందని గుర్తుచేశారు. ఈ వ్యవహారంలో 12 మంది పోలీసులకు కోర్టు మెమో ఇచ్చిందని తెలిపారు. తాను లండన్‌లో పిజి పూర్తి చేశానని, తండ్రి మరణం తర్వాత ఇక్కడికి వచ్చి జగన్‌ను సిఎం చేయడమే లక్ష్యంగా కష్టపడ్డానని అన్నారు. వైఎస్సార్ సమాధి వద్ద ప్రమాణం చేసి మరీ పార్టీ కోసం పనిచేశానని పేర్కొన్నారు. కేంద్ర మంత్రులు సైతం తన ఇంటికి వస్తారని చెప్పుకొచ్చిన ఆయన, తనపై నిందలు వేసిన వారిపై చర్యలు తీసుకోవాలని డిమాండ్ చేశారు.

మద్యం రవాణా టెండర్ల కేసు నిందితుల కస్టడి కోరుతూ సిట్ పిటిషన్

విజయవాడ, ఆగస్టు 4 ప్రభాతవార్త ప్రతినిధి: మద్యం రవాణా టెండర్ల కేసులో నిందితులు రాజ్ కెసిరెడ్డి, వాసుదేవ రెడ్డి, కారుమూరి సునీల్‌ల కస్టడీ పిటిషన్ పై ఎసిబి కోర్టు విచారణ జరిపింది. దీనిపై సిట్ పోలీసులు తరపున, నిందితుల తరపున వాద, ప్రతివాదనలను ఎసిబి కోర్టు న్యాయమూర్తి విన్నారు. తదుపరి విచారణను శుక్రవారానికి న్యాయస్థానం వాయిదా వేసింది. నిందితులను 5 రోజుల పాటు కస్టడికి కావాలని కోరుతూ సిట్ పిటిషన్ దాఖలు చేసింది. ప్రస్తుతం నిందితులు చంచల్‌గూడ జైల్లో జుడీషయల్ రిమాండ్‌లో ఉన్నారు.

క్రీడా నైపుణ్యాన్ని పెంచుకోవాలి

- ఎస్‌పిడిసిఎల్ డైరెక్టర్ గురవయ్య
- 48వ ఆల్ ఇండియా ఎలక్ట్రిసిటీ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డ్ అథ్లెటిక్, చెస్ ఛాంపియన్ షిప్, బాల్ బ్యాండ్మిటన్, క్యారమ్ టోర్నమెంట్ ప్రారంభం

తిరుపతి, ఆగస్టు 4 ప్రభాతవార్త ప్రతినిధి: విద్యుత్ ఉద్యోగులు వివిధ క్రీడల్లో నైపుణ్యాన్ని పెంపొందించుకోవాలని ఎస్‌పిడిసిఎల్ డైరెక్టర్ (టెక్నికల్ హెచ్‌ఆర్‌డి) కె.గురవయ్య పేర్కొన్నారు. తిరుపతిలో 6వ తేదీ వరకు మూడు రోజులపాటు జరిగే 48వ ఆల్ ఇండియా ఎలక్ట్రిసిటీ స్పోర్ట్స్ కంట్రోల్ బోర్డ్ అథ్లెటిక్, చెస్ ఛాంపియన్ షిప్, బాల్ బ్యాండ్మిటన్, క్యారమ్ టోర్నమెంట్ ప్రారంభ కార్యక్రమం మంగళవారం ఎస్‌పిడిసిఎల్ కార్పొరేట్ కార్యాలయ ఆవరణలో జరిగింది. ఈ కార్యక్రమానికి ముఖ్య అతిథిగా విచ్చేసిన డైరెక్టర్ కె.గురవయ్య మాట్లాడుతూ ఉద్యోగులు తమ విధులను నిర్వహిస్తూ క్రీడల్లో పాల్గొనేందుకు సమయాన్ని కేటాయించడం అభినందనీయమని కొనియాడారు. క్రీడల్లో గెలుపోటములు సహజమే అయినప్పటికీ స్నేహపూరిత వాతావరణంలో గెలుపే లక్ష్యంగా పోటీల్లో పాల్గొనాలన్నారు. ఉద్యోగులు ఉల్లాసంగా పోటీల్లో పాల్గొంటూ ఆరోగ్యం, క్రమశిక్షణ, ఐకమత్యంతో విధులు నిర్వహిస్తూ వినియోగదారులకు మరింత మెరుగైన సేవలతో సంస్థ అభివృద్ధికి చేయూతనందించాలని కోరారు.

ఈ కార్యక్రమం సందర్భంగా చీఫ్ జనరల్ మేనేజర్లు ఎం.మురళీ కుమార్, సిహెచ్ రామచంద్ర రావు, కె. సంపత్ కుమార్ తదితరులు మాట్లాడుతూ ఉద్యోగులు క్రీడల్లో పాల్గొనే అవకాశాన్ని సద్వినియోగం చేసుకోవాలన్నారు. క్రీడా స్ఫూర్తిని పెంపొందించుకుంటూ విధి నిర్వహణలో ఉద్యోగులు అత్యుత్తమ సేవలందించాలని కోరారు. ఉద్యోగులు క్రీడలతో పోటీతత్వం ద్వారా బలహీనతల్ని అధిగమించేందుకు అవకాశం వుంటుందని తెలిపారు.

క్రీడాకారులు ఉల్లాసంతో క్రీడల్లో పాల్గొంటూ, మనస్సు నిండా ఆనందాన్ని నింపుకోవాలన్నారు. ఈ కార్యక్రమంలో జనరల్ మేనేజర్ శ్రీకాంత్, తిరుపతి సర్కిల్ సూపరింటెండింగ్ ఇంజనీర్, స్పోర్ట్స్ కౌన్సిల్ అధ్యక్షుడు వి.చంద్రశేఖర రావు, ఎగ్జిక్యూటివ్ ఇంజనీర్, స్పోర్ట్స్ కౌన్సిల్ ప్రధాన కార్యదర్శి జి. గంగాధర్ రెడ్డి, స్పోర్ట్స్ ఆఫీసర్ కుమార వడివేలు, స్పోర్ట్స్, గేమ్స్ కార్యదర్శి లీలా రామ్, పురుషోత్తం, జయప్రకాష్, ముని ప్రసాద్, రమేష్ బాబు, ఇతర అధికారులు, సిబ్బంది పాల్గొన్నారు.

గుంటూరు తూర్పు మాజీ ఎమ్మెల్యే ముస్తఫా అరెస్ట్

విజయవాడ, ఆగస్టు 4 ప్రభాతవార్త ప్రతినిధి: వైసిపి నేత, గుంటూరు తూర్పు మాజీ ఎమ్మెల్యే మహ్మద్ ముస్తఫాను పోలీసులు అరెస్ట్ చేశారు. కిడ్నాప్ కేసుకు సంబంధించి గత కొన్ని రోజులుగా పరారీలో ఉన్న ఆయన్ను నూజివీడు పోలీసులు గుజరాత్‌లో అదుపులోకి తీసుకున్నారు. సాంకేతిక నిఘా సాయంతో ముస్తఫా ఆచూకీని గుర్తించి అరెస్ట్ చేసినట్లు పోలీసులు వెల్లడించారు. కేసు నేపథ్యం: ఇటీవల పొగాకు లోడ్‌తో వెళ్తున్న ఒక వాహనాన్ని ముస్తఫా కుమారుడు, అతని అనుచరులు అడ్డగించారు. ఆ వాహనంలో ఉన్న పొగాకు వ్యాపారితో పాటు మరో వ్యక్తిని కిడ్నాప్ చేసి బంధించారు. బాధితుల కుటుంబ సభ్యులు పోలీసులకు ఫిర్యాదు చేయడంతో, వారు రంగంలోకి దిగి కిడ్నాప్‌కు గురైన ఇద్దరినీ సురక్షితంగా విడిపించారు. ఈ ఘటనకు సంబంధించి ఇప్పటికే ఐదుగురిని అరెస్ట్ చేశారు. ఈ కేసు దర్యాప్తులో భాగంగా తొలుత ముస్తఫా కుమారుడిపై కిడ్నాప్ కేసు నమోదు చేశారు. అయితే, విచారణలో ఈ కిడ్నాప్‌తో మాజీ ఎమ్మెల్యే ముస్తఫాకు కూడా సంబంధం ఉన్నట్లు తేలింది. దీంతో ఆయనపై కిడ్నాప్, బెదిరింపుల కింద కేసులు నమోదు చేశారు. అప్పటి నుంచి ముస్తఫా అజ్ఞాతంలోకి వెళ్లగా, చివరకు సాంకేతిక ఆధారాలతో ఆయన గుజరాత్‌లో ఉన్నట్లు గుర్తించిన పోలీసులు అక్కడకు వెళ్లి అరెస్ట్ చేశారు. ముస్తఫా అరెస్ట్‌ను పోలీసులు అధికారికంగా ధ్రువీకరించారు.

పాపులర్ షూమార్ట్ అధినేత విజయ్ సేవలు అసామాన్యం

విజయవాడ, ఆగస్టు 4 ప్రభాతవార్త ప్రతినిధి: విజయవాడకు చెందిన ప్రముఖ వ్యాపార సంస్థ పాపులర్ షూమార్ట్ అధినేత చుక్కపల్లి విజయ్ కుమార్ మృతిపట్ల సిఎం చంద్రబాబు, డి.సిఎం పవన్ కల్యాణ్, మంత్రి లోకేష్ తీవ్ర సంతాపం తెలిపారు. షూమార్ట్ రంగంలో జాతీయ, అంతర్జాతీయ స్థాయిలో ఏపీకి విస్తృత గుర్తింపు తీసుకుని వచ్చిన చుక్కపల్లి పిచ్చయ్య బాటలో విజయ్‌కుమార్ మంచి గుర్తింపు పొందారు. సామాజిక సేవా రంగంలో విజయ్ సేవలు అసామాన్యం అన్నారు. పాపులర్ షూమార్ట్ అధినేత చుక్కపల్లి విజయ్ కుమార్ సోమవారం గుండెపోటుతో కన్నుమూశారు. ప్రజల విశ్వాసాన్ని పొందిన ఈ సంస్థ అధినేత మృతి పట్ల ఎమ్మెల్యే సుజన చౌదరి సంతాపం తెలిపారు.

తిరుపతి జిల్లాలో సెక్షన్ 30 పోలీసు యాక్ట్ అమలు

తిరుపతి, ఆగస్టు 4 ప్రభాతవార్త ప్రతినిధి: ప్రసిద్ధ యాత్రాస్థలం, ప్రముఖ పుణ్యక్షేత్రం తిరుమల–తిరుపతి నగరంతోబాటు జిల్లా వ్యాప్తంగా సెక్షన్ 30 పోలీసు యాక్ట్ అమలులో ఉందని తిరుపతి జిల్లా ఎస్పీ సుబ్బరాయుడు ప్రకటించారు. శాంతిభద్రతల పరిరక్షణలో భాగంగా ఈ సెక్షన్ నెలరోజులపాటు అమలులో ఉంటుందన్నారు. తిరుపతి జిల్లాలో ప్రశాంత వాతావరణం నెలకొల్పేందుకు, శాంతిభద్రతల పరిరక్షణకు సెక్షన్ 30 పోలీసు యాక్టు అమలులో ఉందన్నారు. ముందస్తు అనుమతిలేనిదే ఎవరూ ఎలాంటి సభలు, సమావేశాలు, ఊరేగింపులు నిర్వహించరాదు. ర్యాలీలు, ఊరేగింపులు, సభలు, సమావేశాలకు చట్టప్రకారం పోలీసుశాఖ నుండి అనుమతి తీసుకోవాల్సిందేనన్నారు.

టిటిడి అగరబత్తీలకు నకిలీల గోల!

- ఇ కామర్స్ పేరుతో శ్రీవారి భక్తులకు బురిడీ

తిరుమల, ఆగస్టు 4 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనాలు, లడ్డూ ప్రసాదాల పేరుతో నకిలీ వెబ్‌సైట్లు సృష్టించి భక్తులను మోసం చేయడమే కాదు.. తాజాగా ఎంతో పవిత్రమైన మహిమాన్వితమైన దేవునికి అలంకరించిన పూలతో తయారుచేసే అగరబత్తీలకు నకిలీ సంస్థలు మార్కెట్లో హల్‌చల్ చేస్తున్నాయి. అంతేగాక టిటిడి అగరబత్తీల తరహాలోనే నకిలీలు తయారుచేసి అదే రీతిలో ప్యాకింగ్, బ్రాండింగ్ పేర్లు వినియోగించుకుని ధర అమాంతం రెండింతలు రెట్టింపుచేసే ఇ కామర్స్ సైట్లలో నకిలీ సంస్థలు మోసం చేయడం వెలుగుచూసింది. దీంతో టిటిడి ఇప్పుడు అగరబత్తీలను కూడా కాపాడుకోవాల్సిన పరిస్థితి వచ్చింది. భక్తులకు నాణ్యమైన, స్వచ్ఛమైన టిటిడి తయారుచేస్తున్న ఉత్పత్తులనే అందించేందుకు మరో కోణంలో ఆలోచన చేయాల్సి వస్తోంది. అగరబత్తీలను టిటిడి నిబంధనలకు విరుద్ధంగా ఆన్‌లైన్‌లో ఇ కామర్స్ సంస్థలు విక్రయాలు చేయడం దుమారం రేపుతోంది. ఇప్పటికే తిరుమల, తిరుపతిలో టిటిడి అగరబత్తీలు కోసం భక్తుల నుండి భారీ డిమాండ్ ఉంది. భక్తుల అవసరాలను, అమాయకత్వాన్ని ఆసరాగా చేసుకున్న కొన్ని ఇ కామర్స్ సంస్థలు ఆన్‌లైన్‌లో విచ్చలవిడిగా అమ్మకాలు చేయడం మాత్రం అక్రమార్కులకు పంటపండినట్లేనని భక్తులు ఆందోళన వ్యక్తం చేస్తున్నారు. అచ్చం టిటిడి ఉత్పత్తుల్లాగే నకిలీ బ్రాండ్లు ఉండటంతో భక్తులు ఆసక్తి చూపుతున్నట్లు సమాచారం. తిరుమల శ్రీవారి ఆలయంలో ఏడుకొండల వేంకటేశ్వరస్వామి మూలవిరాట్టుతోబాటు ఉప ఆలయాలు, ఉత్సవమూర్తులకు అలంకరించిన పూలు, పూలమాలలను, టిటిడి అనుబంధ ఆలయాలు తిరుపతి గోవిందరాజస్వామి, తిరుచానూరు పద్మావతి అమ్మవారి ఆలయం, శ్రీనివాస మంగాపురం కల్యాణ వేంకటేశ్వరస్వామి ఆలయం, అప్పలాయగుంట ఆలయం, నారాయణవనం, కోదండరామస్వామి ఆలయాల్లో దేవుళ్ళకు అలంకరించిన పూలమాలలు నిరుపయోగం గాకుండా 2023లో ఏకంగా భక్తివిశ్వాసాలతో పూలతో అగరబత్తీలు తయారు చేయడం మొదలైంది.

తొలుత ఏడురకాల ఉత్పత్తులు తయారుచేసి టిటిడి విక్రయాలు ప్రారంభించింది. భక్తుల నుండి ఈ అగరబత్తీలకు భారీ డిమాండ్ ఏర్పడింది. దీంతో టిటిడి ఉత్పత్తులను పెంచాలని కూడా నిర్ణయించింది. అయితే ఇప్పటికీ టిటిడి అగరబత్తీలకు భక్తుల నుండి స్పందన వుంది. టిటిడి అగరబత్తీల కాంబో ప్యాక్ (ఏడురకాలు బాక్స్)500 రూపాయల వరకు ధర ఉంది. ఇదే నకిలీ బ్రాండ్ల అగరబత్తీలు వెయ్యిరూపాయల వరకు ఇ కామర్స్‌లో ధర ఉందని టిటిడికి ఫిర్యాదు అందింది. టిటిడిపేరుతో నకిలీ ఇ కామర్స్ సంస్థలు ఇలా విక్రయాలు చేయడం భక్తులను కలవరపరుస్తోంది. అయితే నిబంధనలు ఉల్లంఘించి టిటిడి పేరును దుర్వినియోగం చేస్తున్న ఈ నకిలీ సంస్థలపై కఠిన చర్యలు తీసుకోవాలని భక్తులు కోరుతున్నారు.

బిసి రక్షణ చట్టంపై విజయవాడలో నేడు కీలక భేటీ

రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి సవిత

విజయవాడ, ఆగస్టు 4 ప్రభాతవార్త ప్రతినిధి: కూటమి ప్రభుత్వం ఎన్నికల ముందు ఇచ్చిన హామీలో భాగంగా బిసి రక్షణ చట్టం తుది రూపు ఇవ్వడానికి సిద్ధమవుతోంది. ఇందులో భాగంగా విజయవాడలోని ఓ హోటల్‌లో కీలక సమావేశం బుధవారం నిర్వహించనున్నట్లు రాష్ట్ర బిసి సంక్షేమ శాఖ మంత్రి ఎస్.సవిత తెలిపారు. ఈ మేరకు మంగళవారం ఆమె ఒక ప్రకటన విడుదల చేశారు. సిఎం చంద్రబాబు నేతృత్వంలోని కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన నాటి నుంచి బిసిలను అన్ని రంగాల్లో ముందంజలో నిలిపేలా సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను చేపడుతున్నామన్నారు. దీనిలో భాగంగా, బిసి రక్షణ చట్టాన్ని తీసుకురావడానికి చర్యలు ప్రారంభించామన్నారు. బిసిలను కులాలు, వృత్తుల పేరుతో దూషించినా, వారిపై దాడులకు, దౌర్జన్యాలకు దిగినా ఎస్సీ, ఎస్టీ అట్రాసిటీ చట్టం మాదిరిగా రక్షణ చట్టం రూపొందిస్తున్నామని మంత్రి సవిత తెలిపారు. బిసిలపై జరిగే దాదాపు 15 రకాల దాడులు, వేధింపులను ఈ చట్టం కింద నేరాలు గుర్తిస్తామన్నారు. బిసి రక్షణ చట్టంలో భాగంగా కేసుల సత్వర పరిష్కారానికి ప్రత్యేక కోర్టులు కూడా ఏర్పాటు చేయనున్నామన్నారు. గత సాధారణ ఎన్నికల ముందు అధికారంలోకి వచ్చిన తరవాత బిసి రక్షణ చట్టం తీసుకొస్తామని సిఎం చంద్రబాబునాయుడు హామీ ఇచ్చారన్నారు. ఇచ్చిన మాటకు కట్టుబడుతూ, ఇప్పటికే చట్ట రూపకల్పనకు పలు పర్యాయాలు కేబినెట్‌లో ఉన్న ఎనిమిది మంది బిసి మంత్రులు పలు పర్యాయాలు భేటీ అయ్యామన్నారు.

భారత రాజ్యాంగానికి లోబడి పలు చట్టాలను పరిశీలించి, అధికారులు బిసి రక్షణ చట్టానికి తుది రూపు తీసుకొచ్చారన్నారు. ఈ ముసాయిదా చట్టాన్ని తుదిరూపు ఇచ్చే క్రమంలో బిసి సామాజిక వర్గానికి ఎమ్మెల్యేలు, ఎమ్మెల్సీలు, ఎంపిలు, మంత్రులతో కీలక భేటీ విజయవాడలోని మురళీ ఫార్చ్యూన్‌లో బుధవారం నిర్వహించనున్నట్లు తెలిపారు. ఈ సమావేశంలో తనతో పాటు ఏడుగురు బిసి మంత్రులు కింజరాపు అచ్చెన్నాయుడు, కొల్లు రవీంద్ర, అనగాని సత్యప్రసాద్, సత్యకుమార్ యాదవ్, కొలుసు పార్థసారథి, వాసంశెట్టి సుభాష్, కొండపల్లి శ్రీనివాస్ సహా హోం మంత్రి అనిత, న్యాయ శాఖ మంత్రి ఎన్ఎండి ఫరూక్ కూడా హాజరుకానున్నారన్నారు. వారితో పాటు బిసి సామాజిక వర్గానికి చెందిన 30 మంది ఎమ్మెల్యేలు, నలుగురు ఎమ్మెల్సీలు, ఆరుగురు ఎంపీలు ఈ సమావేశం పాల్గొననున్నట్లు తెలిపారు. వారిచ్చే సూచనలు, సలహాలు పరిగణలోకి తీసుకుని బిసి రక్షణ చట్టానికి తుది రూపు ఇచ్చి, సిఎం చంద్రబాబునాయుడుకు అందజేయనున్నామన్నారు. బిసిల అభ్యున్నతికి, గౌరవ ప్రదమైన జీవనానికి కూటమి ప్రభుత్వం చిత్తశుద్ధితో పనిచేస్తోందన్నారు. దేశంలోనే బిసిలకు సంబంధించి ప్రత్యేక రక్షణ చట్టం తెస్తున్న తొలి రాష్ట్రంగా ఆంధ్రప్రదేశ్ నిలవనుందని మంత్రి సవిత తెలిపారు.

తిరుమల సమాచారం

ఏడుకొండలస్వామికి రెండు బ్రహ్మోత్సవాలు

- సెప్టెంబర్ 17నుండి సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలు
- అక్టోబర్ 14నుండి నవరాత్రి బ్రహ్మోత్సవాలు

తిరుమల, ఆగస్టు 4 ప్రభాతవార్త ప్రతినిధి: అఖిలాండకోటి బ్రహ్మాండ నాయకుడిగా.. ఆపదమొక్కులవాడిగా, అర్చామూర్తిగా వైఖానస ఆగమోక్తంగా పూజలందు కుంటున్న తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామికి అత్యంత వైభవంగా జరిగే సాంవత్సరిక ఉత్సవాల్లో ప్రత్యేకంగా తొమ్మిది రోజులు పాటు ఉదయం, రాత్రి వాహనసేవలతో అంగరంగవైభవంగా జరిగే "బ్రహ్మోత్స వాలు" ప్రధానం. కరోనా వైరస్ పూర్తిగా నిర్వీర్యం అయిన తరువాత ఈ ఏడాది అధికమాసం రావడంతో రెండుసార్లు బ్రహ్మోత్సవాలు తిరుమల తిరుపతి దేవస్థానం నిర్వహించనుంది. సాధారణంగా సెప్టెంబర్ మాసంలో జరిగే సాలకట్ల వార్షిక బ్రహ్మోత్సవాలు, అక్టోబర్‌లో జరిగే నవరాత్రి బ్రహ్మోత్సవాలు రెండువారాల తేడాతో జరిపించేలా ముహూర్తం ఖరారుచేస్తారు. భారతదేశంలోనే మరే ఆలయంలోనూ జరగని విధంగా ప్రపంచ ప్రసిద్ధ పుణ్యక్షేత్రం తిరుమలేశుని ఆలయంలో అంగరంగవైభవంగా జరిగే "బ్రహ్మోత్సవాలు"కు దేశవిదేశాల నుండి లక్షలాది మంది భక్తులు నలుమూలల నుంచి తండోపతండాలుగా తరలివస్తారు. ఇష్టదైవమ్ వాహనసేవలను వీక్షించి పునీతులవుతారు. తొమ్మిదిరోజులు రోజుకు రెండు వాహనాలపై ఎంతో ముగ్ధమనోహరంగా, సర్వాలంకారభూషితుడై శ్రీవేంకటేశ్వరుని ఉత్సవమూర్తులు శ్రీదేవిభూదేవిసమేత శ్రీమలయప్ప స్వామి వారు ఒక్కో వాహనంపై ఒక్కో విశిష్టతతో ఊరేగి భక్తులను కటాక్షించడం ప్రత్యేకత. శ్రీవారి భక్తులకు ఈ ఏడాది అధికమాసం కావడంతో రెండుదఫాలు ఉత్సవాలు జరగనున్నాయి. ఈ ఏడాది సెప్టెంబర్ 17 నుంచి 26వరకు, తిరిగి అక్టోబర్ 14నుండి 23 వరకు కన్నుల పండువగా బ్రహ్మాండ నాయకుడి బ్రహ్మోత్సవాలకు తేదీలు ఖరారు చేశారు. ఉదయం పూట వాహనసేవలు 8గంటలకే మొదలవుతాయి. రాత్రి వేళ వాహనసేవలు 7గంటలకు ఆరంభవుతాయి. వార్షిక బ్రహ్మోత్సవాలకు సెప్టెంబర్ 17వ తేదీ ఆదివారం సాయంత్రం అంకురార్పణం, 18న సాయంత్రం ధ్వజారోహణంతో బ్రహ్మోత్సవ ఘట్టానికి శ్రీకారంపడుతుంది. నవరాత్రి బ్రహ్మోత్సవాల్లో ధ్వజారోహణం, ధ్వజావరోహణం ఉండవు. బ్రహ్మోత్సవాల సమయంలో ప్రత్యేక దర్శనాలు వృద్ధులు, దివ్యాంగులు, చంటిపిల్లల తల్లిదండ్రులకు దర్శనాలు రద్దుచేస్తారు. సామాన్యభక్తులకు ఎక్కువగా దర్శనసమయం కల్పించేందుకు ఆ తొమ్మిదిరోజులు బ్రేక్ దర్శనాలు ఉండవు. టిటిడి ఇఒ ఏవి ధర్మారెడ్డి సారథ్యంలో దేవదేవుని బ్రహ్మోత్సవాలు జరగనున్నాయి.

ఆర్జిత సేవలు రద్దు: ఏడుకొండల వేంకటేశ్వరస్వామికి ప్రతిరోజూ వైఖానస ఆగమోక్తంగా ఆలయంలో ఎన్నో రకాల సేవలు, కైంకర్యాలు జరుగుతుంటాయి. ఈ సేవలు ప్రత్యేక పర్వదినాల్లో, ఏడాదిలో తొమ్మిదిరోజులు జరిగే బ్రహ్మోత్సవాల సమయంలో పూర్తిగా రద్దు చేస్తారు. ఈ నేపథ్యంలో ఈ ఏడాది రానున్న సెప్టెంబర్ 15 నుండి 23 వరకు తిరుమలలో శ్రీవారి సాలకట్ల బ్రహ్మోత్సవాలు నిర్వహించనున్నారు. ఈ కారణంగా ఆ తొమ్మిది రోజుల పాటు ఆర్జిత సేవలైన అష్టదళ పాదపద్మారాధన సేవ, తిరుప్పావడ సేవ, కల్యాణోత్సవం, ఊంజల్ సేవ, సహస్ర దీపాలంకరణ సేవలు టిటిడి రద్దు చేసింది. వృద్ధులు, దివ్యాంగులు, చంటిపిల్లల తల్లిదండ్రులు, ఎన్ఆర్ఐ, దాతల దర్శనాలను కూడా రద్దు చేయడం జరిగింది. ఈ విషయాన్ని గమనించి భక్తులు టిటిడికి సహకరించాలని టిటిడి విజ్ఞప్తి చేసింది.

తిరుమలలో రద్దీ పెరిగితే.. ఆఫ్‌లైన్ టోకెన్ల జారీ గందరగోళం!

- వేళాపాళా లేకుండా ముందుగానే టిటిడి విడుదల
- భక్తుల్లో అయోమయం

తిరుమల, ఆగస్టు 4 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుమల శ్రీవేంకటేశ్వరస్వామి దర్శనంలో అమలవుతున్న సమయనిర్దేశిత సర్వదర్శనం (టైమ్ స్లాట్) టోకెన్ల ఆఫ్‌లైన్‌లో జారీ గందరగోళంగా మారింది. ఈ టోకెన్ల తిరుపతిలోని కౌంటర్లలో ఏ సమయంలో జారీ చేస్తారో? ఎన్ని ఇస్తున్నారనేది కూడా తెలియక సామాన్యభక్తులు అయోమయంలో ఉంటున్నారు. తిరుమలలో వారాంతంలోనేగాక సాధారణ రోజుల్లోనూ భక్తుల రద్దీ విపరీతంగా కొనసాగుతోంది. 40వేల మంది భక్తులు రద్దీ పెరిగితే కొండ కిటకిటలాడుతోంది. ఆపై భక్తుల సంఖ్య అనూహ్యంగా రెట్టింపయితే భక్తుల క్యూలైన్లు వైకుంఠమ్ క్యూ కాంప్లెక్స్‌లు దాటి వెలుపలకు వచ్చేస్తున్నాయి. సాధారణంగానే తిరుమలలో భక్తుల రద్దీ ఎక్కువగా ఉంది. దేశం నలుమూలల నుండి ముఖ్యంగా తమిళనాడు, కర్ణాటక, కేరళ, మహారాష్ట్రల నుండేగాక తెలుగురాష్ట్రాల నుండి భక్తులు తరలి వస్తున్నారు. తమ మొక్కుబడుల్లో భాగంగా ఏడుకొండల స్వామిని దర్శించుకోవడానికి చిన్నపిల్లలు, వృద్ధులు, యువకులు ఇలా వచ్చేస్తున్నారు. ఎలాంటి దర్శన టిక్కెట్లు, టోకెన్లు లేకున్నా సాధారణ సర్వదర్శనంలోనూ భక్తులను అనుమతిస్తున్నారు. ఇలా నేరుగా తిరుమలకు వచ్చేస్తున్న భక్తులకు కొండపై వెలుపల క్యూలైన్లు ఎక్కడ నుండి ప్రవేశించాలనేది కూడా భక్తుల్లో గందరగోళంగా మారింది. ఆలయానికి మూడునాలుగు కిలోమీటర్లు దూరం వరకు వ్యాపించిన శిలాతోరణం నుండి గానీ, బాట గంగమ్మ ఆలయం, శ్రీవారి సేవాసదన్‌లు, గోగర్భమ్‌డ్యామ్ ప్రాంతాల నుండి భక్తుల లైన్లు ఉంటాయి. ఇక్కడకు చేరుకోవడమే భక్తులకు దేవుడు కనిపిస్తుంటాడు. అక్కడ నుండి కిలోమీటర్లు దూరం నడకతోనే క్యూలైన్లలో గంటల తరబడి నిలబడి విసిగిపోతున్నారు. సాధారణరోజుల్లో కూడా తిరుమలేశుని 70వేలమంది వరకు భక్తులు దర్శనం చేసుకుంటుండటం విశేషం. అలాంటిది తిరుమలకు వచ్చే భక్తుల సంఖ్య పెరిగితే తిరుపతిలో ఆఫ్‌లైన్‌లో శ్రీనివాసం, విష్ణు నివాసం, అలిపిరి భూదేవి కాంప్లెక్స్‌లోని కౌంటర్లలో టైమ్‌స్లాట్ సర్వదర్శనం టోకెన్ల జారీ గందరగోళమే.

వేళాపాళా లేని టోకెన్ల జారీ: తిరుపతిలో ఆఫ్‌లైన్‌లో రోజువారీగా జారీచేసే సమయనిర్దేశిత సర్వదర్శనం టోకెన్ల (టైమ్‌స్లాట్) ఇవ్వడంలో ఒక నిర్దేశిత సమయం పాటించడంలేదు. సాధారణంగా ప్రతిరోజూ మధ్యాహ్నం 1.30–2గంటల ప్రాంతంలో ఈ కౌంటర్లలో టైమ్‌స్లాట్ దర్శన టోకెన్ల జారీచేయాల్సి ఉంది. ఇందుకు అనుగుణంగా భక్తులు కూడా ఎక్కడెక్కడి నుండో ముందుగానే తిరుపతికి చేరుకుని క్యూలైన్లలో గంటల తరబడి నిరీక్షిస్తుంటారు. అయితే భక్తుల రద్దీ పెరిగిన సమయంలో క్యూలైన్లలో భక్తులను నియంత్రించలేక ఈ టోకెన్ల తెల్లవారుజామున 4గంటలకు లేకుంటే ఉదయం 7–8గంటల ప్రాంతంలో జారీ చేసేస్తుండటంతో ఆ తరువాత తిరుపతికి వచ్చిన భక్తులకు టోకెన్లు లేవనే ప్రచారంతో అసహనానికి గురవుతున్నారు. ఎక్కడెక్కడి నుండో వందల వేల కిలోమీటర్లు ప్రయాణించి తిరుపతికి వస్తున్న భక్తులకు టోకెన్లు జారీ లేదని తెలుసుకుని మండిపడుతున్నారు. ముందుగానే ఎలాంటి ప్రకటన చేయకుండా కొన్నిగంటల ముందే టైమ్‌స్లాట్ టోకెన్లు జారీ చేసేయడం పరిపాటిగా మారింది. సాధారణంగా భక్తుల రద్దీని బట్టి తిరుపతిలో ఆఫ్‌లైన్‌లో సర్వదర్శనం టైమ్‌స్లాట్ టోకెన్లు 10వేలు, దివ్యదర్శనం టోకెన్లు (శ్రీవారిమెట్టు) 3వేల వరకు జారీచేస్తుంటారు. మరీ వారాంతంలో ఈ టోకెన్లు 2వేల వరకు కుదించేస్తున్నారు. దీనివల్ల ప్రతిరోజూ 20వేల మంది వరకు భక్తులు సర్వదర్శనం టోకెన్లు కోసం తిరుపతికి వస్తున్నారనేది టిటిడి అధికారుల అంచనా. గతంలో టైమ్‌స్లాట్ సర్వదర్శనం టోకెన్లు 12వేల నుండి 15వేల వరకు జారీచేసేవారు. కాలినడక మార్గంలో 3వేలనుండి 5వేల టోకెన్లు జారీచేశారు. ఇప్పుడు భక్తుల రద్దీ అనూహ్యంగా పెరగడంతో ఈ టోకెన్లు కూడా కుదించేశారు. భక్తుల రద్దీ కారణంగానే కొన్ని చర్యలు తీసుకోవడం తప్పదని టిటిడి అధికారుల వాదన. ఈ నేపథ్యంలో తిరుపతిలో వేళాపాళా లేని టైమ్‌స్లాట్ టోకెన్ల జారీ సమయంలో ఎలాంటి మార్పు చేయకుండా నిర్దేశిత సమయానికే నిర్దేశిత సర్వదర్శనం టోకెన్లు జారీచేస్తే బావుంటుందని భక్తుల అభిప్రాయం. సాధారణ సర్వదర్శనం కంటే, సమయ నిర్దేశిత సర్వదర్శనం టోకెన్లు కలిగిన భక్తులకు ఐదారుగంటలు ముందుగానే దేవుని దర్శనం చేసుకునే వెసలుబాటు ఉంది. వారాంతం శుక్ర, శని, ఆదివారాల్లో ఈ రద్దీ 40వేల మంది వరకు తిరుపతిలో కనిపిస్తుంది.

కొత్త నిర్ణయాలకు పచ్చజెండా!

- మూడు దశాబ్దాల విధానానికి టిటిడి స్వస్తి

తిరుమల, ఆగస్టు 4 ప్రభాతవార్త ప్రతినిధి: హిందూ ధార్మికసంస్థ తిరుమల తిరుపతి దేవస్థానంలో కొత్త నిర్ణయాలకు పచ్చజెండా ఊపారు. ఇందుకు టిటిడి బోర్డు పెద్దలు కూడా సుముఖత చూపడంతో రానున్న రోజుల్లో సంస్కరణల అమలులో భాగంగా మూడు దశాబ్దాల కాలంగా అమలవు తున్న పాత అకౌంటింగ్ విధానానికి ఆధునిక రూపు కల్పిస్తు న్నారు. ఈ మేరకు ఇటీవలే బోర్డు పెద్దలు నిర్ణయం తీసుకు న్నారు. అకౌంటింగ్ వ్యవస్థను (ఆర్థిక నివేదికలను) మెరుగుపరిచేందుకు భారత చార్టర్డ్ అకౌంటెంట్స్ సంస్థ (ఐసిఎఐ) సమగ్ర అధ్యయనం చేపట్టింది. ప్రస్తుత అవసరాలకు అనుగుణంగా ఒక అకౌంటింగ్ మాన్యువల్‌ను ఐసిఎఐ రూపొందించి అందజేయనుంది. ఇప్పటికే ఈ సంస్థకు చెందిన అకౌంటింగ్ రీసెర్చ్ ఫౌండేషన్ ప్రాథమిక అధ్యయనం ప్రారంభించింది. ప్రస్తుతం టిటిడిలో ఎంటర్‌ప్రైజ్ రిసోర్స్ ప్లానింగ్ (ఇఆర్‌పి) ఆధారిత సమగ్ర అకౌంటింగ్ వ్యవస్థ అమలులో ఉంది. ఈ వ్యవస్థను ఆధునీకరించే లక్ష్యంతో కసరత్తు మొదలుపెట్టారు. టిటిడి ఇటీవల చేసిన ప్రతిపాదనల నిర్ణయం ద్వారా శ్రీవారి ఆలయానికి వచ్చే విరాళాలు, వివిధ విభాగాల ఆదాయంతో పాటుగా చేస్తున్న ఖర్చులు, ఆస్తుల నిర్వహణ, ఆర్థిక లావాదేవీల వివరాలన్నింటినీ పారదర్శకంగా అంతర్జాతీయ ప్రమాణాలకు అనుగుణంగా మరింత క్రమబద్ధంగా కంపెనీల లెక్కలను సులభంగా పోల్చి చూసేలా మోసాలను అరికట్టి, నమ్మకాన్ని పెంచడం. ప్రాథమిక భాగాలు నిర్వహించడమే ఈ సంస్కరణల ప్రధాన లక్ష్యంగా భావిస్తున్నారు. టిటిడి వినియోగిస్తున్న అకౌంటింగ్ మాన్యువల్ దాదాపు 30సంవత్సరాల క్రితం రూపొందించబడింది. కంపెనీస్ యాక్ట్‌లో చోటుచేసుకున్న తాజా మార్పులు, నూతన లెక్కల నిర్వహణ ప్రమాణాలకు అనుగుణంగా టిటిడి ఆర్థిక నియమావళిలో అవసరమైన సవరణలను ఈ కొత్త అధ్యయనం నివేదికలో సూచించనున్నారు. వేగవంతమైన ఆర్థిక నియంత్రణకు మార్గం సుగమం చేయడమే లక్ష్యంగా తుది కసరత్తు కొనసాగుతోంది. ఈ విధానం వీలైనంత త్వరగా అమల్లోకి తేవాలని భావిస్తున్నారు. ముఖ్యంగా తిరుమలలో భక్తులకు వేగంగా దర్శనం చేయించే విధంగా క్యూ లైన్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ విధానం అమలుచేస్తోంది. అదే విధంగా వసతి గదుల కేటాయింపు విషయంలోనూ సాంకేతికతను వినియోగించుకోవాలని సేవలను పెంపొందించే విధంగా కొత్త విధానం అందుబాటులోకి తీసుకొచ్చింది.



17 నుండి టిటిడిలో వస్త్రాల ఇ వేలం

తిరుమల, ఆగస్టు 4 ప్రభాతవార్త ప్రతినిధి: తిరుమల శ్రీవారి ఆలయంతో పాటు టిటిడి అనుబంధ ఆలయాల్లో భక్తులు కానుకగా సమర్పించిన వస్త్రాలను ఈనెల 17నుండి 19వరకు ఇ వేలం ద్వారా వేలంవేయనున్నారు. ఈ వేలంలో 177 లాట్లలో కొత్తవి, ఉపయోగించినవి, పాక్షికంగా దెబ్బతిన్న వస్త్రాలు అందుబాటులో ఉన్నాయి. టర్కీ టవళ్లు, ఆర్డినరీ టవళ్లు, లుంగీలు, శాలువాలు, బెడ్‌షీట్లు, దిండుకవర్లు, న్యాప్‌కిన్లు, హ్యాండ్‌కర్చీఫ్‌లు, పిల్లో కవర్లు, బ్లౌజ్‌పీస్‌లు, దుపట్టాలు, పరదాలు, హుండీ గలీబులు, ఈర్వాడాలు తదితర వస్త్రాలను ఇ వేలంలో విక్రయిస్తారు. వివరాలకు తిరుపతిలోని టిటిడి మార్కెటింగ్ కార్యాలయం (వేలములు) 08772 264429ను సంప్రదించవచ్చు. అలాగే డబ్ల్యుడబ్ల్యుడబ్ల్యు.కొనుగోలు.ఎపి.జిఓవి.ఇన్ వెబ్‌సైట్లలో వివరాలు తెలుసుకోవచ్చు.

తిరుపతి గంగమ్మ ఆలయ పునర్నిర్మాణంపై

ప్రజాభిప్రాయం తీసుకుంటాం

- కడ పి.డి. వికాస్ మర్మత్
- భక్తులు ఆందోళనలు చెందొద్దు

కుప్పం, ఆగస్టు 4 ప్రభాతవార్త: కుప్పం గ్రామ దేవత శ్రీతిరుపతి గంగమ్మ ఆలయ పునర్నిర్మాణ అంశంపై ప్రజలు, భక్తుల అభిప్రాయాలు తప్పక తీసుకుంటామని కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ స్పష్టం చేశారు. మంగళవారం స్థానిక కడ కార్యాలయంలో విలేకరుల సమావేశంలో పి.డి. మాట్లాడారు. ఏడాదిన్నర క్రిందట ఆలయ నిర్మాణంకు సిఎం చంద్రబాబు రూ.8.40 కోట్ల నిధులు మంజూరు చేశారన్నారు. ఆలయ పునర్నిర్మాణంతో భక్తులకు ఎలాంటి ఇబ్బందులు కలగకుండా చూడాలని భావించామన్నారు. ఏటా అమ్మవారి జాతరకు ఆంధ్ర, కర్ణాటక, తమిళనాడు నుంచి 5లక్షల దాకా భక్తులు వస్తుంటారన్నారు. భక్తుల సౌకర్యార్థం ఆలయాన్ని పునర్నిర్మించాలని నిధులు మంజూరయ్యాయని వికాస్ మర్మత్ తెలిపారు. సోమవారం ఆలయంకు స్తపతి, ఇంజనీరింగ్ అధికారులు రావడంతో ఆలయ కమిటీతో చిన్నపాటి సమావేశం జరిపామని, అయితే ఇంతవరకు ఆలయ నిర్మాణంపై ఎలాంటి నిర్ణయం తీసుకోలేదన్నారు. ఈ విషయంగా సోమవారం పుకార్లు చెలరేగాయన్నారు. ఈ వ్యవహారంపై తాను స్పష్టత ఇస్తున్నానన్నారు. ఆలయ నిర్మాణంకు సంబంధించి ప్రజలు, భక్తుల నుంచి ఆగస్టు 31వ తేది వరకు వారి అభిప్రాయాలను కడ కార్యాలయంలో స్వీకరిస్తామని వికాస్ మర్మత్ స్పష్టం చేశారు. అవసరం అనుకుంటే మరింత గడువు సైతం పెంచుతామన్నారు. ఏదిఏమైనా ప్రజాభిప్రాయం తెలుసుకున్నాకే ఆలయ నిర్మాణంపై స్థపతి, దేవదాయ అధికారులతో చర్చించి తదుపరి నిర్ణయం తీసుకుంటామన్నారు. కుప్పంలో సిఎం చంద్రబాబునాయుడు చొరవతో 10వేలకోట్లతో 32వేల పరిశ్రమలు వచ్చాయన్నారు. కడ ద్వారా పరిశ్రమలకు ఎలాంటి సమస్య లేకుండా వెయ్యి ఎకరాల భూమి సేకరించామన్నారు. రెండు నెలల్లోపు కుప్పం పట్టణంలో మూడో రీచ్ పనులు పూర్తి చేస్తామన్నారు. ప్రస్తుతం ఎన్టీఆర్ స్టేడియం, పార్కుల అభివృద్ధి పనులు జరుగుతున్నాయని త్వరలోనే ఆర్టీసీ బస్‌స్టేషన్ పనులు మొదలుపెడతామని కడ ప్రాజెక్ట్ డైరెక్టర్ వికాస్ మర్మత్ వివరించారు.

విశాఖపట్నం
అనకాపల్లి
అల్లూరి సీతారామరాజు
వార్త
బుధవారం 5, ఆగస్టు 2026

ఉపరాష్ట్రపతికి 'అమరావతి విజన్' పుస్తకాన్ని అందజేసిన టీడీపీ ఎంపీలు

తెలుగుదేశం పార్టీ (టీడీపీ) పార్లమెంట్ సభ్యుల బృందం నేడు న్యూఢిల్లీలోని భారత ఉపరాష్ట్రపతి సి.పి. రాధాకృష్ణన్‌ను ఆయన కార్యాలయంలో మర్యాదపూర్వకంగా కలిశారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ రాజధాని అమరావతి విజన్, పురోగతి, మరియు భవిష్యత్తు ప్రాధాన్యతలను వివరిస్తూ రూపొందించిన ప్రత్యేక పుస్తకాన్ని ఉపరాష్ట్రపతికి అందజేశారు. ఈ కార్యక్రమంలో లోక్‌సభ సభ్యులు లావు శ్రీకృష్ణదేవరాయలు, రాజ్యసభ సభ్యులు సానా సతీష్, భాష్యం రామకృష్ణ, మరియు చింతకాయల విజయ్ గారితో పాటు పలువురు ఇతర టీడీపీ ఎంపీలు పాల్గొన్నారు. ఎంపీలతో ఎంతో ఆత్మీయంగా ముచ్చటించిన ఉపరాష్ట్రపతి, అమరావతిపై వారు చేపట్టిన ఈ చొరవను ప్రత్యేకంగా అభినందించారు. - ప్రభాతవార్త, విశాఖపట్నం.

నర్సీపట్నంలో ఘనంగా అభివృద్ధి పనులు

ప్రారంభోత్సవం

- 24వ వార్డులో ఒక కోటి 54 లక్షల రూపాయల నిధులతోటి నిర్మించిన సీసీ రోడ్లు, కాలువలు ప్రారంభించిన చింతకాయల పద్మావతి, రాజేష్
- అభివృద్ధికి చిరునామా అయ్యన్నపాత్రుడు కుటుంబమే: వార్డు ఇన్ఛార్జ్ ధనిమిరెడ్డి మధు

నర్సీపట్నం, ఆగష్టు 4, ప్రభాతవార్త :

నర్సీపట్నం పట్టణంలోని 24వ వార్డు ధనిమిరెడ్డి వీధిలో మంగళవారం కురుస్తున్న వర్షాన్ని సైతం లెక్కచేయకుండా నూతనంగా నిర్మించిన సీసీ రోడ్లు, కాలువలను ఆంధ్రప్రదేశ్ శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సతీమణి చింతకాయల పద్మావతి, టీడీపీ పట్టణ అధ్యక్షులు చింతకాయల రాజేష్ ముఖ్య అతిథులుగా హాజరై ప్రారంభించారు. వానలోనూ వారే స్వయంగా రిబ్బన్ కట్ చేసి శిలాఫలకాన్ని ఘనంగా ఆవిష్కరించారు. ఈ సందర్భంగా పద్మావతి మాట్లాడుతూ... పట్టణ వ్యాప్తంగా రూ.32 కోట్ల అంచనా వ్యయంతో 189 రకాల రహదారులు, కాలువలు, కల్వర్టుల అభివృద్ధి పనులు శరవేగంగా జరుగుతున్నాయని తెలిపారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు, స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు, మరియు కూటమి నాయకులకు ఆమె ప్రత్యేక ధన్యవాదాలు తెలియజేశారు. గత వారం రోజులుగా వివిధ వార్డుల్లో ఈ ప్రారంభోత్సవాలు పండుగ వాతావరణంలో జరుగుతున్నాయని ఆమె పేర్కొన్నారు. అనంతరం 24వ వార్డు ఇన్ఛార్జ్ ధనిమిరెడ్డి మధు మాట్లాడుతూ, తమ వార్డు అభివృద్ధికి అయ్యన్నపాత్రుడు సుమారు కోటీ 54 లక్షల రూపాయలు మంజూరు చేశారని వెల్లడించారు. ఈ నిధులతో వార్డులో డ్రైన్లు, కల్వర్టులు, రోడ్లు బ్రహ్మాండంగా నిర్మించుకున్నామని, ఒకప్పుడు మాస్ ఏరియాలా ఉండే తమ ప్రాంతం ఇప్పుడు ఎంతో సుందరంగా మారిందని హర్షం వ్యక్తం చేశారు. మిగిలిన రెండు, మూడు రోడ్ల పనులకు కూడా నిధులు కేటాయిస్తామని అయ్యన్నపాత్రుడు హామీ ఇచ్చారని, వాటిని కూడా త్వరలోనే పూర్తి చేస్తామని స్పష్టం చేశారు. కేవలం తమ వార్డే కాకుండా, నర్సీపట్నం నియోజకవర్గం మొత్తం సుమారు 500 కోట్ల రూపాయలతో భారీ అభివృద్ధి కార్యక్రమాలు సాగుతున్నాయని ఆయన వివరించారు.

అయ్యన్నపాత్రుడికి నర్సీపట్నం ప్రజలంతా ఒక కుటుంబం లాంటి వారని, 1983 నుంచి రాజకీయాల్లో ఉన్న ఆయన హయాంలోనే ఆసుపత్రులు, కళాశాలలు, రహదారుల నిర్మాణం జరిగిందని మధు కొనియాడారు. గత ఐదేళ్ల వైసీపీ పాలనలో ఏ వార్డులోనూ కనీస అభివృద్ధి జరగలేదని, కాంట్రాక్టర్లు సైతం పనులు చేసేందుకు వెనకడుగు (తరువాయి 8వ పేజీలో)

ఆంధ్రా యూనివర్సిటీ ఆర్ట్స్ బాయ్స్ హాస్టల్‌లో

నాసిరకం ఆహారంపై

విద్యార్థుల ఆందోళన

కుళ్లు వాసన వచ్చిన ఎగ్ కర్రీ

వెంటనే హాస్టల్ సమస్యలు పరిష్కరించాలి: ఎస్ఎఫ్ఐ

విశాఖపట్నం, ఆగస్టు 4, ప్రభాతవార్త :

ఆంధ్రా యూనివర్సిటీ ఆర్ట్స్ బాయ్స్ హాస్టల్ మెస్‌లో మంగళవారం విద్యార్థులకు అందించిన ఎగ్ కర్రీ నుంచి కుళ్లిన వాసన రావడం, కుళ్లిపోయిన టమాటాలు వంటి నాసిరకం కూరగాయలతో వంటలు తయారు చేయడంతో విద్యార్థులు తీవ్ర ఆగ్రహం వ్యక్తం చేశారు. ప్రతి నెల నిర్ణీత సమయంలో మెస్ ఛార్జీలు చెల్లిస్తున్నప్పటికీ నాణ్యమైన భోజనం అందించడం లేదని, విద్యార్థులు మెస్‌లో వడ్డించిన ఆహారాన్ని మధ్యాహ్నం తీసుకుని మెస్ నుండి వీసీ ఆఫీస్ వద్దకు ర్యాలీగా వెళ్లి నిరసన చేపట్టారు. వీసీ కార్యాలయంలో లేకపోవడంతో రిజిస్ట్రార్ ఆఫీస్ వద్ద ఆందోళనకు దిగారు. ఏయూ ఎస్ఎఫ్ఐ ఉపాధ్యక్షుడు తరుణ్ విద్యార్థుల తరఫున యూనివర్సిటీ అధికారులతో మాట్లాడి సమస్యలను వారి దృష్టికి తీసుకెళ్లారు. గత వారం ఇదే సమస్యపై జిల్లా కలెక్టర్‌కు ఫిర్యాదు చేసినప్పటికీ ఎలాంటి చర్యలు తీసుకోకపోవడం పట్ల ఆందోళన వ్యక్తం చేశారు. విద్యార్థుల నిరసన అనంతరం ప్రిన్సిపాల్, వార్డెన్ స్పందించి మెస్‌లో నుండి వండిన ఆహారానికి సంబంధించిన పాత్రను సెక్యూరిటీ సిబ్బంది తీసుకురావడంతో అధికారులు పరిశీలించారు. నాసిరకం ఆహారం తయారు చేసిన వంట సిబ్బందిపై చర్యలు తీసుకుని, బాధ్యులను సస్పెండ్ చేస్తామని హామీ ఇచ్చారు. ఇకపై విద్యార్థులకు నాణ్యమైన, పరిశుభ్రమైన ఆహారం అందేలా మెస్ నిర్వహణలో ప్రత్యేక శ్రద్ధ తీసుకుంటామని తెలిపారు.

ఈ సందర్భంగా ఎస్ఎఫ్ఐ జిల్లా కార్యదర్శి జి. అజయ్ మాట్లాడుతూ హాస్టల్ విద్యార్థులకు నాణ్యమైన ఆహారం అందించడం యూనివర్సిటీ యాజమాన్యం బాధ్యత అన్నారు. హాస్టల్‌లో నెలకొన్న అన్ని సమస్యలను వెంటనే పరిష్కరించాలని, లేని పక్షంలో ఎస్ఎఫ్ఐ ఆధ్వర్యంలో విద్యార్థులతో కలిసి ఆందోళనలు మరింత ఉధృతం చేస్తామని హెచ్చరించారు.

సంక్షేమం హాస్టల్స్‌పై సీఎం ప్రత్యేక శ్రద్ధ

ఎక్సలెంట్ సెంటర్ల ద్వారా విద్యార్థులకు నీట్ ప్రత్యేక శిక్షణ

బోర్డు ఛైర్మన్ బాలకోటయ్య వెల్లడి

విశాఖపట్నం, ఆగస్టు 4, ప్రభాతవార్త :

ముఖ్యమంత్రి చంద్రబాబునాయుడుకు సాంఘిక సంక్షేమం అంటే చాలా ఇష్టమని, సంక్షేమ హాస్టల్స్ పిల్లలు అంటే మహా ఇష్టమని ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సామాజిక సంక్షేమ బోర్డు చైర్మన్ పోతుల బాలకోటయ్య పేర్కొన్నారు. మంగళవారం ఉత్తరాంధ్ర సంక్షేమ యాత్రలో రెండవ రోజు విశాఖపట్నంలోని కృష్ణాపురం డాక్టర్ బి.ఆర్ అంబేద్కర్ గురుకుల పాఠశాలలో అధికారుల తోనూ, పాఠశాల అధ్యాపకులతోనూ సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ సంక్షేమ విద్యార్థుల కోసం నిధులు ఖర్చు పెట్టేందుకు ప్రభుత్వ సిద్ధంగా ఉందన్నారు. ముఖ్యమంత్రి స్వయంగా తాళ్ళపాలెం గురుకుల పాఠశాల నుండి ముస్తాబు కార్యక్రమానికి శ్రీకారం చుట్టారని గుర్తు చేశారు. ఈ ఏడాది ఎక్స్ లెంట్ సెంటర్ల ద్వారా సంక్షేమ హాస్టళ్ళ విద్యార్థులకు నీట్ ప్రత్యేక శిక్షణ ఇస్తున్నట్లు చెప్పారు. విద్యార్థులు ఇలాంటి అవకాశాలను అందిపుచ్చుకునెలా చూడాలని కోరారు. ప్రభుత్వ సంక్షేమం అమలుకు వారధులు మీరేనని, విద్యార్థులకు కంటిచూపు కూడా మీరేనని (తరువాయి 8వ పేజీలో)

మాస్కో సదస్సులో విశాఖ భవిష్యత్ రవాణా ప్రణాళికలపై

ఎంపీ శ్రీభరత్ ప్రసంగం

విశాఖ మెట్రో, ఈ-రాపిడ్ ట్రాన్స్‌పోర్ట్‌కు రష్యా సాంకేతిక సహకారం కోరిన ఎంపీ

విశాఖపట్నం, ఆగస్టు 4, ప్రభాతవార్త :

రష్యా రాజధాని మాస్కోలో జరుగుతున్న 5వ అంతర్జాతీయ రవాణా సదస్సు రెండో రోజు నిర్వహించిన థీమాటిక్ సెషన్-1.1లో విశాఖపట్నం పార్లమెంటు సభ్యులు మతుకుమిల్లి శ్రీభరత్ పాల్గొని, విశాఖపట్నం నగర భవిష్యత్ ప్రజా రవాణా ప్రణాళికలను అంతర్జాతీయ వేదికపై వివరించారు. మెట్రో వ్యవస్థల అభివృద్ధి, ఆధునిక పట్టణ రవాణా సాంకేతికతలు, ప్రపంచ నగరాల్లో అమలవుతున్న ప్రజా రవాణా నమూనాలపై నిర్వహించిన ఈ సమావేశంలో శ్రీభరత్ మాట్లాడుతూ, వేగంగా అభివృద్ధి చెందుతున్న విశాఖపట్నానికి ప్రపంచ స్థాయి, భవిష్యత్ అవసరాలకు అనుగుణమైన ప్రజా రవాణా వ్యవస్థ అత్యవసరమని పేర్కొన్నారు. ఈ సందర్భంగా విశాఖపట్నం మెట్రో రైలు ప్రాజెక్టుతో పాటు, పెందుర్తి-విశాఖపట్నం రైల్వే స్టేషన్ మధ్య ప్రస్తుతం ఉన్న బీఆర్‌టీఎస్ కారిడార్‌లో ప్రతిపాదిస్తున్న ఈ-రాపిడ్ ట్రాన్స్‌పోర్ట్ ప్రాజెక్టు గురించి సవివరంగా వివరించారు.

ఈ రెండు ప్రాజెక్టులు నగరంలో ట్రాఫిక్ రద్దీని తగ్గించడమే కాకుండా, వేగవంతమైన, పర్యావరణహితమైన, సుస్థిర ప్రజా రవాణా వ్యవస్థను అందించడంలో కీలక పాత్ర పోషిస్తాయని తెలిపారు. విశాఖపట్నాన్ని భవిష్యత్ అవసరాలకు అనుగుణంగా అంతర్జాతీయ ప్రమాణాల నగరంగా తీర్చిదిద్దేందుకు ప్రపంచంలోని అత్యుత్తమ రవాణా సాంకేతికతలను అందిపుచ్చుకోవాల్సిన అవసరం ఉందని శ్రీభరత్ పేర్కొన్నారు. ఈ క్రమంలో మాస్కో ట్రాన్స్‌పోర్ట్ ఫెడరేషన్, రష్యా మెట్రో సంస్థలు విశాఖపట్నం మెట్రో, ఈ-రాపిడ్ ట్రాన్స్‌పోర్ట్ ప్రాజెక్టుల రూపకల్పన, అమలు, సాంకేతిక నైపుణ్యాల మార్పిడి, ఆధునిక రవాణా నిర్వహణ వ్యవస్థల అభివృద్ధిలో సహకారం అందించాలని కోరారు. అంతర్జాతీయ రవాణా రంగంలో మాస్కో సాధించిన విజయాలు, సాంకేతిక పరిజ్ఞానం విశాఖ పట్నం వంటి వేగంగా అభివృద్ధి చెందుతున్న నగరాలకు ఎంతో ఉపయోగపడతాయని (తరువాయి 8వ పేజీలో)

అంగన్‌వాడీల సంక్షేమానికి

టీడీపీ ప్రభుత్వం కట్టుబడి ఉంది

చింతకాయల పద్మావతి

తల్లిపాల వారోత్సవాల ర్యాలీలో పాల్గొని తల్లులకు అవగాహన

నర్సీపట్నం, ఆగస్టు 4, ప్రభాతవార్త :

అంగన్వాడీలో తల్లుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని తల్లిపాల వారోత్సవాల ర్యాలీలో చింతకాయల పద్మావతి తెలిపారు. గొలుగొండ అంగన్‌వాడీ ప్రాజెక్టుల పరిధిలోని కేంద్రా లకు చీరలు, ఇండక్షన్ స్టవ్‌లు, కుక్కర్ల పంపిణీ మంగళవారం ఘనంగా జరిగింది. ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సతీమణి చింతకాయల పద్మావతి (తరువాయి 8వ పేజీలో)

కూటమి రెండేళ్ల పాలన అభివృద్ధి, సంక్షేమం

సమానంగా పరిగెడుతుంది

పట్టాభి రామ్

విశాఖపట్నం, ఆగష్టు 4, ప్రభాతవార్త :

తెలుగుదేశం పార్టీ జాతీయ అధ్యక్షులు ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర ముఖ్యమంత్రివర్యులు నారా చంద్రబాబునాయుడు మరియు తెలుగుదేశం పార్టీ వర్కింగ్ ప్రెసిడెంట్ నారా లోకేష్ బాబు ఆదేశాల మేరకు కోటం ప్రభుత్వం రెండేళ్ల పాలనాపై ఇంటింటికి తిరిగే కార్యక్రమం విశాఖ తూర్పు నియోజకవర్గం 17వ వార్డు ఆదర్శనగర్ ప్రాంతంలో విశాఖపట్నం టిడిపి అధ్యక్షుడు చోడే వెంకట పట్టాభిరామ్ పాల్గొన్నారు, ఇంటింటికి తిరిగి కరపత్రాలు పంపిణీ చేసి ప్రభుత్వ పనితీరు అడిగి తెలుసుకున్నారు, ఈ కార్యక్రమంలో టీడీపీ పార్లమెంట్ ప్రధాన కార్యదర్శి లొడగల కృష్ణ , వార్డు టిడిపి అధ్యక్షులు నెక్కంటి సత్తిబాబు, తారక్, రాము, వర , రాములమ్మ, గోపమ్మ, కృష్ణ తదితరులు పాల్గొన్నారు

నేటి రాష్ట్రవ్యాప్త కళాశాలల బంద్‌ను

విజయవంతం చేయాలి

కలెక్టరేట్ ఎదుట ఎబివిపి నగర శాఖ ధర్నా

విశాఖపట్నం, ఆగస్టు 4 ప్రభాత వార్త :

రాష్ట్రములోని విద్యా రంగ సమస్యలను పరిష్కరించాలని కోరుతూ అఖిల భారతీయ విద్యార్థి పరిషత్ (ఎబివిపి) బుధవారం తలపెట్టిన రాష్టవ్యాప్త కళాశాలల బంద్‌ను విజయవంతం చేయాలని ఎబివిపి జాతీయ కార్యవర్గ సభ్యులు జి.కిరణ్ కుమార్ పిలుపు నిచ్చారు. ఎబివిపి రాష్ట్ర కమిటీ పిలుపు మేరకు మంగళవారం జిల్లా శాఖ విశాఖ కలెక్టర్ కార్యాలయం ఎదుట పెద్ద ఎత్తున నగరంలోని వివిధ కళాశాలకు చెందిన విద్యార్థులు ధర్నాను నిర్వహించారు. ఈ సందర్భంగా రాష్టంలో కళాశాల విద్యార్థులు ఎదుర్కొంటున్న పలు ప్రధాన సమస్యలను రాష్ట్ర ప్రభుత్వం వెంటనే పరిష్కారం చేయాలని ధర్నాలో పాల్గొన్న ఎబివిపి (తరువాయి 8వ పేజీలో)

భోగాపురం విమానాశ్రయం ప్రారంభం నేపథ్యంలో

విశాఖ కాంట్రాక్టు ఉద్యోగులకు

ప్రత్యేక జాబ్ మేళా

ఎంపీ శ్రీభరత్ చొరవతో 36 సంస్థల భాగస్వామ్యం

100 మందికి ఉద్యోగాలు, 150 మంది తుది ఇంటర్వ్యూకు ఎంపిక



విశాఖపట్నం, ఆగష్టు 4, ప్రభాతవార్త :

భోగాపురంలోని అల్లూరి సీతారామరాజు అంతర్జాతీయ విమానాశ్రయం ప్రారంభమైన నేపథ్యంలో విశాఖపట్నం విమానాశ్రయంలో విధులు నిర్వ హించిన కాంట్రాక్టు ఉద్యోగుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని, విశాఖపట్నం పార్లమెంటు సభ్యులు మతుకుమిల్లి శ్రీభరత్ ప్రత్యేక చొరవతో మంగళవారం విశాఖపట్నం విమానాశ్రయంలో ప్రత్యేక ఉద్యోగ మేళాను నిర్వహించారు. ఈ ఉద్యోగ మేళాకు మొత్తం 450 మంది అభ్యర్థులు హాజరు కాగా, వారిలో 100 మంది అభ్యర్థులు వివిధ సంస్థల్లో ఉద్యోగాలకు ఎంపికయ్యారు. మరో 150 మంది (తరువాయి 8వ పేజీలో)

రేపు జిల్లాలో గిరిజన సంక్షేమ శాసనసభ కమిటీ పర్యటన

జిల్లా ఇంచార్జి కలెక్టర్ జి.విద్యాధరి

విశాఖపట్నం, ఆగస్టు 4 ప్రభాత వార్త :

ఏపీ శాసన సభ గిరిజన సంక్షేమ కమిటీ గురు వారం విశాఖపట్నం జిల్లాలో పర్యటించనున్నట్లు జిల్లా ఇంచార్జి కలెక్టర్ జి.విద్యాధరి ఒక ప్రకట నలో తెలిపారు. పర్యటనలో భాగంగా శాసన సభ కమిటీ గిరిజన సంక్షేమ వసతి గృహాల తనికీతో పాటు వివిధ శాఖల అధికారులతో సమీక్షా సమావేశాలను నిర్వహించనున్నట్లు ఆమె పేర్కొన్నారు. కమిటీ నేటి ఉదయం 9 గంటలకు గిరిజన సంక్షేమ వసతి గృహల లోని మౌలిక వసతులను పరిశీలన చేస్తుంది. పదకొండు గంటలకు జిల్లా కలెక్టర్ కార్యాలయ ములోని సమావేశ మందిరంలో వివిధ గిరిజన సంక్షేమ సంఘాల ప్రతినిదులు, ప్రజల నుండి వినతులను స్వీకరిస్తుంది. మధ్యాహ్నం పన్నెండు గంటలకు జిల్లాలో సర్వీస్‌లలో గిరిజన ఉద్యో గుల రోస్టర్ అమలుపై పరిశీలన చేస్తుందని ఈసందర్భంగా జిల్లాలోని అన్ని శాఖల అధిపతు లు తమ శాఖల రోస్టర్ రిజిస్టర్‌లతో తప్పని సారిగా హాజరు కావాలని ఇంచార్జి కలెక్టర్ ఆదే శించారు. చివరిగా గురువారం మధ్యాహ్నం రెండు గంటలకు జిల్లా కలెక్టర్ సంబందిత అధికారులుతో కమిటీ సమీక్షా సమావేసాన్ని నిర్వహిస్తుందని పేర్కొన్నారు. ఈ సమావేశంలో (తరువాయి 8వ పేజీలో)

అంగన్‌వాడీల సంక్షేమానికి టీడీపీ ప్రభుత్వం కట్టుబడి ఉంది

(7వ పేజీ తరువాయి)

చేతుల మీదగా వీటిని అందజేశారు. అనంతరం నిర్వహిం చిన తల్లిపాల వారోత్సవాల అవగాహన ర్యాలీలో ఆమె పాల్గొని, పసి పిల్లలకు తల్లిపాలు అందించడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలపై తల్లులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రెండు ప్రాజెక్టుల పరిధిలోని పలు మండలా లకు సామగ్రిని పంపిణీ చేశారు. నర్సీపట్నం ప్రాజెక్టు పరిధిలోని మాకవరపాలెం మండ లంలోని 79 అంగన్‌వాడీ కేంద్రాలకు 158 చీరలు, 79 ఇండక్షన్ స్టవ్‌లు, 79 కుక్కర్లు అందజేశారు. అలాగే నర్సీపట్నం మండలాని కి 180 చీరలు అందించారు. గొలుగొండ ప్రాజెక్టు పరిధిలోని గొలుగొండ, నాతవరం మండలాల్లోని 168 కేంద్రాలకు గానూ మొత్తం 336 చీరలు, 168 ఇండక్షన్ స్టవ్‌లు, 168 కుక్కర్లను పంపిణీ చేశారు.

మాస్కో సదస్సులో ఎంపీ శ్రీభరత్ ప్రసంగం

(7వ పేజీ తరువాయి)

ఆయన పేర్కొ న్నారు. ప్రపంచంలోని ఉత్తమ నగరాల అను భవాలను స్వీకరిస్తూ విశాఖపట్నాన్ని అత్యాధు నిక, స్మార్ట్, సమర్థవంతమైన ప్రజా రవాణా వ్యవస్థ కలిగిన నగరంగా తీర్చిదిద్దడమే తమ లక్ష్యమని శ్రీభరత్ స్పష్టం చేశారు. ఈ సమావేశంలో మహా విశాఖ నగరపాలకసంస్థ కమిషనర్ కేతన్ గార్గ్ , పలు దేశాలకు చెందిన రవాణా నిపుణులు, మెట్రో సంస్థల ప్రతినిధులు, విధాన నిర్ణేతలు పాల్గొన్నారు.

నర్సీపట్నంలో ఘనంగా అభివృద్ధి పనులు ప్రారంభోత్సవం

(7వ పేజీ తరువాయి)

వేశారని విమర్శించారు. గతంలో కృష్ణ దేవి పేట ప్రధాన రహదారిలో ఉన్న కల్వర్టుకు భారీ కన్నం పడి ప్రజలు ఇబ్బందులు పడితే, గత ప్రభుత్వం కనీస శాశ్వత పరిష్కారం చూపకుండా తూతూమంత్రంగా కాంక్రీట్ వేసి వదిలేసిందని మండిపడ్డారు. దీనివల్ల వర్షపు నీరు వెనక్కి వచ్చి ప్రజల ఇళ్లలోకి చేరి తీవ్ర అవస్థలు పడ్డారని గుర్తు చేశారు. అయితే, కూటమి ప్రభుత్వం రాగానే అయ్యన్న పాత్రుడు పెద్ద కుమారుడు విజయ్ చొరవతో వెంటనే 50 లక్షల రూపాయలు మంజూరు చేయించి, అక్కడ శాశ్వత కల్వర్టు నిర్మించి ప్రజల కష్టాలు తీర్చారని మధు ప్రశంసించారు. నర్సీపట్నం అభివృద్ధి చెందిందంటే అది కేవలం అయ్యన్నపాత్రుడు కుటుంబం వల్లేనని ఆయన ఉద్ఘాటించారు. భారీ వర్షం పడుతున్నప్పటికీ వార్డు ప్రజలు, మహిళలు, కూటమి శ్రేణులు, వివిధ వార్డుల ఇన్చార్జులు ఏమాత్రం వెనక్కి తగ్గకుండా ఉత్సాహంగా వర్షంలోనే తడుస్తూ ఈ ప్రారంభోత్సవ కార్యక్రమంలో పాల్గొని విజయవంతం చేశారు.

సంక్షేమం హాస్టల్స్‌పై సీఎం ప్రత్యేక శ్రద్ధ

(7వ పేజీ తరువాయి)

అధికారులను ఉద్దేశించి హిత బోధ చేశారు. సంక్షేమ వసతి గృహాల్లో ఎలాంటి అవాంచనీయ సంఘటనలు జరిగినా, విద్యార్థులకు అసౌకర్యం కలిగినా ఉపేక్షించేది లేదని హెచ్చరించారు. ముందుగా ప్రాంగణంలో ఉన్న అంబేద్కర్ విగ్రహంకు పూలమాలలు వేసి నివాళులర్పించారు. విద్యార్థులతో కలిసి భోజనం చేశారు. ఐఐటి ఇంటర్ విద్యార్థులతో మాటా మంతీ ప్రోగ్రాం నిర్వహించి పలు సలహాలు, సూచనలు చేశారు. కార్యక్రమంలో సాంఘిక సంక్షేమ శాఖ డిప్యూటీ డైరెక్టర్ కె. రామారావు, ప్రిన్సిపాల్ సత్యవతి, ఎస్సీ కార్పొరేషన్ ఎగ్జిక్యూటివ్ డైరెక్టర్ సత్య పద్మ, మాదిగ కార్పోరేషన్ డైరెక్టర్ సుజాత, మేగాద్రి గడ్డ ప్రిన్సిపాల్ రత్న వల్లి తదితరులు పాల్గొన్నారు.

రేపు జిల్లాలో గిరిజన సంక్షేమ శాసనసభ కమిటీ పర్యటన

(7వ పేజీ తరువాయి)

గత రెండేళ్ళలో గిరిజన సంక్షేమ పథకాల అమలు, ఎస్టీ సబ్ ప్లాన్ నిధుల వినియోగం, అట్రాసిటీ కేసుల పురోగతి ఇతర సంక్షేమ చర్యలపైచర్చించనున్నారు. సంబంధిత అధికా రులు అందరూ పూర్తి సమమాచారంతో సకా లంలో హాజరు కావాలని. అలాగే గిరిజన సంక్షేమ సంఘాల ప్రతినిధులు కూడా ఈ అవకాశం ను వినియోగించు కోవాలని ఇంచార్జి కలెక్టర్ విద్యాధరి కోరారు.

బంద్ పేరుతో ప్రజలకు ఇబ్బందులు కలిగిస్తే కఠిన చర్యలు

టెట్ పరీక్షలు, విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో పెట్టుకోవాలి : డీఎస్పీ రాజసింహారెడ్డి

పాడేరు, ఆగస్టు 4, ప్రభాతవార్త: అల్లూరి జిల్లా స్థానిక డీఎస్పీ కార్యాలయంలో నూతన డీఎస్పీ రాజసింహారెడ్డి మీడియా సమావేశం ఏర్పాటు చేశారు.. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ, ఈ నెల 8న కొంతమంది (కొన్ని సంఘాలు) మన్యం బంద్‌కు పిలుపునిచ్చినట్లు తమ దృష్టికి వచ్చిందని, అయితే ఆ బంద్‌కు పోలీసు శాఖ నుంచి ఎలాంటి అనుమతి లేదని స్పష్టం చేశారు. ఈ నెల 5వ తేదీ నుంచి 21వ తేదీ వరకు టెట్ పరీక్షలు నిర్వహించబడుతున్న నేపథ్యంలో జిల్లాలోని అనేక మంది అభ్యర్థులు పరీక్షా కేంద్రాలకు రాకపోకలు సాగిస్తారని తెలిపారు. అలాగే పాఠశాలలు కూడా కొనసాగుతున్నందున విద్యార్థులు, ప్రజలు ఎలాంటి ఇబ్బందులు ఎదుర్కోకుండా చూడాల్సిన బాధ్యత అందరిదని అన్నారు. బంద్ పేరుతో రహదారులు దిగ్బంధించడం, పరీక్షలకు హాజరయ్యే అభ్యర్థులను అడ్డుకోవడం, విద్యార్థులు, ప్రజల రాకపోకలకు అంతరాయం కలిగించడం లేదా శాంతిభద్రతలకు భంగం కలిగించే చర్యలకు పాల్పడితే సంబంధిత వ్యక్తులపై చట్టప్రకారం కఠిన చర్యలు తీసుకుంటామని డీఎస్పీ హెచ్చరించారు.ప్రస్తుతం ఉద్యమకారులు ప్రస్తావిస్తున్న సమస్యపై గత నెల గిరిజన సంక్షేమ శాఖ మంత్రి స్వయంగా చర్చించి హైపవర్ కమిటీని ఏర్పాటు చేశారని, ఆ కమిటీ ప్రభుత్వంతో చర్చలు జరిపి సమస్యకు పరిష్కారం చేసే ప్రక్రియ కొనసాగుతోందని అప్పటి వరకు ప్రజలకు ఇబ్బందులు కలిగించే కార్యక్రమాలకు దూరంగా ఉండాలని విజ్ఞప్తి చేశారు.శాంతియుత వాతావరణాన్ని కాపాడేందుకు ప్రతి ఒక్కరూ పోలీసు శాఖకు సహకరించాలని, ప్రజా శాంతి భద్రతలకు విఘాతం కలిగించే చర్యలను సహించబోమని డీఎస్పీ రాజసింహారెడ్డి స్పష్టం చేశారు.

పీజీఆర్ఎస్ వినతిపై స్పందించిన జీవీఎంసీ జోన్-2 అధికారులు

రైతు బజార్ పరిశీలన.. ఆదిత్యనగర్‌లో వీధి దీపాల సమస్యకు పరిష్కారం



పి.ఎం.పాలెం, ఆగస్టు 4 (ప్రభాతవార్త): పీజీఆర్ఎస్ కార్యక్రమంలో వివిధ ప్రజా సమస్యల పరిష్కారం కోరుతూ జీవీఎంసీ జోన్-2 (మధురవాడ జోన్) పౌర సంక్షేమ సంఘం సమర్పించిన వినతిపత్రానికి అధికారులు సానుకూలంగా స్పందించారు. ఈ నేపథ్యంలో జీవీఎంసీ జోన్-2 అధికారులు మంగళవారం ఉదయం సంబంధిత ప్రాంతాలను సందర్శించి, ముఖ్యంగా రైతు బజార్‌ను పరిశీలించారు. అక్కడ ఉన్న సమస్యలను ప్రత్యక్షంగా పరిశీలించి, వాటి పరిష్కారం కోసం సంబంధిత అధికారులకు పలు సూచనలు చేశారు. సమస్యల పరిష్కారానికి అత్యంత ప్రాధాన్యమిస్తూ త్వరితగతిన చర్యలు చేపడతామని హామీ ఇచ్చారు. అదేవిధంగా ఆదిత్యనగర్‌లో వీధి దీపాల సమస్యను పరిష్కరిస్తూ విద్యుత్ దీపాలను వెలిగేలా చర్యలు తీసుకోవడం పట్ల స్థానికులు హర్షం వ్యక్తం చేశారు. ఏ రాజకీయ పార్టీకి అతీతంగా కేవలం ప్రజా సమస్యల పరిష్కారమే లక్ష్యంగా పనిచేస్తున్న పౌర సంక్షేమ సంఘం సమర్పించిన వినతిపత్రాలను పరిగణనలోకి తీసుకుని వెంటనే స్పందించి చర్యలు ప్రారంభించిన జీవీఎంసీ జోన్-2 అధికారుల చొరవను సంఘం గౌరవాధ్యక్షులు యల్.ఎస్. నాయుడు, అధ్యక్షులు నాగోతి సూర్యప్రకాశ్ అభినందించారు. ప్రజా సమస్యల పరిష్కారంలో అధికారులు ఇదే విధంగా స్పందించి, మిగిలిన సమస్యలను కూడా త్వరితగతిన పరిష్కరించాలని వారు కోరారు.

విశాఖ కాంట్రాక్టు ఉద్యోగులకు ప్రత్యేక జాబ్ మేళా

(7వ పేజీ తరువాయి)

అభ్యర్థులు తుది (ఫైనల్) ఇంటర్వ్యూకు ఎంపి కయ్యారు. ఈ ఉద్యోగ మేళాలో హోటల్స్ అండ్ హాస్పిటాలిటీ, హౌస్‌కీపింగ్, ఫెసిలిటీ మేనేజ్‌మెంట్, రిటైల్, ఎలక్ట్రికల్, ఐటీ, సివిల్, కస్టమర్ సర్వీస్, అడ్మినిస్ట్రేషన్, డ్రైవర్లు, టెక్నీషియన్లు, చెఫ్‌లు, గెస్ట్ రిలేషన్స్, సూపర్‌వైజర్లు, మేనేజర్లు తదితర విభాగాలకు సంబంధించిన ఉద్యోగాల కోసం ఇంటర్వ్యూలు నిర్వహించారు. మొత్తం 36 ప్రముఖ సంస్థలు పాల్గొని అభ్యర్థులను ఇంటర్వ్యూ చేశాయి. ఉద్యోగ మేళాను ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా-విశాఖపట్నం విమానాశ్రయ డైరెక్టర్ ఎన్.పురుషోత్తం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్, దస్పల్లా హోటల్స్ ప్రైవేట్ లిమిటెడ్, జాయింట్ మేనేజింగ్ డైరెక్టర్, విమానాశ్రయ సలహా కమిటీ సభ్యులు జి.వెంకట్ కృష్ణ మాట్లాడుతూ, ఈ ఉద్యోగ మేళాను పూర్తిగా పారదర్శకంగా నిర్వహించామని తెలిపారు. విశాఖపట్నం ఎంపీ మతుకుమిల్లి శ్రీభరత్ ఈ కార్యక్రమాన్ని అత్యంత బాధ్యతాయుతంగా తీసుకుని, ఏ ఒక్క అభ్యర్థికీ అన్యాయం జరగకుండా ప్రతి అంశాన్ని స్వయంగా పర్యవేక్షించారని పేర్కొన్నారు. గత జూలై 9న నిర్వహించిన విశాఖపట్నం విమానాశ్రయ చివరి విమానాశ్రయ సలహా కమిటీ సమావేశంలో కాంట్రాక్టు ఉద్యోగుల సమస్యలను ఎంపీ శ్రీభరత్ స్వయంగా తెలుసుకుని, వారికి ప్రత్యామ్నాయ ఉపాధి అవకాశాలు కల్పించాలనే లక్ష్యంతో విశాఖలోని పరిశ్రమలు, వ్యాపార సంస్థలు, హోటల్ రంగ ప్రతినిధులను సమన్వయం చేసి ఈ ప్రత్యేక ఉద్యోగ మేళా నిర్వహించేందుకు కృషి చేశారని తెలిపారు.

ఈ కార్యక్రమంలో ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా జాయింట్ జనరల్ మేనేజర్ (ఆపరేషన్స్) రాజేంద్ర ప్రసాద్ లంక కూడా పాల్గొన్నారు. ఈ ప్రత్యేక ఉద్యోగ మేళాను ఆంధ్రప్రదేశ్ ఛాంబర్స్ ఆఫ్ కామర్స్ అండ్ ఇండస్ట్రీ ఫెడరేషన్ -- విశాఖపట్నం జోన్ మరియు హోటల్స్ అండ్ రెస్టారెంట్ అసోసియేషన్ ఆఫ్ ఆంధ్రప్రదేశ్ సంయుక్త ఆధ్వర్యంలో నిర్వహించారు.

కార్యక్రమాన్ని ప్రధానంగా సమన్వయం చేసిన వారిలో జి.వెంకట్ కృష్ణ తో పాటు ఏపీ ఛాంబర్స్ విశాఖ జోన్ ఉపాధ్యక్షులు ఎం.వి. పవన్ కార్తీక్, ఏపీ ఛాంబర్స్ బోర్డ్ ఆఫ్ డైరెక్టర్ శ్రీమతి గీతా శ్రీకాంత్, ఏపీ ఛాంబర్స్ స్కిల్ డెవలప్‌మెంట్ సబ్ కమిటీ చైర్‌పర్సన్ శ్రీమతి సత్యశ్రీ కీలక పాత్ర పోషించారు. ఉద్యోగ మేళాకు హాజరైన అభ్యర్థులు ఒకే వేదికపై అనేక సంస్థల్లో ఇంటర్వ్యూలకు హాజరయ్యే అవకాశం కల్పించినందుకు ఆనందం వ్యక్తం చేశారు. అలాగే ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ ఆఫ్ ఇండియా -- విశాఖపట్నం విమానాశ్రయం కల్పించిన ఏర్పాట్లను హెచ్ఆర్ ప్రతినిధులు, అభ్యర్థులు అభినందించారు.

ఈ సందర్భంగా నిర్వాహకులు మాట్లాడుతూ, ఈసారి ఉద్యోగం పొందని అభ్యర్థుల వివరాలను కూడా ఎయిర్‌పోర్ట్స్ అథారిటీ సహకారంతో భద్రపరచి, విశాఖపట్నంలోని వివిధ పరిశ్రమలు, సంస్థలకు పంపించి భవిష్యత్ ఖాళీలలో వారికి ఉద్యోగ అవకాశాలు కల్పించేలా చర్యలు తీసుకుంటామని తెలిపారు. అవసరమైతే త్వరలోనే మరో ప్రత్యేక ఉద్యోగ మేళాను కూడా నిర్వహిస్తామని వెల్లడించారు.

ఆయా సంస్థల అవసరాలకు అనుగుణంగా అభ్యర్థుల విద్యార్హతలు, సంబంధిత అనుభవం, సాంకేతిక నైపుణ్యం, కమ్యూనికేషన్ నైపుణ్యం, ఇంటర్వ్యూలో ప్రతిభ, ఉద్యోగానికి తగిన సామర్థ్యం ఆధారంగా ఎంపిక ప్రక్రియను నిర్వహించినట్లు నిర్వాహకులు తెలిపారు...

నేటి రాష్ట్ర వ్యాప్త కళాశాలల బంద్‌ను విజయవంతం చేయాలి

(7వ పేజీ తరువాయి)

కార్యకర్తలు పెద్దఎత్తున నినాదా లు చేశారు. ధర్నాను ఉద్దేశించి జాతీయ కార్యవర్గ సభ్యులు కిరణ్ కుమార్ మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తి కావస్తున్నా కళాశాల విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను పరిష్కారించడంలో ఉదాసీన వైఖరిని అవలంభిస్తుందని ధ్వజమెత్తారు. రాష్ట్రములో పెండింగులో ఉన్న రూ.6800 కోట్ల ఫీజు రీఎంబర్స్‌మెంట్ బకాయిలని వెంటనే విడుదల చేయాలని, జీవో నెంబర్ 77 ను రద్దు చేసి పీజీ చదివే విద్యార్థులకు ఫీజు రీఎంబర్స్‌మెంట్ చెల్లించాలని, డిగ్రీతో సహా అన్ని కోర్సుల్లో ప్రవేశాలను తక్షణమే పూర్తి చేయాలని అన్ని యూనివర్సిటీలకు ఉమ్మడి అకాడమిక్ క్యాలెండర్‌ను ప్రకటించాలని, సాంఘిక వసతి గృహాలకు పక్కా భవనాలు నిర్మించాలని విద్యార్థుల కు నాణ్యమైన ఆహారంను అందించాలని ప్రభుత్వ పరీక్షల సవరణ బిల్లు 2026ను పటిష్టంగా అమలు చేయాలని డిమాండ్ చేశారు. జిల్లా కో ప్రభుత్వఇంజనీరింగ్ కళాశాల ఏర్పాటు చేయాలని కళాశాలల్లో ఖాళీగా ఉన్న అధ్యాపకుల పోస్టలను వెంటనే భర్తీ చేయాలని కార్పొరేట్, ప్రైవేట్ విద్యా వ్యాపారంను నియంత్రణ చేసి పేద విద్యార్థులకు నాణ్యమైన విద్యను అందుబాటులోకి తేవాలని ప్లా కార్డులను ప్రదర్శించి నినాదాలు చేస్తూ ధర్నాలో పెద్ద సంఖ్యలో కళాశాల విద్యార్థులు పాల్గొన్నారు.

ముఖ్యమంత్రి పర్యటనకు పకడ్బందీ ఏర్పాట్లు

'సంజీవని' ప్రారంభం, ఆదివాసీ దినోత్సవం, స్వాతంత్ర్య వేడుకలపై కలెక్టర్ సమీక్ష

పాడేరు, ఆగస్టు 4, ప్రభాతవార్త: జిల్లాలో త్వరలో ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు చేతుల మీదుగా ప్రారంభం కానున్న 'సంజీవని' పైలట్ ప్రాజెక్టు, ప్రపంచ ఆదివాసీ దినోత్సవం, 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణకు సంబంధించిన ఏర్పాట్లపై జిల్లా కలెక్టర్ టి. నిశాంతి మంగళవారం కలెక్టరేట్ సమావేశ మందిరంలో ఉన్నతస్థాయి సమీక్షా సమావేశం నిర్వహించారు. సమావేశంలో జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీపూజ, ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి ఆదిత్య వర్మ, అదనపు ఎస్పీ శృతి, జిల్లా రెవెన్యూ అధికారి ఎం.వి.ఎస్. లోకేశ్వరరావు, ఆర్డీవో భుజంగరావు, వివిధ శాఖల జిల్లా అధికారులు పాల్గొన్నారు.

'సంజీవని' ప్రాజెక్టు ఏర్పాట్లపై సమీక్ష

ఈ నెల 22న ముఖ్యమంత్రి చేతుల మీదుగా రాష్ట్రంలోనే పైలట్ ప్రాజెక్టుగా జిల్లాలో ప్రారంభం కానున్న 'సంజీవని' కార్యక్రమానికి సంబంధించిన ఏర్పాట్లను కలెక్టర్ సమగ్రంగా సమీక్షించారు. ఆరోగ్య సేవలు, ప్రజల నమోదు, డిజిటల్ రిజిస్ట్రేషన్, వైద్య శిబిరాలు, తాగునీటి సదుపాయం, షామియానాలు, అంబులెన్స్‌లు తదితర ఏర్పాట్లను ముందుగానే పూర్తి చేయాలని అధికారులను ఆదేశించారు. ముఖ్యమంత్రి పర్యటన సందర్భంగా భద్రత, ప్రోటోకాల్, హెలిప్యాడ్, కాన్వాయ్ మార్గం, సభా ప్రాంగణం, మీడియా గ్యాలరీలు, ప్రజా సౌకర్యాల ఏర్పాట్లను అన్ని శాఖలు సమన్వయంతో పూర్తి చేయాలని సూచించారు.

ఆదివాసీ దినోత్సవ వేడుకలు ఘనంగా నిర్వహించాలి

ప్రపంచ ఆదివాసీ దినోత్సవం ఏర్పాట్లపై ఐటిడిఏ ప్రాజెక్టు అధికారి ఆదిత్య వర్మ సమీక్ష నిర్వహించారు. గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలు, కళలు, వారసత్వం, ప్రభుత్వ సంక్షేమ కార్యక్రమాలు ప్రతిబింబించేలా వేడుకలను ఘనంగా నిర్వహించేందుకు అవసరమైన చర్యలు చేపట్టాలని సంబంధిత అధికారులకు సూచించారు.

స్వాతంత్ర్య దినోత్సవానికి పకడ్బందీ ఏర్పాట్లు

80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణపై జిల్లా జాయింట్ కలెక్టర్ తిరుమాని శ్రీపూజ సమీక్ష నిర్వహించారు. పరేడ్, సాంస్కృతిక కార్యక్రమాలు, అవార్డుల ప్రదానం, ఆహ్వానితుల ఏర్పాట్లు, పరిశుభ్రత, విద్యుత్, తాగునీటి సదుపాయాలు తదితర అంశాలపై సంబంధిత శాఖలకు తగిన ఆదేశాలు జారీ చేశారు.

సమన్వయంతో పనులు పూర్తి చేయాలి

ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ టి. నిశాంతి మాట్లాడుతూ, ముఖ్యమంత్రి పర్యటనతో పాటు అన్ని కార్యక్రమాలను ఎలాంటి లోటుపాట్లు లేకుండా అత్యంత ప్రతిష్టాత్మకంగా నిర్వహించాలని అధికారులను ఆదేశించారు. అన్ని శాఖలు పరస్పర సమన్వయంతో నిర్ణీత గడువులోగా ఏర్పాట్లను పూర్తి చేయాలని, విధుల్లో నిర్లక్ష్యం ప్రదర్శించిన అధికారులపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు.

సుజని పార్కులో ఘనంగా స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల సన్నాహక సమావేశం

పి.ఎం.పాలెం, ఆగస్టు 4 (ప్రభాతవార్త): సీతమ్మధార 14వ వార్డులోని సుజని పార్కులో 80వ స్వాతంత్ర్య దినోత్సవ వేడుకలను ఘనంగా నిర్వహించాలని ఏఎస్ఆర్ నగర్ పార్క్ వెల్ఫేర్ అసోసియేషన్ నిర్ణయించింది. ఈ మేరకు మంగళవారం నిర్వహించిన సన్నాహక సమావేశంలో వేడుకలను ప్రతిష్ఠాత్మకంగా నిర్వహించాలని ఏకగ్రీవంగా తీర్మానించారు. అసోసియేషన్ కోఆర్డినేటర్ పి.నిర్మలరాజు సమన్వయంతో జరిగిన సమావేశంలో అధ్యక్షుడు కె.ఎస్.ఆర్. ఆంజనేయులు, కోశాధికారి కె.వరప్రసాదరావు, సలహాదారులు, కార్యవర్గ సభ్యులు పాల్గొని ఏర్పాట్లపై చర్చించారు. స్వాతంత్ర్య దినోత్సవ వేడుకల నిర్వహణ బాధ్యతలను కార్యదర్శి పి. ప్రభాకరరావు, జాయింట్ సెక్రటరీ ఎస్. శ్రీనివాస్, ఆర్గనైజింగ్ సెక్రటరీ డాక్టర్ పి. వెంకటరావులకు అప్పగించారు.

జాతీయ పతాక ఆవిష్కరణతో పాటు దేశభక్తిని పెంపొందించే కార్యక్రమాలు నిర్వహించనున్నట్లు తెలిపారు. కార్యక్రమంలో సభ్యులు, వారి కుటుంబాలు, పరిసర ప్రాంతాల ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొనాలని నిర్వాహకులు కోరారు. వేడుకల అనంతరం పాల్గొనే వారికి అల్పాహార విందు ఏర్పాటు చేయనున్నట్లు వెల్లడించారు.

తొలి ఆరు నెలలు తల్లిపాలే శిశువుకు ఉత్తమ ఆహారం

- ఆశా డే సందర్భంగా తల్లిపాలు వారోత్సవాల్లో డీఎంహెచ్‌వో డాక్టర్ జగదీశ్వర్‌రావు

విశాఖపట్నం, ఆగస్టు 4 (ప్రభాతవార్త): ఆశా డే సందర్భంగా జిల్లాలోని ప్రాథమిక ఆరోగ్య కేంద్రాలు, పట్టణ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో తల్లిపాలు వారోత్సవాలు నిర్వహించారు. ఆనందపురం పీహెచ్‌సీలో జరిగిన కార్యక్రమంలో జిల్లా వైద్య ఆరోగ్యశాఖ అధికారి డాక్టర్ పి. జగదీశ్వర్‌రావు మాట్లాడుతూ, పుట్టిన వెంటనే ముర్రెపాలు ఇవ్వడం ద్వారా శిశువుకు రోగనిరోధక శక్తి పెరుగుతుందని తెలిపారు.

పుట్టినప్పటి నుంచి తొలి ఆరు నెలలు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, అనంతరం అనుబంధ ఆహారంతో పాటు రెండేళ్లు లేదా అంతకంటే ఎక్కువకాలం తల్లిపాలను కొనసాగించాలని సూచించారు. గర్భిణులకు గర్భధారణ ప్రారంభ దశ నుంచే తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించాలని వైద్య సిబ్బందిని ఆదేశించారు.

వర్షాకాలాన్ని దృష్టిలో ఉంచుకుని దోమల నివారణ చర్యలు, ఇంటింటి జ్వర సర్వేలను ముమ్మరం చేయాలని సూచించారు. అనంతరం పీహెచ్‌సీ ప్రయోగశాలను సందర్శించి సర్వైలెన్స్, జాతీయ దోమల ద్వారా వ్యాపించే వ్యాధుల నియంత్రణ కార్యక్రమం అమలుపై సమీక్ష నిర్వహించారు. కార్యక్రమంలో జిల్లా వైద్యాధికారులు, ప్రోగ్రామ్ అధికారులు, వైద్యులు, ఆశా కార్యకర్తలు పాల్గొన్నారు.

వేంపాడులో పరమ పదోత్సవం మహోత్సవం

నక్కపల్లి, ఆగస్టు 4, ప్రభాతవార్త : వేంపాడు గ్రామానికి చెందిన గునుపూడి మాజీ సర్పంచ్ అయినంపూడి చిన్న పేర్రాజు (బాబు) దేహాన్ని మోక్షానికి చేర్చే కార్యక్రమంలో భాగంగా వేంపాడు గ్రామంలో పరమ పదోత్సవం మహోత్సవ కార్యక్రమాన్ని పూజా కార్యక్రమంలో అనంతరం స్వామీజీ చిన్న జీయర్ స్వామి ఆదేశాల మేరకు మంగళవారం నిర్వహించారు. జీయర్ స్వామి శిష్యులు తోపాటు సింహాచలం దేవస్థానం నుంచి వచ్చిన పలువురు ఆధ్వర్యంలో కుటుంబ సభ్యులతో పాటు పలువురు ఈ యాత్రలో పాల్గొన్నారు. చిన్న పేర్రాజు దేహాన్ని మోక్షానికి చేర్చేందుకే ఈ ప్రక్రియ కార్యక్రమం చేపట్టడం జరిగిందని తెలిపారు.

నక్కపల్లిలో వైసిపి రౌండ్ టేబుల్ సమావేశం

నక్కపల్లి, ఆగస్టు 4, ప్రభాతవార్త : డీఎస్సీ నియామకాల్లో అక్రమాలు జరిగాయని, వాటిపై సమగ్రమైన విచారణ జరిపించాలని కోరుతూ వైఎస్ఆర్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర కమిటీ ఇచ్చిన పిలుపుమేరకు పాయకరావుపేట నియోజకవర్గ ఇన్చార్జి మాజీ ఎమ్మెల్యే కంబాల జోగులు నాయకత్వంలో స్థానిక సుబ్బారామరెడ్డి కల్యాణ మండపంలో రౌండ్ టేబుల్ సమావేశాన్ని మంగళవారం మధ్యాహ్నం నిర్వహించారు. ఈ సందర్భంగా పలువురు వక్తలు పూర్తిస్థాయిలో జరిగిన నియామకాలపై విచారణ జరిపించాలని విద్యామంత్రి రాజీనామా చేయాలని డిమాండ్ చేశారు. భవిష్యత్తులో జరిగే ఆందోళన కార్యక్రమాలపై పార్టీ రాష్ట్ర నాయకత్వం ఇచ్చిన పిలుపును అందుకొని జయప్రదం చేసేందుకు ప్రతి ఒక్క కార్యకర్త కష్టపడి పనిచేయాలని ఎమ్మెల్సీ డివి సూర్యనారాయణ రాజు, రామకృష్ణ లు పిలుపునిచ్చారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ డివి సూర్యనారాయణ రాజు, రాష్ట్ర పార్టీ కార్యదర్శి వీసం రామకృష్ణ , దత్తుడు సీత బాబు రాజు, చిక్కాల రామారావు, గొర్ల గోవిందు, దగ్గుపల్లి సాయి, మధు వర్మ, ఫైల రమేష్, సీరం నరసింహమూర్తి ,లోడగల చంద్రరావు తోపాటు పలువురు పార్టీ నాయకులు మాజీ సర్పంచులు, ఎంపీటీసీలు, పార్టీ ముఖ్య నాయకులు పెద్ద ఎత్తున పాల్గొన్నారు.

ఆరిలోవ హెల్త్ సిటీ ఆసుపత్రుల్లో జీవీఎంసీ ఆకస్మిక తనిఖీలు

ఆరిలోవ, ఆగస్టు 4, ప్రభాతవార్త ఆరిలోవ హెల్త్ సిటీలోని ఆసుపత్రులు అనుమతి లేకుండా బోర్‌వెల్ల ద్వారా భూగర్భ జలాలను తోడేస్తుండటంతో జీవీఎంసీ నీటి సరఫరా అధికారులు మంగళవారం ఆకస్మిక తనిఖీలు నిర్వహించారు. జీవీఎంసీ బల్క్ వాటర్ వాడకుండా అక్రమంగా భూగర్భ జలాలను వినియోగించడం వల్ల చుట్టుపక్కల ప్రజల తాగునీటి సరఫరాపై తీవ్ర ప్రభావం పడుతోందని సూపరింటెండింగ్ ఇంజనీర్ పల్లంరాజు తెలిపారు. నిబంధనలు ఉల్లంఘించిన ఆసుపత్రులకు నోటీసులు జారీ చేశామని,7 రోజుల్లోగా జీవీఎంసీ బల్క్ వాటర్ కనెక్షన్ కోసం దరఖాస్తు చేసుకోవాలని ఆదేశించినట్లు చెప్పారు. ప్రజల తాగునీటికి ఆటంకం కలిగిస్తే కఠిన చర్యలు తప్పవని హెచ్చరించారు. ఈ తనిఖీల్లో ఈఈలు, డిఈఈలు,ఎఈలు పాల్గొన్నారు.

గ్యాస్ గోడౌన్, డబుల్ రోడ్డు ఎంతో అవసరం..!

శాసనసభాపక్ష గిరిజన సంక్షేమకమిటీ చైర్మన్ శిరీషదేవిని కోరిన ఎంపీపీ బడుగు రమేష్ బాబు

కొయ్యూరు, ఆగస్టు 4, ప్రభాతవార్త : మండల కేంద్రానికి వాహనాల రద్దీ పెరిగినందున, కాకరపాడు హైవే రోడ్డు నుండి కొయ్యూరు వరకు రెండు వంతెనలతో కూడిన డబుల్ రోడ్డు మంజూరుకు కృషి చేయాలని శాసనసభాపక్ష గిరిజన సంక్షేమ కమిటీ చైర్మన్, రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవిని వైసిపి ఎంపీపీ బడుగు రమేష్ బాబు కోరారు. మంగళవారం మండల కేంద్రానికి విచ్చేసిన ఆమెను ఎంపీపీ మర్యాద పూర్వకంగా కలిసి ప్రధాన సమస్యలను ప్రస్తావించారు. మండల కేంద్రంలో వంట గ్యాస్ గోడౌన్ అవసరం ఎంతైనా ఉందని, దాని మంజూరుకు కృషి చేయాలని ఎంపీపీ కోరారు. మండలంలో నిర్మించాల్సిన పలు రోడ్లు, ఇతర అభివృద్ధి పనుల కొరకు ఆమెను ఎంపీపీ రమేష్ అభ్యర్థించారు. కార్యక్రమంలో అరకు ఎమ్మెల్యే రేగం మత్యలింగం, కొయ్యూరు సీఐ బి.శ్రీనివాసరావు, తదితరులు పాల్గొన్నారు.

తలుపులమ్మ తల్లి ట్రస్ట్ బోర్డు చైర్మన్ కు సన్మానం

కొయ్యూరు, ఆగస్టు 4 ప్రభాతవార్త : తలుపులమ్మ తల్లి ట్రస్ట్ బోర్డ్ చైర్మన్ పెంటకోట భాస్కర్ సత్యనారాయణను పలువురు నేతలు ఘనంగా సన్మానం చేశారు. ఈ సందర్భంగా పెంటకోట భాస్కర్ సత్యనారాయణ చేస్తున్న సేవలను కొనియాడారు. ఈ కార్యక్రమంలో టిఎన్ టిసి పాడేరు నియోజకవర్గ ప్రధాన కార్యదర్శి అనిశెట్టి చిరంజీవి, కమల కోయిలాడ అనిమిరెడ్డి రాజు, బంధువులు, స్నేహితులు తదితరులు పాల్గొన్నారు.

మా డి పట్టా భూములను కాపాడండి

తహసిల్దార్ ను కోరిన రాజేంద్రపాలెం గ్రామ గిరిజన రైతులు

కొయ్యూరు, ఆగస్టు 4, ప్రభాతవార్త : 1995 సం. లో తమకు శనివారపు పాడు రెవెన్యూ గ్రామములో ప్రభుత్వం డి -పట్టా భూములను మంజూరు చేసిందని, వాటిని కొంతమంది పీవిటీజీలు ఆక్రమించుకునే ప్రయత్నం చేస్తున్నారని వాటిని కాపాడాలని మంగళవారం మండలంలోని రాజేంద్రపాలెం గ్రామానికి చెందిన కొంతమంది గిరిజన రైతులు తహసిల్దార్ ప్రసాద్ రావుకు వినతి పత్రం అందించారు. రాజేంద్రపాలెం గ్రామానికి చెందిన కొంతమంది రైతులకు ఈయొక్క డి-పట్టా భూములు తప్పా మరొక జీవనాధారం లేదని, ఇవి ఆక్రమణకు గురైతే వారి కుటుంబాలు వీధిన పడతాయని రైతులు వాపోయారు. అసలు శనివారపుపాడు అనే గ్రామమే లేదని, అది కేవలం రెవిన్యూ గ్రామం మాత్రమేనని, కానీ ఇటీవల ఆరు నెలల క్రితం వచ్చిన కొంతమంది పివిటిజీలు శనివారపుపాడును ఒక గ్రామంగా చిత్రీకరించి, రేషన్ కార్డులు, ఆధార్ కార్డులు ఆ గ్రామం పేరుతో పొంది, తమ భూములను ఆక్రమించే ప్రయత్నం చేస్తున్నారని, దీనిని నిలువరించి, వారి బారి నుండి వారి భూములను రక్షించాలని రాజేంద్రపాలెం గిరిజన రైతులు కోరుతున్నారు. కార్యక్రమంలో రైతులు నర్సి పాపారావు, కాకర చిన్నారావు, కాకర గంగరాజు, సరుమూర్తి సూరిబాబు, దిబ్బరత్నం, గుమ్మా చిన్నారావు, కానీ నూకరాజు, కాకర సోమరాజు తదితరులు పాల్గొన్నారు.

పానిరంగిని గ్రామంలో 15 లక్షల ఎంపీ నిధులతో సీసీ రోడ్డు నిర్మాణానికి శ్రీకారం



అరకులోయ, ఆగస్టు 4, ప్రభాతవార్త : అరకులోయ మండలం, పెదలబుడు పంచాయతీ, పానీరంగిని గ్రామంలో మంగళవారం 15 లక్షలు ఎంపీ నిధులతో సీ.సీ రోడ్డు నిర్మాణ పనులకు శ్రీకారం చుట్టారు. ఎన్నో ఏళ్లగా కలగా మిగిలిన సీసీ రోడ్డు నిర్మాణం ప్రారంభం కావడంతో గ్రామస్తులు హర్షం వ్యక్తం చేశారు . ఈ కార్యక్రమానికి మహిళ డిగ్రీ కళాశాల ఆర్ కుస్మా కుమారి, వైస్ ప్రిన్సిపాల్ పి. చలపతి రావు ,గ్రామ పెద్దలు కిరణ్ కుమార్, రామారావు, మొద్దు ,దుర్జో , గ్రామ నాయక్ రాము ,లైచోన్, అబ్బుద్, సద్దు, పాంగి మొద్దు, రవి తదితరలు పాల్గొని పనుల శ్రీకారం పై ఆనందం వ్యక్తం చేశారు .

vsp9:vsp9.qxd 04-08-2026 22:00 Page 1

8వ తేదీ బంద్‌కు ఆదివాసీ జెఏసితో సంబంధం లేదు

స్పష్టం చేసిన ఆదివాసీ జెఏసి జిల్లా చైర్మన్ రామారావు దొర

పాడేరు,ఆగస్టు4,ప్రభాతవార్త:

సిపిఎం, దాని అనుబంద సంఘాలు ప్రకటించిన ఆగస్టు 8వ తేదిల మన్యం బందుకు, ఆదివాసి జెఏసి పేరిటా వచ్చిన పేరు, ఊరు లేని ప్రకటనలకు, ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ జెఏసికి ఎటువంటి సంబందం లేదని ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ జెఏసి జిల్లా చైర్మన్ రామారావు దొర స్పష్టం చేసారు. ఉపాధ్యాయ నియామకాలకు ఉద్దేశించిన జివో నంబర్ 3 రద్దు తరువాత షెడ్యూల్డ్ ప్రాంత ఉద్యోగ నియామకాల చట్టం చేసుకోవడానికి, 1/70 చట్టం రద్దుకు నాన్ ట్రైబల్స్ వేసిన సుప్రీం కోర్ట్ కేసుని ఎదుర్కోవడానికి ఆంధ్రప్రదేశ్ ఆదివాసి జెఏసి ఆగస్టు 7 న ఆదివాసి అరణ్య గర్జన సభకు పిలుపునిచ్చిందన్నారు. వామపక్షాలు, దాని అనుబంద సంఘాలు ఆగస్టు 8, తేదిలలో మన్యం బందుకు ఇచ్చిన పిలుపుతో పాడేరులో జరగను అరణ్య గర్జన సభకు గత నెల రోజులుగా సంసిద్ధమైన ఆదివాసిలను గందరగోళంలో పడేసరన్నారు. ఇది కాకతలికంగా చేసిన ప్రకటన కాదని, ఉద్దేశాపుర్వకంగా చేస్తున్న సమాంతర ప్రకటనలని, రాజకీయాలకు, ప్రజా ఉద్యమాలకు మధ్య తేడాలను ప్రజలు నిశితంగా గమనించాలని ఆయన కోరారు. కార్యక్రమంలో మాధవరావు, ప్రభాకర్, బొంజునాయుడు, సత్య, వినోద్, వెంకట్, పార్ధు, తదితరులు పాల్గొన్నారు.

2003 నుంచి ప్రపంచ ఆదివాసీ దినోత్సవాన్ని నిర్వహిస్తున్నాం

పాడేరు,ఆగస్టు4,ప్రభాతవార్త:

తెలుగు రాష్ట్రాలలో అఖిల భారత ఆదివాసీ వికాస పరిషత్ మొట్టమొదటి సారి ప్రపంచ ఆదివాసి దినోత్సవాన్ని జరుపుటలో దేశశీలోని అగ్రగామిగా ఉందని ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ వికాస్ పరిషద్ రాష్ట్ర అధ్యక్షులు అడపా బొంజునాయుడు పేర్కొన్నారు. 2003 సంవత్సరం నుండి ఈ వేడుకల ప్రయాణం కొనసాగుతుంద న్నారు.. హైదరాబాదులో శ్రీపొట్టిశ్రీరాములు తెలుగు కళాభవనం నందు మొట్టమొదటిసారి జరిపారన్నారు.తదనంతరం ఆదివాసీల హక్కులు, న్యాయం, విద్య, సంస్కృతి , రాజ్యాంగ హక్కుల గురించి విశేష అవగాహన సదస్సులు నిర్వహించి ఆంధ్రప్రదేశ్ ఆదివాసీ వికాస్ పరిషద్ ద్వారా ఈ ఉత్సవాలలో గ్రామీణ అదివాసుల భాగస్వామ్యాన్ని పెంచడం వలన, అప్పటి రాష్ట్ర ప్రభుత్వాలు 2016 నుండి అధికారికంగా ఈ దినోత్సవాన్ని గుర్తించి నిర్వహిస్తుందని బొంజునాయుడు గుర్తు చేశారు.

రిలే నిరాహార దీక్షలు విజయవంతం చెయ్యాలి

నియోజకవర్గ స్థాయి టౌన్ హాల్ సమావేశంలో ఎమ్మెల్యే మత్స్యరాస విశ్వేశ్వర రాజు

పాడేరు,ఆగస్టు4,ప్రభాతవార్త:

వైసిపి అధ్యక్షులు వైయస్ జగన్మోహన్ రెడ్డి ఆదేశాల మేరకు పాడేరు శాసన సభ్యులు జిల్లా పార్టీ అధ్యక్షులు మత్స్యరాస విశ్వేశ్వర రాజు అధ్వర్యంలో మంగళవారం క్యాంప్ కార్యాలయంలో టౌన్ హాల్ సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా శాసన సభ్యులు మత్స్యరాస విశ్వేశ్వర రాజు మాట్లాడుతూ డీఎస్సీలో జరిగిన అక్రమాలపై సిబిఐ ఎంక్వైరీ కావాలని, ఫీజ్ రీయింబర్స్ మెంట్ బకాయిలు విడుదల చెయ్యాలని అలాగే నిరుద్యోగ భృతి 3000 రూపాయలు వెంటనే ఇవ్వాలని వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ విద్యార్థి యువజన విభాగం ఆధ్వర్యంలో ఇప్పటికే జిల్లా కేంద్రంలో ర్యాలీలు విజయవంతంగా నిర్వహించాం, మళ్లీ ఈ నెల 6 తేదీ నుంచి 9 వ తేదీ వరకు రిలే నిరాహార దీక్షలు నిర్వహిస్తున్నాం, అదే విధంగా ఈ నెల 6వ తేదీ న పాడేరు కేంద్రంలో, 8వ తేదీన చింతపల్లి మరియు కొయ్యూరు మండల కేంద్రంలో రిలే నిరాహార దీక్షలు నిర్వహించాలని మండల పార్టీ అధ్యక్షులకు కోరారు, కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు సీధరి రాంబాబు, సుర్మని మత్యకొండం నాయుడు, కంకిపాటి గిరి ప్రసాద్, బిడిజనా అప్పారావు, జిల్లా మహిళా అధ్యక్షురాలు కురుస పార్వతమ్మ, విద్యార్థి విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి పొడుగు అచ్యుత్,జిల్లా యువజన విభాగం అధ్యక్షుడు గుబ్బడి శేఖర్, జిల్లా విద్యార్థి విభాగం అధ్యక్షుడు లోచలి వర ప్రసాద్,జిల్లా అధికార ప్రతినిధి కూడా సురేష్ కుమార్, రాష్ట్ర ఎస్టీ సెల్ ప్రధాన కార్యదర్శి జల్లి సుధాకర్, పంచాయతీ రాజ్ రాష్ట్ర విభాగం కార్యదర్శి బొబ్బిలి లక్ష్మణ్, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి తడబారికి సురేష్ కుమార్, వైస్ ఎంపీపీ కుడుముల సత్యనారాయణ, లోత దేవుడు, మాజీ ఎంపీపీ మత్స్యరాస వెంకట గంగరాజు, ఐటీ వింగ్ విభాగం రాష్ట్ర సంయుక్త కార్యదర్శి కూడా సుబ్రమణ్యం, గొడ్డేటి మహేష్, సీనియర్ నాయకులు ఐషారం హనుమంతరావు, గుబ్బడి చిట్టిబాబు, నియోజకవర్గ ఎస్టీ సెల్ అధ్యక్షులు శరభ సూర్యనారాయణ, నియోజకవర్గ మహిళా అధ్యక్షురాలు కిల్లో ఊర్వశి రాణి, పార్టీ వివిధ హోదాలో ఉన్న అనుబంధ విభాగాల నాయకులు ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, విద్యార్థి యువజన విభాగం నాయకులు సీనియర్ నాయకులు కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ప్రజల ముఖంలో చిరునవ్వు చూడటమే ప్రభుత్వ లక్ష్యం

ఇంటింటికీ టీడీపీలో మండల అధ్యక్షురాలు, మదర్ థెరిస్సా సేవా రత్న అవార్డు గ్రహీత కిల్లో సన్యాసమ్మ

ముంచంగిపుట్టు, ఆగస్టు 4, (ప్రభాతవార్త):

ప్రజాస్వామ్యంలో ప్రజల ముఖంలో చిరునవ్వు చూడటమే కూటమి ప్రభుత్వ లక్ష్యమని మండల టిడిపి అధ్యక్షురాలు కిల్లో. సన్యాసమ్మ (సంధ్య) అన్నారు.కూటమి ప్రభుత్వం చేపట్టిన అభివృద్ధి, సంక్షేమ ఫలాలను క్షేత్రస్థాయిలో ప్రజలకు చేరవేయడమే లక్ష్యంగా ముంచంగిపుట్టు మండలంలోని సుజనకోట పంచాయతీ, సుజనకోట గ్రామంలో, దోడిపుట్ పంచాయతీ, తలిబిరడ గ్రామాల్లో మంగళవారం నాడు నిర్వహించిన ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో ముంచంగిపుట్టు మండల తెలుగుదేశం పార్టీ అధ్యక్షురాలు కిల్లో సన్యాసమ్మ (సంధ్య)..పార్టీ నాయకులు పాల్గొన్నారు. రెండేళ్ల పాలన పూర్తయిన సందర్భంగా, ప్రతి ఇంటి గడపకూ వెళ్లారు. ప్రజలను నేరుగా కలుసుకొని వారి బాగోగులను అడిగి తెలుసుకున్నారు.. కూటమి ప్రభుత్వం రెండేళ్ల కాలంలో అందించిన చేస్తున్న అభివృద్ధి,సంక్షేమ పథకాల పై ప్రతి ఇంటికి వెళ్లి వివరించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఈ రెండేళ్లలో అభివృద్ధి – సంక్షేమం పై కూటమి ప్రభుత్వం పైన ప్రజల్లో నమ్మకాన్ని పెంచిందని. కూటమి ప్రభుత్వం తన రెండేళ్ల ప్రయాణాన్ని ప్రజల ముందు ఉంచుతూ, రాబోయే రోజుల్లో మరింత సంక్షేమం అభివృద్ధి లక్ష్యంగా పని చేస్తుందని ఆమె తెలిపారు.ఇంటింటికి తెలుగుదేశం ద్వారా ప్రజలు, నాయకులకి మధ్య ఉన్న దూరాన్ని తగ్గించి, మరింత బలమైన బంధాన్ని ఏర్పరిచిందని. కూటమి ప్రభుత్వం, రెండేళ్ల నమ్మకం -సంక్షేమం, అభివృద్ధి పై ప్రజలు విశ్వాసం వ్యక్తం చేస్తున్నారని ఆమె తెలిపారు. అదేవిధంగా స్థానిక ప్రజలు ఎదుర్కొంటున్న చిన్న చిన్న సమస్యలను విని, పరిష్కారం అయ్యేలా అధికారులు వద్ద తీసుకెళ్ళి పరిష్కారానికి కృషి చేస్తానని ఆమె తెలిపారు. కార్యక్రమంలో మండల కార్యదర్శి కొంతోల జాగన్నాయ్, మహిళా నాయకురాలు కిరసాని రత్న, మండల సంయుక్త కార్యదర్శి మండి ప్రభాకర్, మండల రైతు అధ్యక్షుడు కిముడు ఉర్లాజ్,దోడిపుట్ పంచాయతీ అధ్యక్షుడు కిరసాని మోహన్, జల్ల సహదేవ్, సోషల్ మీడియా కన్వీనర్ చెట్టి నవీన్ కుమార్, కిల్లో రాజ్ కుమార్, కిరసాని దేవరాజు, కిరసాని గోపాల్, కిరసాని సుందర్ సేన్,పాంగి సురేష్ కుమార్,ప్రేమ్ చంద్,శివ,తదితరులు పాల్గొన్నారు.

కిండంగి గ్రామ పంచాయతీలో ఇంటింటా టిడిపి

పాడేరు,ఆగస్టు4,ప్రభాతవార్త:

కూటమి ప్రభుత్వం ప్రతిష్టాత్మక నిర్వహిస్తున్న ఇంటింటా టిడిపి కార్యక్రమంలో భాగంగా మండలం కిండంగి గ్రామ పంచాయతీ కిండంగి 289 బూత్ నెంబర్ బివిల్ల బుక్క జగదీష్ ఆధ్వర్యంలో ఇంటింటి కార్యక్రమం నిర్వహించారు. ముఖ్యఅతిథి సీనియర్ టీడీపీ నాయకులు. బొర్రా నాగరాజు గ్రామ పెద్దలు లింగేరి చిట్టిబాబు పూజ కళ్యాణం,తలారి కొండబాబు,బుక్క జనార్ధన రావు గ్రామ పెద్దలు పాల్గొన్నారు.

మన్యం బంద్ విజయవంతం చేయండి

పాడేరు,ఆగస్టు4,ప్రభాతవార్త:

జీవో నెంబర్ 3 100% రిజర్వేషన్ కోసం, గుండె కాయలాంటి 1/70 పరిరక్షణ కోసం ఈనెల 8వ తేదీ రాష్ట్రవ్యాప్త మన్యం బంద్ విజయవంతం చేయాలని ప్రజాసంఘాల ఆధ్వర్యంలో విస్తృతంగా ప్రచారం నిర్వహించారు. గిరిజన సమైక్య జిల్లా ప్రధాన కార్యదర్శి కూడా రాధాకృష్ణ, ఆదివాసి గిరిజన సంఘం నాయకులు సుందర్ రావు, దాసు, చిట్టిబాబు, ఎస్ఎఫ్ఐ,ఏఐఎస్ఎఫ్ జిల్లా కార్యదర్శి శ్రీను కార్తీక్, రాజశేఖర్ చిన్ని తదితరులు పాల్గొన్నారు.

నవజాత శిశువు ఎదుగుదలకు తల్లిపాలే రక్షణ కవచం

అంగన్వాడీ టీచర్ డి. సూర్యలక్ష్మి (సుజాత)

ముంచంగిపుట్టు, ఆగస్టు 4, (ప్రభాతవార్త):

నవజాత శిశు ఆరోగ్యవంతమైన ఎదుగుదలకు తల్లిపాలే రక్షణ కవచంలా ఉపయోగపడతాయని,తల్లిపాలే బిడ్డకు శ్రేష్టమైన ఆహారమని, ముంచంగిపుట్టు మండల కేంద్రంలో గల అంగన్వాడి సెంటర్ -1 టీచర్ డి. సూర్య లక్ష్మి (సుజాత) ఉన్నారు. తల్లిపాల వారోత్సవాల సందర్భంగా మండల కేంద్రంలో గల అంగన్వాడి సెంటర్ -1 లో అంగన్వాడి టీచర్ డి సూర్యలక్ష్మి (సుజాత) ఆధ్వర్యంలో తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమా న్ని ఘనంగా నిర్వహించారు. ప్రభుత్వం ప్రతిష్టాత్మక ప్రవేశపెట్టిన ఈ కార్యక్రమం విజయవంతం చేసేందుకే ప్రతి ఏడాది తల్లిపాల వారోత్సవాల కార్యక్రమాన్ని నిర్వహించడం జరుగుతుందని ఆమె అన్నారు. ఈ సందర్భంగా గర్భిణీ, బాలింత లు, కిషోర్ బాలికలు, తదితరులతో భారీ ర్యాలీ నిర్వహించి వారితో ప్రత్యేక సమావేశ కార్యక్రమాన్ని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడు తూ ఈ తల్లిపాల వారోత్సవాల కార్యక్రమం మండలంలో ఆగష్టు 1 నుండి 7 వరకు మండలంలో గల అన్ని అంగన్వాడి సెంటర్లలో నిర్వహించడం జరుగుతుందని ఈ కార్యక్రమం ద్వారా తల్లిపాల ప్రాముఖ్యతను వివరించడం జరుగుతుందన్నారు. అప్పుడే పుట్టిన బిడ్డకు తల్లి గంటలోపు ముర్రు పాలు పెట్టించాలని, పసుపు పచ్చని రంగులో ఉండే ఈ ముర్రుపాలు బిడ్డకు వ్యాధి నిరోధక శక్తిని పెంచుతుందన్నారు. 6 నెలల వరకు క్రమం తప్పకుండా తల్లులు బిడ్డకు తల్లిపాలను మాత్రమే ఇవ్వాలని మరి ఇతర ఆహార పదార్థాలను బిడ్డకు ఇవ్వకూడదన్నారు. ఆరు నెలలు నిండిన తర్వాత బిడ్డకు పౌష్టికాహార విలువలు కలిగిన ఆహార పదార్థాలను అందిస్తూ బిడ్డకు రెండు సంవత్సరాల వరకు తల్లిపాలను కొనసాగించాలని ఆమె సూచించారు. బిడ్డ పుట్టిన గంటలోపే తల్లిపాలు పట్టించడం అత్యంత కీలకమన్నారు. తొలి ఆరు నెలలు తల్లిపాలు మాత్రమే ఇవ్వడం వలన శిశువు కు అవసరమైన పోషకాహారాలు సమృద్ధిగా అందడమే కాకుండా రోగనిరోధక శక్తి గణనీయంగా పెరుగుతుందని, తల్లిపాలు ఇవ్వడం వలన తల్లుల్లో రొమ్ము క్యాన్సర్, గర్భాశయ క్యాన్సర్ వంటి వ్యాధుల ప్రమాదం తగ్గుతుందని, తల్లి బిడ్డల మధ్య సంబంధం మరింత బలపడుతుందని ఆమె వివరించారు. పోషకాహారానికి సంబంధించిన అపోహలను మహిళలు విడనాడాలని సమతుల్యమైన పోషక విలువలు అధికంగా ఉన్న ఆహారం తీసుకోవడం ద్వారా తల్లి బిడ్డ ఇద్దరూ ఆరోగ్యవంతంగా ఉంటారని సూచించారు.

పాడేరు, హుకుంపేట మండలాల్లో రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యురాలు గంజిమాల దేవి ఆకస్మిక తనిఖీలు

హుకుంపేట,ఆగష్టు 4 ప్రభాత వార్త:

రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యురాలు గంజిమాల దేవి పాడేరు, హుకుంపేట మండల పరిధిలోని వివిధ ప్రభుత్వ పాఠశాలలు, గిరిజన సంక్షేమ హాస్టళ్లు, అంగన్వాడీ కేంద్రాలు, పబ్లిక్ డిస్ట్రిబ్యూషన్ సెంటర్స్, షాపులు, ఎం ఎల్ ఎస్ పాయింట్‌ను మంగళవారం క్షేత్రస్థాయిలో పరిశీలించారు. మంగళవారం ఉదయం జిల్లా లోని పాడేరు హుకుంపేట మండలలో గల ప్రభుత్వ అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాలు,పిల్లలకు అందుతున్న మధ్యాహ్న భోజనం, అంగన్వాడీలలో బాలామృతం పంపిణీ, గిరిజన సంక్షేమ హాస్టళ్లలోని వసతులు,రేషన్ డిపోల ద్వారా పంపిణీ, ప్రజలకు తూకం తగ్గకుండా సరుకులు అందుతున్నాయో లేదో అనేది స్వయంగా పరిశీలించారు. జిల్లా సివిల్ సప్లై అధికారి వి.మోహన్ బాబు, సివిల్ సప్లై డిప్యూటీ తాసిల్దార్ ప్రశాంత్ కుమార్, జిల్లా ఆహార భద్రత అధికారి ఎం గ్రీష్మ, పాడేరు ఐసిడిఎస్ సిడిపిఓ శారద, ఎంఈఓ విశ్వనాథం, ఏటిడబ్ల్యుఓలు , హుక్కుంపేట ఎంఈఓ, మధ్యాహ్న భోజన కో-ఆర్డినేటర్, ఇతర అధికారులు పాల్గొన్నారు.

భక్తిశ్రద్ధలతో గంగమ్మ తల్లికి సారె సమర్పణ

అరకు రూరల్ , ఆగస్టు 4, ప్రభాతవార్త :

అరకులోయ మండలం ఎండపల్లి వలసలో వెలసిన గంగమ్మ తల్లి అమ్మవారికి ఆషాఢ మాసం సందర్భంగా మంగళవారం భక్తులు ఘనంగా సారెను బహుకరించారు. ఈ సందర్భంగా అమ్మవారి భక్తురాలు రేపాక రోజా ఆధ్వర్యంలో సుమారు 60 మంది పౌర్ణమి పారాయణం సభ్యులు, మహిళలు వివిధ రకాల స్వీట్లును, పసుపు, కుంకుమ, చీర, గాజులు, పూలు, పండ్లు, కొబ్బరికాయలతో సంప్రదాయబద్ధంగా సారెను తీసుకువచ్చి అమ్మవారికి సమర్పించారు. అనంతరం ఆలయంలో ప్రత్యేక పూజలు, అభిషేకాలు, అర్చనలు నిర్వహించారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని అమ్మవారి దర్శనం చేసుకుని గ్రామ ప్రజల ఆయురారోగ్యాలు, సుఖశాంతులు, సకాలంలో వర్షాలు కురిసి పంటలు సమృద్ధిగా పండాలని ప్రార్థించారు. కార్యక్రమంలో గ్రామ పెద్దలు, ఆలయ కమిటీ సభ్యులు, మహిళలు, యువకులు, భక్తులు పాల్గొన్నారు. అనంతరం భక్తులకు తీర్థప్రసాదాలు పంపిణీ చేశారు. ఆధ్యాత్మిక వాతావరణంలో కార్యక్రమం భక్తిశ్రద్ధలతో ముగిసింది. కాగా అమ్మవారి ఆలయానికి తరలివచ్చిన భక్తులకు పౌర్ణమి పారాయణం కమిటీ సభ్యులు ప్రత్యేకంగా మెహంది కార్యక్రమంలో ఏర్పాటు చేశారు.

తల్లిపాలు బిడ్డకు దేవుడిచ్చిన వరం : సీడీపీవో

ముంచంగిపుట్టు, ఆగష్టు 4, (ప్రభాతవార్త):

తల్లిపాలు బిడ్డకు దేవుడు ఇచ్చిన వరమని తల్లిపాలల్లో రోగనిరోధక శక్తిని పెంపొందించే పోషక విలువలు ఉంటాయని, అంతేకాకుండా శిశువు త్వరితగతిన ఎదిగే సామర్థ్యాన్ని పెంపొందిస్తాయని ముంచంగిపుట్టు మండల మాత శిశు సంరక్షణ శాఖ ప్రాజెక్ట్ అధికారిని యు. విమల కుమారి అన్నారు. ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా మంగళవారం కిలగడ సెక్టార్ పడాల పుట్టు అంగన్వాడి కేంద్రంలో తల్లిపాల ప్రాముఖ్యత పై అవగాహన కార్యక్రమం నిర్వహించడం జరిగింది. ఈ కార్యక్రమంలో ముంచంగిపుట్టు సిడిపిఓ యు విమల కుమారి ముఖ్య అతిథిగా పాల్గొన్నారు. ఈ సందర్భంగా గర్భిణీలు బాలింతలు కిషోర్ బాలికలు గ్రామస్తులతో ప్రత్యేక సమావేశ కార్యక్రమాన్ని నిర్వహించి తల్లిపాల ప్రాముఖ్యత పౌష్టికాహారం వలన కలిగే లాభాలను వారికి వివరించారు. అనంతరం గ్రామంలో భారీ ర్యాలీని నిర్వహించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ప్రసవం అనంతరం గంట లోపు తల్లిపాలు బిడ్డకు పట్టించటం అత్యంత అవసరమని ఆమె తెలిపారు. గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. తల్లిపాల వారోత్సవాలు కార్యక్రమంలో భాగంగా మండలంలో లక్ష్మీపురం,తల బిరడ, తాంగుల , ముక్కాపుట్టు, పనసపుట్టు, సిహెచ్ సరియపల్లి,బాబుసాల, పలు అంగన్వాడీ కేంద్రాల్లో కూడా తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. కార్యక్రమంలో ప్రాజెక్టు సూపర్వైజర్స్, అంగన్వాడీ కార్యకర్తలు, ఆయాలు, ఆశ వర్కర్లు పాల్గొన్నారు.

8న జరిగే రాష్ట్ర మన్యం బంద్ విజయవంతం చేయాలి

దుంబ్రిగూడ, ఆగస్టు 4, ప్రభాతవార్త:

మండల కేంద్రంలో, అఖిలపక్షం వివిధ ప్రజాసంఘాల ఆధ్వర్యంలోని మంగళవారం భారీ నిరసన ర్యాలీ చేపట్టారు . ఈ సందర్భంగా ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు. బాలదేవ్ ముఖ్య అతిదిగా పాల్గొని మాట్లాడుతూ గిరిజన చట్టాలు పటిష్టంగా అమలు చేయాలనీ డిమాండ్ చేశారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు గారు ఇచ్చిన హామీలు నిలబెట్టు కోవాలని, అలాగే గిరిజనులకు గిరిజన ప్రాంతంలో నూరు శాతం ఉద్యోగ చట్టం చేయాలనీ కోరారు. కూటమి ప్రభుత్వం ఏర్పడి రెండు న్నర సంవత్సరం గడుస్తున్నా ఇచ్చిన హామీలను అమలు చేయకుండా కాలయాపన చేస్తూ మోసం చేస్తుందని చెప్పారు. జీఓనెంబర్ 3కు ప్రత్యమ్నాయ చట్టం తీసుకొని వస్తామని చెప్పిన హామీలు ఏమైందని ఆయన ప్రశ్నించారు. 1/70చట్టం రద్దు కోరుతూ గిరిజనేతరులు సుప్రీం కోర్టును ఆశ్రయించడం దుర్మార్గం అన్నారు.కేంద్ర, రాష్ట్ర ప్రభుత్వాలు 1/70చట్టం రక్షణకై వెంటనే సుప్రీం కోర్టులో ఇంప్లీడ్ పిటీషన్ వేసి గిరిజన చట్టాలు కాపాడాలని కోరారు. అలాగే హైడ్రో పవర్ ప్రాజెక్టు అనుమతులు వెంటనే రద్దు చేయాలని, లేకపోతే భవిష్యత్తులో జరిగే ప్రజా ఆగ్రహనికి ప్రభుత్వం భాద్యత వహించాలని చెప్పారు. ఆదివాసీ గిరిజన సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి పొద్దు. బాలదేవ్ సిఐటీయు జిల్లా కార్యదర్శి వర్గ సభ్యులు ఎస్బీ. పోతురాజు,మండల కార్యదర్శి తామర్ల. సూర్యనారాయణ, అధ్యక్షులు పాంగి. సత్యనారాయణ, వైసీపీ మండల అధ్యక్షులు పాంగి. పరసురాం,జెడ్పీటీసీ చటారి. జానకమ్మ,మాజీ సర్పంచులు గుమ్మ నాగేశ్వరావు, కిముడు. హరి,ఎస్ఎఫ్ఐ నాయకులు పాంగి. జైరాం, పాంగి. సారేంద్ర, ఐసుబాబు,ఫీసా కమిటీ మండల అధ్యక్షులు గణపతి, మహిళా సంఘం మండల కార్యదర్శి పాంగి. కుమారి,వివిధ ప్రాంతాల నుండి యువకులు, మహిళలు పాల్గొన్నారు.

పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో అడ్మిషన్ ప్రక్రియ ప్రారంభం



పాడేరూ,ఆగస్టు4, ప్రభాతవార్త:

పాడేరు ప్రభుత్వ డిగ్రీ కళాశాల 2026=2027 విద్యాసంవత్సరానికి సంబంధించి అడ్మిషన్ ప్రక్రియ ప్రారంభం అయ్యాయని కళాశాల ప్రిన్సిపల్ డాక్టర్ ఎస్. సత్యనారాయణ మంగళవారం ఒక ప్రకటనలో పేర్కొన్నారు. అడ్మిషన్లు ఈనెల11వ తేదీ వరకు జరగనున్నాయన్నారు. విద్యార్థినీ విద్యార్థులు ఆన్లైన్ రిజిస్ట్రేషన్ చేసుకోవలన్నారునెల 15 వ తేదీ నుంచి 19 వ తేదీ వరకు ఆన్లైన్ వెబ్ ఆప్షన్స్ పెట్టు కోవాలన్నారు.పాడేరు కళాశాలలో అందుబాటులో ఉన్న గ్రూపు వివరాలు: బి ఎ హిస్టరీ, 2. బిఎ పొలిటికల్ సైన్స్ 3. బి ఎ స్పెషల్ తెలుగు 4. బి ఎ స్పెషల్ ఇంగ్లీష్, 5. బీకాం జనరల్, 6. బీకాం కంప్యూటర్ అప్లికేషన్ 7. బీఎస్సీ ఫిజిక్స్ 8. బీఎస్సీ కెమిస్ట్రీ,9. బీఎస్సీ కంప్యూటర్ సైన్స్, 10 బీఎస్సీ బోటనీ, 11. బీఎస్సీ జువాలజీ గ్రూప్‌లు అందుబాటులో ఉన్నాయని విద్యార్థులు వినియోగించుకోవాలని ప్రిన్సిపాల్ సత్యనారాయణ సూచించారు.

ప్యాసింజర్ రైలు ఢీకొని గుర్తు తెలియని వ్యక్తి మృతి

అరకు రూరల్, ఆగస్టు 4, ప్రభాత వార్త:

కొత్తవలస - కిరండోల్ (కేకే) లైన్ లో మంగళవారం కిరండూల్ - విశాఖ స్పెషల్ ఫ్యాసింజర్ రైలు ఢీ కొనడంతో సుమారు 25 ఏళ్ళ వయసు గల గుర్తు తెలియని వ్యక్తి మృతి చెందాడు. కిరండూల్ కొత్తవలస రైల్వే లైను లోని సిమిలిగుడ రైల్వే స్టేషన్ సమీపంలో ప్రమాదం జరిగిందని అరకు రైల్వే స్టేషన్ ఆర్పీఎఫ్ ఏఎస్ఐ శ్యామల రావు ఈ సందర్భంగా తెలిపారు. సాయంత్రం 4 గంటల సమయంలో బోసుబెడ గ్రామ సమీపంలో వ్యక్తి రైలు పట్టాలు దాటుతుండగా ఫ్యాసింజర్ ఢీ కొనడంతో తలకు బలమైన గాయాలై మృతి చెందినట్లు ఏఎస్ఐ పేర్కొన్నారు. మృతి చెందిన వ్యక్తి నల్ల పూలతో కూడిన తెల్ల చొక్కా, బ్లాక్ కాటన్ జీన్, కాళ్ళకు క్రాక్స్ చెప్పులు బ్లాక్ సాక్సులు ధరించినట్లు తెలిపారు.

గిరిజన ప్రజా సంఘాలపై పెట్టిన కేసులు రద్దు చేయాలి

ఆదివాసీ గిరిజన ప్రజా సంఘాల నాయకుల డిమాండ్

ముంచంగిపుట్టు ,ఆగష్టు 4, (ప్రభాతవార్త):

జీవో నంబర్-3 చట్టబద్ధత 1/70 చట్టం అమలు కోసం ముంచింగిపుట్టు లో 3వ తేదీన జరిగిన ర్యాలీ లో పాల్గొన్న ఆదివాసి గిరిజన ప్రజా సంఘల నాయకులపై పెట్టిన కేసులుప్రభుత్వం తక్షణమే రద్దు చేయాలని ఆదివాసీ గిరిజన సంఘం మండల అధ్యక్షులు ఎం ఎం శ్రీను గిరిజన ఉద్యోగుల సంఘం జిల్లా ఉపాధ్యక్షుడు ఎం రామకృష్ణ , వివిధ గిరిజన సంఘాలు, వివిధ పార్టీల నాయకులు డిమాండ్ చేశారు. ఈ సందర్భంగా మంగళవారం స్థాని విలేకరులతో మాట్లాడుతూ ర్యాలీ లో పాల్గొన్న మాట్లాడిన నేతలపై పోలీసులు అక్రమ కేసులు పెట్టడం దారుణమని, వాటిని తక్షణమే రద్దు చేయాలని డిమాండ్ చేశారు. రాజ్యాంగ బద్ధంగా గిరిజనులకు కల్పించిన హక్కులు పరిరక్షించాల్సిన ప్రభుత్వాలే కాలరాస్తుంటే గిరిజనలు ఏకమై ప్రభుత్వాన్ని నిలదీయాలని పేర్కొన్నారు. చట్టాన్ని అమలుచేయని అధికారులపై చర్యలు తీసుకోకుండా, చట్టాన్ని అమలు చేయాలని కోరన వారిపై కేసులు పెట్టడం సమంజసం కాదన్నారు. చట్టాలను ఉల్లంఘించిన వారిపై కేసులు పెట్టి చట్టపరమైన చర్యలు తీసుకోవాలని ఏజెన్సీ స్పెషల్ డీఎస్సీ నోటిఫికేసన్ విడుదల చేయాలని డిమాండ్ చేశారు. హైడ్రో పవర్ ప్రాజెక్టు ఒప్పందాలు రద్దు చేయాలని జీఓ నెంబర్ 3ను చట్టభద్దత చేయాలని 1/70 చట్టని పటిష్టంగా అమలు చేయాలని కోరారు. లేనిపక్షంలో గిరిజనులతో తీవ్ర ప్రతిఘటన తప్పదని హెచ్చరించారు. ఈ కార్యక్రమంలో ఆదివాసీ గిరిజన ప్రజా సంఘాల నాయకులు కె నర్సయ్య, వి కొండయ్య, రమేష్, కె త్రినాద్, పి భీమరాజు,బి రామారావు, గిరిజన ఉద్యోగ సంఘం నాయకులు బి బాబురావు,సింహాచలం, నర్సింగ్ పాడల్ చిన్నిబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఏకలవ్య పాఠశాలలో పోలీస్ ఉన్నతాధికారుల తనిఖీ

గూడెం కొత్తవీధి, ఆగస్టు 4, ప్రభాతవార్త :

జిల్లా ఎస్పీ ఆదేశాల మేరకు గూడెం కొత్తవీధిలోని ఏకలవ్య మోడల్ రెసిడెన్షియల్ పాఠశాలను మంగళవారం పోలీస్ ఉన్నతాధికారులు సందర్శించి తనిఖీలు నిర్వహించారు. చింతపల్లి సబ్ డివిజన్ పోలీస్ అధికారి (డీఎస్పీ) త్రిపురవ్, సి.ఐ సుధాకర్, ఎస్.ఐ సురేష్‌తో కూడిన పోలీస్ బృందం పాఠశాలను సందర్శించి విద్యార్థులతో నేరుగా మాట్లాడారు. ఈ సందర్భంగా విద్యార్థులు ఎదుర్కొంటున్న సమస్యలను అడిగి తెలుసుకున్నారు. అనంతరం పాఠశాలలో విద్యార్థులకు అందిస్తున్న తాగునీటి సదుపాయాలు, మరుగుదొడ్ల నిర్వహణ, వసతి గృహాల పరిస్థితులు, ఇతర మౌలిక వసతులను అధికారులు క్షేత్రస్థాయిలో పరిశీలించారు. విద్యార్థుల భద్రత, పరిశుభ్రత, సౌకర్యాల నిర్వహణపై పాఠశాల సిబ్బందికి పలు సూచనలు చేశారు. విద్యార్థులకు మెరుగైన వాతావరణం, అవసరమైన అన్ని సౌకర్యాలు కల్పించేందుకు అధికారులు తగిన చర్యలు తీసుకోవాలని పాఠశాల యాజమాన్యాన్ని కోరారు.

విద్యార్థినులకు అందించే మెనూలో నాణ్యత పాటించాలి

రాష్ట్ర ఆహార కమిషన్ సభ్యురాలు దేవి గంజిమాల

దుంబ్రిగుడ, ఆగస్టు 4 ప్రభాతవార్త:

విద్యార్థినిలకు అందించే మెనూ లో నాణ్యత ప్రమాణాలు కొరవడితే చర్యలు తప్పదని రాష్ట్ర ఆ హార కమిషన్ సభ్యురాలు దేవి గంజి మాల చెప్పారు. మండలకేంద్రంలోని ప్రభుత్వ గిరిజన బాలికల ఆశ్రమ పాఠశాలలో మంగళవారం ఆకస్మిక తనిఖీ నిర్వహించారు. భోజన మెనూ అమలు తీరు, వంటషెడ్డులో విద్యార్థినిలకు వండి పెడుతున్న ఆహార పదార్థాలను నిశితంగా పరిశీలించారు. నిత్యావసర సరకుల భద్రతలో పురుగులు పట్టకుండా డ్రమ్ములను ఏర్పాటు చేయాలని ఆదేశించారు. కూరగాయలు పాడవకుండా చూసుకోవాలన్నారు. రాత్రి వండిపెట్టే చికెన్ను విద్యార్థినిల సంఖ్య ఎక్కువ ఉండడం, చికెన్ తూకంలో తక్కువ ఉండడంపై అసంతృప్తి వ్యక్తం చేశారు. ప్రతి విద్యార్థినికి చికెన్ 155గ్రాములు పెట్టాలని సూచించారు. అనంతరం పోస్ట్మెట్రిక్ కళాశాల బాలికల వసతి గృహంలో సందర్శించిన ఆమె విద్యార్థినిలతో మాటామంతితో మమేకమయ్యారు. సక్రమంగా భోజన మెనూ ప్రకారంగా ఆహారాన్ని పెడుతున్నారా అడిగి తెలుసుకున్నారు. అన్నం సరిగా ఉడకడం లేదని, చాలిచాలని అన్నం వడ్డించడం, ఆదివారం విద్యార్థినిలకు వడ్డించే బిర్యాని కిచిడిలా ఉంటుందని, రన్నింగ్ వాటార్ సౌకర్యంతోపాటు పలు సమస్యలపై విద్యార్థినిలు ఆమె దృష్టికి తీసుకెళ్లారు. మెనూ అమలులో పర్యవేక్షణ కొరవడుతుందని తీరు మార్చులకోవాలని ఏటీడబ్ల్యూవోను హెచ్చరించారు. దొంగలు, దొంగలు కలిసి ఊర్లను పంచుకున్నట్లుగా ఉందని అసహనం వ్యక్తం చేశారు. పిల్లలకు సక్రమంగా వండించి పెట్టడంలో ఏం తక్కువగా అని ప్రశ్నించారు. ఇప్పటికైన తీరు మార్చుకుని ఉద్యోగ ధర్మం పాటించాలన్నారు. సంబంధిత వసతి గృహ అధికారిణికి షోకాజ్ జారీ చేయాలని ఏటీడబ్ల్యూవో వెంకటరమణను ఆదేశించారు. గిరిజన పిల్లలకు ప్రభుత్వం కల్పించే భోజన మెనూ పక్కగా అమలులో నాణ్యత ప్రమాణాలు పాటించాలని, లేని పక్షంలో చర్యలు తీసుకుంటామని ఆమె హెచ్చరించారు. ఆమె వెంట జిల్లా సివిల్ సప్లయ్ అధికారి మోహనరావు, డీటీ ప్రశాంత్, తదితరులు పాల్గొన్నారు.

పేద గిరిజన విద్యార్థులకు స్టడీ మెటీరియల్ వితరణ

ముంచంగిపుట్టు, ఆగష్టు 4, (ప్రభాతవార్త):

అల్లూరి సీతారామరాజు జిల్లా ముంచంగిపుట్టు మండలంలో గల పెదగూడ పంచాయతీ సారధి ఎంపీపీ పాఠశాల గలగండ జి పి ఎస్ పాఠశాలలో 46 మంది గిరిజన నిరుపేద విద్యార్థిని విద్యార్థులకు బోర్గం భాగ్య వతి సేవా సంఘం సభ్యుడు బోర్గం పూర్ణ రావు, పెదగుడ వైసీపీ పంచాయతీ అధ్యక్షుడు కూడా దాసు బాబు ఆయా పాఠశాల ఉపాధ్యాయులచేతులు మీదుగా స్టడీ మెటీరియల్ మంగళవారం పంపిణీ చేశారు. ఈ సందర్భంగా భాగ్యవతి సేవా సంఘం సభ్యుడు బోర్గం పూర్ణ రావు,కూడా దాసు బాబు మాట్లాడుతూ గత 7ఏళ్లుగా జర్రెల పంచాయతీ మాజీ సర్పంచ్ భాగ్య వతి సేవా సంఘం ఏర్పాటు చేసి మండలం లో అనేక పాఠశాలలో సొంత నిధులతో విద్యార్థినీ విద్యార్థులకు స్టడీ మెటీరియల్స్ తదితర సామాగ్రి అందజేయడం ఎంతో శుభ పరిమాణం అన్నారు. మానవత దృక్పథంతో ఇలాంటి సేవ చేయటం కొందరికే దక్కుతుందని ఆయన అన్నారు. దీంట్లో భాగంగా పెదగూడ పంచాయతీ సారధి గలగండ పాఠశాలల్లో విద్యార్థిని విద్యార్థులు 42 మందికి సేవా సంఘం సభ్యుడు పూర్ణారావు ఆయా పాఠశాలల ఉపాధ్యాయులతో కలిసి స్టడీ మెటీరియల్స్ పంపిణీ చేయడం ఎంతో సంతోషకరమని ఆయన తెలిపారు. కార్యక్రమంలో గలగండ పాఠశాల ఉపాధ్యాయుని టి గౌతమి తో పాటు కె మోహన్ అప్పలరాజు ,నీలకంఠం, తదితరులు పాల్గొన్నారు.

ప్రతి పేద కుటుంబాన్ని ఆదుకోవడమే ప్రభుత్వ ధ్యేయం

దుంబ్రిగూడ, ఆగస్టు 4 ప్రభాతవార్త:

ప్రతి నిరుపేద కుటుంబాన్ని ఆదుకోవడమే కూటమి ప్రభుత్వ ధ్యేయమని రాష్ట్ర కనీస వేతనాల సలహా మండలి డైరెక్టర్ టి సుబ్బారావు చెప్పారు. పోతంగి పంచాయతీ గ్రామంలో మంగళవారం కూటమి ప్రభుత్వం రెండున్నర ఏళ్ల పరిపాల విధానాలపై ఇంటింటికి దేశం పార్టీ శ్రేణులు వెళ్లి కరపత్రాలు పంచుతూ ప్రచారం నిర్వహించారు. నిరుపేదల కలలు కేవలం టిడిపి తోనే సాధ్యమని ఆయన చెప్పారు. కార్యక్రమంలో పోతంగి పంచాయతీ అధ్యక్షుడు ఎం.భీమరాజు, గ్రామస్తులు, తదితరులు పాల్గొన్నారు.

నాణ్యమైన విద్య, ఆహారం అందించడమే లక్ష్యం : ఎమ్మెల్యే

కొయ్యూరు, ఆగస్టు 4, ప్రభాతవార్త :

గిరిజన సంక్షేమ ఆశ్రమ పాఠశాలల్లోనూ, తదితర విద్యాసంస్థల్లో నాణ్యమైన విద్యతోపాటు, నాణ్యమైన ఆహారాన్ని అందించడమే లక్ష్యంగా ప్రభుత్వం పనిచేస్తుందని, ఈ అవకాశాన్ని అందిపుచ్చుకొని గిరిజన విద్యార్థులు ఉత్తమ విద్యా ప్రమాణాలు సాధించాలని గిరిజన శాసనసభాపక్ష సంక్షేమకమిటీ చైర్మన్, రంపచోడవరం ఎమ్మెల్యే మిరియాల శిరీష దేవి కోరారు. మంగళవారం ఆమె అరకు ఎమ్మెల్యే రేగం మత్యలింగంతో కలిసి మండల కేంద్రంలోని కస్తూరిబా గాంధీ బాలికల విద్యాలయాన్ని, రాజేంద్రపాలెం బాలికల ఆశ్రమ ఉన్నత పాఠశాలను సందర్శించి తనిఖీ చేశారు. కేజీబీవీలో కూరగాయలు, ఇతర ఆహార పదార్థాలు మరింత తాజాగా నాణ్యతగా ఉండేలా జాగ్రత్త పడాలని, వంట షెడ్డును పరిశుభ్రంగా ఉంచాలని కోరారు. పదో తరగతి విద్యార్థునులతో మాట్లాడుతూ – రానున్న పదో తరగతి పరీక్షల్లో ఉత్తమ ఫలితాలు సాధించాలని ఆకాంక్షించారు. కార్యక్రమంలో ఏపీఐఐసీ డైరెక్టర్ .. జి .పెద్దిరాజు. ఏపీ స్టేట్ నూర్ భాషా కార్పొరేషన్ ఫైనాన్స్ డైరెక్టర్ షేక్ సుభాన్,ఏపీ అసెంబ్లీ జాయింట్ సెక్రటరీ ... సుబ్బా రెడ్డి ఏపీ అసెంబ్లీ అసిస్టెంట్ సెక్రటరీ, నాగమున్నయ్య, తదితరులు పాల్గొన్నారు.

రోడ్డు ప్రమాదాల నివారణకు కఠిన చర్యలు

డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు ముమ్మరం : జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా

అనకాపల్లి, ఆగస్టు 4, ప్రభాతవార్త

జిల్లాలో రోడ్డు ప్రమాదాల నియంత్రణకు, ప్రజల ప్రాణాలను కాపాడేందుకు అనకాపల్లి జిల్లా పోలీసు శాఖ మరింత సమర్థవంతమైన చర్యలు చేపడుతోంది. నేషనల్ హైవే-16 అనకాపల్లి జిల్లా పరిధిలో అడ్వాన్స్‌డ్ ట్రాఫిక్ మేనేజ్‌మెంట్ సిస్టమ్ ద్వారా నమోదైన వీడియోల్లో ట్రాఫిక్ నిబంధనల ఉల్లంఘనలు అధికంగా గుర్తించబడిన నేపథ్యంలో, జిల్లా వ్యాప్తంగా కఠిన అమలు చర్యలతో పాటు విస్తృత అవగాహన కార్యక్రమాలు నిర్వహించాలని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా మంగళవారం ఆదేశాలు జారీ చేశారు. ఈ సందర్భంగా ఎస్పీ మాట్లాడుతూ ద్విచక్ర వాహనదారులు తప్పనిసరిగా ఐఎస్ఐ ప్రమాణాలు కలిగిన హెల్మెట్‌ను రైడర్, పిలియన్ రైడర్ ఇద్దరూ ధరించాలని, ట్రిపుల్ రైడింగ్, అతివేగం, రాంగ్ సైడ్ డ్రైవింగ్, ప్రమాదకర ఓవర్‌టేకింగ్, వాహనం నడుపుతూ మొబైల్ ఫోన్ వినియోగం, మద్యం సేవించి వాహనం నడపడం వంటి ఉల్లంఘనలకు దూరంగా ఉండాలని సూచించారు. ట్రాఫిక్ నిబంధనలు ఉల్లంఘించే వారిపై మోటారు వాహనాల చట్టం ప్రకారం ఎటువంటి మినహాయింపు లేకుండా చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. జిల్లాలోని జాతీయ, రాష్ట్ర రహదారులు, ప్రమాదాలకు గురయ్యే ప్రాంతాలు, విద్యాసంస్థలు, మార్కెట్లు, గ్రామాలు తదితర ప్రాంతాల్లో ప్రత్యేక అవగాహన కార్యక్రమాలు, తనిఖీలు, ప్రచార కార్యక్రమాలు నిర్వహించాలని పోలీసు అధికారులకు ఆదేశాలు జారీ చేసినట్లు తెలిపారు. ఈ కార్యక్రమానికి తోడ్పాటుగా పరవాడలోని ఫార్మజెల్ కంపెనీ తమ కార్పొరేట్ సామాజిక బాధ్యత నిధుల ద్వారా 8 బ్రీత్ అనలైజర్‌లను అనకాపల్లి జిల్లా పోలీసు శాఖకు మంగళవారం అందజేసింది. ఈ బ్రీత్ అనలైజర్‌ల ద్వారా జిల్లా వ్యాప్తంగా డ్రంక్ అండ్ డ్రైవ్ ప్రత్యేక తనిఖీలను మరింత విస్తృతంగా నిర్వహించి, మద్యం సేవించి వాహనాలు నడిపే వారిపై కఠిన చర్యలు తీసుకోవడంతో పాటు రోడ్డు ప్రమాదాల నివారణకు ఇవి ఎంతో ఉపయోగపడతాయని జిల్లా ఎస్పీ తుహిన్ సిన్హా తెలిపారు. ఈ సందర్భంగా సామాజిక బాధ్యతతో పోలీసు శాఖకు సహకరించిన ఫార్మజెల్ కంపెనీ వైస్ ప్రెసిడెంట్ ఎస్.అప్పారావు, హెచ్‌ఆర్ కె.వి.ఎస్.రవికృష్ణ ఇతర కంపెనీ ప్రతినిధులను జిల్లా ఎస్పీ ప్రత్యేకంగా అభినందించి కృతజ్ఞతలు తెలిపారు. ఈ కార్యక్రమంలో అదనపు ఎస్పీ ఎల్.మోహనరావు, అనకాపల్లి ట్రాఫిక్ ఇన్‌స్పెక్టర్ ఎం.వెంకటనారాయణ తదితరులు పాల్గొన్నారు.

పాఠశాల నిర్మాణానికి కేటాయించిన ప్రభుత్వ భూమిని పరిరక్షించండి

అనకాపల్లి, ఆగస్టు 4, ప్రభాతవార్త

అనకాపల్లి మండలం మామిడిపాలెంలోని జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాల లీఫ్ పాఠశాలగా ఇటీవల ఎంపికైనది. ఈ పాఠశాలకు ఆటస్థలం నిర్మాణం కోసం ప్రభుత్వం 2005 సంలో సర్వే నెం.145లో సుమారు 5 ఎకరాల ప్రభుత్వ భూమిని కేటాయించింది. అయితే, పాఠశాల ఆటస్థలం కోసం కేటాయించిన ఈ ప్రభుత్వ భూమి ప్రస్తుతం ఆక్రమణకు గురైందని పాఠశాల స్కూల్ మేనేజ్‌మెంట్ కమిటీ సభ్యులు మాజీ మంత్రి శాసనసభ్యులు కొణతాల రామకృష్ణకి వినతిపత్రం సమర్పించారు. విషయాన్ని తెలుసుకున్న ఎమ్మెల్యే కొణతాల రామకృష్ణ వెంటనే స్పందించి సంబంధిత రెవెన్యూ, పోలీస్ అధికారులతో మాట్లాడి, ఆక్రమణకు గురైన ప్రభుత్వ భూమిని తక్షణమే రికవరీ చేసి, పాఠశాల అవసరాల కోసం భూమిని పరిరక్షించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. ఈ సమస్యపై గతంలోనే అనకాపల్లి ఆర్డీవో, ఎమ్మార్వోలకు పలుమార్లు ఫిర్యాదు చేసినప్పటికీ తగిన చర్యలు చేపట్టలేదని స్కూల్ కమిటీ సభ్యులు ఆవేదన వ్యక్తం చేశారు. విద్యార్థుల భవిష్యత్తును దృష్టిలో ఉంచుకుని పాఠశాల ఆటస్థలం కోసం కేటాయించిన ప్రభుత్వ భూమిని ఆక్రమణల నుంచి రక్షించి, వెంటనే పరిరక్షణ చర్యలు చేపట్టాలని వారు కోరారు.

దివంగత మండలి వెంకట కృష్ణారావు ఆశయాలు అందరికీ ఆదర్శనీయం

జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్

అనకాపల్లి ఆగస్టు 4, ప్రభాతవార్త

మాజీ మంత్రి దివంగత మండలి వెంకట కృష్ణారావు జయంతి సందర్భంగా మంగళవారం జిల్లా కలెక్టరేట్‌లో పిజిఆర్ సమావేశం మందిరంలో ఆయన చిత్రపటానికి జిల్లా కలెక్టర్ విజయ్ కృష్ణన్ పూలమాలలు వేసి ఘనంగా నివాళులర్పించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ మొదటి ప్రపంచ తెలుగు మహాసభల నిర్వహణలో మండలి వెంకట కృష్ణారావు కీలక పాత్ర పోషించారని, తెలుగు భాష, సంస్కృతుల పరిరక్షణకు ఆయన చేసిన సేవలు కొనియాడారు. 1977 దివిసీమ ఉప్పెన సమయంలో బాధితులకు ఆయన అందించిన పునరావాస సేవలు, చూపిన మానవతా దృక్పథం ఇప్పటికీ ప్రజల గుండెల్లో చిరస్థాయిగా నిలిచిపోయాయని పేర్కొన్నారు. ప్రజా ప్రతినిధిగా, మంత్రిగా గ్రామీణాభివృద్ధికి, పేదల సంక్షేమానికి ఆయన ఎంతో కృషి చేశారని, ఆయన అందించిన స్ఫూర్తితో ప్రజాసేవలో నేటి తరం ముందంజలో ఉండాలని ఆకాంక్షించారు. ఈ కార్యక్రమంలో జిల్లా రెవెన్యూ అధికారి, వివిధ శాఖల జిల్లా అధికారులు, కలెక్టరేట్ సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

ఆధ్యాత్మికతలో పరవశించిన ఏఎల్ పురం

పద్మావతి కళ్యాణ మండపంలో సామూహిక సత్యనారాయణ స్వామి వ్రతం -ఘనంగా శ్రీ వేంకటేశ్వర స్వామి దివ్య కళ్యాణ మహోత్సవం

గొలుగొండ, ఆగస్టు 4, ప్రభాతవార్త

శ్రీ సత్యనారాయణ స్వామి వ్రతకల్పం... శ్రీ వెంకటేశ్వర స్వామి దివ్య కళ్యాణం... శ్రీ రాజరాజేశ్వరి సమేత శ్రీ నీలకంఠేశ్వర స్వామి వారి రుద్రాభిషేకం ఒకే వేదికపై కనుల పండుగగా భక్తిశ్రద్ధలతో జరిగిన ఆధ్యాత్మిక కార్యక్రమాలు 108 జంటలు పాల్గొని వ్రతాలను నిర్వహించారు. మండలంలోని ఏ ఎల్ పురంలో ఉన్న చెక్క వెంకట పద్మావతి కల్యాణ మండపంలో నిర్వహించిన ఆధ్యాత్మిక కార్యక్రమాలు భక్తులను విశేషంగా ఆకట్టుకున్నాయి. అల్లూరి సీతారామరాజు వాసవీ క్లబ్ ఆధ్వర్యంలో, గ్రామ పురోహితులు వెలిది భద్రాద్రి రాముడు నేతృత్వంలో ఈ మహోత్సవాలు వైభవంగా నిర్వహించారు. ఈ సందర్భంగా సామూహిక శ్రీ సత్యనారాయణ స్వామివారి వ్రతాలు, శ్రీ రాజ రాజేశ్వరి సమేత స్వయంభూ నీలకంఠేశ్వర స్వామివారి రుద్రాభిషేకం, అలాగే శ్రీదేవి, భూదేవి సమేత శ్రీ వేంకటేశ్వర స్వామివారి దివ్య కళ్యాణ మహోత్సవం వేదమంత్రోచ్చారణలతో ఈ ప్రాంతం పరవశించింది. గోవింద నామ స్మరణతో భక్తులు ప్రత్యేక పూజలు, హోమాల్లో పాల్గొని వ్రతాలు నిర్వహించి తరించారు. ఈ ఎంతో విశిష్టతతో భక్తి శ్రద్ధలతో సర్వాంగ సుందరంగా నిర్వహించిన ఈ ఆధ్యాత్మిక కార్యక్రమం ఈ ప్రాంత ప్రజల్లో భక్తి పరిమళాన్ని నింపింది. మన్యంతోపాటు పరిసర ప్రాంతాల నుండి తరలివచ్చిన జంటలు వ్రతంలో కూర్చొని వేదమంత్రాలు ఉచ్చారణలో రథసంకల్పం పూర్తి చేయడంలో తరించారు. దీనికి తోడు మంగళ వాయిద్యాలు, భక్తుల గోవింద నామస్మరణతో కళ్యాణ మండపం మొత్తం పరవశంగా మారు మ్రోగాయి. కళ్యాణ మండపం ఒక్కసారిగా ఆధ్యాత్మిక కల సంతరించుకోవడంతో ఆలయ పరిసరాలు తలపించింది. పెద్ద సంఖ్యలో భక్తులు పాల్గొని స్వామివారిని దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించిన అనంతరం హాజరైన భక్తులందరూ స్వామివారిని దర్శించుకొని ప్రత్యేక పూజలు నిర్వహించారు. ఈ సందర్భంగా వాసవి క్లబ్ అధ్యక్షులు యక్కల రాజేశ్వరావు మాట్లాడుతూ గ్రామీణ ప్రాంతాల్లో ఆధ్యాత్మికత పెంపొందించేందుకే వైభవసంకల్పంగా కార్యక్రమం చేపట్టామని అన్నారు. ఇంతటి మహా కార్యక్రమం ఇంత వైభవంగా పూర్తి చేసేందుకు తరలివచ్చిన భక్తులకు, దాతలకు గ్రామాల నుండి తరలివచ్చిన పెద్దలకు, స్థానిక ఏఎల్ పురం గ్రామ పెద్దలకు, స్థానిక ధన్యవాదాలు తెలియజేశారు. అనంతరం భక్తులకు మహా అన్నప్రసాద వితరణ చేపట్టారు. భక్తులు అధిక సంఖ్యలో పాల్గొని తీర్థప్రసాదాలను స్వీకరించి స్వామివారి ఆశీస్సులు అందుకున్నారు. ఈ కార్యక్రమంలో వాసవి క్లబ్ కార్యదర్శి బి.పాపారావు, కోశాధికారి కుసుమంచి నానాజీ, జోనల్ చైర్పన్ చెక్క సతీష్ కుటుంబ సభ్యులు పాల్గొన్నారు.

ఐదో రోజుకు చేరిన లక్ష్మీదేవి కొండ సాగుదారులు చేస్తున్న ఆందోళన

నక్కపల్లి, ప్రభాతవార్త

మండలంలోని గునిపూడి గ్రామ సర్వే నెంబర్ 24/10 లక్ష్మీ దేవి కొండ పై పేదలు సాగు చేసుకుంటున్న భూములను ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ప్లాంట్ టౌన్ షిప్ ఏర్పాటు కొరకు ప్రభుత్వం సేకరణ చేపట్టలని చూస్తున్న నేపథ్యంలో ఆ భూసేకరణకి వ్యతిరేకంగా గత ఐదు రోజులుగా చేస్తున్న ఆందోళన మంగళవారం నాటికి చేరింది. పేద సాగు దార్లు లక్ష్మీదేవి కొండపై చేస్తున్న వంటావార్పు ఆందోళన విరమింపచేయాలని సూచించేందుకు తహశీల్దార్ విన్నిక్రృష్ణ, సర్కిల్ ఇన్స్పెక్టర్ మురళి దీక్ష శిబిరానికి చేరుకున్నారు. సాగుదారులతో వారి చర్చించారు. ఈ భూములు ప్రభుత్వ భూములని, వీటి మట్టూ ట్రెంచ్ కొట్టడానికి వచ్చిన భూమిసర్వేను సహకరించాలని తహశీల్దార్ చెప్పిన క్షణం ఆందోళనకారులు మాట్లాడుతూ మేము సాగు చేసుకుంటున్న భూములలో ఎలా ట్రెంచ్ కొడతారని తహశీల్దార్‌ను నిలదీశారు మేము గత ఎనబై సంవత్సరాలుగా సాగుచేసుకుంటున్న భూములకు పట్టాలు ఇవ్వాలని అర్జీలు పెట్టుకున్న అవి తిరస్కరించిన ప్రభుత్వ అధికారులు ప్రైవేట్ కార్పొరేట్ ఆర్సెలార్ మిట్టల్ నిప్పాన్ స్టీల్ ప్లాంట్ కంపెనీకి టౌన్ షిప్ కు మా సాగు భూములు ఎలా ఇస్తారని, మాకు ఒక న్యాయం, కార్పొరేట్ కంపెనీకి ఒక న్యాయమా అని ప్రశ్నించారు. పేదలకు పట్టాలు ఇవ్వడానికి అంగీకరించని చట్టాలు, కార్పొరేట్ కంపెనీకి భూములు ఇవ్వడానికి ఎలా చట్టాలు వర్తిస్తాయని అన్నారు. మా భూములు లేకపోతే మా బ్రతుకులు వీధిన పడతాయి, మా పిల్లలు భవిష్యత్తు నాశనం అవుతాయని ఎట్టి పరిస్థితుల్లోనూ భూములు ఇవ్వలేమని రెవెన్యూ అధికారులకు తేల్చి చెప్పారు. ఆందోళన చేస్తున్న సాగుదారుల కలిసేందుకు తహశీల్దార్, సర్కిల్ ఇన్స్పెక్టర్లకు వారి సమస్యలు చెప్పడంతో వివి తిరిగి వెళ్లిపోయారు. ఈ కార్యక్రమంలో ప్రభావిత రైతు సంఘం జిల్లా ప్రధాన కార్యదర్శి ఎం.అప్పలరాజు, సిపిఎం మండల కార్యదర్శి ఎం.రాజేష్, స్థానిక నాయకులు డి.కృష్ణ, వి.అప్పారావు, పి.గోవింద్, పి.అప్పారావు, బి.నాయుడు, ఎం.ముసలయ్య,ఎ.గోవింద్ తదితరులు ఉన్నారు.

వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ నిరసన దీక్షకు అనుమతి కోరుతూ దరఖాస్తు

గొలుగొండ, ఆగస్టు 4 ప్రభాతవార్త

డీఎస్సీ నియామకాల్లో చోటు చేసుకున్న అక్రమాలపై సిబిఐ విచారణ చేపట్టాలంటే వైయస్సార్ కాంగ్రెస్ పార్టీ రాష్ట్ర పార్టీ పిలుపు మేరకు ఈనెల 7వ తేదీన మండల కేంద్రంలో చేపట్టే నిరసన మండల పార్టీ అధ్యక్షుడు కొరుప్రోలు ఫణి శాంతారాం తెలిపారు. ఒక్క రోజు పాటు నిర్వహించే నిరసన దీక్ష శిబిరం ఏర్పాటుకు అనుమతి ఇవ్వాలని ఈ సందర్భంగా కోరుతూ అనుమతి కోసం వైయస్సార్ కాంగ్రెస్ మండల పార్టీ అధ్యక్షుడు కొరుప్రోలు ఫణి శాంతారాం ఆధ్వర్యంలో జడ్పిటిసి సుర్ల వెంకటగిరి బాబు, ఎంపీపీ గజ్జలపు మణికుమారి, జిల్లా వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీ ఎస్సి సెల్ మహిళా విభాగ అధ్యక్షురాలు లోచుల సుజాత పార్టీ నాయకులతో సంయుక్తంగా కలిసి గొలుగొండ ఎస్సై పి.రామారావుకు దరఖాస్తులు అందజేశారు. ఈ కార్యక్రమంలో మాజీ మండల పార్టీ అధ్యక్షుడు లెక్కల సత్యనారాయణ, వైస్ ఎంపీపీ సుర్ల బాబ్జి, గొలుగొండ మాజీ సర్పంచ్ కసిపెల్లి అప్పారావు, ఎలమంచిలి రఘురాం, పెదిరెడ్ల నూక రత్నం, ఎంపీటీసీలు, మాజీ సర్పంచులు, ముఖ్య నాయకులు పాల్గొన్నారు.

ఆగస్టు 15 లోపు పంట బీమా నమోదు పూర్తి చేయాలి : ఎంపీడీవో ఉలబాల శ్రీనివాసరావు

గొలుగొండ ఆగస్టు 4, ప్రభాతవార్త

కేంద్ర ప్రభుత్వం ప్రవేశపెట్టిన ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకంలో ప్రతి ఒక్క రైతు తమ పంటకు హేమ నమోదు చేయించుకొలని ఎంపీడీవో ఉలబాల శ్రీనివాసరావు అన్నారు. కొత్త మల్లంపేటలో ఏర్పాటు చేసిన సమావేశంలో పంటల భీమా నమోదు ప్రాముఖ్యతను రైతులకు వివరించారు. ఎటువంటి అనుకూల ప్రతికూల వాతావరణంలో అయినా పంటలకు సంభవించే నష్టాన్ని అధిగమించేందుకు బీమా ఎంతో ఉపయోగపడుతుందన్నారు. ప్రతి రైతు తమ పంట నమోదుతో పాటు బీమా నమోదు కూడా చేసుకోవాలని, 84 రూపాయలు బీమా సొమ్ముగా చెల్లించాలన్నారు. ఆగస్టు 15 లోపు పంటల బీమా నమోదు పూర్తి చేయాలని సూచించారు. ప్రకృతి వైపరీత్యాలు తుపానులు, కరువు, అకాల వర్షాలు వల్ల పంట దిగుబడి నష్టపోయిన రైతులకు ఆర్థిక సహాయం అందించటం ఈ పథకం ఒక్క ముఖ్య ఉద్దేశం అన్నారు. ఇందుకు రైతులు సులభమైన పద్ధతిలో నమోదు చేయించుకోవచ్చని ఎంపిక చేసిన పంటలకు, పంట ఋణం పొందిన సందర్భంలో సంబంధింత బ్యాంకు భీమా సొమ్ము ప్రీమియం వసూలు చేసి భీమా కంపెనీకి చెల్లిస్తుందన్నారు. ప్రజా సర్వీస్ కేంద్రాలు, మీసేవ సెంటర్లు, సచివాలయలో డిజిటల్ అసిస్టెంట్, స్థా పోస్ట్ ఆఫీస్, స్వయంగా రైతు మొబైల్ యాప్ ద్వారా నమోదు చేసుకోవచ్చన్నారు. రైతులకున్న కేంద్రాలకు తీసుకెళ్లాల్సిన పత్రాలు ఆధార్, భూమి పత్రాలు, పంట వేసిన ధృపత్రం, ఆధార్‌తో లింక్ అయిన ఫోన్ నెంబర్ తప్పనిసరిగా వెంట తీసుకొని వెళ్లాలన్నారు. ప్రభుత్వాలు కల్పించిన ఈ సదవకాశాన్ని ప్రతి రైతు సద్వినియోగం చేసుకొని ఇంతకు బీమా భద్రత కల్పించుకోవాలని ఈ సందర్భంగా అన్నారు. ఈ కార్యక్రమంలో చోద్యం కో-ఆపరేటివ్ బ్యాంక్ అధ్యక్షులు చిటికెల సాంబమూర్తి, వ్యవసాయ శాఖ అధికారి, అగ్రికల్చల్ అసిస్టెంట్, స్వర్ణ వార్డు సచివాలయ సిబ్బంది గ్రామ పెద్దలు రైతులు పాల్గొన్నారు.

బిడ్డకు తల్లిపాలు శ్రేయస్కరం

అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సునీత

కశింకోట,ఆగస్టు 4 ప్రభాతవార్త

తల్లి పాలు బిడ్డకు ఎంతో శ్రేయస్కరమని అంగన్‌వాడీ సూపర్‌వైజర్ సునీత అన్నారు. అంత ర్జాతీయ తల్లిపాల వారోత్సవాలు సందర్భంగా మండలంలోని తాళ్లపాలెం గ్రామంలో అంగన్ వాడీ 2 ఆధ్వర్యంలో మంగళవారం జరిగిన ర్యాలీలో సూపర్‌వైజర్ ముఖ్యఅతిథిగా విచ్చేసి తల్లిపాల ప్రాముఖ్యతను వివరిస్తూ బిడ్డకు అందించవలసిన ముర్రుపాలను, వాటిలో ఉండే పోషకాలను వివరించారు. తల్లి పాలు ఇవ్వడం వల్ల బిడ్డకు, తల్లికి కలిగే లాభాలను చెప్పారు. తల్లి తీసుకోవలసిన ఆహార నియమాలను తెలియజేశారు. కార్యక్రమంలో అంగన్‌వాడీ వర్కర్లు అమ్మాజీ, బోరమ్మ, ధనలక్ష్మి, ఆయాలు, ఆశాకార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు పాల్గొన్నారు.

ప్రజా సమస్యల పరిష్కారమే ప్రభుత్వ లక్ష్యం

మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్

రాంబిల్లి, ఆగస్టు 04, ప్రభాతవార్త

మండలంలోని తుఫాన్ బిల్డింగ్‌లో తాత్కాలిక మండల కార్యాలయంలో మంగళవారం నిర్వహించిన మండల పరిషత్ సర్వసభ్య సమావేశంలో ఎలమంచిలి ఎమ్మెల్యే సుందరపు విజయ్ కుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా మండలంలోని అభివృద్ధి పనులు, తాగు నీటి సరఫరా, రహదారుల నిర్మాణం, విద్య, వైద్యం, పారిశుద్ధ్యం, విద్యుత్, వ్యవసాయం తదితర అంశాలపై ఆయా శాఖల అధికారులతో సమగ్రంగా సమీక్ష నిర్వహించారు. అనంతరం ఎమ్మెల్యే మాట్లాడుతూ, ప్రజలకు సంబంధించిన ప్రతి సమస్యను అధికారులు బాధ్యతాయుతంగా స్వీకరించి, అందిన ప్రతి ఫిర్యాదుపై వెంటనే స్పందించి పరిష్కారం చూపాలని ఆదేశించారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాల ఫలాలు అర్హులైన ప్రతి ఒక్కరికీ సకాలంలో అందేలా అన్ని శాఖల అధికారులు సమన్వయంతో పనిచేయాలని సూచించారు. మండలంలోని గ్రామాల్లో విద్యుత్, తాగునీటి సరఫరాలో ఎలాంటి అంతరాయం తలెత్తకుండా ముందస్తు చర్యలు తీసుకోవాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. విద్యార్థుల సౌకర్యాన్ని దృష్టిలో ఉంచుకుని రాంబిల్లి నుండి లాలంకోడూరు వరకు పాఠశాలలు, కళాశాలలకు వెళ్లే విద్యార్థుల కోసం ఉదయం ఒక ట్రిప్పు, సాయంత్రం ఒక ట్రిప్పు అదనపు ఆర్టీసీ బస్సు నడిపేలా చర్యలు తీసుకోవాలని ఆర్టీసీ అధికారులకు సూచించారు. వెంకటాపురం నుండి కొత్తపట్నం వరకు రోడ్ ను ఆక్రమించి దుకాణాలను ఇళ్లను నిర్మించిన వాటిని ఆర్ అండ్ బి, రెవెన్యూ, పోలీసు వారు తక్షణమే తొలగించి ప్రమాదాలను నివారించాలన్నారు. రోడ్లపై భారీ వాహనాలు ఆపకుండా చర్యలు తీసుకోవాలని పోలీసు వారిని కోరారు. రోడ్డు ప్రమాదాల నివారణే కూటమి ప్రభుత్వ ప్రధాన లక్ష్యమని పేర్కొంటూ, డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీల విషయంలో పోలీసులు తీసుకుంటున్న చర్యలకు పూర్తి మద్దతు ఉంటుందని తెలిపారు. ప్రజల ప్రాణాల రక్షణే ముఖ్యమని భావించి, ఎమ్మెల్యేగా తాను ఒక్క ఫోన్ కాల్ కూడా చేసి పోలీసు విధుల్లో జోక్యం చేసుకోలేదని స్పష్టం చేశారు. గత ప్రభుత్వం ప్రజా సమస్యలను విస్మరించి నిర్లక్ష్య పాలన సాగించిందని విమర్శించిన ఆయన, కావాలని కుట్రలు పన్ని ప్రజల్లో భయాందోళనలు సృష్టించే వారిపై కఠిన చర్యలు తీసుకుంటామని హెచ్చరించారు. వాస్తవాలను వెలికితీసి కుట్రలను ఛేదిస్తామని స్పష్టం చేశారు. ఎలమంచిలి నియోజకవర్గ సమగ్ర అభివృద్ధే తమ ప్రభుత్వ లక్ష్యమని పేర్కొన్న ఎమ్మెల్యే, రైతులకు పంట బీమా సకాలంలో అందేలా అధికారులు ప్రత్యేక చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అలాగే శారదా నది గట్ల పటిష్టీకరణ కోసం అత్యవసరంగా ఎస్‌డీఆర్ఎఫ్ నిధులు మంజూరు అయ్యాయని, గత ప్రభుత్వ హయాంలో ఈ సమస్యను నిర్లక్ష్యం చేశారని ఆరోపించారు. ఈ సమావేశంలో మండల ప్రజాప్రతినిధులు, వివిధ శాఖల అధికారులు, మండల పరిషత్ సభ్యులు, ఇతర ప్రజాప్రతినిధులు పాల్గొన్నారు.

రాంబిల్లి మండల అంగన్వాడి కేంద్రాలలో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు

రాంబిల్లి, ఆగస్టు 04, ప్రభాతవార్త



ప్రపంచ తల్లిపాల వారోత్సవాల సందర్భంగా రాంబిల్లి మండలంలోని రాంబిల్లి, కుండలదేవుని పాలెం, వెంకయ్యపాలెం, గజరెడ్డిపాలెం, లోవపాలెం అంగన్వాడీ కేంద్రాల్లో మంగళవారం అవగాహన కార్యక్రమాలు నిర్వహించారు. ప్రతి సంవత్సరం ఆగస్టు 1 నుంచి 7 వరకు ప్రపంచ వ్యాప్తంగా తల్లిపాల వారోత్సవాలు నిర్వహించడం జరుగుతుంది. అంగన్వాడీ కార్యకర్తలు గర్భిణులకు, బాలింతలకు తల్లిపాల ప్రాముఖ్యతపై అవగాహన కల్పించారు. పుట్టిన గంటలోపే శిశువుకు తల్లిపాలు ఇవ్వడం, తొలి ఆరు నెలలు తల్లిపాలు మాత్రమే అందించడం వల్ల శిశువుకు అవసరమైన పోషకాలు, రోగనిరోధక శక్తి లభిస్తాయని వివరించారు. అంగన్వాడీ కార్యకర్తలు, ఆశా కార్యకర్తలు, గర్భిణులు, బాలింతలు, చిన్నారుల తల్లులు పాల్గొన్నారు.



పేటలో విస్తృతంగా ఇంటింటికీ టీడీపీ

నక్కపల్లి, ప్రభాతవార్త

ప్రభుత్వం ప్రతిష్టాత్మకంగా చేపట్టిన ఇంటింటికి టీడీపీ కార్యక్రమం టీడీపీ పట్టణ శాఖ అధ్యక్షులు యాళ్ళ వరహాలు బాబు ఆధ్వర్యంలో ఆ పార్టీ శ్రేణులు పట్టణంలోని పలు వార్డులలో మంగళవారం విస్తృత ప్రచారం చేపట్టారు. రాష్ట్ర హోం, విపత్తు నిర్వహణ శాఖల మంత్రి వంగలపూడి అనిత ఆదేశాల మేరకు పట్టణంలోని 70,71,72 బూత్‌లలో పర్యటించిన ఆ పార్టీ నేతలు పలువురు ప్రభుత్వ పథకాల అమలు గురించి విస్తృత ప్రచారం చేశారు. ఇందులో ముఖ్య అతిథులుగా పాల్గొన్న రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ పెదిరెడ్డి చిట్టిబాబు, రాష్ట్ర నాటక అకాడమీ డైరెక్టర్ పల్లా విలియం కేరి సహా ఆ పార్టీ నాయకులు పలువురు ఇంటింటికి తిరిగి పార్టీ గత రెండేళ్ల కాలంలో అమలు చేసిన సంక్షేమ అభివృద్ధి పథకాలకు సంబంధించి కరపత్రాలను అందజేసారు. రాష్ట్ర కాపు కార్పొరేషన్ డైరెక్టర్ పెదిరెడ్డి చిట్టిబాబు రాష్ట్రంలో ఎన్డీఏ ప్రభుత్వం రానున్న కాలంలో అమలు చేయి తలపెట్టిన అభివృద్ధి సంక్షేమ కార్యక్రమాల గురించి పట్టణ వాసులకు వివరించారు. టీడీపీ సీనియర్ నాయకులు జూరెడ్డి ప్రసాద్,యాళ్ళ సన్యాసిరావు,మండల తెలుగు యువత అధ్యక్షులు గొల్లపల్లి నాగు,పట్టణ ఉపాధ్యక్షులు చిరుకూరి పేర్రాజు, బూత్ ఇన్చార్జులు బోడపాటి శ్రీను, కడియం శివ, అధిక సంఖ్యలో ఆ పార్టీ నాయకులు, కార్యకర్తలు పాల్గొన్నారు.

భూములు కోల్పోయిన రైతులకు న్యాయం చేయాలి

లేని పక్షంలో భారీ ఆందోళన.. వైసీపీ నేతలు, నిర్వాసిత రైతులు హెచ్చరిక

రాంబిల్లి, ఆగస్టు 04, ప్రభాతవార్త

అనకాపల్లి జిల్లా రాంబిల్లి మండలం, మన్యం చింతువా, జిరాయితీ చింతువా పంచాయతీ పరిధిలో రెన్యూ సోలార్ ప్రాజెక్టు, గూగుల్ డేటా సెంటర్ ఏర్పాటుకు సుమారు 300 ఎకరాల భూమిని ప్రభుత్వం కేటాయించిందని, ఈ నేపథ్యంలో భూములు కోల్పోయిన రైతులు, నిర్వాసితులు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొంటున్నారని రాంబిల్లి వైసీపీ మండల అధ్యక్షుడు పి. కిషోర్ రాజు, వైసీపీ సీనియర్ నాయకుడు గొట్టుముక్కల శ్రీనుబాబు, బాధిత రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ప్రాజెక్టుల కోసం భూములు కోల్పోయిన అనేక మంది రైతులు జీవనాధారాన్ని కోల్పోయి ఉపాధి లేక ఇబ్బందులు పడుతున్నారని తెలిపారు. పరిశ్రమల ఏర్పాటుతో స్థానికులకు ఉద్యోగాలు కల్పిస్తామని హామీ ఇచ్చినప్పటికీ ఇప్పటి వరకు భూములు కోల్పోయిన రైతు కుటుంబాలకు తగిన ఉపాధి అవకాశాలు కల్పించకపోవడమే కాకుండా భూములు పోలేని బయట వ్యక్తులకు ఉపాధి కల్పిస్తున్నారని ఆరోపించారు. అలాగే భూముల్లో ఉన్న కొన్ని కొబ్బరి చెట్లను తొలగించారు, మరికొన్ని చెట్లను కంపెనీ పరిధిలో ఉంచుకొని చుట్టూ ఫెన్సింగ్ వేసేసారు. వాటికి సంబంధించిన నష్టపరిహారం ఇప్పటికీ చెల్లించలేదని పేర్కొన్నారు. చెట్ల విలువను అంచనా వేసి వెంటనే నష్టపరిహారం అందించాలని డిమాండ్ చేశారు. ప్రాజెక్టు పనులలో భాగంగా తొలగించిన కొబ్బరి చెట్లను సమీపంలోని చెరువుల్లో వేసి కప్పివేయడం వల్ల రానున్న వర్షాకాలంలో చెరువులలో ఉండవలసిన నీరు రోడ్లపైకి, సమీప గ్రామాల ఇళ్లలోకి చేరి ప్రజలు తీవ్ర ఇబ్బందులు ఎదుర్కొనే ప్రమాదం ఉందని ఆందోళన వ్యక్తం చేశారు. ఈ సమస్యలపై జిల్లా ఉన్నతాధికారులు, సంబంధిత శాఖల అధికారులు వెంటనే స్పందించి పరిశీలన జరిపి శాశ్వత పరిష్కార చర్యలు చేపట్టాలని వారు కోరారు. భూములు కోల్పోయిన రైతులకు నష్టపరిహారం చెల్లించి, ఉద్యోగ అవకాశాలు కల్పించాలని కోరారు. లేనిపక్షంలో నిర్వాసిత రైతులు, గ్రామస్తులతో కలిసి పెద్ద ఎత్తున ఆందోళన కార్యక్రమాలు చేపట్టాల్సి వస్తుందని హెచ్చరించారు.

తీడ గ్రామంలో బీజేపీ పదాధికారుల సమావేశం

కసింకోట, ఆగస్టు 4, ప్రభాతవార్త

కశింకోట మండలం, తీడ గ్రామంలో భారతీయ జనతా పార్టీ "మండల పదాధి కారుల విస్తృత కార్యకర్తల సమావేశం మంగళవారం ఘనంగా జరిగింది. ఈ సమావేశం మండల అధ్యక్షులు అప్పికొండ అప్పారావు ఆధ్వర్యంలో జరిగింది. ఈ సమావేశానికి ముఖ్యఅతిథిగా జిల్లా అధ్యక్షులు ద్వారపూరెడ్డి పరమేశ్వరరావు, బిజెపి సీనియర్ నాయకులు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు పొనగంటి అప్పారావు, జిల్లా ప్రధాన కార్యదర్శి బొడ్డేడ నాగేశ్వరరావు, కశింకోట మండల ఇంచార్జ్ హగ్గాల హనుమంత్ రావు, జిల్లా ఐటీ సెల్ కన్వీనర్ కొణతాల సాయిరాం, జిల్లా కోశాధికారి ఎంఎం నాయుడు జిల్లా యువమోర్చ స్పోర్ట్స్ సెల్ బి.శ్రీనివాసరావు, మండల ఉపాధ్యక్షులు తమరాన దాలినాయుడు, ఓబీసీ మోర్చా జిల్లా సెక్రటరీ రౌతు తలుపులు రాజు, ఓబీసీ మోర్చా మండల అధ్యక్షులు డి.పోతురాజు, జిల్లా మాజీ సర్వీస్ మెన్ సెల్ కో-కన్వీనర్ ప్రగడ నూకరాజు కచ్చాల గణేష్, కశింకోట మాజీ ఎంపీటీసీ సన్యాసిరావు, సోషల్ మీడియా కో-కన్వీనర్ పంచాడ గంగరాజు పాల్గొన్నారు.

అంబేద్కర్ మేఘద్రి గడ్డ గురుకులాలను పరిరక్షించాలి : కనకరాజు

నక్కపల్లి, ప్రభాతవార్త

కొత్త ఐఐటీ, నీట్, జేఈఈ మెయిన్స్ గురుకులాన్ని ఏర్పాటు చేయాల్సింది పోయి విశాఖపట్నంలోని సుమారు 30 సంవత్సరాల చరిత్ర కలిగిన డాక్టర్ బి.ఆర్.అంబేద్కర్ గురుకులం ద్వారా వేలాది మంది విద్యార్థులు ఉన్నత విద్యను అభ్యసించి వివిధ రంగాల్లో స్థిరపడితే అలాంటి గురుకులంలో ఈ విద్యా సంవత్సరం వివిధ కోర్సులకు కోచింగ్ పేరుతో అక్కడ చదువుతున్న సుమారు 500 మంది విద్యార్థులను విశాఖపట్నం, అనకాపల్లి, విజయనగరం జిల్లాల్లోని ఇతర గురుకులాలకు తరలించడం బాధాకరమైన విషయం అని ఆంధ్రప్రదేశ్ పూర్వ విద్యార్థుల సంఘం ప్రతినిధి కనకరాజు స్వేరో తెలిపారు. విద్యార్థులను ఇప్పటికే ఉన్న గురుకులాల నుంచి తరలించడం కాకుండా, వివిధ కోర్సులకు కోచింగ్ కోసం ప్రత్యేకంగా కొత్త గురుకులాన్ని నిర్మించి అందులోనే కోచింగ్ నిర్వహించాలని ఆయన ప్రభుత్వాన్ని కోరారు. దీనివల్ల ప్రస్తుతం చదువుతున్న విద్యార్థులకు ఎలాంటి ఇబ్బందులు కలగవని అన్నారు. ఈ అంశంపై విద్యాశాఖ మంత్రి నారా లోకేష్‌కి త్వరలో తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు, బహుజన సంఘాల ప్రతినిధులతో కలిసి వినతిపత్రం అందజేస్తామని తెలిపారు. ప్రభుత్వం విద్యార్థుల ప్రయోజనాలను దృష్టిలో ఉంచుకొని కొత్త గురుకులాన్ని ఏర్పాటు చేసి, తరలించిన విద్యార్థులను తిరిగి వారి అసలు గురుకులంలో చేర్పించాలని ఆయన డిమాండ్ చేశారు. అలా చేయకపోతే తల్లిదండ్రులు, పూర్వ విద్యార్థులు, విద్యార్థి సంఘాలు, బహుజన సంఘాలతో కలిసి ప్రజాస్వామ్య బద్ధంగా ఉద్యమాన్ని చేపట్టేందుకు సిద్ధంగా ఉన్నామని ఆంధ్రప్రదేశ్ పూర్వ విద్యార్థుల సంఘం తెలిపారు.

దివంగత ఎగ్గాడ నాగేశ్వరరావు సేవలు మరవరానివి

అనకాపల్లి, ఆగస్టు 4, ప్రభాతవార్త

దళిత బహుజన సంఘ జిల్లా నాయకుడు దివంగత ఎగ్గాడ నాగేశ్వరరావు సేవలు నిలుపుమానమని సీనియర్ న్యాయవాది ఐ ఆర్ గంగాధర్ అన్నారు. మంగళవారం అనకాపల్లి మండలం వేట జంగాల పాలెం గ్రామంలో దివంగత ఎగ్గాడ నాగేశ్వరరావు 25వ వర్ధంతి కార్యక్రమం ఘనంగా జరిగింది. ముందుగా నాగేశ్వరరావు విగ్రహానికి గంగాధర్ పూలమాల వేసి నివాళులర్పించారు. ఈ సందర్భంగా గంగాధర్ మాట్లాడుతూ అణగారిన వర్గాల హక్కుల కోసం నిరంతరం పోరాడుతూ పేదలకు అండగా ఉండే వ్యక్తి నాగేశ్వరావు అని గంగాధర్ అన్నారు. గ్రామీణ పేదల తరఫున ఎన్నో సామాజిక ఉద్యమాలు నడిపిన చరిత్ర నాగేశ్వరావుకే దక్కిందని గంగాధర్ కొనియాడారు. నాగేశ్వరావు లేని లోటు పూర్చలేనిదని ,అతన్ని ఆదర్శంగా చేసుకొని నేటి యువత సామాజిక చైతన్యంతో హక్కుల కోసం పోరాడాలని గంగాధర్ పిలుపునిచ్చారు. ఈ సమావేశానికి దళిత సమన్వయ కమిటీ జిల్లా కన్వీనర్ యగ్గాడ భాస్కరరావు అధ్యక్షత వహించారు. ఈ సందర్భంగా భాస్కర్ మాట్లాడుతూ నాటి యువతరంలో ఉత్తేజాన్ని రగిలించి సామాజిక చైతన్యంతో హక్కుల ఉద్యమాలు జరిపిన నాయకుడు నాగేశ్వరరావుని నాటి జ్ఞాపకాలను గుర్తు చేశారు. ఈ సమావేశంలో వేట జంగాల పాలెం మాజీ సర్పంచ్ పూడి చిన్నారావు, మాజీ ఎంపీటీసీ తేలపు గోవిందు, వైసిపి యువజన నాయకుడు బొడ్డు యాకోబు, జనసేన పార్టీ నాయకుడు కర్రీ వెంకట అప్పారావు, తేలపు రామారావు, యువజన నాయకుడు గోరింతల గణేష్, గూన గంగాధర్, ఎగ్గాడ మనోజ్, గ్రామ పెద్దలు తమ్మిన రాము, అర్జున, బండి రాము తదితరులు పాల్గొన్నారు.



నక్కపల్లిలో తల్లిపాలు వారోత్సవాలు

నక్కపల్లి, ప్రభాతవార్త

నక్కపల్లి ఐసిడిఎస్ ప్రాజెక్టు పరిధిలో జాతీయ తల్లిపాలు వారోత్సవాలు సందర్భంగా ప్రాజెక్టు అధికారి శ్రీవిద్య ఆధ్వర్యంలో మంగళవారం ర్యాలీ నిర్వహించారు. అంగన్వాడీ సూపర్వైజర్లు సత్యవతి, కార్యకర్తలు దుర్గారాణి, వైద్య సిబ్బంది పాల్గొన్నారు.

ప్రత్యేక ఆర్థిక మండలి (సెజ్)కు సేకరించిన భూములను పరిశీలించిన జాయింట్ కలెక్టర్ శౌర్యమాన్ పటేల్

రాంబిల్లి, ఆగస్టు 04, ప్రభాతవార్త

ప్రత్యేక ఆర్థిక మండలి (ఎస్ఈజెడ్) రెండో విడత భూసేకరణలో ఉన్న గొరపూడి భూములను మంగళవారం జేసి శౌర్యమాన్ పటేల్ పరిశీలించారు. సేకరించిన భూముల్లో కొబ్బరి జీడి ఇతర చెట్లను లెక్కింపును త్వరగా పూర్తిచేయాలని సిబ్బందిని ఆదేశించారు. ఏపీఐఐసీ ప్రత్యేక ఉప కలెక్టర్ ఎస్‌డిసి అనిత, అడ్డరోడ్డు, నర్సీపట్నం రెవెన్యూ డివిజన్ల ఆర్డీవోలు రామలక్ష్మి, రమణలతో కలిసి భూములను పర్యవేక్షించారు. రీ సర్వేలో తమ భూములు హెచ్చుతగ్గులు నమోదు చేశారని ఇతరుల పేరుతో కొన్ని భూములు నమోదు అయ్యాయని చెట్ల గణలను రైతులు అడ్డుకున్నారు. లోపాలు లేని భూముల్లో చెట్ల గణన సిబ్బంది చేపట్టారు. భూసేకరణలో తొలగించే కుటుంబాలపై జెసి ఆరా తీశారు. భూసేకరణ వేగవంతం చేయాలని ఏపీఐఐసీ ఎస్‌డిసిను జెసి ఆదేశించారు.

ఎలినినో ప్రభావం.. ఎండిపోయిన గోస్తని..

విశాఖకు తాగునీటి సరఫరాపై ఆందోళన

ఆనందపురం, ఆగస్టు 4, ప్రభాతవార్త

విశాఖ నగరంలోని పలు ప్రాంతాలకు తాగు నీటిని అందించే ప్రధాన జలవనరుల్లో ఒకటైన గోస్తని నది ప్రస్తుతం ఎలినినో ప్రభావంతో వర్షా భావం కారణంగా దాదాపు ఎండిపోయింది. ఆనందపురం మండలం బోని వద్ద ఏర్పాటు చేసిన వాటర్ వర్క్స్ పంప్ హౌస్‌కు గోస్తని నది నుంచి నీటిని ఎత్తిపోసి శుద్ధి చేసి నగరానికి సరఫరా చేస్తారు. నదిలో నీటి మట్టం తగ్గిన ప్రతిసారి ప్రత్యామ్నాయంగా తాటిపూడి రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేసి పంప్ హౌస్‌కు నీటిని అందించే చర్యలను ప్రతి ఏడాది చేపడుతున్నారు. గోస్తని నదిలో ఏర్పాటు చేసిన మూడు ఇన్‌టేక్ (ఫిల్టర్) నిర్మాణాల ద్వారా నీటిని సేకరించి బోని వాటర్ వర్క్స్‌కు తరలిస్తారు. అక్కడి నుంచి నీటిని భారీ పైపులైన్ల ద్వారా ఎండాడ వద్ద గల బ్యాలెన్సింగ్ రిజర్వాయర్ కు తరలించి శుద్ధి చేసిన అనంతరం నగరంలోని పలు ప్రాంతాలకు సరఫరా చేస్తారు. సాధారణంగా పంపింగ్‌కు ఆటంకం లేకుండా ఉండాలంటే ఇన్‌టేక్ వెల్‌ల వద్ద తగిన స్థాయిలో నీటి నిల్వ అవసరం. బోని వద్ద గల గోస్తని జలవ్యవస్థకు విశాఖ నగరానికి రోజుకు సుమారు 4.5–5.1 మిలియన్ గ్యాలన్ల నీటిని సరఫరా సామర్థ్యం ఉంది. నీటి మట్టం గణనీయంగా తగ్గితే పంపింగ్ సామర్థ్యం దెబ్బతిని నగరానికి సరఫరాపై ప్రభావం పడే అవకాశం ఉంటుంది. దీంతో అధికారులు ఎప్పటికప్పుడు నీటి మట్టాన్ని పర్యవేక్షిస్తూ అవసరమైనప్పుడు తాటిపూడి రిజర్వాయర్ నుంచి నీటిని విడుదల చేయిస్తుంటారు. కానీ వర్షాలు లేని కారణంగా రిజర్వాయర్ లో కూడా గరిష్ట స్థాయిలో నీటి నిల్వలు లేవు. దీంతో ప్రత్యామ్నాయ మార్గాలను అధికారులు అన్వేషిస్తున్నారు. బోని వాటర్ వర్క్స్ నుంచి రోజువారీగా లక్షలాది మంది ప్రజలకు తాగునీరు అందుతోంది. ముఖ్యంగా నగరంలోని తూర్పు, మధ్య ప్రాంతాలతో పాటు మధురవాడ, ఎంవీపీ కాలనీ, సీతమ్మధార, ద్వారకానగర్, సిరిపురం, ఆరిలోవ, హనుమంతవాక, గాజువాక పరిధిలోని కొన్ని ప్రాంతాలకు ఈ వ్యవస్థ ద్వారా నీటి సరఫరా జరుగుతోంది. అవసరాన్ని బట్టి సరఫరా పరిమాణంలో మార్పులు ఉంటాయి. ప్రస్తుతం వర్షాలు లేకపోవడంతో గోస్తని నదిలో సహజ ప్రవాహం లేకపోవడం ఆందోళన కలిగిస్తోంది. అయితే నగరవాసులకు తాగునీటి సరఫరాలో అంతరాయం కలగకుండా ప్రత్యామ్నాయ వనరుల ద్వారా నీటి సరఫరాను కొనసాగించడానికి చర్యలు చేపడుతున్నట్లు అధికారులు చెబుతున్నారు. రానున్న రోజుల్లో వర్షాలు లేకపోతే తాగునీటి నిర్వహణ మరింత కీలకంగా మారే అవకాశం ఉందని జలవనరుల నిపుణులు అభిప్రాయపడుతున్నారు.

అంగన్‌వాడీల సంక్షేమానికి టీడీపీ ప్రభుత్వం కట్టుబడి ఉంది : చింతకాయల పద్మావతి

తల్లిపాల వారోత్సవాల ర్యాలీలో పాల్గొని తల్లులకు అవగాహన

నర్సీపట్నం, ఆగస్టు 4 ప్రభాతవార్త

అంగన్వాడీలో తల్లుల సంక్షేమం కోసం ప్రభుత్వం అనేక చర్యలు తీసుకుంటుందని తల్లిపాల వారోత్స వాల ర్యాలీలో చింతకాయల పద్మావతి తెలిపారు. గొలుగొండ అంగన్‌వాడీ ప్రాజెక్టుల పరిధిలోని కేంద్రాలకు చీరలు, ఇండక్షన్ స్టవ్‌లు, కుక్కర్ల పంపిణీ మంగళవారం ఘనంగా జరిగింది. ఆంధ్ర ప్రదేశ్ రాష్ట్ర శాసనసభ స్పీకర్ చింతకాయల అయ్యన్నపాత్రుడు సతీమణి చింతకాయల పద్మావతి చేతుల మీదగా వీటిని అందజేశారు. అనంతరం నిర్వ హించిన తల్లిపాల వారోత్సవాల అవగాహన ర్యాలీలో ఆమె పాల్గొని, పసి పిల్లలకు తల్లిపాలు అందించడం వల్ల కలిగే ఆరోగ్య ప్రయోజనాలపై తల్లులకు అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో భాగంగా రెండు ప్రాజెక్టుల పరిధిలోని పలు మండలాలకు సామగ్రిని పంపిణీ చేశారు. నర్సీపట్నం ప్రాజెక్టు పరిధిలోని మాకవరపాలెం మండలంలోని 79 అంగన్‌వాడీ కేంద్రాలకు 158 చీరలు, 79 ఇండక్షన్ స్టవ్‌లు, 79 కుక్కర్లు అందజేశారు. అలాగే నర్సీపట్నం మండలానికి 180 చీరలు అందించారు. గొలుగొండ ప్రాజెక్టు పరిధిలోని గొలుగొండ, నాతవరం మండలాల్లోని 168 కేంద్రాలకు గానూ మొత్తం 336 చీరలు, 168 ఇండక్షన్ స్టవ్‌లు, 168 కుక్కర్లను పంపిణీ చేశారు. ఈ సామగ్రి పంపిణీ మరియు అవగాహన కార్యక్రమం అనంతరం చింతకాయల పద్మావతి మాట్లాడుతూ అంగన్‌వాడీ వ్యవస్థ పటిష్టతకు, వర్కర్ల సంక్షేమానికి తెలుగుదేశం పార్టీ, కూటమి ప్రభుత్వం ఎల్లప్పుడూ అండగా ఉంటుందని స్పష్టం చేశారు. అంగన్‌వాడీల నియామకాలు అయినా, వారి జీతాల పెంపు అయినా కేవలం టీడీపీ హయాంలోనే సాధ్యపడ్డాయని గుర్తుచేశారు. కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత అంగన్‌వాడీ సేవలను మరింత వేగవంతం చేసేందుకు 5జీ మొబైళ్లు అందజేయడంతో పాటు మినీ వర్కర్లను మెయిన్ వర్కర్లుగా ప్రమోట్ చేసిందని తెలిపారు. అలాగే రిటైర్‌మెంట్ బెనిఫిట్స్‌ను భారీగా పెంచిందని, గతంలో ఆయాలకు రూ.20,000 ఉంటే దాన్ని రూ 40,000కు, టీచర్లకు ఉన్న రూ.50,000 ఆర్థిక సాయాన్ని లక్ష రూపాయలకు పెంచిన ఘనత ఈ ప్రభుత్వానిదేనని కొనియాడారు. ఈ కార్యక్రమంలో జడ్పీటీసీ రమణమ్మ, తాండవ రిజర్వాయర్ చైర్మన్ కరక సత్యనారాయణ, అడిగర్ల నానిబాబు, నందిపల్లి వెంకటరమణ, సీడీపీఓలు రమణి, శ్రీగౌరి, అంగన్‌వాడీ సూపర్‌వైజర్లు, తదితరులు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

శిశువుల ఆరోగ్య రక్షణలో తల్లిపాలు ఎంతో కీలకం

డీఎంహెచ్‌వో డా.జగదీశ్వరరావు

ఆనందపురం, ఆగస్టు 4, ప్రభాతవార్త

శిశువుల ఆరోగ్య రక్షణలో తల్లిపాలు ప్రధాన పాత్ర పోషిస్తాయని మానసిక, శారీరక ఎదుగుదలకు తల్లిపాలు ఎంతో కీలకమని జిల్లా వైద్యారోగ్య శాఖ అధికారి డా.జగదీశ్వరరావు అన్నారు. మండలంలోని ఆనందపురం ప్రాథమిక ఆరోగ్య కేంద్రంలో మంగళవారం నిర్వహించిన ప్రపంచ తల్లిపాల వారోత్సవాల కార్యక్రమానికి ఆయన ముఖ్య అతిథిగా హాజరై మాట్లాడారు. శిశువు పుట్టిన వెంటనే ముర్రిపాలు పట్టించడం ద్వారా వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని, పుట్టినప్పటి నుంచి ఆరు నెలల వరకు తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని, అనంతరం అనుబంధ ఆహారంతో పాటు రెండేళ్ల వరకు తల్లిపాలను కొనసాగించాలని సూచించారు. తల్లిపాల వల్ల శిశు మరణాలను గణనీయంగా తగ్గించవచ్చని, తల్లి ఆరోగ్యం కూడా మెరుగుపడుతుందని తెలిపారు. ప్రతి నెల 9, 10 తేదీల్లో నిర్వహించే పీఎంఎస్ఎంఏ కార్యక్రమాల్లో గర్భిణులకు తల్లిపాల ప్రాముఖ్యతపై తప్పనిసరిగా అవగాహన కల్పించాలని వైద్య, ఐసీడీఎస్ సిబ్బందికి సూచించారు. గర్భధారణ మూడో నెల నుంచే తల్లిపాలపై అవగాహన కల్పిస్తే ఈ కార్యక్రమం మరింత విజయవంతమవుతుందని పేర్కొన్నారు. ఈ కార్యక్రమంలో జిల్లా వ్యాధి నిరోధక టీకాల అధికారి డా.లూసీ కార్డీలియా, జిల్లా ప్రోగ్రాం అధికారి డా.బి.ఉమావతి, అసిస్టెంట్ మలేరియా అధికారి బి.నాగభూషణరావు, వైద్యాధికారులు డాక్టర్ షబీనా భాను, డా.షహనాజ్ సాధియా, జిల్లా ఆశ కో–ఆర్డినేటర్ మణికుమారి, సామాజిక ఆరోగ్య అధికారి శ్రీనివాసరావు, ఆరోగ్య పర్యవేక్షకులు పార్వతమ్మ, కృష్ణమోహన్ తదితరులు పాల్గొన్నారు.

మాధవదారలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు కొరత

మాధవధార,ఆగస్టు 4, ప్రభాతవార్త

మాధవధార ఉడా కాలనీ నుంచి ఎన్‌జీజీఓఎస్ కాలనీ వరకు ప్రధాన రహదారిలో డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు సరిగ్గా చేయకపోవడంతో వాహనదారులు మద్యం సేవించి ఇష్టానుసారంగా వాహనాలు నడుపుతున్నారని పలువురు ఆవేదన వ్యక్తం చేస్తున్నారు. మాధవధార 48 బస్ స్టాప్ వద్ద, బిర్లా జంక్షన్ జాతీయ రహదారిని అనుకుని, మురళి నగర్ జంక్షన్, తెనేటి నగర్ ప్రధాన రహదారిలో, ఎన్‌జీజీఓఎస్ కాలనీ ప్రధాన రహదారిలో ఇలా మొత్తంగా ఐదు వైన్‌షాప్‌లు,బార్లు ఉన్నాయి. అయితే ఈ రహదారిలో రోడ్లపై ఇష్టానుసారంగా మందుబాబులు ద్విచక్ర వాహనాలు, కారులు, ఆటోలను రోడ్లపై పార్కింగ్ చేసి బహిరంగంగా మద్యపానం చేస్తూ అటుగా వెళుతున్న ప్రజలకు భయభ్రాంతులకు గురిచేస్తున్నారు. సాయంత్రం 6 గంటల నుంచి రాత్రి 11 గంటల వరకు ఈ రహదారిలో మద్యం సేవించి వాహనాలను పరిమితికి మించిన వేగంతో నడుపుతూ పలువురు ప్రజలను ప్రమాదాలకు గురిచేస్తున్నారు. మాధవధార 48 బస్ స్టాప్ వద్ద ఏర్పాటుచేసిన మద్యం దుకాణంతో ప్రజలు తీవ్ర అసహనం వ్యక్తం చేస్తున్నారు. ఈ రహదారిలో క్రమం తప్పకుండా ప్రతిరోజు డ్రంక్ అండ్ డ్రైవ్ తనిఖీలు చేపట్టాలని కోరుతున్నారు.అయితే ఇటీవల మాధవధార ప్రధాన రహదారిలో రోడ్డుపై నడుచుకొని వెళ్తున్న మహిళ మెడలో చైన్ స్నాచింగ్ జరగడంతో సాయంత్రం బయటకు వచ్చేందుకు మహిళలు భయభ్రాంతులకు గురి అవుతున్నారు.రానున్న శ్రావణమాసం, వినాయక చవితి, దసరా, కార్తీక మాసం పండుగలు నేపథ్యంలో మహిళలు, భక్తులు రోడ్లపై రావాలంటే భయభ్రాంతులకు గురి అవుతున్నారు. ఇటువంటి సంఘటనలపై పోలీసులు దృష్టి సారించి మందుబాబుల ఆగడలను కట్టడి చేయాలని కోరుతున్నారు.

రైఫిల్ షూటింగ్‌లో సెయింట్ అలోసియస్ పాఠశాలకు పతాకాలు

విశాఖపట్నం, ఆగస్టు 4 ప్రభాతవార్త

రైఫిల్ షూటింగ్‌లో సెయింట్ అలోసియస్ పాఠశాలకు మొట్టమొదటిసారిగా విజేతలుగా నిలిచారు. సెయింట్ అలోసియస్ ఆంగ్లో ఇండియన్ హైస్కూల్ విద్యార్థులు క్రీడా విభాగంలో సిబిఎస్ఈ అండర్ 19 రైఫిల్ షూటింగ్ క్రీడలో పాల్గొన్నారు. ఈ క్రీడా విభాగంలో మొట్టమొదటిసారిగా విద్యార్థులు రీమిల్ శ్యామ్ వెండి పథకాన్ని సాధించగా, పి.మహిత్ కాంస్య పథకాన్ని సాధించారు. ఈ సందర్భంగా పాఠశాల ప్రిన్సిపల్ రివెండర్ ఫాదర్ దేవుపల్లి జయ ప్రకాష్ విద్యార్థులను, కోచ్‌ను అభినందించారు. విద్యార్థులు మరిన్ని విజయాలు సాధించాలని ఆయన ఆశీర్వదించారు.

వర్షాభావ పరిస్థితుల్లో ఆరుతడి పంటలే లాభసాటి

రైతులకు ఏడీఏ బి. విజయ్ ప్రసాద్ సూచన

ఆనందపురం, ఆగస్టు 4, ప్రభాతవార్త

వర్షాభావ పరిస్థితులు, తక్కువ వర్షపాతం, ఎల్‌నినో ప్రభావాన్ని దృష్టిలో ఉంచుకొని రైతులు ఆరుతడి పంటలైన మినుములు, పెసలు, రాగి వంటి పంటలను సాగు చేస్తే లాభసాటిగా ఉంటుందని భీమిలి డివిజన్ వ్యవసాయ సహాయ సంచాలకులు బి.విజయ్ ప్రసాద్ తెలిపారు. మంగళవారం ఆనందపురం మండలం జగన్నాథపురం గ్రామం లో నిర్వహించిన వ్యవసాయ విస్తరణ కార్యక్రమం (ఎస్ఎంఏఇ)– వ్యవసాయ సాంకేతిక నిర్వహణ ఏజెన్సీ (ఆత్మ) కార్యక్రమంలో ఆయన పాల్గొని మాట్లాడారు. ప్రస్తుత వాతావరణ పరిస్థితులకు అనుగుణంగా పంటల ఎంపిక చేసుకోవాలని, శాస్త్రీయ సాగు విధానాలు, పీఎండీఎస్ సూచనలను పాటించడం ద్వారా మెరుగైన దిగుబడులు సాధించవచ్చని రైతులకు వివరించారు. మండల వ్యవసాయ అధికారి సి.హెచ్.సంధ్యారత్న ప్రభ మాట్లాడుతూ ఈ నెల 15 లోపు పంటల బీమాను నమోదు చేసుకోవాలని తెలిపారు. అర్హత కలిగిన రైతులందరూ గడువులోపు పంట బీమా నమోదు చేసుకొని ప్రకృతి వైపరీత్యాలు, ఇతర అనుకోని పరిస్థితుల వల్ల కలిగే నష్టాల నుంచి రక్షణ పొందాలని సూచించారు. వ్యవసాయ శాఖ సిబ్బంది, పాల్గొన్నారు.

గీతం ఆసుపత్రిలో ఎముకల పటుత్వ పరీక్షలు

విశాఖపట్నం,ఆగస్టు 4, ప్రభాతవార్త

జాతీయ ఎముకల, కీళ్ళ ఆరోగ్య పరిరక్షణ దినం సందర్భంగా గీతం విశ్వవిద్యాలయానికి అనుబంధంగా గల గీతం ఇనిస్టిట్యూట్ ఆఫ్ మెడికల్ సైన్సెస్ అండ్ రీసెర్చి (జిమ్సర్) వైద్య కళాశాల, ఆసుపత్రి ఆర్థోపెడిక్స్ విభాగం ఆధ్వర్యంలో మంగళవారం ఉచిత ఎముకల పటుత్వ పరీక్షలను నిర్వహించారు. ఆర్థోపెడిక్ విభాగం అధిపతి డా.పి.వి.శ్యామ్‌ప్రసాద్ ఆధ్వర్యంలో వైద్య నిపుణులు ఎముకలను ధృడంగా ఉంచుకోవడం, ఎముకలు బలహీన పడకుండా తీసుకోవలసిన జాగ్రత్తలను తెలియజేశారు. ఆరోగ్యకరమైన ఎముకలు, ఆరోగ్యకరమైన కీళ్ళు, ఆరోగ్యకమైన భారతదేశం అనే ఉద్దేశ్యంతో ఈ కార్యక్రమం పెదజాలరి పేటలోని గీతం పట్టణ ఆరోగ్య కేంద్రంలో నిర్వహించారు. ఈ వైద్య శిబిరంలో ఉచితంగా బోన్ మినరల్ డెన్సిటీ పరీక్షతో పాటు ఉచితంగా న్యూరోపతీ నిర్ధారణ, వివిధ వైద్య పరీక్షలు నిర్వహించి ఉచితంగా మందులను పంపిణీ చేశారు. డా.పి.వి.శ్యామ్ ప్రసాద్ మాట్లాడుతూ ఆరోగ్యకమైన ఎముకలు, కీళ్ళను కాపాడుకోవాల్సిన ప్రాముఖ్యత, అలాగే అవసరమైన జీవనశైలి మార్పుల ఆవశ్యకత గురించి రోగులకు సలహాలు ఇచ్చారు. జిమ్సర్ డాక్టర్‌లు, జిమ్సర్ వైద్య విద్యార్థులు పాల్గొన్నారు.

7న ‘నేతన్న సేవ’ ప్రారంభం

ఏటా రూ.25 వేల ఆర్థిక సాయం -దరఖాస్తులకు ఈ నెల 5 వరకు గడువు: పప్పు రాజారావు

గాజువాక,ఆగస్టు 4,ప్రభాతవార్త

రాష్ట్రంలో చేనేత వృత్తికి పునర్జీవం పోసేలా కూటమి ప్రభుత్వం చర్యలు చేపడుతోందని వీవర్స్ ఫైనాన్స్ కార్పొరేషన్ మాజీ డైరెక్టర్ పప్పు రాజారావు తెలిపారు. ఈ మేరకు సీఎం చంద్రబాబు, డిప్యూటీ సీఎం పవన్ కళ్యాణ్, మంత్రులు లోకేష్, సవితలకు ఆయన ధన్యవాదాలు తెలిపారు. ఆగస్టు 7న జాతీయ చేనేత దినోత్సవం సందర్భంగా చీరాలలో సీఎం చంద్రబాబు చేతుల మీదుగా ‘నేతన్న సేవ’ పథకాన్ని ప్రారంభించి, చేనేతలకు ఏటా రూ.25 వేల ఆర్థిక సాయం అందజేయనున్నట్లు వెల్లడించారు. అర్హులైన వారు ఈ నెల 5వ తేదీ సాయంత్రం 5 గంటల లోగా దరఖాస్తు చేసుకోవాలని కోరారు. మగ్గం నేసేవారికి 200 యూనిట్లు, మరమగ్గాలకు 500 యూనిట్ల ఉచిత విద్యుత్‌తో పాటు 50 ఏళ్లు దాటిన వారికి ఎన్టీఆర్ భరోసా పింఛన్లు, ముద్రా రుణాలు అందిస్తున్నట్లు పేర్కొన్నారు.

1,200 కిలోల రేషన్ బియ్యం స్వాధీనం

మల్కాపురం వద్ద బొలెరో సీజ్.. వ్యక్తి అరెస్టు

గాజువాక,ఆగస్టు4,ప్రభాతవార్త

అక్రమంగా తరలిస్తున్న 1,200 కిలోల పీడీఎస్ (రేషన్) బియ్యాన్ని మల్కాపురం పోలీసులు మంగళవారం స్వాధీనం చేసుకున్నారు. సీపీ ఆదేశాల మేరకు ప్రకాశ్ నగర్ జంక్షన్ వద్ద ఎస్ఐ పి.శ్రీను తనిఖీలు చేపట్టగా, పోలీసులను చూసి తప్పించుకునేందుకు యత్నించిన బొలెరో వాహనాన్ని అడ్డుకున్నారు. సోదా చేయగా రూ.18,000 విలువైన 1,200 కిలోల బియ్యం లభ్యమైంది. దుర్గానగర్‌కు చెందిన పూసర్ల అచ్చిబాబు (51) స్థానికంగా తక్కువ ధరకు బియ్యం కొనుగోలు చేసి చోడవరం తరలిస్తున్నట్లు అంగీకరించాడు. బియ్యం, వాహనాన్ని సీజ్ చేసి, నిందితుడిపై కేసు నమోదు చేసినట్లు పోలీసులు తెలిపారు.

ఆరిలోవలో ఘనంగా తల్లిపాల వారోత్సవాలు

ఆరిలోవ, ఆగస్టు 4, ప్రభాతవార్త

తూర్పు నియోజకవర్గం స్థానిక 13వ వార్డు ఆరిలోవలో ఉన్న ప్రభుత్వ ఆసుపత్రిలో 12, 13వ వార్డుల అంగన్వాడీ సిబ్బంది అర్బన్ ప్రాజెక్ట్ సిడిపిఓ నీలిమ ఆదేశాలు మేరకు సెల్వియా ఆధ్వర్యంలో మంగళవారం ఘనంగా తల్లిపాల వారోత్సవాలు నిర్వహించారు. ఈ సందర్భంగా వారు తల్లులు ఉద్దేశించి మాట్లాడుతూ గర్భిణీలకు, బాలింతలకు తల్లిపాలు యొక్క ప్రాముఖ్యతను తెలియజేశారు. బిడ్డ పుట్టిన తరువాత ఆరు నెలల వరకు కేవలం తల్లిపాలు మాత్రమే ఇవ్వాలని మరి ఏ ద్రవ పదార్థాలు గానీ ఇతర ఆహార పదార్థాలు గానీ తినిపించకూడదు అని ప్రజల్లో అవగాహన కల్పించారు. ఈ కార్యక్రమంలో డాక్టర్ సుప్రజా, అంగన్వాడీ కార్యకర్తలు, ఏఎన్ఎంలు, ఆశా వర్కర్లు తదితరులు పాల్గొన్నారు.

పేద విద్యార్థికి ‘కేఎన్ఆర్’ ఆర్థిక సాయం

గాజువాక,ఆగస్టు 4,ప్రభాతవార్త

ఆర్థిక ఇబ్బందుల వల్ల ఏ విద్యార్థీ చదువుకు దూరం కాకూడదని బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు (కేఎన్ఆర్) అన్నారు. జోగవానిపాలెంకు చెందిన ఆటో డ్రైవర్ రమణ తన కుమారుడు కేశవ్ పదో తరగతి సర్టిఫికేట్ల కోసం ఫీజు చెల్లించలేని స్థితిలో ఉన్నట్లు తెలుసుకుని ఆయన స్పందించారు. స్కూల్ యాజమాన్యంతో మాట్లాడి రూ.5 వేల ఫీజు తగ్గించడమే కాకుండా, మిగిలిన రూ.5,000 ఆర్థిక సాయాన్ని కేఎన్ఆర్ స్వయంగా అందించారు. సదరు విద్యార్థి తమ్ముడి ఫీజు చెల్లింపునకు కూడా దాతలు ముందుకు రావాలని కోరారు. కార్యక్రమంలో బీజేపీ నాయకులు ఒమ్మి రంగనాయకులు, బాటా శ్రీనివాస్ పాల్గొన్నారు.

సింహగిరిపై పాదాలమ్మ పండుగ మహోత్సవం

సింహాచలం, ఆగస్టు 4, ప్రభాతవార్త

సింహగిరి కొండపై కొలువై ఉన్న గ్రామదేవతలు శ్రీ ఉమామహేశ్వరి పాదాలమ్మ, శ్రీ బంగారమ్మ అమ్మవార్ల వార్షిక పండుగ మహోత్సవాలు మంగళవారం భక్తిశ్రద్ధల మధ్య సంప్రదాయబద్ధంగా వైభవంగా నిర్వహించారు. పులి వేషాలు, తీన్మార్ డప్పుల మోతలు, నాదస్వర మంగళవాయిద్యాలు, భక్తుల జయజయ ధ్వానాలతో కొండపై పండుగ వాతావరణం నెలకొంది.ఈ సందర్భంగా సింహాచలం దేవస్థాన కార్యనిర్వహణాధికారి జల్లేపల్లి వెంకట్రావు అమ్మవార్లను దర్శించుకుని ప్రత్యేక పూజలు నిర్వహించారు. దేవస్థానం తరఫున అమ్మవార్లకు పసుపు, కుంకుమ, నూతన వస్త్రాలు సమర్పించి ప్రత్యేక హారతులు సమర్పించారు. సింహగిరి క్షేత్రం సర్వకాల సుభిక్షంగా ఉండాలని, భక్తులందరిపై అమ్మవార్ల కరుణాకటాక్షాలు ప్రసరించాలని ప్రార్థించారు. సింహగిరి వర్కర్స్ యూనియన్ ఆధ్వర్యంలో భక్తులకి ప్రసాదం అందజేశారు. యూనియన్ అధ్యక్షులు కిరణ్, దాసరి పైడిరాజు, బంటుపిల్లి మహేష్ దేవస్థానం అధికారులు, సిబ్బంది, ఆలయ కమిటీ సభ్యులు, అర్చకులు, గ్రామ పెద్దలు, అధిక సంఖ్యలో భక్తులు పాల్గొన్నారు. గ్రామదేవతల పండుగ సందర్భంగా ఆలయ కమిటీ ఆధ్వర్యంలో సాయంత్రం నిర్వహించే అమ్మవారి అనుపు మహోత్సవానికి విస్తృత ఏర్పాట్లు చేసినట్లు అధికారులు తెలిపారు. ఈ ఉత్సవాన్ని తిలకించేందుకు పెద్ద సంఖ్యలో భక్తులు తరలిరానున్న నేపథ్యంలో అన్ని శాఖల అధికారులు సమన్వయంతో ఏర్పాట్లు పూర్తి చేశారు. సింహగిరి గ్రామదేవతల పండుగకు శతాబ్దాల చరిత్ర ఉందని, శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి వారి క్షేత్ర పరిరక్షక దేవతలుగా గ్రామదేవతలను భక్తులు విశ్వసిస్తూ ప్రతి ఏడాది అత్యంత భక్తి, శ్రద్ధలతో ఈ మహోత్సవాలను నిర్వహించడం ఆనవాయితీగా కొనసాగుతోందని అర్చకులు తెలిపారు. పండుగ మహోత్సవాల దృష్ట్యా మధ్యాహ్నం మూడు గంటల నుంచి శ్రీ వరాహ లక్ష్మీనరసింహస్వామి వారి దర్శనాలను తాత్కాలికంగా నిలిపివేసినట్లు దేవస్థానం అధికారులు తెలిపారు.

చిన్నారులకు నాణ్యమైన పోషకాహారం అందించాలి

గాజువాక, ఆగస్టు 4, ప్రభాతవార్త

చిన్నారుల ఆరోగ్యం, ప్రాథమిక విద్యలో అంగన్‌వాడీ కేంద్రాలు కీలక పాత్ర పోషిస్తున్నాయని బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు (కేఎన్ ఆర్) అన్నారు. జోగవానిపాలెంలోని అంగన్‌వాడీ కేంద్రాన్ని ఆయన సందర్శించి, అక్కడ అందుతున్న సేవలు, పోషకాహారం, పరిశుభ్రతను పరిశీలించారు. చిన్నారులు, గర్భిణులకు పాలు, గుడ్లు, బాలామృతం వంటి పోషకాహారాన్ని నిరంతరం సక్రమంగా అందించాలని సిబ్బందికి సూచించారు. అంగన్‌వాడీల్లో మౌలిక వసతుల మెరుగుదలకు కూటమి ప్రభుత్వం ప్రాధాన్యమిస్తోందన్నారు. బీజేపీ నాయకులు ఒమ్మి రంగనాయకులు, బాటా శ్రీనివాసరావు, శ్రీను, స్వామి పాల్గొన్నారు.

కార్యకర్తలే బీజేపీకి వెన్నుముక : కేఎన్ఆర్

గాజువాక,ఆగస్టు 4,ప్రభాతవార్త

భారతీయ జనతా పార్టీకి కార్యకర్తలే అసలైన వెన్నుముక అని బీజేపీ గాజువాక నియోజకవర్గ కన్వీనర్ కరణంరెడ్డి నరసింగరావు (కేఎన్ఆర్) అన్నారు. కొత్త గాజువాక హైస్కూలు రోడ్డులో మండల అధ్యక్షుడు ఒమ్మి రంగనాయకులు అధ్యక్షతన మంగళవారం మండల కార్యవర్గ సమావేశం జరిగింది. ఈ సందర్భంగా కేఎన్ఆర్ మాట్లాడుతూ పార్టీ రాష్ట్ర అధ్యక్షుడు పి.వి.ఎన్. మాధవ్, జిల్లా అధ్యక్షుడు పరశురామరాజు ఆదేశాల మేరకు సంస్థాగత బలోపేతానికి ప్రతి నెలా మొదటి వారంలో మండల సమావేశాలు నిర్వహిస్తున్నట్లు తెలిపారు. బూత్ స్థాయిలో పార్టీని బలోపేతం చేయడంతో పాటు స్థానిక ప్రజా సమస్యలను అధికారుల దృష్టికి తీసుకెళ్లి పరిష్కారానికి కృషి చేయాలని నాయకులు, కార్యకర్తలకు సూచించారు. కార్యక్రమంలో నాయకులు వి.రోహిణి, బాటా శ్రీను, సూరిబాబు, గోపిరవిశంకర్, దుర్గా ప్రసాద్, కాశీవిశ్వనాథం తదితరులు పాల్గొన్నారు.

వైజాగ్ టిఎంటి రీబార్స్ ఉత్పత్తిని తక్షణమే పునః ప్రారంభించాలి

-సీఐటీయూ ఉక్కు యూనియన్ డిమాండ్

గాజువాక,ఆగస్టు 4,ప్రభాతవార్త

విశాఖపట్నం స్టీల్‌ప్లాంట్‌లో గ్యాస్ కొరతతో నిలిచిపోయిన ‘టీఎంటి రీబార్స్’ ఉత్పత్తిని తక్షణమే ప్రారంభించాలని స్టీల్ ప్లాంట్ ఎంప్లా యీస్ యూనియన్ (సీఐటీయూ) యాజమాన్యాన్ని డిమాండ్ చేసింది. ఈ మేరకు మంగళ వారం సీఎండీ కార్యాలయంలో యూనియన్ నాయకులు వినతిపత్రం అందజేశారు. ఈ సందర్భంగా సీఐటీయూ అధ్యక్ష, ప్రధాన కార్యదర్శులు యు.రామస్వామి, జె.అయోధ్యరామ్ మాట్లాడుతూ ప్లాంట్ ఉత్పత్తులు మార్కెట్‌లో లభించకపోవడంతో ‘వైజాగ్ టీఎంటి ‘పేరిట నాసిరకం బ్రాండ్లు విక్రయమవుతున్నాయని ఆందోళన వ్యక్తం చేశారు. ప్రైవేట్ సంస్థల పోటీని తట్టుకుని, బ్రాండ్ విలువను కాపాడటానికి ఉత్పత్తిని వెంటనే పునఃప్రారంభించాలన్నారు. అలాగే ఎస్ఎంఎస్ విభాగంలో 320.250 మి.మీ. బ్లూమ్ కాస్టర్ల స్థానంలో 125.125 మి.మీ. బిల్లెట్ కాస్టర్లను ఏర్పాటు చేస్తే నేరుగా రీబార్, వైర్ రాడ్ మిల్లకు సరఫరా సులువవుతుందని సూచించారు. గతంలో కేంద్ర మంత్రి కుమారస్వామి హామీ ఇచ్చిన రూ.8,000 కోట్ల నిధులను తక్షణమే విడుదల చేయించాలని, బ్యాటరీ–6తో పాటు మిల్స్ ఆధునీకరణ చేపట్టి ప్లాంట్‌ను రక్షించుకోవాలని విజ్ఞప్తి చేశారు.

దొంగతనం కేసుల్లో ఆరుగురి అరెస్టు

గాజువాక, దువ్వాడ, స్టీల్ ప్లాంట్ పరిధిలో పోలీసుల చర్యలు -బైక్‌లు, ఐరన్ స్క్రాప్ సహా చోరీ సొత్తు స్వాధీనం

గాజువాక,ఆగస్టు 4,ప్రభాతవార్త

వేర్వేరు దొంగతనం కేసుల్లో ప్రమేయం ఉన్న ఆరుగురు నిందితులను గాజువాక, దువ్వాడ, స్టీల్ ప్లాంట్ పోలీసు బృందాలు మంగళవారం అరెస్టు చేసి రిమాండ్‌కు తరలించాయి. సౌత్ క్రైమ్ బ్రాంచ్ సీఐ జి.డి.బాబు, క్రైమ్ ఎస్ఐ రామకృష్ణ నేతృత్వంలో ప్రత్యేక పోలీసు బృందాలు ఈ తనిఖీలు చేపట్టాయి.

వేర్వేరు ప్రాంతాల్లో చోరీలు

గాజువాక, దువ్వాడ, స్టీల్ ప్లాంట్ పోలీస్ స్టేషన్ల పరిధిలో ఇటీవల ద్విచక్ర వాహనాల చోరీలు, వాహనాల డిక్కీల నుంచి విలువైన వస్తువులను అపహరించడం, పరిశ్రమల నుంచి ఐరన్ స్క్రాప్ దొంగిలించడం వంటి ఘటనలపై పోలీసులు ప్రత్యేక నిఘా ఉంచారు. సాంకేతిక సమాచారం ఆధారంగా విచారణ జరిపిన పోలీసులు మంగళవారం ఆరుగురు నిందితులను అదుపులోకి తీసుకున్నారు. వారి వద్ద నుంచి చోరీకి గురైన బైక్‌లు, ఐరన్ స్క్రాప్ సహా ఇతర సొత్తును స్వాధీనం చేసుకున్నట్లు అధికారులు వెల్లడించారు. నిందితులను కోర్టులో హాజరుపరచగా న్యాయమూర్తి రిమాండ్ విధించినట్లు పోలీసులు తెలిపారు.

నకిలీ ట్రేడింగ్ యాప్‌లతో మోసాలు

విశాఖపట్నం, ఆగస్టు 4 ప్రభాతవార్త



దుబాయ్ కేంద్రంగా సాగుతున్న అంత ర్రాష్ట్ర సైబర్ మోసాల ముఠాకు బ్యాంకు ఖాతాలను సమకూర్చి, మోస పూరితంగా వచ్చిన నగదును వివిధ మార్గాల్లో తరలిస్తున్న ముగ్గురు వ్యక్తులను విశాఖ సైబర్ క్రైమ్ పోలీసులు అరెస్ట్ చేశారు. నకిలీ ట్రేడింగ్ యాప్ ద్వారా ఇద్దరు బాధితుల నుంచి మొత్తం రూ.52.16 లక్షలు కాజేసిన కేసులో అరదండలు వేశారు. నగర పోలీస్ కమిషనర్ డాక్టర్ శంఖబ్రత బాగ్చి, ఆదేశాలతో సైబర్ క్రైమ్ పోలీసులు సాంకేతిక ఆధారాలు, బ్యాంకు లావాదేవీలు, క్షేత్రస్థాయి దర్యాప్తు ఆధారంగా ఈ కేసును ఛేదించారు నిందితులను కోర్టు హాజరు పరిచిన పోలీసులు 14 రోజుల రిమాండ్‌కు తరలించారు.

వాట్సాప్‌లో పరిచయం.. నకిలీ యాప్‌తో బురుడి...

విశాఖలోని ఓ విద్యాసంస్థలో లైబ్రేరియన్‌గా పనిచేస్తున్న వ్యక్తిని గుర్తుతెలియని సైబర్ నేరగాళ్లు వాట్సాప్ ద్వారా సంప్రదించారు. తాము అమెరికా స్టాక్ మార్కెట్ నిపుణులమని నమ్మించారు. అనంతరం స్లటోరో ఇన్ పేరుతో ఉన్న నకిలీ ట్రేడింగ్ యాప్‌ను డౌన్‌లోడ్ చేయించారు. తొలుత యాప్‌లో తప్పుడు లాభాలు చూపించి బాధితుడి నమ్మకాన్ని పొందారు.ఆ తర్వాత భారీ లాభాలు వస్తాయని ఆశ చూపిస్తూ షేర్లు, ఐపీవోల పేరుతో పలుమార్లు పెట్టుబడులు పెట్టించారు. ఈ క్రమంలో బాధితుడి నుంచి రూ.51.25 లక్షలు కాజేశారు. ఇదే తరహాలో మరో వ్యక్తిని కూడా మోసగించి రూ.91,500 స్వాహా చేశారు. ఇద్దరు బాధితుల నుంచి మొత్తం రూ.52,16,500 మోసపోయినట్లు దర్యాప్తులో తేలింది.

రూ.5 లక్షల లావాదేవీతో గుట్టురట్టు

బాధితుడి నుంచి బదిలీ అయిన రూ.5 లక్షలు తొలుత ఒక బ్యాంకు ఖాతాకు, అక్కడి నుంచి మరో ఖాతాకు బదిలీ అయినట్లు పోలీసులు గుర్తించారు. ఈ లేయర్–1, లేయర్–2 ఖాతాల కేవైసీ వివరాలు, బ్యాంకు స్టేట్‌మెంట్లు, మొబైల్ టవర్ లొకేషన్లు, ఇతర సాంకేతిక ఆధారాలను విశ్లేషించడంతో తెలంగాణకు చెందిన వ్యక్తుల ప్రమేయం బయటపడింది. వారిని విచారించగా అధిక కమీషన్‌కు ఆశపడి కుటుంబ సభ్యులు, స్నేహితులు, పరిచయస్తుల బ్యాంకు ఖాతాలను సేకరించి సైబర్ నేరగాళ్లకు ‘మ్యూల్ ఖాతాలు’గా అందించినట్లు వెల్లడైనట్లు పోలీసులు తెలిపారు.అరెస్టైన నిందితులు దుబాయ్‌లో ఉన్న షైబాజ్, సులేమాన్ తదితర పరారీలో ఉన్న నిందితుల తెలిపిన బ్యాంకు ఖాతాలను సేకరించినట్లు దర్యాప్తులో వెల్లడైంది. ఆ ఖాతాల్లోకి వచ్చిన సైబర్ మోసాల సొమ్మును నగదు రూపంలో ఉపసంహరించడం, యూపీఐ, డిమాండ్ డ్రాఫ్ట్, హవాలా మార్గాల్లో తరలించడం ద్వారా కమీషన్ పొందినట్లు పోలీసులు గుర్తించారు.

ముగ్గురు అరెస్ట్..

పోలీసులు అరెస్ట్ చేసిన నిందితులను హైదరాబాద్‌కు చెందిన సయ్యద్ అలీ అబ్బాస్ హుస్సేన్ జాఫ్రీ (30), షేక్ యూసుఫ్ (23), జాకీర్ హుస్సేన్ (24)గా గుర్తించారు. వీరిలో జాకీర్ హుస్సేన్ సాఫ్ట్‌వేర్ ఉద్యోగిగా పనిచేస్తున్నట్లు పోలీసులు తెలిపారు. నిందితుల నుంచి స్వాధీనం చేసుకున్న మొబైల్ ఫోన్లలో వాట్సాప్ సంభాషణలు, బ్యాంకు ఖాతాలకు సంబంధించిన వివరాలు, ఇతర కీలక డిజిటల్ ఆధారాలను పోలీసులు గుర్తించారు. వాటిని స్వాధీనం చేసుకుని ఫోరెన్సిక్ పరీక్షలకు పంపించారు. ఈ కేసులో విదేశాల్లో ఉన్న ప్రధాన నిందితులు, సైబర్ మోసాల నెట్‌వర్క్‌కు సంబంధించిన మరిన్ని వివరాలపై దర్యాప్తు కొనసాగుతోందని పోలీసులు తెలిపారు.

చోరీ వస్తువులు ఎవరైన కొనినా, అమ్మిన చర్యలు తప్పవు

స్క్రాప్ షాపులను పరిశీలించిన సీఐ ఎస్. శ్రీనివాస్

ఆరిలోవ, ఆగస్టు 4, ప్రభాతవార్త

ఆరిలోవ పోలీస్ స్టేషన్ పరిధిలో ఉన్న పాత సామాన్ల దుకాణాలను సీఐ ఎస్ శ్రీనివాస్, ఎస్సై రాజేశ్వరి సిబ్బందితో కలిసి మంగళవారం తనిఖీలు నిర్వహించారు. శ్రీకాంత్ నగర్, టిఐసి పాయింట్, అంబేద్కర్ జంక్షన్, చినగదిలి స్క్రాప్ షాపులలో రైల్వే, రహదారులపై ఉన్న ప్రభుత్వ వస్తువులు, విద్యుత్ సంబంధించిన చోరీ వస్తువులు ఉన్నాయేమో అని పరిశీలించారు. ఎట్టి పరిస్థితుల్లోనూ దొంగలించబడిన వస్తువులను కొనినా, అమ్మిన కఠిన చర్యలు తీసుకుటామని పాత దుకాణాల యజమానులను హెచ్చరించారు.

శ్రీదుర్గమ్మకి నాయిబ్రాహ్మణుల ఆషాఢం సారె

ఇంద్రకీలాద్రి, ఆగస్టు 4 ప్రభాతవార్త: అమ్మలగన్నమ్మ బెజవాడ శ్రీ దుర్గమ్మకి ఆలయంలోని నాయి బ్రాహ్మణులు ఆషాఢం సారెను వైభవంగా మంగళవారం సమర్పించారు. ఆలయ కేశఖండన శాలలో ముందుగా చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఇఓ వికె శీనా నాయక్ దుర్గమ్మ చిత్రపటానికి పూజాదికాలు సమర్పించారు. మంత్రోచ్ఛారణల నడుమ స్వాగతం పలికి దుర్గమ్మ సన్నిధికి తోడ్కొని వెళ్ళి పూజాదికాలు జరిపారు. అనంతరం సారెను 6వ అంతస్తులోని ఉత్సవ వద్ద సమర్పించారు.

దుర్గమ్మకి బంగారు హారం: శ్రీదుర్గమ్మకి మంగళవారం కర్నూలుకు చెందిన వెంకటేశ్వర రావు, రాజేశ్వరి దంపతులు రు.3లక్షల 88వేల విలువైన బంగారు హారాన్ని కానుకగా సమర్పించారు. దాతలకు దుర్గమ్మ దర్శన ఏర్పాట్లు చేసిన అనంతరం వేద పండితులు వారికి వేద ఆశీర్వచనం, అమ్మవారి చిత్రపటం, ప్రసాదాలను అందజేశారు.

దుర్గమ్మకి వైభవంగా ఆషాఢం సారె: శ్రీ కనకదుర్గమ్మని ఇంటి ఆడపెల్లుగా, ఆడపడుచుగా భావిస్తూ సారె పసుపు, కుంకుమలు, గాజులు, చీర,సారెలతో ఇంద్ర కీలాద్రికి భక్తులు తరలి వచ్చారు. ఆషాఢ సారె 21వ రోజు మంగళవారం శ్రీ కనకదుర్గమ్మ సన్నిధిలో మహిళల రద్దీ విశేషంగా పెరిగింది.

దుర్గమ్మకి బంగారుహారం కానుకగా అందిస్తున్న భక్తులు

సాయంత్రం 5 గంటల వరకు 39 సారె బృందాలు రాగా, సదరు బృందాలలో 16921మంది భక్తులు సారె సమర్పణకు వచ్చారు. సారె బృందాలకు ఉచిత దర్శనం, ఆశీర్వచనం అందించారు.

దుర్గమ్మ సేవలో హోంమంత్రి: దుర్గమ్మని మంగళవారం రాష్ట్ర హోంమంత్రి వంగల పూడి అనిత దర్శించుకున్నారు. మంత్రికి దుర్గమ్మ ప్రసాదం, శేషవస్త్రం, మెమెంటోలను చైర్మన్, ఇఓ అందించారు. వేదపండితులు వేదాశీర్వచనాలు పలికారు.

భక్తులకు జై భవానీ అంటూ మర్యాదగా మెలగాలి: దుర్గమ్మ దర్శనానికి వచ్చే భక్తులతో జై భవానీ అంటూ మర్యాదగా మెలగాలని ఇఓ సెక్యూరిటీ సిబ్బందికి ఆదేశాలిచ్చారు. మంగళవారం ఆయన సెక్యూరిటీ సిబ్బందితో నిర్వహించిన సమావేశంలో మాట్లాడుతూ భక్తులతో దురుసు ప్రవర్తన చూపితే విధులనుండి తొలగిస్తామని హెచ్చరించారు.

దుర్గమ్మకి ఆషాఢం సారెను తీసుకొచ్చిన నాయిబ్రాహ్మణులతో పాటు చైర్మన్, ఇఓ

ఆలయ కేశఖండనశాల, శానిటేషన్ కార్మికులకు ఆషాఢం సారె: దుర్గమ్మ ఆలయంలో పనిచేస్తున్న కేశఖండన శాల సిబ్బంది, శానిటేషన్ టెండర్ కార్మికులకు ఆషాఢ మాసం సందర్భంగా మంగళవారం చైర్మన్ బొర్రా రాధాకృష్ణ, ఈఓ వి.కె. శీనా నాయక్ దంపతులు ఘనంగా ఆషాఢ సారెను సమర్పించారు. శ్రీ అమ్మవారి భక్తులకు సేవలందిస్తున్న నాయి బ్రాహ్మణులు, పరిశుభ్రతను కాపాడటంలో కీలక పాత్ర పోషిస్తున్న కార్మికుల సేవలను ఈ సందర్భంగా ఇఓ, చైర్మన్లు అభినందించారు. కార్యక్రమంలో ఆలయ అధికారులు సంబంధిత శాఖ సిబ్బంది, సూపర్ వైజర్లు, పెద్ద సంఖ్యలో సిబ్బంది పాల్గొన్నారు.

తెలుగుజాతి ఖ్యాతిని విశ్వవిఖ్యాతం చేసిన మహనీయుడు మండలి వెంకటకృష్ణారావు

విజయవాడ, ఆగస్టు 4 ప్రభాతవార్త ప్రతినిధి: తెలుగుజాతి ఖ్యాతిని విశ్వవిఖ్యాతం చేసిన మహనీయుడు మండలి వెంకటకృష్ణారావు అని ఏపీ సిఎం చంద్రబాబు నాయుడు వ్యాఖ్యానించారు. మాజీ మంత్రి, తెలుగు భాషా పరిరక్షకులు దివంగత మండలి వెంకట కృష్ణారావు జయంతి సందర్భంగా క్యాంప్ కార్యాలయంలో ఆయన చిత్ర పటానికి ముఖ్యమంత్రి చంద్రబాబు నాయుడు నివాళులర్పించారు. ప్రపంచ తెలుగు మహాసభలను నిర్వహించడం ద్వారా దేశ, విదేశాల్లో భాషాభ్యుదయానికి కృషి చేసారన్నారు. ఆయన జయంతి ప్రతి ఏటా ప్రభుత్వం అధికారికంగా నిర్వహిస్తుందన్నారు. దివిసీమ ఉప్పెన సందర్భంలో ఆయన అందించిన సేవా కార్యక్రమాలు మరువలేనివన్నారు. దివిసీమ గాంధీగా ఆయన తుదివరకు గాంధేయవాదాన్ని నమ్ముకుని ముందుకు నడిచారన్నారు.

తెలుగు జాతి ఔన్నత్యాన్ని చాటిన మండలి వెంకట కృష్ణారావు: రాజకీయాన్ని ప్రజాసేవకు బాటగా మలచుకుని, ప్రతి అడుగులో ప్రజాహితాన్ని ముందుకు తీసుకువెళ్లిన ఉన్నత వ్యక్తిత్వం కలిగిన నాయకులు ఉమ్మడి ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర మాజీ మంత్రి దివంగత మండలి వెంకట కృష్ణారావు అని ఉపముఖ్యమంత్రి పవన్ కల్యాణ్ అన్నారు. ఈ మేరకు ఈ డీసీఎం నుంచి ఒక ప్రకటన విడుదల చేసారు. మంత్రి పదవిలో ఉన్నప్పటికీ ఆర్టీసీ బస్సులోనే ప్రయాణిస్తూ నిరాడంబర జీవనాన్ని సాగింయాని ఆయన వ్యక్తిత్వం నేటి తరానికి ఆదర్శప్రాయం. 1977లో ఉప్పెన రూపంలో దివిసీమను మహా విపత్తు చుట్టుముట్టిన సమయంలో ఓ కుటుంబ పెద్దలా బాధితుల బాధ్యతను భుజాన వేసుకుని, ప్రభావిత ప్రాంతాల పునర్నిర్మాణానికి ఆయన చేసిన కృషి చిరస్మరణీయం. 1975లోమొట్టమొదటి ప్రపంచ తెలుగు మహాసభలను నిర్వహించి, ప్రపంచవ్యాప్తంగా ఉన్న తెలుగు వారందరినీ ఒక వేదికపైకి తీసుకువచ్చి తెలుగుజాతి ఔన్నత్యాన్ని విశ్వవ్యాపితం చేశారు. తెలుగు భాష, సాహిత్యం, సంస్కృతి పరిరక్షణకు ఆయన చేసిన విశిష్ట సేవలను గుర్తించి కూటమి ప్రభుత్వం ఆంధ్రప్రదేశ్ అధికార భాషా సంఘానికి ఆయన పేరును పెట్టి గౌరవించింది. అలాగే ఆయన జయంతిని రాష్ట్ర ఉత్సవంగా నిర్వహిస్తోంది. ప్రజాసేవకు ప్రతీకగా, గాంధేయ జీవన విధానా నికి సజీవ రూపంగా నిలిచిన శ్రీ మండలి వెంకట కృష్ణారావు గారి శత జయంతి సందర్భంగా తెలుగు జాతికి ఆయన అందించిన విశిష్ట సేవలను స్మరించుకుంటూ, ఆ మహనీయునికి నివాళులు అర్పిస్తున్నానని డీసీఎం పేర్కొన్నారు

శ్రీకాళహస్తిలో ప్రతి భక్తునికి సుదర్శనం

● ఆడికృత్తిక ఉత్సవాల ఏర్పాట్లును సమీక్షించిన శ్రీకాళహస్తి ధర్మకర్తల మండలి చైర్మన్

కొండపై ఏర్పాట్లను పరిశీలిస్తున్న చైర్మన్, ఇఓ క్యూలైన్ల గురించి వివరిస్తున్న ఇఇ

శ్రీకాళహస్తి, ఆగస్టు 4 ప్రభాతవార్త: శ్రీకాళహస్తీశ్వరాలయంలోనూ, అనుబంధ ఆలయమైన విజ్ఞాన గిరిపై వెలసిన కుమారస్వామి ఆలయంలో నిర్వహిస్తున్న ఆడికృత్తిక బ్రహ్మోత్సవాల్లో ప్రధాన ఉత్సవాలు నేటి నుంచి (బుధవారం) ప్రారంభం కానున్నాయి. ఈ సందర్భంగా మంగళవారం ధర్మకర్తల మండలి చైర్మన్ కొట్టె సాయిప్రసాద్, ఆలయ ఇఓ బికె వెంకటేశులు, ఇఇ శ్రీనివాసులురాజు, డిఇఇ శ్రీనివాసులురెడ్డి, చిన్న ఆలయాల ఇన్‌చార్జి లక్ష్మయ్య, ఉద్యోగులు, సిబ్బందితో కలసి ఏర్పాట్లును సమీక్షించారు. ఈ సందర్భంగా ఆయన ఆలయానికి వస్తున్న భక్తులతో చర్చించారు. నారదపుష్కరిణిలో కొత్తగా వదలిన నీటిలో ఆలంను కలపాలని సూచించారు. మెట్లపై భక్తులు కర్పూరం వెలగించకుండా చర్యలు తీసుకోవాలని సూచించారు. భరణి, ఆడికృత్తికకు హాజరయ్యే భక్తులకు సుదర్శనం ఇతర సదుపాయాల కల్పనలో ఆలయాధికారులు తీసుకున్న ఏర్పాట్లకు సంబంధించి సమీక్షించారు. దర్శనం వేళలు కూడా పారదర్శకత పాటించాలని ఆలయ ఆర్చకునికి సూచించారు. సాధ్యమైనంత వరకు అంతరాలయ దర్శనాలకు స్వస్తి చెప్పాలని ఆదేశించారు.

భరణితో భక్తుల సందడి: శ్రీకాళహస్తీశ్వరాలయానికి అనుబంధంగా వెలసి కుమారస్వామి ఆలయంలో ప్రధాన ఉత్సవాలు భరణితో ప్రారంభమౌతుంది. ఈ నేపథ్యంలో ఆలయాధికారులు తగు జాగ్రత్తలు తీసుకుంటున్నారు. ముఖ్యంగా దర్శనాలకు కోనేరులో స్నానాలకు ప్రాముఖ్యత ఇస్తున్నారు. కోనేరులో నీరు లేకున్నా పంపింగ్ చేశారు. ఇది తెప్పోత్సవాలకు మాత్రమే ఉపయోగపడుతుంది. దాంతో భక్తులకు ప్రత్యేక స్నానఘట్టాల్ని ఏర్పాటు చేశారు. ట్యాంకర్లు పెట్టి డ్రమ్ములతో నీటిని నిల్వ చేశారు. భరణి సందర్భంగా బుధవారం మధ్యాహ్నం నుంచే భక్తులు తరలి వస్తారని అంచనా వేసి ఏర్పాట్లు చేపట్టారు. బుధవారం ఆడికృత్తిక సందర్భంగా ఎలాంటి ఇబ్బంది లేకుండా ఏర్పాట్లు చేపట్టారు.

గుంటూరులో అమరావతి చిత్రకళా వీధి ఉత్సవాలు

● విజయవాడలో ఉత్సవాల పోస్టరు ఆవిష్కరించిన మంత్రి కందుల దుర్గేష్

విజయవాడ, ఆగస్టు 4 ప్రభాతవార్త ప్రతినిధి: ఆంధ్రప్రదేశ్ రాష్ట్ర సృజనాత్మకత, సంస్కృతి కమిషన్ ఆధ్వర్యంలో గుంటూరు నగరంలో అత్యంత వైభవంగా నిర్వహించనున్న అమరావతి చిత్రకళా వీధి ఉత్సవానికి సంబంధించిన పోస్టర్‌ను రాష్ట్ర పర్యాటక, సాంస్కృతిక, సినిమాటోగ్రఫీ శాఖ మంత్రి కందుల దుర్గేష్ విజయవాడలోని తమ క్యాంపు కార్యాలయంలో ఆవిష్కరించారు. ఈ సందర్భంగా మంత్రి కందుల దుర్గేష్ మాట్లాడుతూ రాష్ట్ర సాంస్కృతిక వైభవాన్ని, కళాకారుల సృజనాత్మకతను ప్రపంచానికి చాటిచెప్పేలా ఈ భారీ కళా ఉత్సవాన్ని రూపకల్పన చేసినట్లు తెలిపారు. ఈ నెల8, 9 తేదీలలో (శని, ఆదివారాలు) ఉదయం 10:00 గంటల నుండి రాత్రి 8:00 గంటల వరకు గుంటూరు ఇన్నర్ రింగ్ రోడ్డు సమీపంలోని కొరిటేపాడు విద్యానగర్ రోడ్డులో ఈ కళా ఉత్సవం జరుగుతుందన్నారు. ప్రధానంగా సందర్శకులు స్వేచ్ఛగా తిలకించేలా ప్రత్యేక సాంస్కృతిక వీధి నిర్మాణం, దేశం నలుమూలల నుండి విచ్చేసే వివిధ రకాల చిత్రకళా ఉత్పత్తులు, హస్తకళల ప్రదర్శన, విక్రయాలకోసం 800కు పైగా స్టాల్స్, నిర్విరామంగా సాగే ప్రత్యక్ష కళారూపాలు, సంగీత విభావరి, వినోద కార్యక్రమాలకు 9 కళా వేదికలు, లైవ్ ఆర్ట్ ఇన్‌స్టాలేషన్స్, ప్రత్యేక ఫోటోబూత్‌లు, విభిన్న రుచులతో కూడిన ఫుడ్ కోర్టులు ఉంటాయన్నారు. గత ఏడాది రాజమహేంద్రవరంలో నిర్వహించిన చిత్రకళా వీధికి అపూర్వ స్పందన లభించిందని, ఆ విజయాన్ని స్ఫూర్తిగా తీసుకుని ఈ ఏడాది రాష్ట్ర ప్రజారాజధాని అమరావతికి అతిసమీపంలో ఉన్న గుంటూరులో మరింత అంగరంగ వైభవంగా ఏర్పాటు చేస్తున్నామని మంత్రి దుర్గేష్ తెలిపారు. ఇలాంటి వినూత్న కార్యక్రమాలు కళాకారుల ప్రతిభను విశ్వవ్యాప్తం చేయడానికి ఎంతో తోడ్పడతాయని ఉద్ఘాటించారు.

ఈ అద్భుత కళా ప్రదర్శనకు కళాభిమానులు, ప్రజలు, విద్యార్థులు పెద్ద ఎత్తున హాజరై, ఏపీ సాంస్కృతిక వైభవాన్ని ప్రతిబింబించే ఈ వేడుకను విజయవంతం చేయాలని మంత్రి కందుల దుర్గేష్ పిలుపునిచ్చారు. పోస్టర్ ఆవిష్కరణలో ఎపి సృజనాత్మక, సాంస్కృతిక సమితి చైర్‌పర్సన్ పొడపాటి తేజస్వి పాల్గొన్నారు.

డిఎస్సీ అక్రమాలపై సిబిఐ విచారణ జరిపించాలి

● విద్యా శాఖ మంత్రి లోకేష్ రాజీనామా చేయాలి ● మాజీ మంత్రి ఆర్.కె.రోజా

పుత్తూరు(నగరి), ఆగస్టు 4 ప్రభాతవార్త: రాష్ట్రంలో మెగా డిఎస్సీ నిర్వహణలో జరిగిన అక్రమాలపై సిబిఐ విచారణ జరిపించాలని, అవకతవకలకు బాధ్యత వహించి విద్యా శాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని వైఎస్సార్ కాంగ్రెస్ పార్టీకి చెందిన పర్యాటక శాఖ మాజీ మంత్రి ఆర్.కె.రోజా డిమాండ్ చేశారు. డిఎస్సీ అక్రమాలను నిరసిస్తూ వైసిపి విద్యార్థి, యువజన విభాగం ఆధ్వర్యంలో మంగళవారం నగరి పట్టణంలోని టౌన్ హాలులో నిర్వహించిన సమావేశంలో ఆమె ప్రసంగించారు. మెగా డిఎస్సీ పేరుతో దగా డిఎస్సీ నిర్వహించి అనర్హులకు ఉద్యోగాలు లభించేలా చీకటి జిఒలు తీసుకువచ్చారని ఆరోపించారు. ఫీజు రీఎంబర్స్‌మెంట్, నిరుద్యోగ భృతి, వసతి దీవెన వంటి పథకాలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలన్నారు. విద్యార్థులకు ఈ పథకాలు అందే వరకూ వైసిపి పోరాటం కొనసాగిస్తుందని తెలిపారు. డిఎస్సీ అక్రమాలపై సిబిఐ విచారణ నిర్వహించి అనర్హులకు ఇచ్చిన ఉద్యోగాలు రద్దు చేసి అర్హులైన అభ్యర్థులకు న్యాయం చేయాలని డిమాండ్ చేశారు. నారా లోకేష్ విద్యా శాఖ మంత్రిగా బాధ్యతలు చేపట్టినప్పటి

నుంచి విద్యా వ్యవస్థ పూర్తిగా దెబ్బతిందని విమర్శించారు. నీట్ పేపర్ లీకేజీలో కేంద్ర విద్యా శాఖ మంత్రి ధర్మేంద్ర ప్రధాన్ రాజీనామా చేసిన నేపథ్యంలో డిఎస్సీలో అక్రమాలపై లోకేష్ ఎందుకు రాజీనామా చేయరని ప్రశ్నించారు. పార్టీ జిల్లా అధ్యక్షుడు భూమన కరుణాకర్‌రెడ్డి మాట్లాడుతూ డిఎస్సీ అక్రమాలపై సిబిఐ విచారణ, అందుకు బాధ్యత వహిస్తూ లోకేష్ రాజీనామా చేసే వరకూ వైసిపి తన పోరాటం ఆపదన్నారు. సమావేశంలో పార్టీ నియోజకవర్గ పరిశీలకుడు రాహుల్ రాజారెడ్డి, రాష్ట్ర యువజన కార్యదర్శి కాయం గాంధి, ఎస్ఐఆర్ రాష్ట్ర పరిశీలకుడు వజ్రభాస్కర్‌రెడ్డి, నియోజకవర్గ యువత అధ్యక్షుడు యువరాజ్, మండల యువత అధ్యక్షులు, నియోజకవర్గ నాయకులు, కార్యకర్తలు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

విద్య, వసతి, వికాసంలో దాతలు భాగస్వాములు కావాలి

● నెల్లూరు జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల పిలుపు ● వినూత్న ప్రయత్నం అభినందనీయం

● ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, కాకర్ల సురేష్, వెంకట కృష్ణారెడ్డి

నెల్లూరు(కలెక్టరేట్), ఆగస్టు 4 ప్రభాతవార్త: ప్రభుత్వ హాస్టళ్లలో చదువుకుంటున్న నిరుపేద విద్యార్థుల ఉజ్వల భవిష్యత్తు కోసం జిల్లాలో వినూత్నంగా చేపట్టిన విద్య, వసతి, వికాసం కార్యక్రమంలో జిల్లాలోని ప్రముఖ పారిశ్రామికవేత్తలు, స్వచ్ఛంద సంస్థలు, దాతలు కూడా తమ భాగస్వామ్యాన్ని పంచుకోవచ్చని, విద్యార్థులకు అవసరమైన వసతులు, సామాగ్రిని హాస్టళ్లకు సమకూర్చేందుకు స్వచ్ఛందంగా ముందుకు రావాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. దాతలు అందించిన సామాగ్రి, పరికరాలపై వారి పేరును చిరస్థాయిగా నిలిచేలా పొందుపరుస్తామని చెప్పారు. మంగళవారం కలెక్టరేట్‌లోని తిక్కన ప్రాంగణంలో విద్య, వసతి, వికాసం కార్యక్రమాన్ని కలెక్టర్ లాంఛనంగా ప్రారంభించారు. ఈ కార్యక్రమానికి ఎమ్మెల్యేలు సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి, కాకర్ల సురేష్, వెంకట కృష్ణారెడ్డి ముఖ్య అతిథులుగా హాజరయ్యారు. ఈ సందర్భంగా పవర్ పాయింట్ ప్రజెంటేషన్ ద్వారా ఈ కార్యక్రమం ఉద్దేశాన్ని జిల్లా బిసి వెల్ఫేర్ అధికారి వెంకటలక్ష్మి క్లుప్తంగా వివరించారు. ఈ సందర్భంగా జిల్లా కలెక్టర్ మాట్లాడుతూ జిల్లాలోని 155 ఎస్సీ, ఎస్టీ, బిసి, గిరిజన, మైనారిటీ సంక్షేమ హాస్టళ్లు, గురుకుల పాఠశాలల్లో విద్యార్థులకు మెరుగైన వసతి సౌకర్యాలు కల్పించేందుకు రెండు నెలల ముందు నుంచే విద్యా.. వసతి.. వికాసం కార్యక్రమాన్ని ప్రారంభించేందుకు కసరత్తు చేపట్టినట్లు వివరించారు. జిల్లాలోని సీఎస్ఆర్ నిధులు, దాతల సౌజన్యంతో ఈ కార్యక్రమాన్ని చేపట్టనున్నట్లు కలెక్టర్ తెలిపారు. కమర్షియల్ టాక్స్, ఎక్సైజ్, మైనింగ్, పరిశ్రమల శాఖల అధికారులు తమ పరిధిలోని సంస్థలకు, ప్రముఖ వ్యక్తులకు ఈ కార్యక్రమం ఉద్దేశాన్ని వివరించి, వారిని ఇందులో భాగస్వామ్యం చేయాలని కోరారు. పేద బిడ్డలకు మంచి చేసే ఈ కార్యక్రమంలో ప్రతి ఒక్కరు తమ వంతు తోడ్పాటు అందించాలని కలెక్టర్ పిలుపునిచ్చారు. పేద విద్యార్థుల హాస్టళ్ల అభివృద్ధికి సహకారం అందించాలనుకునే దాతలు డిబిసిడబ్ల్యూఈఓ. ఎన్ఎల్ఆర్. 18ఎట్‌దిరేట్ ఆఫ్. జిమెయిల్. కాం, సిపిఓ-ఎన్ఎల్ఆర్ఎట్ దిరేట్ ఆఫ్‌యాహూ.కో.ఇన్ ఈమెయిల్స్‌ను సంప్రదించాలని కోరారు. సర్వేపల్లి ఎమ్మెల్యే సోమిరెడ్డి చంద్రమోహన్ రెడ్డి మాట్లాడుతూ రాష్ట్ర ప్రభుత్వం పేద విద్యార్థుల విద్యాభివృద్ధికి అత్యంత ప్రాధాన్యత ఇస్తోందన్నారు. మంత్రి నారా లోకేష్ చొరవతో విద్యారంగంలో పలు సంస్కరణలు అమలవుతున్నాయని, అదే స్ఫూర్తితో జిల్లా కలెక్టర్ హిమాన్షు శుక్ల హాస్టళ్ల అభివృద్ధికి విద్య, వసతి, వికాసం కార్యక్రమాన్ని ప్రారంభించడం అభినందనీయమన్నారు. ఈ గొప్ప కార్యక్రమానికి తమ వంతు సహకారం ఎల్లప్పుడూ ఉంటుందని తెలిపారు. కావలి శాసనసభ్యులు దగుమాటి వెంకటకృష్ణారెడ్డి కలెక్టర్ నిర్ణయాన్ని ప్రత్యేకంగా స్వాగతించారు.

అఖిల భారత పోలీస్ క్రీడల్లో విజేతలతో డిజిపి హరీష్‌కుమార్ గుప్తా

సిఐఎస్‌ఎఫ్ అఖిల భారత పోలీస్ క్రీడల్లో ఆంధ్రప్రదేశ్ పోలీసులు ఘన విజయం

● 11 పతకాలు కైవసం - 5 స్వర్ణ, 3 రజత, 3 కాంస్య పతకాలు

● విజేతలను అభినందించిన డిజిపి హరీష్‌కుమార్ గుప్తా

విజయవాడ, ఆగస్టు 4 ప్రభాతవార్త ప్రతినిధి: సెంట్రల్ ఇండస్ట్రియల్ సెక్యూరిటీ ఫోర్స్ (సిఐఎస్‌ఎఫ్) ఆధ్వర్యంలో తెలంగాణ రాష్ట్రం హైదరాబాద్‌లో గత నెలాఖరులో మూడు రోజులు పాటు నిర్వహించిన 11వ అఖిల భారత పోలీస్ క్రీడలు-2026లో ఆంధ్రప్రదేశ్ పోలీస్ జట్టు విశేష ప్రతిభ కనబరిచి మొత్తం 11 పతకాలను సాధించింది. ఇందులో 5 స్వర్ణ పతకాలు, 3 రజత పతకాలు, 3 కాంస్య పతకాలు సాధించి రాష్ట్రానికి, పోలీస్ శాఖకు గర్వకారణంగా నిలిచింది.

ఈ సందర్భంగా ఆంధ్రప్రదేశ్ డిజిపి హరీష్ కుమార్ గుప్తా, మంగళవారం తన కార్యాలయంలో పోటీల్లో విజేతలుగా నిలిచి, పతకాలు సాధించిన క్రీడాకారులు ఘనంగా సన్మానించి అభినందించారు. జాతీయ స్థాయిలో రాష్ట్రానికి కీర్తి ప్రతిష్ఠలు తీసుకువచ్చిన క్రీడాకారుల కృషిని కొనియాడుతూ, పోలీసు విధులతో పాటు క్రీడల్లోనూ అత్యుత్తమ ప్రతిభ కనబరచడం అభినందనీయమని పేర్కొన్నారు. భవిష్యత్తులో కూడా ఇదే స్ఫూర్తితో జాతీయ, అంతర్జాతీయ స్థాయి పోటీల్లో మరిన్ని విజయాలు సాధించి ఆంధ్రప్రదేశ్ పోలీస్ శాఖకు మరింత గౌరవం తీసుకురావాలని ఆకాంక్షి ంచారు.

ఈ సందర్భంగా విజేత క్రీడాకారులకు అభినందన పత్రాలు అందజేసి, వారితో కలిసి జ్ఞాపిక ఫోటోలు దిగారు. ఈ సన్మాన కార్యక్రమంలో ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (స్పోర్ట్స్) కె.వి. మోహన్ రావు, డిప్యూటీ ఇన్‌స్పెక్టర్ జనరల్ ఆఫ్ పోలీస్ (వెల్ఫేర్ స్పోర్ట్స్) కె.కె.ఎన్. అన్బురాజన్, స్పోర్ట్స్ ఆఫీసర్, కోచ్‌లు, క్రీడాకారులు, ఇతర పోలీసు అధికారులు పాల్గొన్నారు.

అభివృద్ధి, సంక్షేమం కూటమి ప్రభుత్వంలోనే

● కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి

కోవూరు (నెల్లూరు), ఆగస్టు 4 ప్రభాతవార్త: ఆంధ్రప్రదేశ్‌లో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తర్వాత ఈ రెండేళ్ల పరిపాలనలో అభివృద్ధి, సంక్షేమం వేగంగా పుంజుకుందని కోవూరు ఎమ్మెల్యే వేమిరెడ్డి ప్రశాంతిరెడ్డి అన్నారు. కోవూరు మండలం పడుగుపాడు పంచాయతీ చంద్రమౌళినగర్ గిరిజన కాలనీ ప్రాంతంలో నూతనంగా రూ.23 లక్షల నిధులతో నిర్మించిన విలేజ్ హెల్త్ క్లినిక్‌ను, రూ.3 లక్షల వ్యయంతో పున:నిర్మించిన సామాజిక వికాస కమ్యూనిటీ కేంద్రాన్ని ఆమె మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఆమె మాట్లాడుతూ ఇప్పటివరకు కోవూరు నియోజకవర్గంలో ఊహించని విధంగా రూ.770 కోట్ల వ్యయంతో అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను నిర్వహించామన్నారు. ప్రతిపక్ష పార్టీ కేవలం ప్రజల్లో మేము ఉన్నామని తెలయజేసేందుకే ప్రభుత్వంపై బురద జల్లే కార్యక్రమాన్ని చేపడుతున్నారన్నారు. ఈ రెండు సంవత్సరాల పరిపాలనలో చెప్పిన హామీలే కాకుండా చెప్పని హామీలు కూడా నెరవేర్చడం కూటమి ప్రభుత్వానికే సాధ్యమైందన్నారు. ఈ కార్యక్రమంలో తహసీల్దార్ సిహెచ్ సుబ్బయ్య, ఎంపిడిఓ శ్రీనివాసులు, డిఎ పెన్నా డెల్టా ఆయకట్టు చైర్మన్ రాజగోపాల్‌రెడ్డి, సొసైటీ అధ్యక్షుడు శ్యామ్ సుందర్‌రెడ్డి మండల అధ్యక్షుడు సుధాకర్‌రెడ్డి, పార్టీ సీనియర్ నాయకులు జెట్టి మదన్‌రెడ్డి, చెంబేటి పెంచలయ్య, విన్నకోట రాధాకృష్ణ, దాపరనేని శ్రీనివాసులు నాయుడు, మాజీ సర్పంచ్ వనమ్మ, మాజీ ఎంపీటీసీ సభ్యులు సమాధానం,సు రమేష్ యాదవ్, శ్రీనివాసులు నాయుడు, ఫిరోజ్‌ఖాన్, బాలకృష్ణ, రవి, వెంకట్, శ్రీనివాసులురెడ్డి, రవీంద్రరెడ్డి, వెంకటేశ్వర్లు, జహాంగీర్, సాధిక్, మురళి కూటమి నేతలు సుబ్బారావు, అల్తాఫ్, పెద్ద సంఖ్యలో నేతలు, కార్యకర్తలు ఉన్నారు.

నెల్లూరులో అపార్ట్‌మెంట్ పైనుండి దూకి మహిళ ఆత్మహత్యాయత్నం

నెల్లూరు క్రైం, ఆగస్టు 4 ప్రభాతవార్త: నెల్లూరు నగరంలో పట్టపగలు జరిగిన ఓ హృదయ విదారక ఘటన స్థానికంగా తీవ్ర సంచలనం రేపింది. బహుళ అంతస్తుల భవనం పైనుండి ఓ వివాహిత కిందకు దూకి ఆత్మహత్యకు పాల్పడిన ఉదంతం నగరంలో చర్చనీయాంశమైంది. ఈ ఘటనకు సంబంధించి పోలీసులు తెలిపిన పూర్తి వివరాలు ఇలా ఉన్నాయి. తిరుపతి పట్టణానికి చెందిన టి. పుష్పలత, అదే ప్రాంతానికి చెందిన శివయ్యలు దాదాపు 15యేళ్ల క్రితం ప్రేమ వివాహం చేసుకున్నారు. ఆ తర్వాత వారు స్థానికంగా ఒక ప్రైవేట్ పాఠశాలను నిర్వహిస్తూ జీవనం సాగిస్తున్నారు. అయితే, కాలక్రమేణా వ్యాపారంలో నష్టాలు రావడంతో వారిద్దరూ తీవ్రమైన ఆర్థిక ఇబ్బందుల్లో చిక్కుకున్నారు. రోజురోజుకూ పెరిగిపోయిన అప్పుల భారం వారిని మానసికంగా కుంగదీసింది. ఈ క్రమంలోనే సుమారు 15 రోజుల క్రితం ఓ స్థల మధ్యవర్తిత్వ పని నిమిత్తం భార్యాభర్తలిద్దరూ నెల్లూరు నగరానికి వచ్చారు. అప్పటి నుండి నగరంలోని ఒక లాడ్జిలో బస చేస్తూ వస్తున్నారు. ఈ నేపథ్యంలోనే మంగళవారం ఉదయం భార్యాభర్తలు ఇద్దరూ కలిసి స్థానిక దర్గామిట్ట ప్రాంతంలోని ప్రసిద్ధ శ్రీ రాజరాజేశ్వరి దేవస్థానాన్ని దర్శించుకున్నారు. దేవాలయ దర్శనం ముగించుకుని వస్తున్న సమయంలో భర్త శివయ్య ఫోన్‌లో మాట్లాడుతుండగా పుష్పలత అకస్మాత్తుగా ఆయనకు ఎలాంటి సమాచారం ఇవ్వకుండా అక్కడి నుండి ఆటోలో గాంధీ బొమ్మ సెంటర్ ప్రాంతానికి చేరుకున్నారు. అక్కడ రద్దీగా ఉన్న ఒక బహుళ అంతస్తుల భవనం ఎక్కింది. క్షణాల వ్యవధిలో అందరూ చూస్తుండగానే ఆమె ఒక్కసారిగా కిందకు దూకేసింది. పట్టపగలు రద్దీ ప్రాంతంలో ఈ ఘటన జరగడంతో స్థానికులు ఒక్కసారిగా భయాందోళనకు గురయ్యారు. తేరుకున్న వెంటనే వారు ట్రాఫిక్ పోలీసుల సహకారంతో తక్షణమే స్పందించి 108 అంబులెన్స్ ద్వారా బాధితురాలిని చికిత్స నిమిత్తం సమీపంలోని ఆసుపత్రికి తరలించారు. ఈ ప్రమాదంలో ఆమె రెండు కాళ్లు పూర్తిగా దెబ్బతిన్నట్లు ప్రాథమిక సమాచారం ద్వారా తెలుస్తోంది. ఈ ఘటనపై సంతపేట సిఐ సోమయ్య కేసు నమోదు చేసుకుని, దర్యాప్తు వేగవంతం చేశారు.

యువకుడు హత్య కేసులో నిందితుల అరెస్ట్

గూడూరు (నెల్లూరు), ఆగస్టు 4 ప్రభాతవార్త: హత్య కేసులో ముద్దాయిలు అరెస్ట్ అయిన సంఘటన చోటు చేసుకుంది. మంగళవారం స్థానిక ఒకటో పట్టణ పోలీస్ స్టేషన్లో విలేకరుల సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా గూడూరు రూరల్ సిఐ కిషోర్ బాబు మాట్లాడుతూ గూడూరు మండలం విందూరు గ్రామానికి చెందిన షాహుల్ అనే యువకుడుకి మద్యంసేవించే అలవాటు ఉంది. మద్యం సేవించిన సమయంలో పలువురి అసభ్యపదజాలంతో దూషించడం, కొన్ని సార్లు బట్టలు విప్పి అసభ్యకరంగా ప్రవర్తించడం వంటి చేష్టలు చేస్తుంటాడు. జులై 31వ తేదీన షాహుల్ మద్యం సేవించి గ్రామంలోని పడమటమ్మ ఆలయం వద్ద కూర్చోనివున్నాడు. అదే సమయంలో గతంలో ఇతనితో కలిసి పనిచేస్తున్న అదే గ్రామానికి చెందిన మహేంద్ర, వెంకటేశ్వర్లు, విందూరు కండ్రిగకు చెందిన కామేష్‌లు గుడి వద్ద కూర్చొని వున్న షాహుల్ను ఇంటికి వెళ్లకుండా ఇంకా ఎందుకు ఇక్కడ కూర్చున్నావని అడిగారు. వారి మధ్య ఉన్న పరిచయంలో మద్యం త్రాగుదామని అందరూ కలిసి జడ్పీ ఉన్న పాఠశాల భవనంపైకి వెళ్లి మద్యం త్రాగుతున్నారు. అదే సమయంలో మృతుడు మద్యం మత్తులో తనకున్న అలవాటు ప్రకారం తోటివారితో అసభ్యకరంగా ప్రవర్తించాడు. కామేష్ అనే

యవకుడు ఫ్లెక్సీ అంటించే పనిచేస్తుండడంతో అతని వద్ద ఉన్న చాకుతో తోటివారితో కలిసి షాహుల్ గొంతు కోసి, హత్య చేశారు. నిందితులను అరెస్ట్ చేశామన్నారు. ఈ సమావేశంలో సిఐలు శేఖర్ బాబు, మాలకొండయ్య, ఎస్ఐలు మనోజ్ కుమార్, తిరుపతయ్య, సురేష్ బాబు, శిరీష, సిబ్బంది తదితరులు పాల్గొన్నారు.

5skl13:5skl13.qxd 04-08-2026 23:04 Page 1

రైతులకు అండగా...ఉదయ భాస్కర్ ఉండగా

-సొంత నిధులతో కాలువలు జంగిల్ క్లియరెన్స్ - హర్షం వ్యక్తం చేస్తున్న రైతన్నలు

వీరఘట్టం, ఆగస్టు 4 ప్రభాతవార్త :

ఉదయాన ఉదయ భాస్కర్... ఈ పేరుకి కొత్తగా పరిచయం అవసరం లేదు. మండలంలోని కొట్టుగుమడ గ్రామానికి చెందిన ఎమ్మెల్యే నిమ్మక జయకృష్ణకు ముఖ్య అనుచరుడిగా, ప్రజలు బాగోగులు చూసే అరుదైన వ్యక్తిగా పేరుగాంచిన ఉదయ భాస్కర్... కష్టాల్లో నేనున్నానంటూ ముందుకు వచ్చి... అందరివాడిలా అందరితో కలిసిపోయే ఉదయ భాస్కర్... మంగళవారం తనే స్వయంగా రైతులతో మమేకమై, రావివలస నుండి కడకెల్ల, నడిమికెల్ల, కిమ్మి, నడుకూరు, కొట్టుగుమ్మడ, గడగమ్మ తదితర గ్రామాలకు తన సొంత నిధులతో సాగునీటి కాలువలను జంగిల్ క్లియరెన్స్ చేయిస్తూ, వారికి అండగా నిలుస్తూ, రైతుల కళ్ళల్లో ఆనందాన్ని రెట్టింపు చేశారు ఉదయ భాస్కర్. వివరాల్లోకెళ్తే తోటపల్లి ఎడమ కాలువ నుండి వచ్చే సాగునీరు దిగువ ప్రాంత గ్రామాలకు అందకపోవడంతో సాగు చేసేందుకు అదును తప్పడంతో వారంతా లబోదిబోమంటూ ఏకరువు పెట్టారు. ప్రస్తుతం వర్షాలు లేక, సాగునీరు రాక, రైతులు నానా అవస్థలు పడుతున్నారు. ఇటువంటి ప్రస్తుత తరుణంలో నారుమడులు ఎండకు ఎండిపోయి, బీటలు వారిపోతున్న సమయంలో... ఎందుకు ఇలా జరుగుతుందని ఆరా తీసి సాగునీటిని అందించే దిశగా జెసిబి సాయంతో జంగిల్ క్లియరెన్స్ వెను వెంటనే చేయించి సాగునీరు అందేలా ఏర్పాట్లు చేశారు. తన సొంత నిధులతో గత మూడేళ్లుగా లక్షలాది రూపాయలు వెచ్చించి రైతులకు అండగా నిలబడి ఆదుకుంటు న్నారు. అయితే ఇటు ప్రభుత్వం, అటు రైతులుకు అండగా ఉండి ప్రభుత్వం చేయవలసిన పనులను ఉదయ భాస్కర్‌యే చేపట్టడంతో రైతులకు మాత్రం ఎంతో ఉపయోగకరంగా ఉంటుందే తప్ప, ఈయనకు మాత్రం ఆర్థికంగా భారం మాత్రం తప్పడం లేదు. రైతులకు సకాలంలో ఎంతో సేవ చేస్తున్న ఉదయ భాస్కర్ సామాజిక సేవలను దృష్టిలో పెట్టుకొని ప్రభుత్వం ఆయనకు, ఆయన చేస్తున్న పనులకు నిధులు మంజూరు చేయాలని రైతన్నలు కోరుతున్నారు. ఆయనే ఈ పనికి పూనుకోకపోతే తమ పరిస్థితి ఏంటని రైతన్నలు ఎదురు ప్రశ్నిస్తున్నారు. రైతుల పట్ల ఎంతో ఔదార్యమున్న ఉదయ భాస్కర్‌కు తాము ఎల్లవేళలా రుణపడి ఉంటామని వారంతా ముక్తకంఠంతో చెబుతున్నారు. రైతుల కష్టాల్లో నేనున్నానంటూ పాలుపంచుకుంటున్న ఎమ్మెల్యే జయకృష్ణ కు తామంతా అండగా ఉంటామని గొంతు ఎత్తి చాటుతున్నారు రైతన్నలు.

టెక్కలి పార్టీ కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం

టెక్కలి, ఆగస్టు 4, ప్రభాతవార్త :

వైసిపి అధినేత మాజీ ముఖ్యమంత్రి వైఎస్ జగన్మోహనరెడ్డి పిలుపు మేరకు 'టెక్కలి నియోజకవర్గ ఇంచార్జ్ పేరాడ తిలక' ఆదేశానుసారం టెక్కలి పార్టీ కార్యాలయంలో రౌండ్ టేబుల్ సమావేశం జరిగింది. ఈ కార్యక్రమంలో హాజరైన నాయకులు, వక్తలు డీఎస్సీలో జరిగిన అక్రమాలపై సీబీఐ ఎంక్వైరీ చేయాలని, బాధ్యుడైన విద్యాశాఖ మంత్రి నారా లోకేష్ రాజీనామా చేయాలని, ఫీజు రీయింబర్స్మెంట్ బకాయిలు విడుదల చేయాలని, నిరుద్యోగ భృతి 3000 వెంటనే ఇవ్వాలని డిమాండ్ చేస్తూ తెలుగుదేశం ప్రభుత్వ వైఫల్యాలను ఎండగట్టారు. పలువురు మాట్లాడుతూ మెగా డీఎస్సీ పేరుతో నిరుద్యోగులను టీడీపీ ప్రభుత్వం దగా చేసిం దని, స్పోర్ట్స్ కోటా పేరుతో డీఎస్సీ ఉద్యోగాలను వంతులు వేసుకుని టీడీపీ నాయకులు అమ్ముకున్నారని, స్పోర్ట్స్ కోటాలో పతకాలు వచ్చినవారికి కాకుండా క్రీడలకు హాజరైన వాళ్ళకి ఉద్యోగం ఇవ్వడం విడ్డూర మన్నారు. గడచిన వైసీపీ పాలనలో నిబద్ధతతో పారదర్శకంగా లక్షల్లో ఉద్యోగాలు నియామకం చేపట్టామని, పారదర్శకత విషయంలో వైయస్సార్ కాంగ్రెస్ పార్టీది మొదటి స్థానమన్నారు. కార్యక్రమంలో టెక్కలి నియోజకవర్గ పరిశీలకులు చల్లా రవి కుమార్, నాలుగు మండలాల మండల పార్టీ అధ్యక్షులు, ఎంపీపీలు, జడ్పీటీసీలు, రాష్ట్ర, జిల్లా, నియోజకవర్గ, మండల, గ్రామ స్థాయిలో వివిధ హోదాల్లో ఉన్న పార్టీ ప్రతినిధులు, ఎంపీటీసీ సభ్యులు, మాజీ సర్పంచులు, కార్యకర్తలు పాల్గొని కార్యక్రమాన్ని విజయవంతం చేశారు.

పేద రోగులకు అండగా ప్రభుత్వం : ప్రభుత్వ విప్ అశోక్

కవిటి, ఆగస్టు 4, ప్రభాతవార్త :

పేద రోగులకు అండగా కూటమి ప్రభుత్వం నిలుస్తుందని ఇచ్ఛాపురం ఎమ్మెల్యే, ప్రభుత్వ విప్ బెందాళం అశోక్ అన్నారు. మంగళవారం రామయ్యపుట్టుగ ఎమ్మెల్యే క్యాంపు కార్యాలయంలో నియోజకవర్గానికి చెందిన 13 మంది రోగులకు సుమారు 12 లక్షల రూపాయల విలువ చేసే సీఎంఆర్ఎఫ్ చెక్కులను అందించే కార్యక్రమాన్ని చేపట్టారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే అశోక్ మాట్లాడుతూ పేద రోగులకు ఎదురయ్యే ఆరోగ్య సమస్యలను అధిగమించడానికి కూటమి ప్రభుత్వం ఆర్థిక సహకారం అందిస్తుందని ఇది మీకు భరోసాగా నిలుస్తుందని ఆయన అన్నారు. కార్యక్రమంలో కంచిలి మండలం తెలుగుదేశం అధ్యక్షులు మాదిన రామారావు, నియోజకవర్గానికి చెందిన పలువురు ప్రజాప్రతినిధులు, కార్యకర్తలు, అభిమానులు పాల్గొన్నారు.

9న ఆదివాసీ దినోత్సవం ఘనంగా జరుపుకుందాం

ఐటిడిఏ పివో పవర్ స్వప్నిల్ జగన్నాథ్

సీతంపేట, ఆగస్టు 4, ప్రభాతవార్త :

ప్రపంచ ఆదివాసీ దినోత్సవం ఈ నెల 9న సీతంపేటలో ఘనంగా జరుపుకుందామని ఐటిడిఏ పిఓ పవర్ స్వప్నిల్ జగన్నాథ్ స్పష్టం చేశారు. మంగళవారం ఐటీడీఏ ఎస్సార్ శంకరన్ సమావేశం మందిరంలో గిరిజన సంఘాల నాయకులతో సమీక్ష సమావేశం నిర్వహించారు. ఈ సందర్భంగా ప్రాజెక్టు అధికారి మాట్లాడుతూ, ప్రపంచ ఆదివాసి దినోత్సవం గిరిజనుల సంస్కృతి, సంప్రదాయాలను ప్రపంచానికి చాటి చెప్పే ఒక ముఖ్యమైన వేదిక అని పేర్కొన్నారు. గిరిజనుల విశిష్ట జీవన విధానం, సంప్రదాయ కళలు, జానపద నృత్యాలు, వాయిద్యాలు, సాంప్రదాయ వస్త్రధారణ, ఆహార సంస్కృతి, హస్తకళలు ప్రతిబింబించేలా ఉత్సవ కార్యక్రమాలను రూపొందించాలని సూచించారు. కార్యక్రమంలో పాలకొండ డి.ఎస్.పి రాంబాబు, డిడి అన్నదొర. ఎంపీడీవో బిబి మిశ్రా, జేఏసీ నాయకులు బి.శ్రీనివాసరావు, అడవి రాముడు, పాలక పురుషోత్తం, బిడ్డిక ఉమామహేశ్వరరావు, నిమ్మక కాంతారావు, మూటక రవికుమార్, కె.కాంతారావు, లక్ష్మీనారాయణ, బి.రామ్మోహన్‌రావు, తదితరులు పాల్గొన్నారు.

పేదలకు ఆర్థిక భరోసా ముఖ్యమంత్రి సహాయ నిధి

కంచిలి, ఆగస్టు 4, ప్రభాతవార్త :

నిరుపేదలకు వైద్య నిమిత్తం ఆర్థిక భరోసా ముఖ్యమంత్రి సహాయనిధి ప్రభుత్వం విప్, ఇచ్ఛాపురం ఎమ్మెల్యే బెందాళం అశోక్ బాబు అన్నారు. మంగళవారం క్యాంప్ కార్యాలయంలో ఆనారోగ్యంతో బాధపడుతున్న బాధితులు మునగాల మోహిత్ నరసన్న ముకుందపురం, 1,28503, సాలిన జానకిరావు మఖరాంపురం 97,524, బురగాం ధూపాన మాధవరావు 65000, పైల హరికృష్ణ పురుషోత్తపురం 48,795 వైద్య ఖర్చులు నిమిత్తం కోసం ముఖ్యమంత్రి సహాయ నిధి నుండి చెక్కులను అందజేశారు. కార్యక్రమంలో మండల పార్టీ అధ్యక్షులు మాదిన రామారావు, పిఎసిఎస్ అధ్యక్షులు పైల పురుషోత్తం రెడ్డి, యువత మద్దిల ఆనంద్, పోలయ్య రెడ్డి, టీవీ రమణ పాల్గొన్నారు.

పశువులకు ముద్దశర్మ, లంపీ వ్యాధి నివారణ టీకాలు తప్పనిసరి

-పశువైద్య సహాయ సంచాలకుడు లోకనాథం

కోటబొమ్మాళి, ఆగస్టు 4, ప్రభాతవార్త :

పాడిరైతులు వర్షాకాలంలో పశువులకు సోకే ముద్దశర్మ, లంపీ వ్యాధి నివారణ టీకాలు తప్పని సరిగా వేయించాలని స్థానిక పశువైద్య సహాయ సంచాలకులు డాక్టర్ మంద లోకనాథం అన్నారు. ఆయన పశువైద్యకారుడు డాక్టర్ లఖినేని కిరణకుమార్ తో కలిసి మంగళవారం కోటబొమ్మాళి, కమలనాభపురం, యలమంచిలి గ్రామాల్లో 338 పశు వులకు టీకాలు వేశారు. ఈ సందర్భంగా ఆయన మాట్లాడుతూ ఈ టీకాలు ఉచితంగా ఈనెల 1వ తేదీనుంచి 30వ తేదీ వరకు మండలంలో ఉన్న అన్ని గ్రామాల్లో పశువులకు వేయటం జరుగుతుందని ఆయన తెలిపారు. ఈ టీకాలు 4 మాసాల వయసు పై బడిన దూడలు నుంచి అన్ని వయస్సుల వాటికి వేసుకోవచ్చునని, చూడితో ఉన్న పశువులకు కూడా వేసుకోవచ్చునని ఆయన తెలిపారు. ముద్ద చర్మవ్యాధి అనేది పశువులు, మరియు గేదెలలో వచ్చే వైరల్ వ్యాధి. దీనికి కారణం లంపీ స్కిన్ డిసీజ్ వైరస్ ఇది ప్రధానంగా దోమలు, పేలు, ఈగలు వంటి కీటకాల కాటు ద్వారా వ్యాప్తిస్తుందన్నారు. కార్యక్రమంలో పశు వైద్య సిబ్బంది వరలక్ష్మీ, సత్యనారాయణ, రమణమూర్తి, రాంబాబు, తదితరులు పాల్గొన్నారు.

ఈ నెల 8న సర్వసభ్య సమావేశం

కోటబొమ్మాళి, ఆగస్టు 4, ప్రభాతవార్త :

స్థానిక మండల పరిషత్ సమావేశ మందిరంలో ఈ నెల 8వ తేదీన మండలపరిషత్ అధ్యక్షులు రోణంకి ఉమా అద్వర్యంలో సాధారణ సర్వసభ్య సమావేశం నిర్వహించబడుతుందని, ఈ సమావేశానికి అన్ని శాఖల అధికారులు, ఎంపీటీసీలు హజరు కావాలని ఎంపీడీవో కిల్లారి నారాయణరావు మంగళవారం ఒక ప్రకటనలో తెలిపారు. ఈ సమావేశం శనివారం ఉదయం 10గంటలకు ప్రారంభం అవుతుందని అన్ని శాఖల అధికారులు సమయానాకి హజరు కావాలని ఆయన కోరారు.

డిగ్రీ ప్రవేశానికి దరఖాస్తులు ఆహ్వానం

ఇచ్ఛాపురం ఆగస్టు 4 ప్రభాత వార్త:

ప్రభుత్వ డిగ్రీ కళాశాలలో 2026-27 విద్యా సంవత్సరానికి గాను డిగ్రీ మొదటి సంవత్సరంలో ప్రవేశాల కు ఆన్‌లైన్ దరఖాస్తుల స్వీకరణ ప్రారంభమయిందని ప్రిన్సిపాల్ కృష్ణ చెప్పారు. బి.ఎ , బి.కామ్ , బి.ఎస్సీ కోర్సులకు దరఖాస్తు చేసుకోవచ్చని తెలియజేశారు. పూర్తి వివరాలకు విద్యార్థులు కళాశాలలో నేరుగా లేదా ఇతర సమాచారం కోసం 9010031773 ఫోన్ నంబరును సంప్రదించాల్సిందిగా ఆయన కోరారు.

రాజాం నడిబొడ్డున దొంగతనం

25 తులాల బంగారు ఆభరణాలు, రెండు లక్షల నగదు చోరీ

రాజాం, ఆగస్టు 4, ప్రభాతవార్త :

రాజాం పట్టణం బొబ్బిలి జంక్షన్ సమీపంలో ప్రజలు సంచరిస్తున్న సమయంలో నడిబొడ్డున వర్తకుడు ఉంగ్రాళ్ళు అప్పలరాజు ఇంట్లో ఎవరూ లేకపోవడంతో సుమారు 25 తులాలు బంగారు ఆభరణాలు 2.0 లక్షలు నగదు అపహరణకు గురైనట్లు బాధితులు పోలీస్ స్టేషన్‌లో ఫిర్యాదు చేశారు. పోలీసులు వెంటనే స్పందించి దొంగతనానికి గురైన ఇంటిని సీజ్ చేశారు. ఉంగ్రాళ్ళు అప్పలరాజు గత కొన్ని రోజులుగా పుణ్యక్షేత్రాల దర్శనం కోసం బయలుదేరారు. ఇంతలో తన తమ్ముడు అన్నయ్య అప్పలరాజు తీర్థయాత్ర నుండి వచ్చేసాడు ఏమో అని తెలుసుకోవడానికి ఇంటికి వెళ్లి చూడగా కిటికీ తలుపులు తెరిచి ఉండడాన్ని గమనించి పైకి వెళ్లి ప్రధాన తలుపులు పగలగొట్టి వెళ్లి చూడగా బీరువాలో బట్టలు చిందరవందరగా పడి ఉండడంతో హఠాత్తుగా తన అన్నయ్యకు విషయం తెలపగా అప్పుడే రాజాం వచ్చిన అప్పలరాజు లబోదిబోమని గుండెల బాదుకుని పోలీసులకు ఫిర్యాదు చేశారు. చోరీ జరిగిన ప్రదేశంలో క్లూస్ టీం సహాయంతో ఇంటిలో ప్రతి అణువు గాలిస్తున్నట్లు సీఐ డి.నవీన్ కుమార్ వెల్లడించారు. ఈ మేరకు సీఐ నవీన్ కుమార్ మాట్లాడుతూ చోరీకి సంబంధించి ప్రతి విషయాన్ని క్షుణ్ణంగా పరిశీలించి చర్యలు తీసుకుంటామని తెలిపారు. అదేవిధంగా దొంగతనానికి పాల్పడిన దొంగలను పట్టుకునే పనిలో నిమగ్నం చేస్తామని ఈ సందర్భంలో తెలియజేశారు.

పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని సద్వినియోగం చేసుకోండి

వీరఘట్టం, ఆగస్టు 4, ప్రభాతవార్త :

పొలం పిలుస్తుంది కార్యక్రమాన్ని రైతులు సద్వినియోగం చేసుకోవాలని మండల వ్యవసాయ శాఖ అధికారి జక్కు సౌజన్య పిలుపునిచ్చారు. మంగళవారం మండలంలో నీలానగరం పనస నందివాడ గ్రామాలలో పొలం పిలుస్తోంది కార్యక్రమాన్ని నిర్వహించిన సందర్భంగా ఆమె మాట్లాడారు. ఈ సందర్భంగా బంతినారతో పాటు కంది విత్తనాలను గట్లు మీద వేసుకోవడానికి రైతులకి ఆమె అందజేశారు. రైతులు బహుళ పంటలను ఒకేసారి వేసుకోవాలని సూచించారు. కార్యక్రమంలో ఏఇఓ రాజేష్, వీఏఏ లాలి బాబు, రైతులు, తదితరులు పాల్గొన్నారు.

పేద కుటుంబాల ఆహార భద్రతే ప్రభుత్వ ధ్యేయం

ఎమ్మెల్యే, రాష్ట్ర పియుసి కమిటీ చైర్మన్ కూన

ఆమదాలవలస, ఆగస్టు 4, (ప్రభాతవార్త):

పేద, మధ్యతరగతి కుటుంబాలకు ఆర్థిక భారం తగ్గించి నాణ్యమైన ఆహారాన్ని అందించాలనే లక్ష్యంతో కూటమి ప్రభుత్వం సబ్సిడీపై సన్న బియ్యం పంపిణీకి శ్రీకారం చుట్టిందని ఎమ్మెల్యే, పియుసి కమిటీ చైర్మన్ కూన రవికుమార్ అన్నారు. రాష్ట్ర ప్రభుత్వం అమలు చేస్తున్న సంక్షేమ కార్యక్రమాల్లో భాగంగా రైతు బజార్ ఆవరణలో సబ్సిడీ సన్న బియ్యం పంపిణీ కార్యక్రమాన్ని మంగళవారం ప్రారంభించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రవికుమార్ మాట్లా డుతూ ప్రతి ఒక్కరికి అందుబాటు ధరలో నాణ్యమైన బియ్యాన్ని అందించడమే కూటమి ప్రభుత్వ ప్రధాన ఉద్దేశమని అన్నారు. ప్రజా సంక్షేమానికి పెద్ద పీట వేస్తూ విద్య, వైద్యం, మహిళా సాధికారత వ్యవసాయ రంగాల్లో పలు పథకాలను ప్రభుత్వం వేగవంతంగా అమలు చేస్తుందని అన్నారు. అర్హులైన ప్రతి ఒక్కరూ ఈ పథకాలను సద్వినియోగం చేసుకోవాలని ఎమ్మెల్యే రవికుమార్ కోరారు. అన్నదాత సుఖీభవ ద్వారా ప్రతి రైతుకు రూ.20వేల పెట్టుబడి సాయం అందిస్తున్నామని ఎమ్మెల్యే రవికుమార్ తెలిపారు. కార్యక్రమంలో మాజీ మున్సిపల్ చైర్ పర్సన్ తమ్మినేని గీత, మాజీ వైస్ చైర్మన్ కె.వి.రాజ్యలక్ష్మి, పట్టణ మహిళ అధ్యక్షురాలు బోయిన సునీత, మండల తెలుగు యువత అధ్యక్షులు తమ్మినేని నాని, జిల్లా మేనేజర్ శ్రీనివాసరావు, డి ఎస్ ఓ సూర్యప్రకాశరావు, జిల్లా మిల్లర్ల సంఘం అధ్యక్షులు బోయిన గోవిందరాజులు, సువ్వారి అనిల్ కుమార్, కోట అన్నాజీరావు, పేడాడ వెంకటరమణ, రైస్ మిల్లర్లు యాజమానులు పాల్గొన్నారు.

ఇంటింటి అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం

ఎమ్మెల్యే, పియుసి కమిటీ చైర్మన్ కూన

ఆమదాలవలస, ఆగస్టు 4, (ప్రభాతవార్త):



నియోజకవర్గం అభివృద్ధి కూటమి ప్రభుత్వం యొక్క లక్ష్యమని ఎమ్మెల్యే, పియుసి కమిటీ చైర్మన్ కూన రవికుమార్ అన్నారు. మంగళవారం మున్సిపాలిటీలో ఎనిమిదవ వార్డ్ గేటులో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చి రెండేళ్లు పూర్తి చేసుకున్న సందర్భంగా నిర్వహించిన "రెండేళ్ల నమ్మకం సంక్షేమ విజయాలు ప్రజా పాలన ఇంటింటికీ అభివృద్ధి కార్యక్రమాన్ని ఎమ్మెల్యే, రాష్ట్ర పియుసి చైర్మన్ కూన రవికుమార్ పాల్గొన్నారు. ఈ సందర్భంగా గ్రామంలోని ప్రతి ఇంటికి వెళ్లి గత రెండేళ్లలో కూటమి ప్రభుత్వం అమలు చేసిన అభివృద్ధి, సంక్షేమ కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే రవికుమార్ మాట్లాడుతూ రాష్ట్రంలో కూటమి ప్రభుత్వం అధికారంలోకి వచ్చిన తరువాత ప్రజల సంక్షేమమే లక్ష్యంగా పరిపాలన సాగుతోందని తెలిపారు. ఎన్నికల సమయంలో ఇచ్చిన హామీలను ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ప్రజల జీవితాల్లో సానుకూల మార్పులు తీసుకురావడానికి ప్రభుత్వం కృషి చేస్తోందన్నారు. రైతులు, మహిళలు, యువత, విద్యార్థులు, వృద్ధులు, కార్మికులు సహా అన్ని వర్గాల ప్రజలకు ఉపయోగపడే విధంగా అనేక సంక్షేమ పథకాలు అమలు చేస్తున్నట్లు పేర్కొన్నారు. రాష్ట్ర ముఖ్యమంత్రి నారా చంద్రబాబు నాయుడు నాయకత్వంలో గ్రామీణ ప్రాంతాల అభివృద్ధికి ప్రత్యేక ప్రాధాన్యత ఇస్తున్నామని, రహదారులు, తాగునీటి సదుపాయాలు, విద్య, వైద్యం, విద్యుత్, వ్యవసాయ రంగాల్లో గణనీయమైన పురోగతి సాధించామని తెలిపారు. గ్రామ స్థాయిలో మౌలిక వసతుల కల్పనకు ప్రభుత్వం పెద్ద ఎత్తున నిధులు కేటాయించి అభివృద్ధి పనులు చేపడుతోందన్నారు. 8వ వార్డులో కూడా వివిధ అభివృద్ధి పనులు చేపట్టడంతో పాటు ప్రజలకు ప్రభుత్వ పథకాల ఫలాలు అందేలా చర్యలు తీసుకుంటున్నామని ఎమ్మెల్యే రవికుమార్ వివరించారు. ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ కార్యక్రమాల గురించి ప్రజలకు అవగాహన కల్పించడంతో పాటు వారి సమస్యలను తెలుసుకొని పరిష్కారానికి కృషి చేస్తున్నట్లు చెప్పారు. ఈ కార్యక్రమంలో మాజీ ఎమ్మెల్సీ పి.విశ్వ ప్రసాద్, మాజీ మున్సిపల్ చైర్‌పర్సన్ తమ్మినేని గీత, మాజీ వైస్ చైర్మన్ కె.వి.రాజ్యలక్ష్మి, పట్టణ మహిళా అధ్యక్షురాలు బోయిన సునీత, సిమ్మ మాధవి, దవల అప్పలనాయుడు, ఎం.కృష్ణమూర్తి, నాగళ్ళ మురళీధర్, బాగాది భాస్కరరావు, ఎం.సతీష్, పాతిన రమణమూర్తి, కార్యకర్తలు, మహిళలు పాల్గొన్నారు.

భయం వీడండి...!

ఇచ్ఛాపురం, ఆగస్టు 4, ప్రభాతవార్త:

ప్రముఖ వ్యక్తిత్వ వికాస నిపుణులు, ఇంపాక్ట్ క్లబ్ ఇంటర్నేషనల్ జాతీయ ఉపాధ్యక్షులు, జెసిఐ ప్రొవిజినల్ జోన్ ట్రైనర్ పల్లంటి చిరంజీవి శాంతినికేతన్ పాఠశాలలో 9, 10 వ తరగతి విద్యార్థులకు విద్యా సంబంధిత అంశాలపై ప్రత్యేక శిక్షణ ఇచ్చారు. స్టడీ స్కిల్స్, టైం మేనేజ్మెంట్, మెమొరీ టెక్నిక్స్ తదితర అంశాలపై విద్యార్థులకు శిక్షణ అందించారు. విద్యార్థులు పదో తరగతి పరీక్షల్లో అత్యుత్తమ మార్కులు సాధించడానికి ప్రత్యేక ప్రణాళికతో ఎలా సిద్ధం కావాలో, ప్రభావవంతంగా సమర్థవంతంగా సమయాన్ని సద్వినియోగం చేసుకోవడానికి ఎలా కాల పట్టిక తయారు చేసుకోవాలో, చదివే అంశాలు మర్చిపోకుండా ఉండేందుకు మెమరీ టెక్నిక్స్ ఎలా వాడాలో అత్యంత అద్భుతంగా వివరించారు. విద్యార్థులతో కొన్ని ఆక్టివిటీస్ చేయించారు. సమయపాలనకు సంబంధించి వారు చేస్తున్న తప్పులను వారే తెలుసుకునే విధంగా ప్రత్యేక ఆక్టివిటీ నిర్వహించారు. ఈ శిక్షణ పట్ల విద్యార్థులు ఎంతో సంతృప్తిని వ్యక్తం చేశారు.

ఫ్రెండ్లీ పోలీస్‌లో భాగంగా క్రికెట్ ఆడిన సిఐ నవీన్ కుమార్

రాజాం, ఆగస్టు 4, ప్రభాతవార్త :

రాజాం పట్టణ సిఐగా బాధ్యతలు చేపట్టిన అనంతరం గంజాయి ఇతరత్రా మత్తు పదార్థాలు విషయంలో ఉక్కు పాదం మోపుతూ అక్రమార్కులు గుండెల్లో రైలు పరిగెస్తున్న అధికారిగా గుర్తింపు పొందుతున్నారు. అలాగే ఈ మధ్యకాలంలో రౌడీ షీటర్లు భరతం పడుతూ కటకటాలు పాలవుతున్న రౌడీయిజం. ప్రస్తుతం ప్రజలకు చేరువలో స్నేహపూర్వక పోలీస్ అనే దృక్పథంతో క్రికెట్ క్రీడాకారులతో, క్రికెట్ క్రీడలు ఆడుతున్నారు. అలాగే ఈ మధ్యకాలంలో అగ్ని వీర్ శిక్షణలో పాల్గొని శిక్షణార్థులకు మెళకువలు నేర్పించారు. అలాగే వీళ్లకు శిక్షణలో పాల్గొనడానికి రవాణా చార్జీలు కూడా అందించడానికి సిద్ధంగా ఉన్నానని చెప్పారు. ప్రస్తుతం రాజాం పట్టణంలో పోలీస్ బాస్ వచ్చారు అనే పిలుపు స్థానిక ప్రజల నుంచి కూడా గట్టిగా వినిపిస్తుంది.

పీఎంఎఫ్‌వైను 15లోగా నమోదు చేసుకోవాలి

కోటబొమ్మాళి, ఆగస్టు 4, ప్రభాతవార్త :

ఆగస్టు 15లోగా వరి, ఇతర పంటలు సాగు చేస్తున్న రైతులు ఒక ఎకరాకు రూ.160లుతో ప్రధానమంత్రి ఫసల్ భీమాయోజన పథకం(పీఎంఎఫ్‌వై)ను నమోదు చేసుకోవాలని మండల వ్యవసాయాధికారి ఎస్.గోవిందరావు అన్నారు. ఆయన మంగళవారం మండలం జర్జంగి గ్రామంలో పొలం పిలుస్తోంది కార్యక్రమం నిర్వహించారు. ఈ సందర్భంగా రైతులతో మాట్లాడుతూ ప్రధానమంత్రి ఫసల్ భీమా యోజన పథకంను (పీఎంఎఫ్‌వై)ను నమోదు చేసుకుంటే కరువు, ప్రకృతి వైపరీత్యాల వలన పంట నష్టం జరిగితే రైతులకు ఇన్సూరెన్స్ అండగా ఉంటుందని తెలియజేశారు. బ్యాంకులలో పంట రుణం తీసుకున్నట్లుయితే సంబంధిత బ్యాంకు సిబ్బందిని సంప్రదించి ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించాలి. రుణం తీసుకొని రైతులు కామన్ సర్వీస్ సెంటర్ (సీఎస్సి) ద్వారా ఇన్సూరెన్స్ ప్రీమియం చెల్లించి పంటల భీమా చేయాలని సూచించారు. కార్యక్రమంలో వీఏఏ ఎస్.పద్మజ, రైతులు పాల్గొన్నారు.

శ్రీకాకుళం వార్త

కుత్తుమలో 'పొలం పిలుస్తోంది'

కంచిలి, ఆగస్టు 4, ప్రభాతవార్త :

పొలం పిలుస్తోంది కార్యక్రమం కుత్తుమ గ్రామంలో చేపట్టడం జరిగింది. ఎల్ నినో పరిస్థితి కారణంగా ఏర్పడే వర్షాభావ పరిస్థితులకు అనుగుణంగా పంటలను పండించాలని బోరు బావులు వంటి నీటి సదుపాయం ఉన్న దగ్గర మాత్రమే వేసిన వరి పంటను సంరక్షించుకోవాలని వర్షం మీద ఆధారపడే భూములలో వరి పంటను వేయకుండా తక్కువ వర్షపాతం అవసరమైనటువంటి అపరాలు, నూనె గింజల వంటి పంటను వేసుకోవాలని సూచించారు. ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజనలో తప్పనిసరిగా ప్రతి రైతు నమోదు చేసుకోవాలని అందుకుగాను ఎకరానికి వరి పంటకు 160 రూపాయలు చెల్లించినట్లయితే పంటకోత ప్రయోగాల ఆధారంగా దిగుబడి ఆధారంగా 40 వేల రూపాయల వరకు బీమా వర్తించే అవకాశం ఉంది. కాబట్టి రైతులందరూ ఆగస్టు 15, 2026 లోపల మీసేవ ద్వారా గాని పంట రుణం తీసుకున్నటువంటి రైతులు బ్యాంకుల ద్వారా గాని చేసుకోవాల్సిందిగా కోరడమైనది ఇందుకుగాను ప్రతి రైతుకు రైతు విశిష్ట సంఖ్య తప్పనిసరిగా ఉండాలని దానిని ఏపీఎఫఆర్ పోర్టల్‌లో నమోదు చేసుకొని పొందవచ్చని సూచించడమైనది. అనంతరం వరి నారుమడి పరిశీలించి ఆరోగ్యకరమైన నారు కొరకు తగు సూచనలు ఇవ్వడమైనది. కార్యక్రమంలో వ్యవసాయ సహాయకులు గణపతి, రైతులు పాల్గొన్నారు.

గండిని పూడ్చిన ఇరిగేషన్ అధికారులు

హర్షం వ్యక్తం చేసిన కొత్తవలస రైతులు

ఆమదాలవలస, ఆగస్టు 4, (ప్రభాతవార్త):

గత 25 రోజుల నుండి తురకపేట నుండి శ్రీరాం బట్టికి చేరుకునే బైరోడు బట్టికి గండి పడింది. దీని వల్ల నీరు ఇతర పొలాలకు వెళ్ళిపోతుంది. ఆ బట్టి ద్వారా నీరు ప్రవహించకపోవడంతో కొత్తవలస రైతులు చాలా ఇబ్బందులు పడ్డారు. ఆబట్టిని పూడ్చి సాగు నీరు అందించాలని పలుమార్లు కొత్తవలస రైతులు అధికారులకు మొరపెట్టుకున్నప్పటికీ కనీస చర్యలు చేపట్టలేదని మాజీ ఉప సర్పంచ్ గురుగుబెల్లి అప్పల నాయుడు తోపాటు రైతులు ఆవేదన వ్యక్తం చేశారు. ఈ విషయం పై ఇరిగేషన్ అధికారులు, నీటి సంఘం అధ్యక్షులు స్పందించి ఆ గండిని మంగళవారం పూడ్చి వేశారు. ఒకానొక సందర్భంలో కొత్తవలస ఉప సర్పంచ్‌తో పాటు రైతులు తమ సొంత నిధులతో గండిని పూడ్చడానికి సిద్ధపడ్డారు. వెంటనే ఇరిగేషన్ అధికా రులు స్పందించి గండిని పూడ్చి రైతులకు సకాలంలో సాగు నీరు అందించడానికి చర్యలు చేపడుతున్నారు. గండిని పూడ్చడంతో మాజీ ఉప సర్పంచ్ అప్పలనాయుడుతో పాటు రైతులు హర్షం వ్యక్తం చేశారు.

పీఆర్సీ చైర్మన్ నియమించాలి

కొత్తూరు, ఆగస్టు 4, ప్రభాతవార్త :

ఉద్యోగ, ఉపాధ్యాయులకు ఇచ్చిన హామీలను ప్రభుత్వం వెంటనే అమలు చేయాలని, పీఆర్సీ కమిటీ చైర్మన్‌ను నియమించి ఇంటీరిమ్ రిలీఫ్ (ఐఆర్) ప్రకటించాలని యూటీఎఫ్ జిల్లా కార్యదర్శి దండు ప్రకాశరావు,మండల అధ్యక్షుడు కె.విజయకుమార్, ప్రధాన కార్యదర్శి వి.మధుసూదనరావు డిమాండ్ చేస్తూ రెండేళ్లకు పైగా గడిచినా ఎన్నికల్లో ఇచ్చిన హామీలను అమలు చేయకపోవడం సరికాదన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ ఉపాధ్యాయులకు ఇవ్వాల్సిన ఐదు డీఏలు పెండింగ్‌లో ఉన్నాయని, సుమారు రూ.25 వేల కోట్ల ఆర్థిక బకాయిలు చెల్లించాల్సి ఉందన్నారు. ప్రభుత్వం జాప్యం వీడి ఉద్యోగ, ఉపాధ్యాయుల సమస్యలను పరిష్కరించాలని కోరారు. యూటీఎఫ్ ప్రతినిధి బృందం మండలంలోని మెట్టూరు, కుంటిభద్ర, నివగాం, మాతల, మాకవరం, ఖురిగాం, కడుము జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలతో పాటు పలు ప్రాథమిక, ప్రాథమికోన్నత పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయుల సమస్యలను తెలుసుకుంది. వివిధ యాప్‌ల వినియోగంతో బోధనకు ఆటంకం కలుగుతోందని, యాప్‌ల భారం తగ్గించాలని ప్రభుత్వాన్ని కోరింది. పాఠశాలల్లో మౌలిక వసతులు కల్పించాలని, శిథిలావస్థకు చేరిన భవనాల మరమ్మతులకు తక్షణమే నిధులు మంజూరు చేయాలని విజ్ఞప్తి చేశారు. బి.చిన్నారావు, ఎం.వరదరాజులు, బి.గణేష్, ఎన్.లక్ష్మీనారాయణ, ఎ.శోభనబాబు, పి.దినేష్, పి.బాలరాజు, టి.కృష్ణ, తిరుపతిరావు, చిన్నం నాయుడు, రాంబాబు, శ్రీనివాసరావు, ఎం.ఉమామహేశ్, కె.నాగేంద్ర, టి.గణపతి, సి.హెచ్. మార్కో, తదితరులు పాల్గొన్నారు.

సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుంచి మినహాయించండి

సంతబొమ్మాళి, ఆగస్టు 4, ప్రభాతవార్త:

సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ నుండి మినహాయించాలని స్కూల్ టీచర్స్ అసోసియేషన్ (ఏపీ ఎస్.టి.ఏ). రాష్ట్ర ప్రధాన కార్యదర్శి తమ్మినాన చందనరావు, రాష్ట్ర కార్యవర్గ సభ్యులు కె. కె రామిరెడ్డి అన్నారు. మంగళవారం మండలంలోని వివిధ జిల్లా పరిషత్ ఉన్నత పాఠశాలలు మండల పరిషత్ పాఠశాలలను సందర్శించి ఉపాధ్యాయ విద్యారంగ సమస్యలపై కె జీ వలస యూపీ పాఠశాలలో ఉపాధ్యాయులతో సమావేశం నిర్వహించారు. 12 పి.ఆర్.సి. కమిటీని వెంటనే నియమించాలని పెండింగ్‌లో ఉన్న నాలుగు డి.ఏ. లు, సరెండర్ లీవ్ బకాయిలు, 11వ పి.ఆర్.సి. బకాయిలు వెంటనే చెల్లించాలని డిమాండ్ చేశారు. ఇన్ సర్వీస్ ఉపాధ్యాయులకు టెట్ మినహాయిస్తూ విద్యా హక్కు చట్టాన్ని సవరించాలని, దీని గురించి కేంద్ర ప్రభుత్వంపై ఒత్తిడి తీసుకురావాలని డిమాండ్ చేశారు. మిషన్ మార్చ్ పేరుతో ఇప్పటినుండే స్లిప్ టెస్టులు నిర్వహించడం వల్ల బోధనకు సమయం సరిపోవటం లేదని కాబట్టి నవంబర్ వరకు పూర్తిగా బోధనకు కేటాయించే విధంగా టైం టేబుల్ ఉండాలని దీనిపై కమిషనరేట్ సరైన నిర్ణయం తీసుకోవాలని అన్నారు. కార్యక్రమంలో లక్ష్మణరావు, శ్రీనివాసరావు, జయలక్ష్మి, కల్యాణి, తదితరులు పాల్గొన్నారు.

సంక్షేమం, అభివృద్ధే కూటమి ప్రభుత్వ లక్ష్యం

కోటబొమ్మాళి, ఆగస్టు 4, ప్రభాతవార్త:

కూటమి ప్రభుత్వం సంక్షేమం, అభివృద్ధిని లక్ష్యంగా చేసుకొని పాలన అందిస్తుందని మండలం కిస్టుపురం గ్రామానికి చెందిన సీనియర్ టీడీపీ కార్యకర్త పాగోటి ముత్తురాజు, మాజీ ఎంపిటిసి బాడాన చిన్నవాడు లు అన్నారు. మంగళవారం వారి గ్రామంలో ఇంటింటికి తెలుగుదేశం కార్యక్రమంలో పాల్గొన్నారు. ఈ సందర్భంగా వారు మాట్లాడుతూ కూటమి ప్రభుత్వం ఎన్నికల్లో ఇచ్చిన హామీలు ఒక్కొక్కటిగా అమలు చేస్తూ ముందుకు సాగుతోందని వారు అన్నారు. ఇంతవరకు ప్రజలకు అందిన లబ్ధిని ప్రజలకు వివరించారు. కార్యక్రమంలో కిస్టుపురం నీటి సంఘం అధ్యక్షుడు బాడాన రమణమూర్తి, కార్యకర్తలు, ప్రజలు పాల్గొన్నవారిలో ఉన్నారు. అలాగే కురుడు పంచాయతీ చౌదరి కొత్తూరు గ్రామంలో టిడిపి మండల కార్యనిర్వహణ కార్యదర్శి నాళ్ల ఆదినారాయణ (చిన్ని) ఇంటింటికి వెళ్లి ప్రభుత్వం అందజేసిన సంక్షేమ, అభివృద్ధి కార్యక్రమాలు గురించి ప్రజలకు వివరించారు.

టాటా-విశాఖ ఎక్స్‌ప్రెస్‌కి ఇచ్ఛాపురంలో హాల్ట్ ఉంది

ఇచ్ఛాపురం, ఆగస్టు 4 ప్రభాతవార్త :

విశాఖపట్నం-టాటా నగర్ జంక్షన్ (ఆదిత్య పూర్) మధ్య ట్రైన్ నెంబర్ 20816తో ప్రతి ఆదివారం నడిచే వీక్లీ ఎక్స్‌ప్రెస్‌కి ఇచ్ఛాపురంలో హాల్ట్ సౌకర్యం ఉందని రైల్వే అధికారులు తెలిపారు. రైల్వే టైం టేబుల్‌లో గానీ వేర్ ఈజ్ మై ట్రైన్ యాప్‌లో సంబంధించిన వెబ్ సైట్‌లో గాని చూపకపోవడం వల్ల ఇచ్ఛాపురంలో హాల్ట్ ఉందో, లేదో అని తెలియక ఇచ్ఛాపురం వచ్చే ప్రయాణీకులు ఇబ్బంది పడేవారు. ఈ విషయాన్ని ఇచ్ఛా పురంకు చెందిన బలివాడ రాము అనే వ్యక్తి ఇచ్ఛాపురం డిగ్రీ కళాశాల రిటైర్డ్ ప్రిన్సిపాల్ డాక్టర్ నిత్యానంద పట్నాయక్ దృష్టికి తీసుకువచ్చారు. ఈ విషయాన్ని సమాచార హక్కు చట్టం ద్వారా రైల్వే శాఖ అధికారుల దృష్టికి తీసుకెళ్లారు. ఫలితంగా రైల్వే శాఖ అధికారులు వెంటనే స్పందించారు. ఇచ్ఛాపురంలో సదరు ట్రైన్‌కు స్టాపేజ్ ఉన్నట్లు పేర్కొన్నారు. వేర్ ఈజ్ మై ట్రైన్ యాప్‌లో కూడా అప్డేట్ అయినట్లు చెప్పారు.

డ్రగ్స్ రహిత భారత నిర్మాణానికి కృషి చేయాలి

కొత్తూరు, ఆగస్టు 4 ప్రభాతవార్త :

ప్రధానమంత్రి పిలుపునిచ్చిన 'డ్రగ్స్ ఫ్రీ ఇండియా' సాధనను ప్రతి పౌరుడూ బాధ్యతగా స్వీక రించాలని, మాదకద్రవ్యాల నిర్మూలనకు సమాజ మంతా ఏకతాటిపైకి రావాలని టీడీపీ సీనియర్ నాయకుడు లోతుగెడ్డ తులసి వరప్రసాదరావు పిలుపునిచ్చారు. మండల కేంద్రంలోని ఓం శాంతి మందిరంలో నిర్వహించిన మాదకద్రవ్యాల నివారణ అవగాహన కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని ప్రసంగించారు. కార్యక్రమంలో ఎక్సైజ్ సీఐ, లోతుగెడ్డ తాతబాబు, స్థానిక నాయకులు, విద్యార్థులు, యువత, గ్రామ ప్రజలు పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు.

బఠాణీలు తింటుంటే..

తాజా బఠాణీలు.. ఆకుపచ్చ ముత్యాల్లా ఎంత అందంగా ఉంటాయి కదూ! చూస్తుంటేనే నోట్లో వేసుకోబుద్ధేస్తుంది. బఠాణీలను క్యాలీ ఫ్లవర్, క్యాబేజ్, బంగాళదుంప, క్యారెట్.. ఇలా దేనితో కలిపి వండినా వాటి రుచి రెట్టింప వుతుంది. బిర్యానీ, కిచిడీల్లో ఇవి గనుక లేకపోతే.. పెద్ద లోటుగానే ఉంటుంది. వీటితో స్వీట్లు, హాట్లు కూడా చేయొచ్చు. సూప్, సలాడ్ రూపంలోనూ సేవించవచ్చు. బఠాణీల్లో ఎన్ని సుగుణాలున్నాయంటే.. ఇవి.. పచ్చిబఠాణీలు ఎర్రరక్త కణాలు వృద్ధిచెంద డంలో, శరీరం అంతటికీ ప్రాణవాయువును అందజేయడంలో తోడ్పడతాయి. రక్తంలో చక్కెర స్థాయిని క్రమబద్ధం చేస్తాయి. బఠాణీలు తినడం వల్ల జీర్ణ వ్యవస్థ మెరుగుపడుతుంది. తరచుగా బఠాణీలు తినేవారికి క్యాన్సర్ వచ్చే అవకాశం తక్కువ. వీటిలో ఉన్న సెపోనిన్స్ ద్రవ్యాలు క్యాన్సర్ చేరిన సూక్ష్మ క్రిములను నశింపచేస్తాయి. వీటిల్లో ఉండే కెరొటినాయిడ్స్, జిక్సాంథిన్లు కళ్లకు దీర్ఘకాలిక వ్యాధులు రాకుండా కాపాడతాయి. యాంటీఇన్‌ఫ్లమేటరీ గుణాలు రోగనిరోధక శక్తిని పెంచుతాయి. మధుమేహం, ఉబకాయం, గుండెజబ్బుల నుంచి ఉపశమనం కలిగిస్తాయి. ఇవి కొన్ని రకాల క్యాన్సర్లను సైతం నిరోధిస్తాయని పరిశోధనల్లో తేలింది. పీచు, పొటాషియం, ప్రొటీన్లు ఉన్నాయి. మాంసాహారం తినని వాళ్లకి మంచి పోషకాహారం. ఇంత మేలు చేసే బఠాణీలను విస్మరిస్తే ఎలా! తరచూ ఏదో రూపంలో తీసుకుందాం. ఆరోగ్యంగా ఉందాం కానీ అవసరమైన దాని కంటే ఎక్కువగా తింటే మాత్రం అనర్థమేనండోయ్. □

చాలామంది అమ్మాయిలు ఇబ్బంది పడే అంశాల్లో పొట్ట దగ్గర కొవ్వొకటి. అది తగ్గడం కోసం కడుపు మాడ్చుకోవడం, కెలోరీలు లెక్కేసుకొని తినడం, కిలోమీటర్ల కొద్దీ నడవడం వంటివెన్నో చేస్తారు. అవసరమైన పోషకాలు అందక కొత్త

పొట్ట తగ్గేదిలా!

సమస్యలు తెచ్చుకుంటారు. అలా కాకూడదంటే కొన్ని అలవాట్లు చేసుకుని, క్రమంగా పాటించాలి. అల్పాహారం మానొద్దు. ప్రొటీన్లు, ఆరోగ్యకరమైన కొవ్వులు, కార్బొహైడ్రేట్లు, పీచు ఎక్కువగా ఉండే గుడ్లు, ఓట్స్, రాగి, తాజాపండ్లు, నట్స్ వంటివాటికి దానిలో చోటివ్వాలి. ఇవి మెటబాలిజాన్ని మెరుగుపరుస్తాయి. శరీరానికి కావల్సిన శక్తినివ్వడంతోపాటు జీర్ణప్రక్రియను మెరుగుపరుస్తాయి. రోగ నిరోధకతనూ పెంచుతాయి. రోజూ కొద్దిసేపైనా వ్యాయామానికి చోటివ్వాలి. మధ్యస్థ స్థాయి వాటికి వారంలో రెండున్నర. గంటలైనా కేటాయించాలి. కండలతో మాకేం పని అనుకోకుండా రోజూ కొంచెం సేపు బరువులు ఎత్తిదించండి. డంబుల్స్ వగైరా కొనాల్సిన పనిలేదు కానీ. రెండు వాటర్ బాటిళ్లతో చేసినా సరే! ఇంకా గుంజీళ్లనూ జోడించుకుంటే మేలు. ఇవి కొవ్వును కరిగిస్తూనే మెటబాలిజాన్నీ మెరుగుపరుస్తాయి. బోర్ కొట్టినా, ఒత్తిడి పెరిగినా చిరుతిళ్ల వైపు మనసు మళ్లుతుంది. అందుబాటులో బాదం, తాజా పండ్లు, క్యారెట్, కీర వంటి కాయగూరల పొట్ట తగ్గాలా.. ముక్కలను దగ్గర ఉంచుకొని తింటే సరి. ఇవి ఆకలిని అదుపు చేయడమే కాదు, జీర్ణక్రియనీ మెరుగుపరుస్తాయి. నీళ్లు బాగానే తాగుతున్నారా? ఇదీ 'పొట్ట'కు కారణమే! కనీసం 2 లీటర్లు తాగుతున్నారో లేదో చూసుకోండి. ఇవి శరీరాన్ని హైడ్రేట్ చేస్తూనే ఆరోగ్యాన్నీ మెరుగుపరుస్తాయి. మజ్జిగ, హెర్బల్ టీ, పండ్ల రసాల రూపంలో తీసుకున్నా మంచిదే. ఇంకా ఏం తింటున్నాం, తాగుతున్నాం అన్నది గమనించుకుంటే ఉండాలి. కాబట్టి, తినేటప్పుడు ఫోన్, టీ, పుస్తకాలను దూరంగా ఉండాలి. . చివరగా ఒత్తిడి కూడా ఈ సమస్యకు మూలమే. పైగా త్వరగా కొవ్వు కరగకుండా చేస్తుంది. కాబట్టి, ధ్యానం, బ్రీతింగ్ ఎక్సర్‌సైజ్‌లు వగైరా చేస్తూ దాన్నీ అదుపులో పెట్టుకోండి. శారీరకరంగా, మానసికంగా ఆరోగ్యంగా అవ్వడమే కాదు.. పొట్టదగ్గర సహా అనవసరం కొవ్వు కరగడం ఖాయం. □



గుర్రాన్ని అదుపులో పెట్టేం దుకు రౌతు, పడవను సజావుగా నడిపేందుకు సరంగు, ఏనుగును సముదాయించి మచ్చిక చేసుకు నేందుకు మావటి...వీళ్లతా నిత్య జీవితంలో అరుదుగా తారసపడే వ్యక్తులే. ఎవరి ప్రత్యేకత వారిదే! వీళ్లలో నిత్య చైతన్యవంతులైన మగ మహా పురుషులు మాత్రమే ఉంటారని ప్రతీతి. కానీ అనుకోకుండా ఏనుగులను మచ్చిక చేసుకుని దారికి తెచ్చే ఓ మహిళామణి తారస పడిందటే నమ్మండి ఆమె 'హస్తికన్య' లేదా 'ఏనుగు కూతురు' అనే మారు పేర్లతో పిలువబడుతోంది. పార్వతి బారువా భారతదేశపు తొలి మహిళా

తొలి మహిళా మావటి !

ఏనుగు మావటిగా 'పద్మశ్రీ' అవార్డుకూడా అందుకుంది. కోక్రాఝర్ జిల్లాలోని కచుగావ్ అడవుల నుండి తన మొదటి ఏనుగును ఇంటికి తీసుకువచ్చినప్పుడు ఆమె వయస్సు 14 సంవత్సరాలే. పురుషాధి క్యత ఉన్న ఇలాంటి రంగంలోకి ఓ యువతి ప్రవేశించి సాహసోపేత జీవితాన్ని అనుభవి స్తోందంటే వారి ప్రతిభా నైపుణ్యాలను గుర్తించవలసిందే ! బారువా ఏనుగులతో తనకున్న బంధాన్ని అద్వితీయంగా మలచు కొన్నారు. పార్వతి బారువా 1953, మార్చి 14న అసోంలోని గౌరీపూర్ రాజ కుటుంబంలో, అధికారాన్ని చేపట్టిన చివరి వ్యక్తి దివంగత ప్రకృతిష్ చంద్ర బారువా దంపతుల గారాలపట్టి రాజకీయ శాస్త్రంలో పట్టభద్రురాలైన పార్వతికి వన్య ప్రాణుల పట్ల, ముఖ్యంగా ఏనుగుల పట్ల ఎల్లప్పుడూ ఆసక్తి ఉండేదని చేపుతారు. ఆమె తండ్రికి ఏనుగుల గురించి ఒక అతీంద్రియ అవగా హన ఉండేది. ఆమె చిన్నతనంలో తండ్రి దట్టమైన అడవుల్లోకి తీసుకు వెళ్లేవారు వన్య మృగాలను సైతం వారు ఆప్యాయతతో పలకరిస్తారు. ఆ కుటుంబానికి రాజశాలలో 40 ఏనుగులు ఉండేవట. 1975 నుండి 1978 వరకు, పార్వతి అసోం, ఉత్తర బెంగాల్ అడవుల లో అమలులో ఉన్న, ఉచ్చుతో అడవి ఏనుగులను పట్టుకునే సాంప్రదాయ అస్సామీ పద్ధతి 'మేళా శిఖర్' ద్వారా 14 అడవి ఏనుగులను మచ్చిక చేసుకుంది. ఆమె 500కు పైగా ఏనుగులకు శిక్షణ కూడా ఇచ్చిం దన్న రికార్డులున్నాయి. పార్వతి ఇప్పుడామెకు 70 ఏళ్లు దినచర్యలో తన ఏనుగులకు స్నానం చేయించడం, అడవిలో వాటిపై స్వారీ చేయడం, వాటికి శిక్షణ ఇవ్వడం వంటివి చోటు చేసుకుని ఉంటాయి. తన మూడు ప్రియమైన ఏనుగులు లక్ష్మీమాల, అలోక, కంచన్‌మాలల కోసం ఆమె ఎంతో ఇష్టంగా బియ్యంతో చేసిన 'హడియా' అనే ఒక రకమైన తినుబండారాన్ని తయారు చేసి తినిపిస్తుంది. మద్యం అంటే కూడా వాటికి బాగా ఇష్ట మట. బీహార్, పశ్చిమ బెంగాల్, అసోం వంటి రాష్ట్రాలు అదుపు తప్పిన ఏనుగుల ను అదుపు చేయడానికి లేదా గాయపడిన, అనారోగ్యంతో ఉన్న వాటి సంరక్షణ కోసం ఆమె సహాయాన్ని కోరతాయి. పార్వతి బారువా పద్మశ్రీ పురస్కార గ్రహీత. ఆమె ఐక్యరాజ్య సమితి పర్యావరణ కార్యక్రమం పురస్కారాన్ని కూడా అందుకున్నారు. ఏనుగుల కోసం ఆమె చేసిన జీవితకాల సేవకు, అసోం ప్రభుత్వం ఆమెను 'అసోం గౌరవ ప్రధాన ఏనుగుల సంరక్షకురాలి'గా సత్కరించింది. కోల్‌కతా అంతర్జాతీయ వన్యప్రాణి పర్యావరణ చలనచిత్రోత్సవం ఆమెకు జీవిత సాఫల్య పురస్కారాన్ని, అలాగే అపరాజిత 2023 చిత్రానికి 'నేచర్స్ వారియర్' జ్యూరీ అవార్డును కూడా ప్రదానం చేసింది. □

సుబ్రహ్మణ్యుడు

రాహు కేతు దోషం ఆయా జాతకులను అనేక రకాల ఇబ్బందులకు గురిచేస్తూ ఉంటుంది. అందువలన రాహు కేతు దోషం నుంచి విముక్తులు కావడానికి ఎవరికి వారు ప్రయత్నిస్తుంటారు. కుమారస్వామి ..సుబ్రహ్మణ్య స్వామిగా పిలవ బడుతూ ఉంటాడు. సుబ్రహ్మ ణ్యుడు .. నాగులకు అధిపతి. అందు వలన ఆయనకి పూజాభిషేకాలు జరపడం వలన నాగులు శాంతిస్తాయి. ఫలితంగా రాహు కేతు దోష నివారణ జరుగు తుందని ఆధ్యాత్మిక గ్రంథాలు చెబుతు న్నాయి. 'సుబ్రహ్మణ్యస్వామికి 'మంగళ వారం' అభిషేకం చేయడం వలన ఈ దోషం తొలగిపోతుంది. ఇక ఈ దోషంతో బాధపడుతున్నవారు, దుర్గాదేవిని .. గణపతిని పూజించడం వలన కూడా మంచి ఫలితం కనిపిస్తుంది. రాహువుకు అమ్మవారు అధిదేవత .. అలాగే కేతువు అధిష్ఠాన దైవం గణపతి. అందువలన రాహు కేతు దోషంతో నానా ఇబ్బందులు పడుతున్నవారు దుర్గాదేవి గణపతులను పూజించినట్టయితే, ఆ దోషం తొలగిపోతుందని ఆధ్యాత్మిక గ్రంథాలు స్పష్టం చేస్తున్నాయి.

ఆరాకనే మడతపెట్టి..

ఉతికిన వెంటనే ఆరేయండి.చేత్తో ఉతికినా లేదా వాషింగ్ మిషన్‌లో ఉతికినా.. బట్టలను మడతలు పడేలా బకెట్‌లో ఎక్కువ సేపు అలాగే ఉంచ కూడదు. తడి బట్టలు బకెట్‌లో ఎక్కువ సేపు ఉంటే వాటి నుంచి దుర్వాసన వస్తుంది.దుస్తుల మధ్య గ్యాప్ ఇవ్వండి: బట్టలు ఆరేసేటప్పుడు ఒకదానికొకటి తాకకుండా కొంత దూరం (గ్యాప్) ఉండేలా ఆరేయాలి. దీనివల్ల గాలి బాగా తగిలి బట్టలు త్వరగా ఆరడానికి దోహదపడుతుంది.ఫ్యాన్ లేదా కిటికీల దగ్గర ఆరేయండి. ఇంట్లో బాల్కనీ ఉంటే బయట ఆరేయడం మంచిది. బయట వర్షం పడుతుంటే కిటికీల దగ్గరగాని లేదా గాలి ఎక్కువగా వచ్చే ప్రాంతాల్లో, ఇంట్లోనే ఫ్యాన్ కింద ఆరేస్తే త్వరగా ఆరిపో తాయి. మందపాటి బట్టలను ఉదయమే ఉతకండి. దుప్పట్లు, జీన్స్ పాంట్లు, టవల్స్ వంటి మందపాటి బట్టలను ఉదయమే వీలైనంత త్వరగా ఉతకాలి. రోజంతా గాలి తగలడం వల్ల ఇవి బాగా ఆరే అవకాశం ఉంటుంది.తేమ ఉన్న బట్టలను అల్మారాలో పెట్టవద్దు. బట్టలు కొద్దిగా తడిగా ఉన్నా లేదా లైట్‌గా తేమ ఉన్నా కూడా అల్మారాలో పెట్టకూడదు. అలా పెడితే దుర్వాసన వస్తుంది.. కాబట్టి బట్టలు పూర్తిగా ఆరిన తర్వాత మాత్రమే మడతపెట్టి దాచు కోవాలి. అల్మారాలకు గాలి తగ^లని వ్వండి.వర్షా కాలంలో అల్మా రాలను అప్పుడ ప్పుడు తెరిచి ఉంచడం వల్ల లోపల ఉండే తేమ తగ్గి, బట్టల కు బూజు పట్ట కుండా.. వాసన రాకుండా ఉంటుంది. తడి, పొడి బట్టలను కలపకండి. ఉతికిన తడి బట్టలతో పాటు పొడి బట్టలను కలిపి ఆరేయడం గానీ, ఉంచడంగానీ చేయకూడదు. దీనివల్ల పొడి బట్టలకు కూడా తడి వాసన పడుతుంది. అవసరానికి తగినట్లే ఉతకండి.వర్షాల సమయంలో బట్టలు ఆరడానికి ఎక్కువ సమయం పడుతుంది. కాబట్టి, ఒకేసారి ఎక్కువగా ఉతకకుండా అవసరమైన మేరకే ఉతికితే ఆరేయడం.. చాలా తేలికవుతుంది. భారం కూడా ఉండదు.బట్టలు ఉతికేటప్పుడు చివరి రిన్స్‌లో కొద్దిగా ఫ్యాబ్రిక్ కండిషనర్ లేదా బట్టలకు అనువైన క్రిమినాశక లిక్విడ్ ఉపయోగిస్తే తడి వాసన తగ్గడానికి సహాయ పడుతుంది. అలాగే బట్టలు పూర్తిగా ఆరిన తర్వాతే మడతపెట్టి అల్మారాలో పెట్టడం అలవాటు చేసుకోవాలి.ఈ చిన్నచిన్న చిట్కాలు పాటిస్తే.. వర్షాకాలంలోనూ మీ బట్టలు త్వరగా ఆరిపోవడంతో పాటు తాజాగా, దుర్వాసన లేకుండా ఉంటాయి.□

చిటాకా

✦ముఖ కండ రాలను యథా స్థితికి తెచ్చి చర్మంపై వుండే ముడత లను పోగొట్టి వృద్ధాప్య ఛాయలను పోగొడు తుంది. థర్మో స్టాటిక్ చికిత్స.

✦ థర్మోడైనమిల్ చికిత్స జారిపోయిన చర్మాన్ని బిగుతుగా చేస్తుంది. ఎండి పోయిన తర్వాత ముఖాకృతిలో ఊడి వస్తుంది. ఈ చికిత్స వల్ల వయస్సును పదినుండి 5 సంవత్సరములకు తగ్గినట్లు చేయవచ్చును.

✦ వామును ఉప్పు నమిలి నీరు త్రాగిన కడుపునొప్పి తగ్గును.

✦ నోటి చప్పదనం తగ్గిపోవాలంటే ధనియాల కషాయం త్రాగండి. □

తెర

'కొరియన్ కనకరాజు' మంచి ఫన్ సినిమా: మేర్లపాక గాంధీ



కొరియన్ కనకరాజు కథ ఎలా మొదలైంది?

నేను కొంత మంది ఫ్రెండ్స్‌తో కలిసి అనంతపురం మీదుగా ఒక పెళ్లికి వెళ్లాను. రాత్రి సమయంలో కియా ఫ్యాక్టరీ దగ్గర ఆగాం. ఆ ప్రదేశం విజువల్‌గా చాలా బాగుంది. అక్కడ పని చేసే కొరియన్ల కోసం ప్రత్యేకంగా ఒక కమ్యూనిటీ, వాళ్ల కల్చర్‌కు తగ్గ రెస్టా రెంట్లు, మార్కెట్లు ఉన్నాయని తెలిసింది. అనంత పురం లాంటి చోట కొరియన్లు ఉండడం, వాళ్ల కోసం ప్రత్యేకమైన కల్చర్ ఏర్పడడం నాకు చాలా ఇంట్రెస్టింగ్‌గా అనిపించింది.

ఈ కథను ముందుగా వరుణ్ తేజ్ కోసమే అనుకున్నారా?

మొదట ఆయన కోసం మరో కథ అనుకున్నాను. అది చెప్పిన తర్వాత ఈ కొరియన్ పాయింట్ కూడా చెప్పాను.ఆయనకు బాగా నచ్చి దీన్ని డెవలప్ చేయ మన్నారు. పూర్తి స్క్రిప్ట్ సిద్ధమైన తర్వాత మళ్లీ వినిపించాను. వరుణ్ తేజ్ నాకు నటుడిగా చాలా ఇష్టం.

మీ సినిమాల మధ్య చాలా గ్యాప్ వస్తుంటుంది. కారణం? నేను ఒకేసారి చాలా కథల మీద పని చేస్తుంటాను. కొన్నిసార్లు కొంత దూరం వచ్చాక ఆ కథ నాకే నచ్చదు. అప్పుడు దాన్ని పక్కన పెట్టిమరో కథ మొదలుపెడతాను.

మీ నాన్నకూడా కథా రచయితే కదా. ఆయన కథతో సినిమా చేయొచ్చు కదా?

నిజమే. మా నాన్నకథతో సినిమా చేయాలనే ఆలోచన ఉంది. కానీ ఆయన టేస్ట్‌కు, నా టేస్ట్‌కు తేడా ఉంటుంది. ఆయనకు రొమాంటిక్ కథలు ఇష్టం.

రితిక పాత్ర గురించి చెప్పండి?

ఈ సినిమాలో రితిక కొరియన్ ఫ్యాక్టరీలో పని చేస్తుంది. ఆమెకు కొరియన్ కల్చర్ అంటే చాలా ఇష్టం. నిజానికి తనకి కొరియన్ భాష కూడా తెలుసు. ఆమె లుక్ కూడా ఆ కల్చర్‌కు బాగా మ్యాచ్ అవుతుంది.

తమన్ మ్యూజిక్ గురించి?

తమన్ అద్భుతమైన సంగీతం ఇచ్చారు. ఇప్పటికే విడుదలైన రెండు పాటలకు చాలా మంచి రెస్పాన్స్ వచ్చింది.

మిగతా పాత్రల గురించి?

ఇది పూర్తిగా ఫన్ ఎంటర్‌టైనర్. సత్య, మురళీధర్ గౌడ్, సునీల్.. ఇలా ప్రతి పాత్ర కూడా చాలా ఫన్నీగా ఉంటుంది. ఇందులో మాఫియా డాన్ ఉన్నా అది కూడా సీరియస్ ట్రీట్‌మెంట్‌లో కాదు. ఫన్‌తోనే నడుస్తుంది.

మీ డ్రీమ్ ప్రాజెక్ట్ ఏది?

ప్రస్తుతం నా డ్రీమ్ ప్రాజెక్ట్ కొరియన్ కనకరాజు.

ఏ హీరోతో పని చేయడం మీకు ఎక్కువ కంఫర్ట్‌గా ఉంటుంది?నేను ప్రతి హీరోతో స్క్రిప్ట్ స్టేజ్ నుంచే వాళ్లను ఇన్వాల్వ్ చేస్తాను. వాళ్ల సలహాలు, సూచనలు కూడా తీసుకుంటాను.

వరుణ్ తేజ్‌తో ఈ సినిమా ఎలా మొదలైంది?

వరుణ్ తేజ్ ఒక ఎంటర్‌టైనింగ్ జానర్ సినిమా చేయాలనుకుంటున్నారని నిర్మాత రాజీవ్‌రెడ్డి ద్వారా తెలిసింది. అప్పుడు ఈ కథను ఆయనకు చెప్పాను. యూవీ వంశీ, రాజీవ్ రెడ్డి ఈ మీటింగ్ ఏర్పాటు చేశారు.

ప్రొడక్షన్ నెం 2 టైటిల్ 'అలియాస్ రుక్మిణి' వీడియో రిలీజ్

'నేచరల్ స్టార్ నాని సమర్పణలో తెరకెక్కిన 'కోర్ట్ – స్టేట్ వర్సెస్ ఎ నోబడీ' ఘన విజయానంతరం ఆయన యూనానిమస్ ప్రొడక్షన్స్ రెండో చిత్రాన్ని అధికారికంగా ప్రకటించారు. నితిన్ హీరోగా నటిస్తున్న ఈ చిత్రానికి 'దండోరా' ఫేమ్ మురళీకాంత్ దేవసోత్ దర్శకత్వం వహిస్తున్నారు. ఈ చిత్రాన్ని తాజాగా సాంప్రదాయ పూజా కార్యక్రమాలతో ప్రారంభించారు. ముహూర్తపు సన్నివేశానికి నాని క్లాప్ కొట్టగా, నితిన్ తండ్రి సుధాకర్ రెడ్డి కెమెరా స్విచ్ ఆన్ చేశారు. నాని గంటా రాంబాబు, నిర్మాత వెంకట్ బోయనపల్లి స్క్రిప్ట్‌ను చిత్ర బృందానికి అందజేశారు. 'కోర్ట్' దర్శకుడు రామ్ జగదీష్, శైలేష్ కొలను కలిసి తొలి షాట్‌కు దర్శకత్వం వహించారు. నాని మాట్లాడుతూ: యూనానిమస్ ప్రొడక్షన్స్ రెండో చిత్రం 'అలియాస్ రుక్మిణి' పూజా కార్య క్రమంతో ఈ రోజు ప్రారంభమవడం చాలా ఆనందంగా ఉంది. నా కెరీర్ ప్రారంభం నుంచే, నేను సక్సెస్ కాకముందే నితిన్ నాకు ఎంతో సపోర్ట్ చేశారు. హీరో నితిన్ మాట్లా డుతూ: ఈ రోజు మా సినిమా ముహూ ర్తం జరగడం చాలా ఆనందంగా ఉంది. నాని సమర్పణలో, దీప్తి నిర్మాణంలో, మురళీకాంత్ దర్శకత్వంలో ఈ సినిమా నా కెరీర్‌లో ఎంతో ప్రత్యేకమైన చిత్రంగా నిలుస్తుంది. దర్శకుడు మురళీకాంత్ దేవసోత్ మాట్లాడుతూ: ఈ రోజు నాకు చాలా సంతోషంగా ఉంది. ఈ కథను నాని అన్నకు చెప్పిన వెంటనే 'చేద్దాం' అని చెప్పడంతో ఈ ప్రయాణం మొదలైంది. అప్పటి నుంచి అన్నీ చాలా అందంగా జరుగుతున్నాయి. నితిన్ అన్న ఈ సినిమాలో భాగం కావడం నా కల నిజమైనట్టే. అదే సమయంలో బాధ్యత కూడా మరింత పెరిగింది. నిర్మాత దీప్తి గంటా మాట్లాడుతూ: కొన్ని కథలు విన్న వెంటనే ఇది ప్రత్యేకమైన సినిమా అవుతుంది అనే ఫీలింగ్ వస్తుంది.

'అనకాపల్లి' ఫ్యామిలీ డ్రామాగా రూపొందించాం : నిర్మాతలు త్రినాథరావు నక్కిన, కాండ్రేగుల నాయుడు..

కాండ్రేగుల నాయుడుతో మీకున్న బంధం గురించి చెప్పండి?..

త్రినాథరావు నక్కిన..నాయుడు అనకాపల్లిలో ఎన్నో సేవా కార్యక్రమాలు చేస్తుంటాడు. ఇండస్ట్రీలోకి వస్తానని నాతో ఎప్పుడూ అంటూ ఉండేవాడు. కానీ నేను మాత్రం వద్దు అని అనేవాడ్ని. చివరకు పట్టుదలతో ఇక్కడకు వచ్చి నిర్మాత అయ్యాడు.

అనకాపల్లికథను ఇప్పుడు చేయడానికి గల కారణం ఏంటి?..

..త్రినాథరావు నక్కిన.. : అనకాపల్లికథను నేనే రాసుకున్నాను. కానీ తీయకుండా అలా పెట్టేశాను. దర్శకుడిగా జర్నీ మొదలైన తర్వాత సమీకరణాలు మారుతూ వచ్చాయి. అందుకే నా దగ్గర ఉన్న మంచి కథల్ని భవ్య శ్రీ మూవీ మేకర్స్, నక్కిన నెరేటివ్స్ బ్యానర్ల మీద తీయాలని అనుకుంటున్నాం.

అనకాపల్లిలో షూట్ చేసిన అనుభవం గురించి చెప్పండి?..

కాండ్రేగుల నాయుడు.. : మా సొంత ఊర్లో షూట్ చేయడంతో మాకు బాగా కలిసి వచ్చింది.

కథా చర్చల్లో మీ పాత్ర ఎంత ఉంది?..

..కాండ్రేగుల నాయుడు.. : త్రినాథరావు చెప్పిన ఈ కథ నాకు చాలా నచ్చింది. కథ విన్న వెంటనే ప్రాజెక్ట్‌కి ఓకే చెప్పేశాను.

ఈ సినీ జర్నీ మీకు ఎలా అనిపించింది?..

కాండ్రేగుల నాయుడు.. : సొంతూరిలో మా సినిమాని తీయడం నాకెంతో ఆనందం గా అనిపించింది. మొత్తం 75 లొకేషన్లలో చిత్రీకరించాం. **అనకాపల్లిలోని మెయిన్ పాయింట్ ఏంటి?..** త్రినాథరావు నక్కిన.. : ఇప్పుడున్న జెన్ జీ తరానికి ఎమోషన్స్ తెలియడం లేదు. ఫ్యామిలీ ఎమోషన్స్‌ని మళ్లీ అందరికీ తెలియాలని, గుర్తించాలని ఈ మూవీని తీశాం.

అనుకున్న బడ్జెట్‌లోనే సినిమాని తీశారా? ఓటీటీ డీల్ పూర్తయిందా?..

..త్రినాథరావు నక్కిన.. : నేనూ ఓ దర్శకుడినే అవ్వడంతో ఈ సినిమాకి ఎక్కడెక్కడ ఏం అవసరం పడిందో అక్కడక్కడ బడ్జెట్ పెంచుకుంటూ వెళ్లాను. .

ఆగస్ట్ 7న గట్టి పోటీ ఉంది కదా?..

..త్రినాథరావు నక్కిన.. : ముందు మేం ఆగస్ట్ 7న ఫిక్స్ అయ్యాం. అప్పుడు ఈ చిత్రాలన్నీ లేవు. అయితే ఎప్పుడు వచ్చినా కూడా ఏదో ఒక సినిమా పోటీలో ఉంటుంది. **దర్శకుడి గురించి చెప్పండి?..** త్రినాథరావు నక్కిన.. : ఖగేష్ నాకు పదేళ్ల నుంచి తెలుసు. నాకు తమ్ముడిలాంటివాడు.

'దండా'లో పవర్‌ఫుల్ డైలాగ్స్ ఉన్నాయి: డైరెక్టర్ ఆదిత్య దేవులపల్లి

మీ బ్యాక్‌గ్రౌండ్ గురించి చెప్పండి?..

నేను చదువులో టాపర్‌నే, కానీ చిన్నప్పటి నుంచీ నాకు సినిమా లంటే పిచ్చి ఇష్టం. ఆ ప్యాషన్ తోనే ఇంజనీరింగ్ మధ్యలోనే వది లేసి రాడికల్ డిసిషన్ తీసు కున్నా. ఇంట్లో కెమెరా మీద ఉన్న ఆసక్తిని చెప్పడంతో ఓ చిన్న కెమెరా కొనిచ్చారు.

చాయ్ షాట్స్‌లోకి ఎంట్రీ ఎలా జరిగింది?..

నేను చెప్పిన కథ అనురాగ్ అన్నకి బాగా నచ్చింది. "తెలుగులో సాధారణంగా ఇలాంటి కథను తీసే ధైర్యం ఎవరూ చేయరు అని చెప్పారు. ఆ తర్వాత మళ్లీ నన్ను పిలిచి మాట్లాడారు.

'దండా'కథలో మీ ప్రమేయం ఎంతవరకు ఉంది?..

ఒరిజినల్ కథను విజయ్ కుమార్ రాశాడు, కానీ అందులో కొన్ని లోపాలుఉన్నాయి. నేను మొత్తం రీరైట్ చేసి కథకు ఒక కంప్లీట్‌నెస్ తీసుకొచ్చా.

దండాకి వస్తున్న రెస్పాన్స్ అండ్ అప్రిషియేషన్ ఎలా ఉంది?..

ఇప్పటివరకు దండాకి ఒక్కటంటే ఒక్క నెగెటివ్ రివ్యూ కూడా రాలేదు! ప్రతీ ఒక్కరూ ఈ ఫ్రెష్ మేకింగ్ స్టైల్, స్ట్రాంగ్ కంటెంట్‌ను విపరీతంగా పొగుడుతున్నారు.

సొంత కథ కాకుండా దండాతోనే డైరెక్టర్‌గా ఎందుకు డెబ్యూ చేశారు?..

నాకు పూరీ జగన్నాథ్, రామ్‌గోపాల్ వర్మ, ఉపేంద్ర లాంటి డైరెక్టర్ల మేకింగ్ అన్నా, ఆటిట్యూడ్ అన్నా చాలా ఇష్టం.

డైలాగ్స్ గురించి చెప్పండి?..

ఈ పవర్‌ఫుల్ డైలాగ్స్ అన్నీ అరవింద్ క్యారెక్టర్ జర్నీ నుంచే పుట్టుకొచ్చాయి.

కాస్టింగ్ సెలెక్షన్ ఎలా జరిగింది?..

అరవింద్ పాత్ర కోసం చాలామందిని అనుకున్నాం, ఫైనల్‌గా దొరసాయి తేజను ఓకే చేశాం. ఆరంభంలో అతని చుట్టూ ఉన్న కాంట్ర వర్సీలు చూసి కొన్ని అనుమానాలు ఉండేవి,

దండా సక్సెస్‌పై మీ పేరెంట్స్ రియాక్షన్ ఏంటి?..

నాలో ఉన్న ఈ ఫైర్ మా అమ్మ నుంచి వచ్చిందే! ఆమె తరచూ చెప్పే రాజు కంటే మొండోడే బలవంతుడు అనే డైలాగ్‌నే సిరీస్‌లో వాడాను. మా నాన్నకి హీస్ట్ సినిమాలు అంటే పిచ్చి ఇష్టం.

యంగ్ టాలెంటెడ్ హీరో, ప్యాషనేట్ ప్రొడ్యూసర్ రాకేష్ వర్రే చేస్తున్న కొత్త సినిమా "మాయలేడి". ఈ సినిమాలో రాకేష్ వర్రే హీరోగా నటిస్తూ క్రేజీ యాంట్స్ ప్రొడక్షన్స్ బ్యానర్ పై నిర్మిస్తున్నారు. రాకేష్ వర్రే గతంలో క్రేజీ యాంట్స్ ప్రొడక్షన్స్ బ్యానర్ పై ఎవరికీ చెప్పొద్దు, పేకమేడలు వంటి కంటెంట్ ఓరియెంటెడ్ మూవీస్ నిర్మించి అందరి ప్రశంసలు పొందారు.

'మాయలేడి' మూవీ గ్లింప్స్ రిలీజ్

ఇప్పుడు "మాయలేడి"తో మరో ఇంట్రెస్టింగ్ చిత్రాన్ని ప్రేక్షకుల ముందుకు తీసుకురాబోతు న్నారు. ఈ సినిమాను దర్శకుడు ప్రశంకర్ రూపొందిస్తున్నారు. మధుమిత సర్కార్ హీరోయిన్ గా నటిస్తోంది. త్వరలోనే "మాయలేడి" సినిమా గ్రాండ్ థియేట్రికల్ రిలీజ్ కు రెడీ అవుతోంది. ఈ రోజు "మాయలేడి" సినిమా గ్లింప్స్‌ను మేకర్స్ రిలీజ్ చేశారు. ఈ గ్లింప్స్ ఎలా ఉందో చూస్తే హీరోయిన్ గురించి తెలుసుకున్నా కొద్దీ ఆమె పట్ల హీరోలో మరింత ఆసక్తి పెరుగుతుం టుంది. ఆ అమ్మాయి గురించి తెలిసే కొద్దీ ఇంకా ఎక్కువగా ఇష్టపడతాడు. ఈ జంట లవ్ ప్రపోజ్ చేసుకుని సంతోషంగా ఉన్న సమయంలో హీరోయిన్ గురించి కొత్త కొత్త విష యాలు తెసుకుంటాడు హీరో. తమ మధ్యకు ఎవరైనా వస్తే ఊరుక ోనంటూ.. హీరోయిన్ యాక్షన్ తో సత్తా చూపిస్తుంది. హీరో హీరోయిన్స్ ఇద్దరూ కలిసి తమ శత్రువులతో ఫైట్ చేయడం గ్లింప్స్ కు హైలైట్ గా నిలుస్తోంది. గ్లింప్స్ చివరలో హీరో చెప్పిన ఇప్పుడు నా లవ్ స్టోరీలో విలన్ ఎవరో తెలుస్తోంది.. అనే డైలాగ్ క్యూరియాసిటీ క్రియేట్ చేస్తోంది. ఈ గ్లింప్స్‌లో హీరో రాకేష్ వర్రే ఫ్రెష్ లుక్‌లో కనిపించి ఆకట్టుకున్నారు.

KJQ చాలా డిఫరెంట్ సినిమా: దీక్షిత్ శెట్టి

KJQ మంచి కంటెంట్ ఉన్న యూనిక్ సినిమా. ఎమోషన్స్ ఖచ్చితంగా కనెక్ట్ అవుతాయి: హీరో శశి ఓదెల సక్సెస్ ఫుల్ నిర్మాత సుధాకర్ చెరుకూరి KJQ సినిమాస్ బ్యానర్ పై నిర్మించిన పీరియడ్ క్రైమ్ డ్రామా KJQ (కింగ్ జాకీ క్వీన్). 1990ల నాటి నేపథ్యంలో సాగే ఈ చిత్రంలో 'దసరా', 'ది గర్ల్‌ఫ్రెండ్' చిత్రాలతో గుర్తింపు పొందిన దీక్షిత్ శెట్టి హీరోగా నటిస్తున్నారు. వీరితో పాటు నూతన నటుడు శశి ఓదెల, యుక్తి తరేజా కీలక పాత్రల్లో నటిస్తున్నారు. గత ఏడాది కన్నుమూసిన దర్శకుడు రీరీ(కిరణ్)కి ఇది చివరి చిత్రం. ప్రెస్ మీట్‌లో హీరో దీక్షిత్ శెట్టి మాట్లాడుతూ: నేను చేసిన ప్రతి సినిమాను మీరు ఎంతగానో ఆదరించారు. ఈ సందర్భంగా మీ అందరికీ నా హృదయపూర్వక కృతజ్ఞతలు. ప్రతి సినిమా రిలీజ్ సమయంలో ఒక ఎక్సైట్మెంట్, ఒక భయం ఉంటుంది. కానీ ఈసారి మాత్రం చాలా బాధగా ఉంది. సినిమా విడుదల సమయంలో దర్శకుడు మన మధ్య లేకపోవడం... సినిమా తండ్రి లేని కొడుకులా అనిపిస్తోంది. అందరికీ థ్యాంక్యూ సో మచ్.హీరో శశి మాట్లాడుతూ: KJQ చాలా మంచి సినిమా. రెగ్యులర్ సినిమాలకు భిన్నంగా ఉండే చిత్రమిది. తప్పకుండా ప్రతి ఒక్కరికీ నచ్చుతుందని నమ్మకం ఉంది. డెఫినెట్‌గా థియేటర్‌లో చూసి మీ హానెస్ట్ ఒపీనియన్ చెప్పండి. కిరణ్ గారు మన మధ్య లేకపోవడం చాలా బాధాకరం. ఆయన విజన్‌ను తెరపైకి తీసుకురావడానికి మేమంతా ఎంతో ప్యాషన్‌తో పనిచేశాం. హీరోయిన్ యుక్తి తరేజా మాట్లాడుతూ: మా సినిమాను సపోర్ట్ చేస్తున్న ప్రతి ఒక్కరికీ థ్యాంక్యూ. కిరణ్ గారు చాలా పెద్ద విజన్‌తో ఈ సినిమాను తెరకెక్కించారు. రిలీజ్ సమయంలో ఆయన మన మధ్య లేకపోవడం చాలా బాధాకరం.

కాసిందొరవలసలో పొలంపిలుస్తోంది కార్యక్రమం

బొబ్బిలి, ఆగస్టు 4, ప్రభాతవార్త:

కాసిందొరవలస గ్రామ పరిధిలో పొలం పిలుస్తుంది నిర్వహించారు. కార్యక్రమంలో ప్రధానంగా రైతులకు ప్రస్తుత ఎల్నినో ప్రభావం వలన ఏర్పడే వాతావరణ పరిస్థితులు వాటి వలన జరిగే పంటల నష్టాన్ని గురించి రైతులకు అవగాహన కల్పిస్తూ ప్రస్తుత పరిస్థితుల్లో వాతావరణ పరిస్థితులకు అనుకూలంగా పంటల యజమాన్యంలో జాగ్రత్తలు తీసుకోవాలని అలాగే ముఖ్యంగా ఇటువంటి పరిస్థితుల్లో పంటలను కాపాడుకోవడానికి ప్రధాన ఆయుధం పంటల భీమా పథకం కావున ప్రతి రైతు కూడా వరి మరియు మొక్కజొన్న పంటలకు భీమా నమోదు చేసుకొని జాగ్రత్తలు తీసుకోవలసినదిగా కోరడం అలాగే ప్రత్యామ్నాయ పంటలైన అపరాలు మరియు నువ్వు పంటల మీద దృష్టి పెట్టాలని తక్కువ నీటితో పండించే పంటలపై మొగ్గు చూపాలని రైతులకు అవగాహన కల్పించడం జరిగినది . కార్యక్రమంలో గ్రామ పెద్దలు రైతు సోదరులు గ్రామ ఉద్యాన శాఖ సహాయకులు అప్పలనాయుడు పాల్గొనడం జరిగింది.

తల్లిపాలతో బిడ్డ మేధస్సు పెరుగుతుంది

శృంగవరపుకోట,ఆగస్టు4,ప్రభాతవార్త :

తల్లి పాలతో బిడ్డకు మేధస్సు పెరుగు తుందని పెదఖండేపల్లి సెక్టార్ అంగన్వాడీ సూపర్ వైజర్ నాగరత్నం తెలిపారు. మంగళవారం ముషిడిపల్లి అంగన్వాడీ కేంద్రంలో తల్లిపాల వారోత్సవాల కార్యక్ర మం నిర్వహించారు. ఈసందర్భంగా ఆమె మాట్లాడుతూ బిడ్డ పుట్టిన గంట వ్యవధిలోనే పాలు ఇవ్వాలని ఇది పాలను సమృద్ధి చేస్తుందన్నారు. తల్లిపాల్లో అన్ని రకాల పోషకాలు, నీరు ఉంటాయని ఎట్టి పరిస్థితిల్లోనూ ఆరునెలల వరకు బిడ్డకు నీరు,తేనె, ఇతరఆహారాలు, పానీయాలు ఇవ్వకూడదని తెలిపారు.అనంతరం గ్రామంలో ర్యాలీ నిర్వహించారు. ఎంఎల్ హెచ్ పి రాధ, పిల్లల తల్లులు,గర్భిణులు, బాలింతలు, నాలుగు అంగన్వాడీ కేంద్ర కార్యకర్తలు, ఇతర సిబ్బంది పాల్గొన్నారు.

విద్యార్థులు పూర్తి స్థాయిలో కోలుకున్నారు : ప్రిన్సిపాల్

శృంగవరపుకోట,ఆగస్టు4,ప్రభాతవార్త :

విద్యార్థులు పూర్తి స్థాయిలో కోలుకున్నారని తాటిపూడి ఏపీ ఆర్జేసీ మహిళ కళాశాల ప్రిన్సిపాల్ శారదాబాయి తెలిపారు.ఇటీవల కళాశాలలో 57మందివిద్యార్థులు వైరల్ జ్వరాల బారిన పడినసంగతి తెలిసిందే.వెంటనే కొట్టాం పిహెచ్ సీ ఆధ్వర్యంలో వైద్యాధికారిణి హారిక కళాశాలలో వైద్య శిబిరం ఏర్పాటు చేశారు.సకాలంలో విద్యార్థులకు వైద్యసదుపాయాలు అందించడంతో విద్యార్థులందరూ పూర్తి స్థాయిలో కోలుకున్నారని ప్రస్తుతం కళాశాలకు యథావిధిగా వస్తున్నారని ప్రిన్సిపాల్ శారదాబాయి తెలిపారు.

ప్రజలకు అందుబాటులో మెరుగైన సేవలు అందజేయాలి

చీపురుపల్లి ఆగస్టు 4 ప్రభాతవార్త :

ప్రజలకు అందుబాటులో మెరుగైన సేవలను అందజేయుటకు సచివాలయ సిబ్బంది కృషి జరపాలని చీపురుపల్లి డి డి ఓ కే శ్యాందర్ సచివాలయ సిబ్బందికి సూచించారు. మంగళవారం నాడు చీపురుపల్లి టౌన్లో గల 1,2,4,5 సచివాలయములను సందర్శించి సచివాలయ రికార్డులను పరిశీలించారు . అనంతరం సచివాలయ సిబ్బందితో మాట్లాడుతూ ప్రభుత్వం నుండి ప్రజలకు అందవలసిన సేవలు కొరకు సిబ్బంది అప్రమత్తంగా ఉండాలని ఏ ఒక్కరికి ఇబ్బంది కలగకుండా సేవలు అందజేయాలని వివరించారు. అనంతరం సచివాలయము నందు సిబ్బంది హాజరు నమోదు, అందిస్తున్న సేవలను అడిగి తెలుసుకున్నారు. ప్రభుత్వం అందిస్తున్న ఏ ఒక్క సేవలకు ప్రజలకు వందనం నందు సమస్యలు ఉన్నయెడల గ్రీవెన్స్ నమోదు చేయవలెసిందిగా సచివాలయ సిబ్బందికి సూచించారు. అంతేకాకుండా ప్రభుత్వ వాట్సప్ సేవల పట్ల ప్రజలలో అవగాహన పెంపొందించడానికి సిబ్బంది కృషి చేయవలసినది గా సిబ్బందిని ఆదేశించారు. ఈ కార్యక్రమములో చీపురుపల్లి పంచాయతీ ఈ వో రూన్సీ రాణి తో పాటు, ఇన్చార్జి సానిటరీ ఇన్స్పెక్టర్ నాసిక రామ్మోహన్రావు, సిద్ధర్ధ ఈశ్వరరావు, పలువు పంచాయతీ కార్యదర్శులు సిబ్బంది, తదితరులు పాల్గొన్నారు.

మెంటాడవీధి స్మశానవాటికలో కనీస సౌకర్యాలు లేవు : రేగు

సాలూరు, ఆగస్టు 4, ప్రభాతవార్త :

సాలూరు పట్టణ మెంటాడవీధి స్మశానవాటికలో కనీససౌకర్యాల దుస్థితిపై అడ్వకేట్ రేగు.మహేష్ జిల్లా కలెక్టర్ కు ఫిర్యాదు చేయడంతో వారి ఆదేశాలతో మున్సిపల్ డీఈ ప్రసాద్ తక్షణమే మంగళవారం అక్కడికి వెళ్లి పరిశీలించారు. అనంతరం మహేష్ మాట్లాడుతూ వార్త పత్రికల కథనాల ద్వారా ఈ విషయం వెలుగులోకి తీసుకురావడంతో అధికారులు వెంటనే స్పందించడం సంతోషకరమన్నారు.అలాగే కొత్తమ్మతల్లి ఆలయం నుంచి స్మశానవాటిక వరకు వీధిదీపాలు ఏర్పాటు చేయాలని అంత్యక్రియలకు వచ్చే ప్రజలకు స్నానానికి అవసరమైన నీటి వసతి కల్పించాలని కోరారు. అంతేకాకుండా ప్రజల సమస్యలపై తక్షణమే స్పందించిన జిల్లా కలెక్టర్ కు అలాగే పనులు ప్రారంభించిన అధికారులకు కృతజ్ఞతలు తెలిపారు.అలాగే మిగిలిన అభివృద్ధి పనులను కూడా త్వరగా పూర్తిచేసి స్మశానవాటికను పూర్తిస్థాయిలో ప్రజలకు అందుబాటులోకి తీసుకురావాలని రేగు మహేష్ కోరారు.మున్సిపల్ డీఈ ప్రసాద్, మండల మోహన్ , తదితరులు పాల్గొన్నారు.

కూటమి ప్రభుత్వ పతనం మొదలైంది : మాజీ ఎమ్మెల్యే

శృంగవరపుకోట,ఆగస్టు4,ప్రభాతవార్త :

కూటమి ప్రభుత్వ పతనం మొదలైందని మాజీ ఎమ్మెల్యే కడుబండి శ్రీనివాసరావు విమర్శించారు. మంగళవారం ఎస్.కోట సుబ్బిరామిరెడ్డి కళ్యాణ మండపంలో మాజీ ఎమ్మెల్యే కడుబండి అధ్యక్షతన టౌన్ హాల్ సమావేశం నిర్వహించారు. కార్యక్రమంలో ఆయన ముఖ్య అతిథిగా పాల్గొని మాట్లాడుతూ డీఎస్సీలో జరిగిన అవకతవకలపై సీబీఐ విచారణ జరిపించాలని,ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు వెంటనే విడుదల చేయాలని, నిరుద్యోగ భృతి చెల్లించాలని ఎన్నికల్లో ఇచ్చిన హామీలన్నీ నెరవేర్చాలని ఆయన డిమాండ్ చేశారు.డిల్లీలో జరిగిన పోరాటంలో విద్యార్థులు స్వచ్ఛందంగా పాల్గొని కేంద్ర విద్యాశాఖ మంత్రిని రాజీనామా చేసేలా ఎలా పోరాటం చేసారో మన ఆంధ్ర రాష్ట్రంలో కూడా విద్యాశాఖ మంత్రి లోకేష్ బాబు రాజీనామా చేసే వరకు పోరాటం సాగించాలని కడుబండి పిలుపునిచ్చారు.ఈనెల ఆరో తేదీన తలపెట్టిన నిరాహార దీక్షలో విద్యార్థులు స్వచ్ఛందంగా పాల్గొనాలని ఆయన కోరారు.కార్యక్రమంలో మాజీ జెడ్పీ వైస్ చైర్మన్ శోభా స్వాతిరాణి,డీసిసిబి మాజీ చైర్మన్ సీహెచ్ చిన రామునాయుడు, రాష్ట్ర సంయుక్త కార్యదర్శి గొర్లపల్లి శివ, జిల్లా యువజన అధ్యక్షులు అల్లు అవినాష్,నియోజవర్గం అధ్యక్షుడు వాకాడ సతీష్,నియోజవర్గం విద్యార్థి విభాగ అధ్యక్షుడు డి.శేఖర్, ఐదు మండలాల మండలపార్టీ అధ్యక్షులు,ఎంపీపీలు జెడ్పిటిసిలు,మాజీ సర్పంచ్లు, ఎంపీటీసీలు,కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పొలంపిలుస్తోంది కార్యక్రమం విజయవంతం చేయాలి

గరుగుబిల్లి ,ఆగస్టు 4, ప్రభాతవార్త:

తేదీ 04-8-26 నా శివ్వాం, రావుపల్లి (క్షేత్ర సందర్శన) గరుగుబిల్లి గ్రామాల్లో పొలం పిలుస్తోంది కార్యక్రమం మరియు ఎల్నినో ప్రభావంపై రైతులకు అవగాహన ఈ రోజు పొలం పిలుస్తోంది కార్యక్రమంలో భాగంగా రైతులతో సమావేశం నిర్వహించి, ప్రస్తుత వాతావరణ పరిస్థితులు మరియు ఎల్నినో ప్రభావంపై అవగాహన కల్పించడం జరిగింది.ఈ సందర్భంగా రైతులకు వర్షాభావ పరిస్థితులను దృష్టిలో ఉంచుకొని పంటల నిర్వహణ, నీటి పొదుపు పద్ధతులు, సమతుల్య ఎరువుల వినియోగం, మట్టి పరీక్షల ఆధారంగా ఎరువుల వాడకం, ప్రత్యామ్నాయ పంటల ఎంపిక, పంట సంరక్షణ చర్యల గురించి వివరించారు. అలాగే ప్రభుత్వం రైతులకు అందిస్తున్న వ్యవసాయ శాఖ సేవలు, పంట బీమా, ఈ-పంట నమోదు, ఇతర సంక్షేమ పథకాల సద్వినియోగం చేసుకోవాలని రైతులకు సూచించారు.

ప్రాదేశిక సభ్యురాలు గేదెల పైడితల్లి మృతి

దత్తిరాజేరు, ఆగస్టు 4, ప్రభాతవార్త :

మండలంలోని కే కృష్ణాపురం ప్రాదేశిక సభ్యురాలు అయిన గేదెల పైడితల్లి(72) అనారోగ్యంతో కొద్దిసేపటి క్రితం చౌడంతివలస లో ఆమె ఇంటి వద్ద కొద్దిసేపటి క్రితం స్వర్గస్తులయ్యారని కుటుంబ సభ్యులు తెలిపారు. ఆమె కొంతకాలం నుండి ఆరోగ్య సమస్యతో బాధపడుతూ వైద్యుల సలహా మేరకు మందులు వాడుతుండగా మంగళవారం సాయంత్రం మృతి చెందినట్టు కుటుంబ సభ్యులు తెలిపారు ఆమెకు ముగ్గురు కొడుకులు శ్రీనివాసరావు నారాయణరావు నాగేశ్వరరావు ఉన్నారు. కుమార్తె సుజాత ఉపాధ్యాయురాలుగా పనిచేస్తున్నారు నలుగురికి వివాహాలు ఐ ఉద్యోగ రీత్యా అందరూ స్థిరపడ్డారన్నారు. ఆమె మృతదేహాన్ని పలు రాజకీయ నాయకులు బంధువులు పరామర్శించి నివాళులర్పించారు. ఆమె భౌతికకాయాన్ని నేడు చౌడంతివలస గ్రామంలో అంత్యక్రియలు జరిపిస్తామని కుటుంబ సభ్యులు తెలిపారు.

పలు గ్రామాల్లో పొలం పిలుస్తోంది ప్రోగ్రాం : ఏఓ

సాలూరు , ఆగస్టు 4, ప్రభాతవార్త :

సాలూరు మండలం నార్లవలస ఇంకా పెదబోరబంద రైతుసేవ కేంద్రం అలాగే రెవెన్యూ గ్రామాల్లో మండల వ్యవసాయ అధికారి కె.శిరీషా పొలం పిలుస్తుంది అనే కార్యక్రమం నిర్వహించారు.మంగళవారం అందులో భాగంగా ఆ గ్రామ రైతులకు అవగాహన కల్పించారు. ప్రస్తుత ఖరీఫ్ సీజన్ కు సంబంధించి వరి ఇంకా మొక్కజొన్న పంటలకు ప్రధానమంత్రి ఫసల్ బీమా యోజన పథకంలో పంట భీమాకు ఈనెల అనగా ఆగస్టు15వ తారీకు వరకు గడువు ఉందన్నారు.అలాగే వరి,మొక్కజొన్న సాగు చేస్తున్న రైతులు దగ్గరలో ఉన్న కామన్ సర్వీస్ సెంటర్లో గాని బ్యాంకులో గాని సంప్రదించాలని క్లారిటీ ఇచ్చారు.అంతేకాకుండా ప్రస్తుతం ఎల్నినో వర్షాభావ పరిస్థితులపై వరి పంటను అలాగే మొక్కజొన్న పత్తి పంటలు పరిశీలించి పలు సూచనలు చేశారు.గ్రామ వ్యవసాయ సహాయకులు, రైతులు పాల్గొన్నారు.

క్షేత్రస్థాయిలో ఆరోగ్య సమస్యలను సత్వరమే గుర్తించాలి

మక్కువ, ఆగస్టు4, ప్రభాతవార్త :

క్షేత్ర స్థాయిలో ఆరోగ్య పరమైన సమస్యలను సత్వరమే గుర్తించి తగు చికిత్స అందించాలని జిల్లా ఆర్.బి.ఎస్.కె అధికారి డాక్టర్ టి. జగన్ మోహనరావు సూచించారు. శంబర, మక్కువ ప్రాథమిక ఆరోగ్య కేంద్రాల్లో నిర్వహించిన ఆకాడే కార్యక్రమంలో మంగళవారం ఆయన పాల్గొన్నారు. క్షేత్ర స్థాయిలో వైద్య సేవలు, ఆరోగ్య కార్యక్రమాల నిర్వహణ పై సమీక్ష జరిపారు. అసంక్రమిత వ్యాధుల గుర్తింపుకు చేపడుతున్న ఎన్.సి.డి సర్వే నెలాఖరుకు పూర్తిచేయాలని ఆదేశించారు. 4డి లక్షణాలు గుర్తించే లక్ష్యంగా అంగన్వాడీ కేంద్రాలు, స్కూల్స్ లో ఆర్.బి.ఎస్.కె 2.0 స్క్రీనింగ్ పారదర్శకంగా చేపట్టాలన్నారు. క్షేత్ర స్థాయిలో అనారోగ్య లక్షణాలు గుర్తించడంలో జాప్యం ఉండరాదన్నారు. వసతి గృహాలను తరచుగా సందర్శించి విద్యార్థుల సమాచారం తెలుసుకోవాలన్నారు. మలేరియా నిర్ధారణ పరీక్షలు, మందులు గ్రామాల్లో అందుబాటులో ఉండాలన్నారు. హెల్త్ సర్వే, ఆరోగ్య సూచికలలో వెనుకంజ లో ఉన్న సిబ్బందికి కారణాలపై వివరణ అడిగి నిర్దేశిత గడువులో పూర్తి చేయాలని ఆదేశించారు. సంచార చికిత్స శిబిరాలు, ప్రత్యేక వైద్య శిబిరాలు, గృహ సర్వే లో ప్రజారోగ్యమే ధ్యేయంగా వైద్య సేవలు అందించాలన్నారు. అనంతరం శంబర జెడ్పీ ఉన్నత పాఠశాలను సందర్శించి విద్యార్థుల హెల్త్ స్క్రీనింగ్ పై సమీక్షించారు. కార్యక్రమంలో డా. ఎల్. శివాజీ నాయుడు, డా ఆర్. చంద్రశేఖర్ ఆరోగ్య పర్యవేక్షకులు, వైద్య సిబ్బంది ఆశా కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

ఘనంగా తల్లిపాలు వారోత్సవాలు

పాచిపెంట, ప్రభాతవార్త :

మండలంలోని కోస్టవలస, పాచిపెంట, మోసూరు, బొడ్డపాడు, వై గొట్టూరు అంగన్వాడీ కేంద్రాల్లో తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా ఐసిడిఎస్సీ బొత్స అనంతలక్ష్మి మాట్లాడుతూముర్రు పాలు, బిడ్డ పుట్టిన మొదటి గంట లోగ వెయ్యాలని,, కేవలం తల్లిపాలు 6 నెలలు పట్టించాలని ఆరు నెలలు పూర్తయిన తర్వాత అదనపు పోషకాహారాన్ని పెట్టాలని తల్లిపాలు వలన బిడ్డకు మరియు తల్లికి కలిగే ప్రయోజనాలు తల్లులకు అవగాహన కల్పించారు. అలాగే ర్యాలీ నిర్వహించారు. సెక్టార్ సూపర్వైజర్లు, టాటా ట్రస్ట్ విజయ్ , సిబ్బంది,,గర్భిణీలు బాలింతలు, తల్లులు అంగన్వాడీ కార్యకర్తలు పాల్గొన్నారు.

పోలింగ్ స్టేషన్లో ఓటర్ల జాబితా సిద్ధం

పాచిపెంట, ఆగస్టు 4, ప్రభాత వార్త :

ఎస్ . ఐ . ర్ సర్వే పూర్తయిన వెంటనే మండలంలోగల 50 పోలింగ్ స్టేషన్ లకు సంబంధించిన డ్రాఫ్ట్ ఓటర్ల జాబితాలు అన్ని పోలింగ్ స్టేషన్ లలో జాబితాలను సిద్ధం చేసినట్లు తహసిల్దార్ రవి విలేకరులకు తెలిపారు. సదరు జాబితాలు పరిశీలించి అభ్యంతరాలు ఏమైనా ఉంటే సంబంధిత బి ఎల్ వో లు కి తెలియజేసి పరిష్కారం పొందవలసినదిగా ఆయన కోరారు. అలాగే ప్రతి ఒక ఓటర్లకు వినియోగించుకోవలసిందిగావిజ్ఞప్తి చేశారు. మరియు ప్రోగ్రాం పూర్తయిన తరువాత పాచిపెంట మండలంలో నో మ్యాపింగ్ ఓటర్లు 1033, డెత్ ఓటర్స్ 3005, పర్మినెంట్ మైగ్రేషన్ ఓటర్స్ 586, డబల్ ఎంట్రీ ఓటర్స్ 726, ఆప్సెంట్ ఓటర్స్ 740 గా ఉన్నట్లు గుర్తించామన్నారు.

పనసభద్రలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం

మక్కువ , ఆగస్టు 4 , ప్రభాతవార్త:

మండలంలోని పనసభద్ర గ్రామంలో 'పొలం పిలుస్తోంది' కార్యక్రమం సాలూరు వ్యవసాయ సహాయ సంచాలకులు జి. సత్యవతి ఆధ్వర్యంలో, మక్కువ మండల వ్యవసాయాధికారి సిహెచ్. భారతి అధ్యక్షతన నిర్వహించబడింది. ముందుగా రైతు క్షేత్రంలో పార్వతీపురం మన్యం జిల్లా కలెక్టరు ప్రవేశపెట్టిన "గట్టు మీద చెట్టు" కార్యక్రమంలో నిర్వహణలో భాగంగా అధికారులు మరియు రైతులు కలిసి పొలం గట్ల మీద జామ, మునగ, బొప్పాయి వంటి మరియు కరివేపాకు మునగ మొక్కలను నాటారు.అనంతరం గ్రామసభలో మాట్లాడుతూ పొలం గట్లపై ఖాళీగా ఉన్న స్థలాన్ని వృథా చేయకుండా మినుము, పెసర, కందులు వంటి అపరాల (పప్పు ధాన్యాలు) పంటలు, కూరగాయలు లేదా వివిధ రకాల పండ్ల జాతి మొక్కలను (జామ, మామిడి, నిమ్మ, బొప్పాయి మొదలైనవి) పెంచడం వలన పొలానికి రక్షణగా ఉండటమే కాకుండా రైతులకు నిరంతరం కుటుంబ అవసరాలకు సరిపడా కూరగాయలు మరియు అదనపు ఆదాయం లభిస్తుందని వివరించారు. అలాగే పచ్చిరొట్టఎరువు మొక్కల వేర్లలోని బ్యాక్టీరియా వాతావరణంలోని నత్రజనిని గ్రహించి నేలలో స్థిరీకరించడం ద్వారా నేల సారం పెరుగుతుందని సూచించారు. ప్రస్తుతం ఎల్ నినో ప్రభావం వలన వర్షాభావ పరిస్థితులు లేదా సకాలంలో వర్షాలు కురవని పక్షంలో వరి పైరుకు బదులుగా తక్కువ నీటితో సాగయ్యే ప్రత్యామ్నాయ పంటలైన రాగులు, కొర్రలు, సజ్జలు (చిరుధాన్యాలు), పెసర, మినుము మరియు నూనెగింజల పంటలను సాగు చేసుకోవాలని ఆయన రైతులకు సలహా ఇచ్చారు. అలాగే మండల వ్యవసాయాధికారి మాట్లాడుతూ ప్రకృతి వైపరీత్యాలు, అనావృష్టి లేదా వర్షాభావ పరిస్థితుల వల్ల పంట నష్టం వాటిల్లితే రైతులు ఆర్థికంగా నష్టపోకుండా ఉండేందుకు 'పంట బీమా' ఎంతగానో తోడ్పడుతుందని తెలిపారు. వరి మరియు మొక్కజొన్న పంటలకు ఈ నెల 15 వ తారీఖు వరకు గడువు ఉందనీ, ఈ తేదీ లోపల సిఎస్సి సెంటర్ల ద్వారా నమోదు చేయించుకోవాలని రైతులకు పిలుపునిచ్చారు. కార్యక్రమంలో భాగంగా మండల ఉద్యాన శాఖాధికారి మాట్లాడుతూ ప్రత్యామ్న భాను మాట్లాడుతూ ఆయిల్ పామ్ పంటలో కోకో ను అంతర పంటగా సాగు చేసుకోవటం వలన సంవత్సరానికి ఎకరాకు 50-60 వేల వరకూ అదనపు ఆదాయం వస్తుందని, రైతులు అందరూ ఆ దిశగా మొగ్గు చూపాలని వివరించారు.. అలానే వివిధ ఉద్యాన పంటలలో రైతులు అడిగిన సందేహాలను నివృత్తి చేశారు.

విజయనగరం పార్వతీపురం మన్యం వార్త 25

మోదీ జిల్లా పర్యటన విజయవంతానికి కృషి చేసిన అధికారులకు సన్మానం

లక్కవరపుకోట, ఆగస్టు 4 ప్రభాత వార్త :

ప్రధాని నరేంద్రమోదీ విజయనగరం జిల్లా పర్యటనను అత్యంత ప్రతిష్టాత్మకంగా తీసుకుని దిగ్విజయం చేసిన అధికారులకు శృంగవరపుకోట శాసనసభ్యురాలు కోళ్ల లలితకుమారి, ఎమ్మెల్యే భర్త కోళ్ల బాలాజీ అప్పల బాలాజీ రామ్ ప్రసాద్ కృతజ్ఞతలు తెలిపారు. ఈ సందర్భంగా మంగళవారం ఎల్.కోట మండలం గోల్డ్ స్టార్ సమీపంలోని బుద్ధ హోమ్స్లో నియోజకవర్గ స్థాయి వివిధ శాఖల అధికారులకు ఎమ్మెల్యే దంపతులు ఆధ్వర్యంలో ప్రత్యేక విందు (లంచ్) కార్యక్రమం ఏర్పాటు చేశారు.ప్రధాని పర్యటన అత్యంత విజయవంతంగా ముగియడం వెనుక నియోజకవర్గంలోని ప్రతి శాఖ పాత్ర ఎంతో ఉందంటూ అధికారుల సమన్వయాన్ని ఎమ్మెల్యే ప్రత్యేకంగా అభినందించారు. ఈ ప్రోగ్రామ్ను దిగ్విజయం చేయడం కోసం అధికారులు, సిబ్బంది అంకితభావంతో పనిచేసి పర్యటనను విజయవంతం చేశారని కొనియాడారు. ప్రధాని పర్యటనను విజయవంతం చేయడానికి కృషి చేసిన జిల్లా కలెక్టర్, జిల్లా ఎస్పీలు కీలక పాత్ర పోషించారంటూ వారిని ప్రత్యేకంగా అభినందించారు. విందు కార్యక్రమంలో పోలీస్, రెవెన్యూ, మండల పరిషత్, విద్యుత్, వ్యవసాయ, పశుసంవర్ధక, వెలుగు, విద్యాశాఖలతో పాటు ఇతర కీలక శాఖలకు చెందిన అధికారులు, సిబ్బంది పెద్ద సంఖ్యలో పాల్గొన్నారు. విధి నిర్వహణలో ప్రదర్శించిన ప్రతిభను, చూపిన చొరవను ఎమ్మెల్యే ఈ సందర్భంగా గుర్తుచేసుకున్నారు. విందు అనంతరం ప్రోగ్రామ్ నిర్వహణలో క్రియాశీలకంగా వ్యవహరించిన అధికారులందరినీ ఎమ్మెల్యే కోళ్ల లలిత కుమారి, కోళ్ల బాలాజీ అప్పల బాలాజీ రామ్ ప్రసాద్ దుశ్శాలువాలు కప్పి ఘనంగా సన్మానించారు. ప్రజా ప్రతినిధులు, అధికారులు ఇదే తరహా సమన్వయంతో పనిచేస్తూ నియోజకవర్గ అభివృద్ధికి తోడ్పడాలని ఎమ్మెల్యే ఆకాంక్షించారు.

శిశువులకు తల్లిపాలు దివ్య ఔషధం

కురుపాం, ఆగస్టు 4, ప్రభాతవార్త :

శిశువులకు తల్లిపాలు దివ్య ఔషధమని కురుపాం ఐసిడిఎస్ ప్రాజెక్టు అధికారి జి . రజని దుర్గ అన్నారు. మండలంలోని లేవిడి సెక్టార్ పరిధిలోని అంగన్వాడి కేంద్రంలో మంగళవారం తల్లిపాల వారోత్సవాలు ఘనంగా నిర్వహించారు. ఈ సందర్భంగా తల్లులను ఉద్దేశించి ఆమె మాట్లాడారు. తల్లి ప్రసవించిన గంట లోపు గానే శిశువుకు ముర్రుపాలు పెట్టాలని అన్నారు. ముర్రు పాలు వల్ల శిశువులకు మంచి ఆరోగ్యంతో పాటు, వ్యాధి నిరోధక శక్తి పెరుగుతుందని ఆమె వివరించారు. ఆరు నెల వరకు కేవలం తల్లిపాలనే పిల్లలకు అందించాలని ఆమె సూచించారు. కార్యక్రమానికి ముందు గ్రామంలో అవగాహన ర్యాలీ నిర్వహించారు. తల్లిపాల వారోత్సవాల్లో భాగంగా పలు పౌష్టికాహార పదార్థాలను తయారు చేసి ప్రదర్శనగా ఉంచారు. ఈ కార్యక్రమంలో సూపర్వైజర్ అంగన్వాడీ కార్యకర్తలు, తల్లులు పాల్గొన్నారు.

డీఎస్సీ అవకతవకలపై దర్యాప్తు నిర్వహించాలి

గరివిడి, ఆగస్టు 4, ప్రభాత వార్త:

డిఎస్సీ లో చోటుచేసుకున్న అవకతవకలు పై సి బి ఐ దర్యాప్తు నిర్వహించాలని గరివిడి మండల వైకాపా అధ్యక్షుడు మీసాల విశ్వేశ్వర రావు డిమాండ్ చేశారు. మంగళవారం ఆయన మాట్లాడుతూ విద్యార్థులకు ఫీజు రీయింబర్స్ మెంట్ బకాయిలు విడుదల చేయాలని, నిరుద్యోగ భృతి చెల్లించాలని ఆయన కోరారు. కూటమి సర్కారు విద్యార్థులకు పింఛన్లు మంజూరు చేయక పోవడం దారుణమన్నారు.

దేశపాత్రునిపాలెంలో ఇంటింటికీ కూటమి ప్రభుత్వం

కొత్తవలస, ఆగస్టు 4,(ప్రభాత వార్త) :

మండలంలోని దేశపాత్రునిపాలెం గ్రామంలో 'ఇంటింటికీ కూటమి ప్రభుత్వం' కార్యక్రమం ఘనంగా నిర్వహించారు. కార్యక్రమంలో శృంగవరపుకోట శాసనసభ్య రాలు కోళ్ల లలితకుమారి ముఖ్యఅతిథిగా పాల్గొని, ఇంటింటికి తిరిగి సమస్యలను అడిగి తెలుసుకున్నారు. ఈ సందర్భంగా ఎమ్మెల్యే మాట్లాడుతూ ప్రభుత్వం అందిస్తున్న సంక్షేమ పథకాలు, అభివృద్ధి కార్యక్రమాలను ప్రజలకు వివరించారు. స్థానికుల నుంచి పలు సమస్యలపై వినతులు స్వీకరించి, వాటిని త్వరితగతిన పరిష్కరించాలని సంబంధిత అధికారులను ఆదేశించారు. ముఖ్యంగా తాగునీరు, డ్రైనేజీ, రహదారులు వంటి మౌలిక వసతుల కల్పనకు ప్రాధాన్యత ఇస్తామని హామీ ఇచ్చారు. ప్రజా సమస్యల పరిష్కారమే కూటమి ప్రభుత్వ ప్రాథమిక లక్ష్యమని, అర్హులైన ప్రతి ఒక్కరికీ సంక్షేమ ఫలాలు అందేలా నిరంతరం కృషి చేస్తామని ఎమ్మెల్యే తెలిపారు. కార్యక్రమంలో స్థానిక కూటమి నాయకులు, కార్యకర్తలు, ప్రజాప్రతినిధులు మరియు వివిధ శాఖల అధికారులు భారీ సంఖ్యలో పాల్గొన్నారు.

ఇంటింటికీ తెలుగుదేశం కార్యక్రమంలో ఎమ్మెల్యే

బొబ్బిలి, ఆగస్టు 4, ప్రభాతవార్త:

కింతలవానిపేట గ్రామంలో తాగు నీటి సమస్యపై సమీక్ష "ఇంటింటికీ తెలుగు దేశం కార్య క్రమంలో పాల్గొన్న ఎమ్మెల్యే బేబీనాయన బొబ్బిలి మండలం కింతల వానిపేట గ్రామస్తులు నిన్న బొబ్బిలి కోటలో శాసనసభ్యులుఆర్.వి.ఎస్.కె.కె.రంగారావు (బేబీ నాయన) కలిసి గ్రామంలో తాగునీటి సమస్య గురించి వివరించారు.. బేబీనాయన కింతలవానిపేట గ్రామాన్ని సందర్శించి త్రాగునీటి సమస్యపై సమీక్ష నిర్వహించారు.. ఆర్ డబ్ల్యూ ఎస్ జేఈ గా మాట్లాడి సత్వరమే నీటి సమస్యను పరిష్కరించి, స్వచ్ఛమైన త్రాగునీటిని అందించేలా చర్యలు తీసుకోవాలని ఆదేశించారు. అనంతరం, అదే గ్రామంలో ఇంటింటికీ వెళ్లి కూటమి ప్రభుత్వం ఏర్పడినప్పటి నుంచి లిప్రజలకు అందిస్తున్న సంక్షేమ పథకాలులిప్రభుత్వం తరుపున చేస్తున్న అభివృద్ధి గురించి వివరించారు. అనంతరం పలువురు మాట్లాడారు. కార్యక్రమంలో టీడీపీ సీనియర్ నాయకులు అల్లాడ భాస్కరరావు బొబ్బిలి మండలం టీడీపీ అధ్యక్షులు వాసిరెడ్డి సత్యనారాయణ, ఎంపీటీసీ టీడీపీ నాయకులు, కార్యకర్తలు, తదితరులు పాల్గొన్నారు.

పర్యాటక మంత్రిత్వశాఖల ఆధ్వర్యంలో హోటల్ మేనేజ్ మెంట్ కోర్సులు

విజయనగరం, ఆగస్టు 4 : ప్రభాతవార్త:

భారత పర్యాటక శాఖ మరియు ఆంధ్రప్రదేశ్ పర్యాటక శాఖలతో సంయుక్తంగా నిర్వహించబడుతున్న తిరుపతి లోని "స్టేట్ ఇన్స్టిట్యూట్ ఆఫ్ హోటల్ మేనేజ్ మెంట్ క్యాటరింగ్ టెక్నాలజీ మరియు అప్లైడ్ న్యూట్రిషన్ నందు 2026-27 సంవత్సరమునకు ఈ క్రింద తెలిపిన హోటల్ మేనేజ్మెంట్ కోర్సులకు దరఖాస్తులు ఆహ్వానిస్తున్నాము.

1. బి.యస్.సి (హెచ్ & హెచ్.ఎ) 3 సంవత్సరాల డిగ్రీ కోర్సుకు ఇంటర్-40% మీటీనం గాఎస్సీలు వారి నుండి దరఖాస్తులు ఆహ్వానిస్తున్నాము. ఈ కోర్సులో ఫ్రంట్ ఆఫీస్,హౌస్ కీపింగ్, ఫుడ్ అండ్ బేవరేజ్ సర్వీస్, ఫుడ్ ప్రొడక్షన్ విభాగాలలో శిక్షణ ఇవ్వబడును నేర్పించి 4నెలలు ప్రముఖ ఫైవ్ స్టార్ హోటల్స్ లో ప్రాక్టికల్ ట్రైనింగ్ ఇవ్వబడును.
2. క్రాఫ్ట్ కోర్స్ ఇన్ ఫుడ్ ప్రొడక్షన్ & పెటిసరి (జులై/క్రా)కోర్సుకు యస్.యస్.సి. పొసైన వారి నుండి దరఖాస్తులు కోరుచున్నాము. ఈ కోర్సులో ఒక సంవత్సరము పాటు దేశ విదేశాల వంటకములు నేర్పించి 6నెలలు ప్రముఖ ఫైవ్ స్టార్ హోటల్స్ లో ప్రాక్టికల్ ట్రైనింగ్ ఇవ్వబడును.
3. సర్టిఫికేట్ కోర్స్ ఇన్ ఫుడ్ & బేవరేజ్ సర్వీస్ కోర్సుకు యస్.యస్.సి పొసైన వారి నుండి దరఖాస్తులు కోరుచున్నాము. ఈ కోర్సులో ఐదు నెలల పాటు రెస్టారెంట్ మరియు బార్ సర్వీస్ నేర్పించి 1 నెల ప్రముఖ ఫైవ్ స్టార్ హోటల్స్ లో ప్రాక్టికల్ ట్రైనింగ్ ఇవ్వబడును.

ఆట

సన్‌రైజర్స్ ప్రక్షాళన

ఐదుగురు ప్లేయర్లు ఔట్

న్యూఢిల్లీ: ఐపీఎల్ 2026 సీజన్‌లో సన్‌రైజర్స్ హైదరాబాద్ ఊరించి ఊసురుమనిపించింది. అద్వితీయమైన ప్రదర్శనతో ప్లే ఆఫ్స్ చేరిన ఆరెంజ్ ఆర్మీ కీలక ఎలిమినేటర్‌లో చేతులెత్తేసి ఇంటిబాట పట్టింది. టైటిల్ అందుకోకపోయినా అద్భుత ప్రదర్శనతో ఆకట్టుకుంది. తృటిలో టైటిల్ అందుకునే అవకాశం కోల్పోయిన ఆరెంజ్ ఆర్మీ వచ్చే ఏడాది మరింత బలంగా తిరిగి రావాలనే పట్టుదలతో ఉంది. తదుపరి సీజన్ కోసం జట్టును బలోపేతం చేయడంపై కావ్యమారన్ నేతృత్వంలోని సన్‌రైజర్స్ మేనేజ్‌మెంట్ ప్రత్యేకంగా ఫోకస్ పెట్టింది. ఐపీఎల్ 2027 మినీ వేలం ఈ ఏడాది నవంబర్ లేదా డిసెంబర్ తొలి వారంలో జరిగే వీలుండటంతో జట్టుకు భారంగా ఉన్న ఐదుగురు ఆటగాళ్లను వదిలేయనుంది. ఇంగ్లండ్ ఆల్‌రౌండర్ లియామ్ లివింగ్‌స్టోన్‌ను వదిలేయనుంది. మినీవేలంలో అన్‌సోల్డ్ లివింగ్ స్టోన్‌ను చివరి నిమిషంలో ఆరెంజ్ ఆర్మీ రూ.13 కోట్ల భారీ ధరకు కొనుగోలు చేసింది. కానీ అతనికి తుది జట్టులో అవకాశాలు ఇవ్వకుండా రెండు మ్యాచ్‌ల్లో ఇంపాక్ట్ ప్లేయర్‌గా వీలు కల్పించినా 15 పరుగులు మాత్రమే చేసి ఒక్క ఓవర్ కూడా బౌలింగ్ చేయలేదు. దీంతో అతన్ని వదిలేసి ఆల్‌రౌండర్ కొనుగోలుకు సన్‌రైజర్స్ భావిస్తోంది. ఇక సీనియర్ పేసర్‌గా జట్టు బౌలింగ్ విభాగాన్ని నడిపిస్తాడని ఆశించిన జయదేవ్ ఉనాద్కత్ నిరాశపర్చాడు. పేలవ బౌలింగ్ ప్రదర్శనతో తుది జట్టులో చోటు కూడా కోల్పోయాడు. 4 మ్యాచ్‌లు మాత్రమే ఆడి 4 వికెట్లే తీసాడు. 10.91 ఎకానమీతో ధారళంగా పరుగులిచ్చుకున్నాడు. స్పిన్ ఆల్‌రౌండర్ జీషన్ అన్సారీకి కూడా గుడ్‌బై చెప్పనుంది. ఈ ఐపీఎల్‌లో ఒక్క అవకాశం కూడా ఇవ్వలేదు. యువ స్పిన్నర్లు శివాంగ్ కుమార్, హర్ష్ దూబే సత్తా చాటడంతో జీషన్ అన్సారీ పూర్తిగా బెంచ్‌కే పరిమితమయ్యాడు. దీంతో అన్సారీని వదిలేసి యువ స్పిన్నర్‌ను ఎంచుకోవాలనే యోచనలో సన్‌రైజర్స్ ఉంది. హర్షల్ పటేల్ ప్రదర్శనపై కూడా అసంతృప్తిగా ఉంది. ఐపీఎల్‌లో 5 మ్యాచ్‌లు ఆడిన హర్షల్ 10.83 ఎకానమీతో ధారళంగా పరుగులిచ్చుకున్నాడు. తొలి నాలుగు మ్యాచ్‌ల్లో 11.48 ఎకానమీతో పరుగులు సమర్పించుకొని తుది జట్టులో చోటు కోల్పోయాడు. 2 మ్యాచ్‌లే ఆడిన డేవిడ్ పేన్ ఆర్‌సీబీతో తొలి మ్యాచ్‌లో రెండు వికెట్లు తీసాడు. కానీ కేకేర్‌తో మరుసటి మ్యాచ్‌లో తేలిపోయాడు. రెండు మ్యాచ్‌ల్లో 35 పరుగుల చొప్పున సమర్పించుకొని తుది జట్టులో చోటు కోల్పోయాడు.

మహిళల టి20 ర్యాంకింగ్స్.. నం.1 బెత్ మూనీ

ఆరో స్థానానికి చమరి

న్యూఢిల్లీ: ఇటీవల ముగిసిన ఐసీసీ మహిళల టీ20 ప్రపంచ కప్‌లో అద్భుత ప్రదర్శనల తర్వాత, ఆస్ట్రేలియా ఓపెనర్ బెత్ మూనీ ఐసీసీ మహిళల టీ20ఐ బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో అగ్రస్థానంలో కొనసాగుతోంది. మంగళవారం విడుదల చేసిన ర్యాంకింగ్స్‌లో పాకిస్థాన్‌పై జట్టు సిరీస్ విజయంతో శ్రీలంక కెప్టెన్ చమరి అటపట్టు తాజా ఐసీసీ మహిళల టీ20ఐ బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో తన కెరీర్‌లోనే అత్యుత్తమమైన ఆరో స్థానాన్ని సాధించింది. ఆమె నిలకడైన ప్రదర్శనలు ర్యాంకింగ్స్‌లో ఒక స్థానం పైకి ఎగబాకి ఆరో స్థానానికి చేరడంతో పాటు, తన కెరీర్‌లోనే అత్యధిక రేటింగ్ పాయింట్లను కూడా సంపాదించిపెట్టాయి. పాకిస్థాన్‌తో జరిగిన తొలి టీ20లో చిరస్మరణీయమైన అజేయ 101 పరుగులు చేసిన తర్వాత, శ్రీలంకకు చెందిన ఇమేషా దులానీ ర్యాంకింగ్స్‌లో 33 స్థానాలు పైకి ఎగబాకించి, కెరీర్‌లోనే అత్యుత్తమమైన 23వ స్థానానికి చేర్చింది. అలాగే వన్డే బ్యాటింగ్ ర్యాంకింగ్స్‌లో 4స్థానాలు ఎగబాకిన హర్షిత సమరవిక్రమ, 13వ స్థానానికి చేరుకుంది. సిరీస్ నిర్ణయాత్మక మ్యాచ్‌లో ఆమె చేసిన అజేయ 73 పరుగులు, శ్రీలంక ఎనిమిది వికెట్ల విజయంలో కీలక పాత్ర పోషించాయి. శ్రీలంకకు చెందిన హాసిని పెరేరా రెండు స్థానాలు ఎగబాకి 35వ స్థానానికి చేరుకోగా, పాకిస్థాన్‌కు చెందిన గుల్ ఫిరోజా తొమ్మిది స్థానాలు ఎగబాకి 45వ స్థానానికి, కెప్టెన్ ఫాతిమా సనా ఆరు స్థానాలు ముందుకు దూసుకెళ్లి 56వ స్థానానికి చేరుకున్నారు. వన్డే బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో, పాకిస్థాన్ ఎడమచేతి వాటం స్పిన్నర్ నష్రా సంధు మూడు స్థానాలు ఎగబాకి టాప్10కు చేరుకుంది. శ్రీలంక కెప్టెన్ అటపట్టు కూడా వన్డే బౌలింగ్ ర్యాంకింగ్స్‌లో ఒకస్థానం మెరుగుపడి 31వ స్థానానికిచేరుకోగా, ఆల్‌రౌండర్ కవిషా దిల్‌హారి మూడు స్థానాలు ఎగబాకి 33వ స్థానానికి చేరుకుంది.

హాండ్రెడ్ ఉమన్ కాంపిటేషన్.. సదరన్ బ్రేవ్ ఉమన్ తొలి ఓటమి

జెమీమా మెరుపులు వృథా

న్యూఢిల్లీ: హండ్రెడ్ వుమెన్ కాంపిటేషన్‌లో సదరన్ బ్రేవ్ వుమెన్ తొలి ఓటమి చవిచూసింది. సదరన్ బ్రేవ్‌తో జరిగిన మ్యాచ్‌లో వెల్ష్ ఫైర్‌తో ఆఖరి బంతికి విజయాన్ని అందుకుంది. మ్యాచ్‌లో తొలుత బ్యాటింగ్ చేసిన సదరన్ బ్రేవ్ వుమెన్ 100 బంతుల్లో 5 వికెట్లు నష్టానికి 121 పరుగులు చేసింది. లారా వోల్వార్ట్ 45 బంతుల్లో 48 పరుగులు, జెమీమా రోడ్రిగ్స్ 21 బంతుల్లో 25 పరుగులతో రాణించారు. వెల్ష్ ఫైర్ బౌలర్లలో హెథర్ గ్రహమ్, గ్రేస్ పాట్స్ చెరో రెండు వికెట్లు తీశారు. అనంతరం వైల్ష్ ఫైర్ నిర్ణీత 100 బంతుల్లోనే 6 వికెట్లు కోల్పోయి 122 పరుగులు చేసి విజయాన్ని అందుకుంది. వెల్ష్ ఫైర్ బ్యాటింగ్‌లో టాపార్డర్, మిడిలార్డర్ విఫలమైన చోట లోయర్ ఆర్డర్‌లో హెథర్ గ్రహమ్ 28 బంతుల్లో 35 పరుగులతో నాటౌట్‌గా నిలిచి జట్టును గెలిపించింది. ఆమెకు గ్రేస్ థాంప్సన్ 16 పరుగు, నిమ్హ హోలండ్ 12 పరుగులతో నాటౌట్‌గా సహకారం అందించారు. సదరన్ బ్రేవ్ బౌలర్లలో టిల్లీ కోర్టిన్ 3 వికెట్లు తీయగా, ఇస్సి వాంగ్ 2 వికెట్లు తీసింది. ఈ విజయంతో వెల్ష్ ఫైర్ 5 మ్యాచ్‌ల్లో రెండో విజయంతో పట్టికలో నాలుగో స్థానంలో ఉండగా, సదరన్ బ్రేవ్ ఓటమి పాలైనప్పటికీ టాప్‌లోనే కొనసాగుతోంది.

ప్రపంచ ఛాంపియన్‌షిప్‌లో.. తొమ్మిదో సీడ్‌గా సింధు

ఐదో సీడ్‌గా సాత్విక్, చిరాగ్ జోడీ

న్యూఢిల్లీ: ఈ నెల 17 నుంచి 23 వరకు న్యూఢిల్లీలోని ఇందిరా గాంధీ స్టేడియంలో జరగనున్న 2026 బిడబ్ల్యూఎఫ్ ప్రపంచ ఛాంపియన్‌షిప్‌ల కోసం, మహిళల సింగిల్స్ ఈవెంట్‌లో పివి సింధుకు తొమ్మిదో సీడ్ లభించగా, పురుషుల డబుల్స్ జోడీ సత్విక్‌సాయిరాజ్ రంకిరెడ్డి, చిరాగ్ శెట్టిలకు ఐదో సీడ్ లభించింది. ఈ టోర్నమెంట్‌లో భారత్ ఐదు విభాగాలలో ఒక్కోదానిలో రెండు జట్లను బరిలోకి దించుతుంది. వాటిలో నాలుగు విభాగాలలో కనీసం ఒక సీడెడ్ ఆటగాడు లేదా జంట ఉంటుంది. సింధు, మాజీ ఆసియా క్రీడల ఛాంపియన్‌లు అయిన సత్విక్, చిరాగ్‌లతో పాటు, పురుషుల సింగిల్స్ డ్రాలో లక్ష్య సేన్‌కు 14వ సీడ్ లభించింది. ధ్రువ్ కపిల, తనిషా క్రాస్టోల మిక్స్‌డ్ డబుల్స్ జోడీ 15వ సీడ్‌గా ఛాంపియన్‌షిప్‌లలోకి ప్రవేశిస్తుంది. అలాగే షి యుకి మరియు ఆన్ సే యంగ్ సింగిల్స్ సీడింగ్‌లలో ముందున్నారు. ప్రస్తుత పురుషుల సింగిల్స్ ప్రపంచ ఛాంపియన్, చైనాకు చెందిన షి యుకి టాప్ సీడ్‌గా ఎంపిక కాగా, మహిళల సింగిల్స్ విభాగంలో దక్షిణ కొరియాకు చెందిన ఆన్ సే యంగ్ అగ్రస్థానంలో ఉంది. ప్రస్తుత మహిళల సింగిల్స్ ప్రపంచ ఛాంపియన్, జపాన్‌కు చెందిన అకానె యమగుచి రెండవ సీడ్‌గా నిలవగా, ఆ తర్వాత చైనాకు చెందిన వాంగ్ జియి మరియు చెన్ యుఫెయి వరుసగా మూడవ మరియు నాల్గవ స్థానాల్లో ఉన్నారు.

తొలి స్నేహపూర్వక మ్యాచ్‌లో.. భారత్ జట్టు గెలుపు

3-0తో సింగపూర్ ఓటమి

న్యూఢిల్లీ: తొలి స్నేహపూర్వక మ్యాచ్‌లో సింగపూర్‌పై 3-0 తేడాతో భారత్ విజయం సాధించింది. తద్వారా భారత అండర్20 జట్టు, ఏఎఫ్‌సి అండర్20 ఆసియా కప్ చైనా 2027 క్వాలిఫయర్స్‌కు అర్హత సాధించింది. భారత్ తరఫున ఒమాంగ్ డోడుమ్ (45+2) తొలి గోల్ సాధించాడు. 63వ నిమిషంలో సింగమయుమ్ షమీ గోల్ చేసి ఆతిథ్య జట్టుకు 2-0 ఆధిక్యాన్ని అందించాడు. 83వ నిమిషంలో సింగపూర్ చేసిన ఓన్ గోల్ కారణంగా భారత్ 3-0 ఆధిక్యాన్ని కోల్పోయింది. సింగపూర్ అండర్20 జట్టు రెండు స్నేహపూర్వక మ్యాచ్‌ల కోసం భారత పర్యటనలో ఉంది. రెండో మ్యాచ్ ఈ నెల 6వ తేదీన జరగనుంది. కాగా భారత్, సింగపూర్‌ల మధ్య 1966లో తొలిసారిగా ఒక అండర్20 మ్యాచ్‌లో తలపడ్డాయి. ఆ తొలి పోరులో భారత్, సింగపూర్‌ను 4-1 తేడాతో ఓడించింది. 1974లో, ఏఎఫ్‌సీ యూత్ ఛాంపియన్‌షిప్ క్వార్టర్ ఫైనల్‌లో పెనాల్టీ షూటౌట్‌లో భారత్, సింగపూర్‌ను ఓడించింది. ఆ ప్రతిష్టాత్మక టోర్నమెంట్‌ను భారత్ గెలుచుకుంది. భారత్, సింగపూర్ జట్లు అండర్19 ఫుట్‌బాల్‌లో కూడా తలపడ్డాయి. ఇరు జట్లు చెరొక మ్యాచ్ గెలుచుకున్నాయి. కాగా భారత్ ఎఎఫ్‌సి అండర్ 20 ఆసియా కప్ క్వాలిఫికేషన్‌లో గ్రూప్ బి లో ఉన్నారు. వారు ఈనెల 31న జరిగే తమ మొదటి గేమ్‌లో సిరియాతో తలపడతారు. బ్లూ కోల్ట్స్ తమ తదుపరి రెండు గేమ్‌లలో వరుసగా సెప్టెంబర్ 3, 6 తేదీలలో ఉజ్బెకిస్తాన్ మరియు బంగ్లాదేశ్‌లతో తలపడతారు.

ఎయిర్‌టెల్ నికరలాభం రూ.8167 కోట్లు

ఆదాయం రూ.58,539 కోట్లు

ముంబయి,ఆగస్టు 4: దేశంలో రెండో అతిపెద్ద టెలికాం సంస్థ భారతి ఎయిర్‌టెల్ తొలి త్రైమాసికం ఏకీకృత నికర లాభం 37.3 శాతం పెరిగి రూ.8,167 కోట్లకు చేరుకుంది. కంపెనీ మొత్తం ఆదాయం 18.4 శాతం పెరిగి రూ.58,539 కోట్లకు చేరుకుంది. మాత్రం మార్కెట్ అంచనాలను మించి ఆదాయం నమోదైంది.కంపెనీ లాభాలపై కొన్ని ప్రత్యేక అంశాలు ప్రభావం చూపాయి. గ్రూప్‌కు చెందిన ఒక అనుబంధ సంస్థలో వాణిజ్య వివాదానికి సంబంధించి సూత్రప్రాయ పరిష్కారం కోసం రూ.353.4 కోట్ల ప్రత్యేక కేటాయింపు చేయగా, గత సంవత్సరాలకు సంబంధించిన వ్యాపార నష్టాలపై అనుకూల తీర్పు రావడంతో రూ.389.8 కోట్ల ప్రత్యేక పన్ను ప్రయోజనం కూడా లభించింది.గత త్రైమాసికంతో పోలిస్తే కంపెనీ ఆదాయం రూ.55,383 కోట్ల నుంచి రూ.58,539 కోట్లకు చేరి 5.7 శాతం పెరిగింది. అదే విధంగా నికర లాభం రూ.7,325 కోట్ల నుంచి రూ.8,167 కోట్లకు పెరిగి 11.5 శాతం వృద్ధి నమోదు చేసింది. భారత కార్యకలాపాల పరంగా ఎయిర్‌టెల్ ఆదాయం రూ.41,214 కోట్లకు చేరింది. ఇది గత ఏడాది ఇదే కాలంలోని రూ.37,584 కోట్లతో పోలిస్తే 9.7 శాతం అధికం. మొబైల్ సేవల్లో ప్రీమియం ప్లాన్లకు వినియోగదారులు మారడం, హోమ్ బ్రాడ్‌బ్యాండ్, ఎంటర్‌ప్రైజ్ సేవల్లో బలమైన వృద్ధి ఈ ఫలితాలకు ప్రధాన కారణాలుగా కంపెనీ పేర్కొంది.కంపెనీ మొత్తం ఆదాయంలో 73 శాతం వాటా కలిగిన మొబైల్ సేవల విభాగం ద్వారా రూ.29,928 కోట్ల ఆదాయం లభించింది.

నైకా నికరలాభం రూ.80 కోట్లు

రాబడులు రూ.2782 కోట్లు

ముంబయి,ఆగస్టు 4: నైకా మాతృసంస్థ ఎఫ్ఎస్ఎన్ ఈకామర్స్ వెంచర్స్ కంపెనీ నికర లాభం రూ.80 కోట్లకు చేరుకుంది. గత ఏడాది ఇదే త్రైమాసికంలో నమోదైన రూ.23.3 కోట్లతో పోలిస్తే ఇది 243.3 శాతం పెరుగుదల. అంచనా వేసిన రూ.83 కోట్ల కంటే స్వల్పంగా తక్కువగా నమోదైంది. కంపెనీ కార్యకలాపాల ద్వారా వచ్చిన ఆదాయం 29 శాతం పెరిగి రూ.2,782 కోట్లకు చేరుకుంది. గత ఏడాది ఇదే కాలంలో ఇది రూ.2,155 కోట్లు కాగా, విశ్లేషకుల అంచనా రూ.2,762 కోట్లను కూడా అధిగమించింది.ఆపరేటింగ్ పనితీరు కూడా బలంగా నమోదైంది. కంపెనీ ఈబిట్డా 67.8 శాతం పెరిగి రూ.236 కోట్లకు చేరుకుంది. గత ఏడాది ఇదే కాలంలో ఇది రూ.140.7 కోట్లు. మార్కెట్ అంచనా రూ.230 కోట్లను కూడా అధిగమించింది.ఈబిట్డా మార్జిన్ 6.5 శాతం నుంచి 8.5 శాతానికి పెరిగి 200 బేసిస్ పాయింట్ల మెరుగుదలను నమోదు చేసింది. ఇది విశ్లేషకుల అంచనా అయిన 8.3 శాతం కంటే మెరుగ్గా ఉండటం విశేషం. మొత్తం స్థూల వాణిజ్య విలువలు 34 శాతం వృద్ధిని నమోదయ్యాయి. ముఖ్యంగా ఫ్యాషన్ విభాగం అత్యుత్తమ ప్రదర్శన కనబరిచి నెట్ సేల్స్ వ్యాల్యూ 54 శాతం పెరిగింది. బ్యూటీ విభాగం కూడా 29 శాతం ఎన్ఎస్‌వీ వృద్ధితో స్థిరమైన పనితీరును ప్రదర్శించింది.ఇక వ్యాపార విస్తరణలో భాగంగా అమిను సంస్థలో పూర్తిగా డైల్యూటెడ్ ప్రాతిపదికన 51 శాతం వాటాను గరిష్టంగా రూ.32 కోట్ల పెట్టుబడితో కొనుగోలు చేయడానికి నైకా డైరెక్టర్ల మండలి ఆమోదం తెలిపింది.

లాభాలకు బ్రేక్.. నష్టాల్లో ముగిసిన సెన్సెక్స్, నిఫ్టీ

ముంబయి, ఆగస్టు 4: ఈక్విటీ మార్కెట్లలో కొత్త ట్రేడింగ్ సెషన్ విధానం అమలులోకి వచ్చిన తర్వాత, సెషన్ చివర్లో ఊపందుకున్న స్టాక్ మార్కెట్ సూచీలు సెన్సెక్స్, నిఫ్టీ 50 మంగళవారం సెషన్‌లో తీవ్ర నష్టాలను చవిచూశాయి. దీంతో గత నాలుగు రోజులుగా కొనసాగుతున్న మార్కెట్ లాభాల పరంపరకు బ్రేక్ పడింది. రిజర్వ్ బ్యాంక్ ఆఫ్ ఇండియా ద్రవ్య విధాన కమిటీ నిర్ణయాలు వెలువడనున్న నేపథ్యంలో పెట్టుబడిదారులు తీవ్ర అప్రమత్తత వహించడం.. లాభాల స్వీకరణకు మొగ్గు చూపడం మార్కెట్ పతనానికి ప్రధాన కారణాలుగా నిలిచాయి. చివరకు బీఎస్ఈ సెన్సెక్స్ 210.08 పాయింట్లు క్షీణించి 78,428.95 వద్ద ముగియగా, ఎన్ఎస్ఈ నిఫ్టీ 50 సూచీ 159.40 పాయింట్లు పడిపోయి 24,614.90 వద్ద స్థిరపడింది. ట్రేడింగ్ సెషన్ ఆసాంతం బ్యాంకింగ్, ఆర్థిక సేవలు, ఐటీ స్టాక్‌లు తీవ్ర ఒత్తిడిలోనే కొనసాగాయి. ఈ రంగాలు మార్కెట్ సూచీలలో ఎక్కువ వెయిటేజీ కలిగి ఉండటం వల్ల వాటిలో వచ్చిన అమ్మకాల ఒత్తిడి సూచీల పతనానికి కారణమైంది. ఆర్‌బిఐ ద్రవ్య సమీక్ష కోసం ఎదురుచూస్తున్న పెద్ద పెట్టుబడిదారులు కొత్తగా నిధులు కేటాయించే కంటే వేచి చూసే ధోరణికే మొగ్గు చూపారు. రంగాల వారీగా పరిశీలిస్తే నిఫ్టీ రియల్టీ అత్యధికంగా రెండు శాతానికి పైగా నష్టపోయి అత్యంత బలహీనమైన విభాగంగా నిలిచింది. దీంతో పాటు ఐటీ, సిమెంట్, ఎఫ్ఎంసీజీ, ప్రైవేట్ బ్యాంకింగ్, ఫార్మా, హెల్త్‌కేర్ రంగాలు కూడా బలహీనంగా ముగిశాయి. నిఫ్టీ 50 జాబితాలో గ్రాసిమ్ ఇండస్ట్రీస్, హెచ్‌డీఎఫ్‌సీ లైఫ్ ఇన్సూరెన్స్, హిందుస్తాన్ యూనిలీవర్ షేర్లు అత్యధిక నష్టాలను మూటగట్టుకున్నాయి. నిఫ్టీ మిడ్‌క్యాప్ 100 సూచీ 0.29 శాతం నష్టంతో ముగియగా, నిఫ్టీ స్మాల్‌క్యాప్ 100 సూచీ మాత్రం 0.23 శాతం కొద్దిపాటి లాభాన్ని సాధించింది.

వాణిజ్యం

గ్లోబల్ ఏవియేషన్ కంపెనీ ఇండిగో ఉద్యోగులనుద్దేశించి కొత్త సిఇఓ తొలి కాల్..

ముంబయి, ఆగస్టు 4: ఇంటర్‌గ్లోబ్ ఏవియేషన్ లిమిటెడ్ ఇండిగో కొత్త సీఈఓగా విల్లీ వాల్ష్ బాధ్యతలు స్వీకరించాక సంస్థ ఉద్యోగులను ఉద్దేశించి తొలిసారి ప్రసంగించారు. ఇండిగో ప్రపంచంలోని అగ్రశ్రేణి విమానయాన సంస్థల్లో ఒకటిగా ఎదగడాన్ని తాను ప్రత్యక్షంగా గమనించానని చెప్పారు.‘ బలమైన పునాది, స్పష్టమైన వ్యూహం, ప్రాథమిక విలువలను ఎప్పుడూ మరవని సంస్థ సంస్కృతి ఈ విజయానికి కారణమని వాల్ష్ పేర్కొన్నారు.భారతదేశంలోనే అతిపెద్ద విమాన యాన సంస్థగా మాత్రమే కాకుండా, ప్రపంచవ్యాప్తంగా అత్యంత గౌరవనీయమైన ఎయిర్‌లైన్స్‌లో ఇండిగో ఒకటిగా నిలిచిందని ఆయన అన్నారు. కోట్లాది మందికి విమాన ప్రయాణాన్ని అందుబాటులోకి తీసుకురావడంలో ఇండిగో కీలక పాత్ర పోషించిందని ప్రశంసించారు. బ్రిటిష్ ఎయిర్‌వేస్, ఐఏజీ, ఐఏటీఏ వంటి ప్రముఖ సంస్థల్లో పనిచేసిన అనుభవాన్ని ప్రస్తావించిన వాల్ష్, ఒక విమానయాన సంస్థను విజయవంతంగా నిర్మించడం ఎంత కష్టమో తనకు తెలుసని చెప్పారు.గత పదేళ్లలోనే ప్రపంచవ్యాప్తంగా 408 విమానయాన సంస్థలు కార్యకలాపాలు నిలిపివేసిన పరిస్థితుల్లో ఇండిగో సాధించిన విజయాలు నిజంగా అసాధారణమైనవని ఆయన అన్నారు. ప్రయాణికుల విశ్వాసమే ఇండిగో విజయానికి అసలైన బలం అని పేర్కొన్న వాల్ష్ గొప్ప విమానయాన సంస్థను నిర్వచించేది ప్రయాణికుల నమ్మకం, సంస్థ ప్రతిష్ఠ“ అని అన్నారు.

ఇటిఎఫ్ మార్కెట్‌లోకి జియో

ముంబయి, ఆగస్టు 4: ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్ మార్కెట్లోకి జియో ఎంట్రీ ఇచ్చింది. జియో ఫైనాన్షియల్ సర్వీసెస్, ప్రపంచంలోనే అతిపెద్ద అసెట్ మేనేజ్మెంట్ కంపెనీ బ్లాక్ రాక్ కలిసి జాయింట్ వెంచర్ జియోబ్లాక్‌రాక్ మ్యూచువల్ ఫండ్స్ ఏర్పాటుచేసాయి. ఈసంస్థనుంచే తొలి ఈటీఎఫ్ ఫండ్ మార్కెట్లోకి వచ్చింది. జియో బ్లాక్ రాక్ నిఫ్టీ 50 ఈటీఎఫ్ పేరుతో న్యూ ఫండ్ ఆఫర్ తీసుకురావడంతో ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్‌లోకి అడుగుపెట్టింది. జియో బ్లాక్ రాక్ మ్యూచువల్ ఫండ్ మంగళవారం రోజున తొలి ఎక్స్ఛేంజ్ ట్రేడెడ్ ఫండ్ జియో బ్లాక్ రాక్ నిఫ్టీ 50 ఈటీఎఫ్‌ను లాంచ్ చేసి పెట్టుబడులను సులభతరం చేసింది. ఈ న్యూ ఫండ్ ఆఫర్ సబ్‌స్క్రిప్షన్ ఇప్పటికే మొదలవగా ఈనెల 11, 2026 వరకు అందుబాటులో ఉంటుంది. నిఫ్టీ 50 ఇండెక్స్‌ను ట్రాక్ చేస్తూ దీర్ఘకాలంలో మూలధన లాభాలు అందించడమే లక్ష్యంగా ఈ ఈటీఎఫ్ ఫండ్ రూపొందించినట్లు జియో బ్లాక్ రాక్ పేర్కొంది.ఒకే పెట్టుబడి ద్వారా ఇన్వెస్టర్లు దేశంలోని 50 అతిపెద్ద లిస్టెడ్ కంపెనీల్లో పెట్టుబడి పెట్టే అవకాశాన్ని ఈ స్కీమ్ కల్పిస్తుందని తెలిపింది. 2026, మార్చి 30 నాటికి ఈ ఇండెక్స్ దేశంలోని మొత్తం మార్కెట్ క్యాపిటలైజేషన్‌లో 53.7 శాతం మేర ప్రాతినిధ్యం వహించడం గమనార్హం. భారతదేశ ఈక్విటీ మార్కెట్లో కీలకమైన బెంచ్‌మార్క్‌గా నిలిచింది. ఈఫండ్‌లో వచ్చిన నిధులు ఈక్విటీ, ఈక్విటీ సంబంధిత సెక్యూరిటీల్లో ఇన్వెస్ట్ చేయనుంది. ఈ ఫండ్ పనితీరును నిఫ్టీ 50 టోటల్ రిటర్న్ ఇండెక్స్‌తో పోల్చి చూడనున్నారు.

ఎల్ఐసిలో 6.5% వాటా విక్రయం

నేటినుంచే బిడ్డింగ్ షురూ!

ముంబయి, ఆగస్టు 4: కేంద్ర ప్రభుత్వం కొంత కాలంగా ప్రభుత్వ సంస్థల్లో పెట్టుబడి ఉపసంహరణలు, వాటా విక్రయం చేస్తున్న సంగతి తెలిసిందే. ఈ ఆర్థిక సంవత్సరంలో ఇప్పటికే సెంట్రల్ బ్యాంక్ ఆఫ్ ఇండియా, ఎన్ఎల్‌సీ ఇండియా, ఎన్‌హెచ్‌పీసీ, కోల్ ఇండియా, ఐఆర్ఎఫ్‌సి,భెల్ ఇలా చాలా సంస్థల్లో ఆఫర్ ఫర్ సేల్ విజయవంతంగా నిర్వహించింది. ఇప్పుడు అతిపెద్ద ప్రభుత్వ రంగ బీమా సంస్థ లైఫ్ ఇన్సూరెన్స్ కార్పొరేషన్ ఆఫ్ ఇండియాలో కూడా వాటా విక్రయించేందుకు ఆఫర్ ఫర్ సేల్ ప్రకటించింది కేంద్రం. ఇది బుధవారమే ప్రారంభం కానుంది. మొత్తంగా 6.5 శాతం వాటా విక్రయించాలని నిర్ణయించింది. అయితే అంతా ఒకేసారి కాదు. ముందుగా 2.5 శాతం వాటా విక్రయించనుంది. మరో 4 శాతాన్ని గ్రీన్ షూ ఆప్షన్ కింద వినియోగించనుంది. రెస్పాన్స్ బాగుంటే మిగతా వాటా విక్రయిస్తుంది. నాల్గవ తేదీ నాన్ రిటైల్ ఇన్వెస్టర్లకు షేర్లు కొనేందుకు ఛాన్స్ ఉంటుంది. ఇక్కడ సంస్థాగత ఇన్వెస్టర్లు, హై నెట్ వర్త్ ఇన్వెస్టర్లు పాల్గొంటారు. ఇక రిటైల్ ఇన్వెస్టర్లు బుధవారం రోజు బిడ్స్ దాఖలు చేయొచ్చు. తొలిరోజు అంటే 4న రెస్పాన్స్ బాగుంటే నాన్ రిటైల్ ఇన్వెస్టర్లకు గ్రీన్ షూ ఆప్షన్ కింద మళ్లీ ఆగస్ట్ 5న పార్టిసిపేట్ చేసేందుకు అవకాశం ఉంటుంది.ఆఫర్ ఫర్ సేల్ కింద ఇన్వెస్టర్లకు బంపర్ ఆఫర్ ప్రకటించింది. సోమవారం సెషన్ ఎల్ఐసీ క్లోజింగ్ ప్రైస్ ఎన్ఎస్ఇలో రూ. 424.40 గా ఉండగా ఇప్పుడు ఫ్లోర్ ప్రైస్ రూ. 382 గా ప్రకటించింది. అంటే కిందటి రోజు ధరతో పోలిస్తే ఏకంగా 10 శాతం డిస్కౌంట్ ప్రకటించింది. ఓఎఫ్ఎస్‌లో మొత్తంగా 6.5 శాతం వాటాకు సమానమైన 82.2 కోట్లకుపైగా షేర్లను అందుబాటులో ఉంచింది. ఇక్కడ పూర్తి స్థాయిలో సబ్‌స్క్రిప్షన్ జరిగితే ఖజానాకు ఏకంగా రూ. 31,400 కోట్లు వచ్చి చేరనున్నాయి. తొలుత 2.5 శాతం వాటాకు సమానమైన 31.6 కోట్ల షేర్లు అందుబాటులో ఉంటాయి. మార్కెట్ నియంత్రణ సంస్థ సెబీ నిబంధనల ప్రకారం లిస్టెడ్ కంపెనీల్లో కనీసం 25 శాతం వాటా షేర్లుప్రజలు లేదా సంస్థాగత పెట్టుబడిదారులవద్ద ఉండాలి. దీనినే మినిమం పబ్లిక్ షేర్ హోల్డింగ్ రూల్ అంటారు. గరిష్ఠంగా సంస్థ/ప్రమోటర్ల దగ్గర 75 శాతం వరకు వాటా ఉంచుకోవచ్చు. ప్రస్తుతం 2026 మార్చి నాటికి ఎల్ఐసీలో ప్రభుత్వ వాటానే ఏకంగా 96.5 శాతంగా ఉంది. దీంతో సెబీ మార్గదర్శకాల కింద 26.5 శాతం వరకు వాటా విక్రయిస్తుంది. ఆఫర్‌ఫర్‌సేల్‌ప్రకటించగానే ఎల్ఐసి షేర్లు భారీగా క్షీణించాయి.

Printed and Published by Gireesh Sanghi, CMD and Managing Editor on behalf of AGA Publications Ltd., at D.No. 1 -187, Kushalpuram, Srikakulam Dist. PIN: 532005 Ph. 270684, 271144, 9848387562 Fax : 08942–271146, RNI No. AP TEL/2004/13708 Editor :*Damerla Sai Baba *Responsible for selection of News under the PRB Act. Regd.: No.J/RNP/VM111 Air Surcharge: Delhi : 40 Ps.